# పదసాహిత్య వైభవం



ఆచార్య గల్లా చలపతి

# పదసాహిత్య వైభవం

( పరిశోధక వ్యాసాలు )

**ఆచార్య గల్లా చలపతి**

విశ్రాంతాచార్యులు

తెలుగు అధ్యయన శాఖ

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

# పదసాహిత్యవైభవం

- ఆచార్య గల్లా చలపతి

మొదటి ముద్రణ : మార్చి, 2009

© రచయిత

ప్రతులు : 1000

ధర : రూ.100/-

ప్రతులకు :

రచయిత

5-69-34, శ్రీకృష్ణనగర్

ఎస్.వి. యూనివర్శిటీ పోస్టు

తిరుపతి - 517 502

ఫోన్ నెం. 0877-6576841

మొబైల్ : 9885826626

ఈ గ్రంథంలోని అభిప్రాయాలు రచయితవే
తి.తి.దే. వారికి సంబంధం లేదు.

ముద్రణ :

సి.యన్. ప్రింటర్స్

ప్రకాశం రోడ్, తిరుపతి

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ఆముఖం | |
| | మదింపు | |
| 1. | అన్నమయ్య వచోనూత్నక్రియలు | 1-7 |
| 2. | అన్నమయ్య సంకీర్తనలలో పౌరాణిక గాథా విశేషాలు | 8-20 |
| 3. | అన్నమయ్య - శ్రీనివాసతత్త్వం | 21-33 |
| 4. | అన్నమయ్య సంకీర్తనలు - శృంగారతత్త్వం | 34-39 |
| 5. | అన్నమయ్య సంకీర్తనలు - శరణాగతితత్త్వం | 40-52 |
| 6. | అన్నమయ్య కవితావైభవం | 53-63 |
| 7. | పెదతిరుమలయ్య సుదర్శనరగడ | 64-82 |
| 8. | చినతిరుమలాచార్యుల రచనలు | 83-98 |
| 9. | అన్నమయ్య - సారంగపాణి | 99-113 |
| 10. | అన్నమయ్య సంకీర్త నేతర రచనలు | 114-129 |
| 11. | అన్నమయ్య శృంగార సంకీర్తనలు- సామాజిక శృంగార తత్త్వం | 130-157 |
| 12. | సారంగపాణి పదాలు - సామాజికత | 158-174 |

# ఆముఖం

సమాజం పదసాహిత్యంలో కనిపించినంత ప్రస్ఫుటంగా పద్య సాహిత్యంలో కనిపించదు. అందువల్లనే పదకవులను సమాజకవులని మన్నన చేయవలసి ఉంది. పదసాహిత్యమంటూనే తాళ్ళపాక పద కవిత్రయం (అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య) మన కండ్లముందు మెదలుతారు. వీళ్ళలో కూడా అన్నమయ్యది అగ్రతాంబూలం. అన్నమయ్య సంకీర్తన వాఙ్మయంలో కనిపించని సామాజికాంశం లేదు. ఆయన తన కాలంనాటి సామాజిక వ్యవస్థను బాగా పట్టించుకొన్నాడు. తాత్త్వికుడుగా, అధ్యాత్మవేత్తగా కనిపించినా ప్రధానంగా కవి. సామాజకాంశాల చిత్రణకు ఆయన పెద్ద పీటవేశాడు. సంకీర్తనలలో కనిపించే నైతిక, ధార్మిక, అధ్యాత్మ, తాత్త్విక, శంగారాంశాలు ఆనాటి సమాజానివే. ఈ సంపుటిలోని వ్యాసాలన్నిటా ఈ యంశమే ప్రధానంగా వివేచింపబడింది.

తాళ్లపాక వాఙ్మయం మీద మక్కువ ఏర్పడిన తరువాత రాసిన వ్యాసాలలో కొన్నిటిని ఈ సంపుటిలో చేర్చడం జరిగింది. మరొక పదకర్త సారంగపాణికి సంబంధించిన వ్యాసాలు రెండు తప్ప మిగిలిన పదీ తాళ్లపాక సాహిత్యానికి చెందినవే. అన్నమయ్య సంకీర్తనలలో కనిపించే ప్రధానాంశాలైన పౌరాణికాంశాలు, శ్రీనివాసతత్త్వం, శరణాగతి, కవితా వైభవం, శృంగార తత్త్వం ప్రత్యేక వ్యాసాలుగా ఇందులో కనిపిస్తాయి. ఈ వ్యాసాలలో ఆయావిషయాలకు సంబంధించిన చర్వితచర్వణములైన అంశాలను సూక్ష్మంగా చూపి మిగిలిపోయి చెప్పదగిన నూతనాంశాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. అన్నమయ్య ఆవిష్కరించిన

సామాజికాంశాలలో సామాజిక శృంగారం కూడా ప్రధానమైనదని నా అభిప్రాయం. ఇప్పటివరకు ఎవరూ అన్నమయ్య చూపిన శృంగారాంశాలు సమాజానివేనని చెప్పినట్లు లేదు. శృంగారం మధుర భక్తిలోనే లీనమవుతుందని భావించారు. ఇది సరైన విమర్శ తీరుకాదని, అన్నమయ్య సాహిత్యంలో సామాజిక పార్శ్వం ఉందని, అది ఎక్కువగా శృంగారం ద్వారానే వెల్లడవుతున్నదని ఇందులోని శృంగారానికి సంబంధించిన వ్యాసాలు నిరూపిస్తాయి. అన్నమయ్య చూపినది సామాజిక శృంగారమేనని నా నమ్మకం. అది శృంగార సంకీర్తనల అధ్యయనం ద్వారా నిరూపిత మవుతున్నది. దీనిని పాఠకులు గుర్తిస్తారని నమ్ముతున్నాను.

ఈ వ్యాస సంకలనం మీద తమ అభిప్రాయాన్ని 'మదింపు' పేరుతో తెలియజేసిన సహృదయ మిత్ర చూడామణి, అవధాన సార్వభౌముడు డా॥ మేడశాని మోహన్ గారికి; వివిధ సందర్భాల్లో తాళ్లపాక వాఙ్మయ అంశాలను చర్చించు కోవడంలో తన అభిప్రాయాలను తెలియజేస్తూ, నా అభిప్రాయాలకు ఊత నిచ్చిన తెలుగు శాఖాధ్యక్షులు, మిత్రులు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడుగారికి కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు. ఈ గ్రంథం వెలుగు చూడడానికి అవకాశం కల్పిస్తూ కావలసిన ఆర్థిక సహాయంచేసిన 'తిరుమల తిరుపతి దేవస్థానముల' వారికి కృతజ్ఞతలు. ఈ గ్రంథాన్ని డిటిపి చేసి యిచ్చిన చంద్రశేఖర్ గారికి, అందంగా ముద్రించిన సి.యన్. ప్రింటర్స్ , తిరుపతి వారికి ధన్యవాదాలు.

**– గల్లా చలపతి**

'విరోధి' ఉగాది
27-3-2009

అవధాన సార్వభౌమ

**డా॥ మేడసాని మోహన్**

డైరెక్టర్, అన్నమాచార్య ప్రాజెక్టు

తి.తి. దేవస్థానములు, తిరుపతి

# మదింపు

ఆచార్య గల్లా చలపతి గారు విశ్వవిద్యాలయ స్థాయిలో బోధన, పరిశోధనా రంగాలలో ప్రముఖస్థానం అలంకరించిన వారు. తిరుమల తిరుపతి దేవస్థానం - అన్నమాచార్య ప్రాజెక్టు తరపున నిర్వహించిన అనేక జాతీయ సాహితీ సదస్సులలో పాల్గొని పరిశోధక లోకాన్ని తమ సునిశిత పరిశీలనాదృక్పథంతో ఉత్తేజపరచియున్నారు. గల్లా చలపతి గారు ఉపన్యసించినా, పరిశోధనా వ్యాసాలు వ్రాసినా - అందులో వారు నిబద్ధతతో, శ్రద్ధాసక్తులతో కూడిన తపనతో సలిపిన కృషి వ్యక్తీకృత మౌతుంది.

ప్రత్యేకించి అన్నమయ్య పదకవితా ప్రక్రియపట్ల వీరి ఆరాధనా తాత్పర్యాలు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. ప్రస్తుతం ఈ గ్రంథంలో వీరు వెలువరించిన 12 పరిశోధనా వ్యాసాలు సత్యాన్వేషణతో సాగిన అక్షర ఫలాలు. పద్యకవిత్వం ప్రాచుర్యం పొందియున్న రోజుల్లో అన్నమయ్య ఎన్నుకొన్న పదకవితా ప్రక్రియ యొక్క వైశిష్ట్యాన్ని, ఈ వినూత్న విధానానికి అన్నమయ్య చూపిన దిశానిర్దేశాలను మొదటి వ్యాసంలో విపులీకరించి చూపినారు. శ్రీ వైష్ణవతత్త్వం, విశిష్టాద్వైత 'సిద్ధాంతం'లోని సైద్ధాంతిక విశేషాలు, ఈ అంశాలకు కొన్ని పురాణాలలో ఉన్న ప్రమాణాలు - వంటి అంశాలన్నీ రెండవ వ్యాసంలో చక్కగా వెలువరించినారు. సర్వాంతర్యామి యైన శ్రీనివాసుని సమర్పణభావంతో ఉపాసించే భక్తుని అధ్యాత్మ చింతన, భాగవత సంస్కారం - ఇత్యాది అంశాలను మూడవవ్యాసంలో

సోదాహరణంగా వివరించినారు. పదకవితా పితామహుడు, భాగవతోత్తముడు - నైన అన్నమయ్య తన వర్ణనానైపుణ్యాన్ని, ఆలంకారిక దృక్పథాన్ని భక్తిరసానికి ఎలా సమన్వయించి అద్భుత కవితా జగత్తును సృజించినాడో; మధురభక్తి, శరణాగతి భావాలలో ఎంత తాదాత్మ్యాన్ని పొందినాడో - 4, 5, 6వ వ్యాసాలలో విశ్లేషించినారు. ప్రాచీన సంస్కృత స్తోత్రసాహిత్యంలో పేరెన్నిక గన్న సుదర్శన షట్కం వంటి స్తోత్రాదులతో పెద తిరుమలయ్య సుదర్శన రగడను సమన్వయించి లోతులను అధ్యయనం చేసిన తీరు పరిశోధకులను ముగ్ధుల్ని చేస్తుంది. అన్నమాచార్యుల వారి సామాజిక దృక్పథాన్ని, సాంఘిక ప్రబోధాలను కూడ తగిన ఉదాహరణలతో ఇతరవ్యాసాలలో వివరించి ఉన్నారు. చివరగా పదకవులలో ప్రశస్తిగాంచిన సారంగపాణికి సంబంధించిన విశేషాలు కూడ సముచితంగా పొందుపరచి నారు. అన్నమయ్య పదకవితలపై పరిశోధన చేయదలుచుకొన్న యువపరి శోధకులకు, ఈ రంగంలోని జిజ్ఞాసువులకు ఈ గ్రంథం ఎంతో ఉపకరిస్తుంది.

ఆచార్య గల్లా చలపతి గారంటే నాకు ఎనలేని గౌరవభావం ఉంది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నేను ఎం.ఏ చదువుతున్న రోజుల్లో నేను వీరి ప్రత్యక్ష విద్యార్థినికూడా. క్షోదక్షమంగా పరిశ్రమించి ఎటువంటి గహనమైన పరిశోధనాంశాన్నైనా ప్రసన్న ధోరణితో చెప్పగలిగిన వీరి సౌమ్యతత్త్వం, నిరాడంబర వ్యక్తిత్వం - నన్నెంతో ఆకర్షించిన అంశాలు.

త్రికరణ శుద్ధిగ చేసిన పనులకు దేవుడు మెచ్చు - లోకమును మెచ్చు- అన్న అన్నమయ్య పలుకులు వీరి పరిశోధనా వ్యాసంగం పట్ల అనుసంధానం చేసుకోవచ్చు.

**- మేడసాని మోహన్**

తేది: 9-3-2009

# అన్నమయ్య వచోనూత్నక్రియలు

అన్నమయ్య ఒక మహాకవి. గొప్ప తాత్త్వికుడు. శృంగార అధ్యాత్మ సంకీర్తనలనేకాక, వివిధ ప్రక్రియలలో ఆయన సృజించిన సాహిత్యం విలువైనది. వెలకట్టలేనిది. సాధారణంగా ఆయా యుగాల కవులు వారి కాలంనాటి కావ్య లక్షణ శాస్త్రాలను అనుసరించి రచనలు చేయడం సహజం. కానీ తన రచనలలో అన్నమయ్య వాడిన కవితా సంప్రదాయాలు తరువాత వచ్చిన ఆలంకారికులను సైతం అబ్బురపరచిన కావ్య లక్షణాలైనాయి. తాను రచించబోయే శృంగార అధ్యాత్మ సంకీర్తనలకు అప్పటికి లక్షణ నిర్దేశం జరగక పోవడంవల్ల అన్నమయ్యే ఆ సంకీర్తనలకు లక్షణాలను తయారు చేసుకోవలసి వచ్చింది. ఈ కారణంగా సంస్కృతంలో సంకీర్తనా లక్షణ గ్రంథం రచించాడు. ఈ గ్రంథాన్ని చిన తిరుమలాచార్యులు పద్యగ్రంథంగా తెలుగులోకి అనువదించాడు.

**పదములు శృంగార వధూ**
**మృదు మధుర మనోజ్ఞ వాక్య మిశ్రములైనన్**
**విదితార్థ గ్రామ్యోక్తులు**
**పదిలముగాఁ బొంకమెరిగి పలుకగ జెల్లున్**
**పల్లవ నారీ మ్లేచ్ఛా,**
**ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవియై**
**చెల్లును గ్రామ్యములైనను**
**హల్లీసక ముఖ్య నాటకాదిక ఫణితిన్**

ఈ రెండు పద్యాలలో శృంగార సంకీర్తన లక్షణాలున్నాయి. శృంగార వధువుల తీపి పలుకులు, చెవికింపైన పామర స్త్రీల రసోక్తులు మొదలైనవి శృంగార సంకీర్తనలలో కనిపించే ప్రధాన విషయాలు. ఇలాంటి శృంగారపు పలుకులు గ్రామ్యోక్తులుగా కూడా ఉండవచ్చునట.

**దేహాత్మేశ వివేకో**
**త్సాహంబును లోకవేద ధర్మాధర్మా**
**ద్యూహాపోహంబులఁ గల**
**యాహరి సంకీర్తనంబు లధ్యాత్మంబుల్**

దేహాత్మ పరమాత్మలకు సంబంధించిన, వైదిక లౌకిక ధర్మాధర్మాలకు సంబంధించిన లక్షణాలు కలవి అధ్యాత్మ సంకీర్తనలని పై పద్యం చెబుతున్నది.

దైవారాధన ఒక యజ్ఞ విశేషమైతే అన్నమయ్యది సంకీర్తన యజ్ఞం. నవవిధ భక్తి మార్గాలలో కీర్తనం రెండవది. భగవంతుని గుణనామ సంకీర్తన చేయడమే కీర్తన లక్ష్యం. ఇక్కడ భగవంతుడు శ్రీవేంకటేశ్వరస్వామి. కీర్తించినవాడు అన్నమయ్య.

**'నృత్యతాం గాయతాం చైవ నానావాద్యం ప్రకుర్వతాం**
**యధా సంతుష్యతో దేవో నధ్యానారితి శ్రుతమ్'** అని

జైమినీయాశ్వమేధ పర్వంలో చెప్పబడింది. నృత్యం చేస్తూ వివిధ సంగీత వాద్య సహకారంతో గానం చేయడమే వివిధ ధ్యానాది సాధనల కంటే మిన్నగా పరమేశ్వరుని సంతృప్తి పరుస్తుందని పై శ్లోకార్థం. అన్నమయ్య వాగ్గేయకారుడు కాబట్టి తన్మయత్వంతో ఆడుతూ స్వామిని గురించి పాడి ఉంటాడనటం వాస్తవం. ఆయన రచించిన కీర్తనలకన్నింటికి రాగ నిర్దేశం చేసి ఉండడం కూడా పై అంశాన్ని బలపరిచే విషయమే. 'ముక్తికి మహత్సేవయే ద్వారమ'ని భాగవతం ప్రకటించింది. ముక్తి కోసం అన్నమయ్య చేసిన స్వామిసేవ సంకీర్తన సేవ.

శ్రీమన్నారాయణునికి ప్రసిద్ధమైన పది అవతారాలున్నట్లు అన్నమయ్య సంకీర్తనలకు కూడా పది స్వరూపాలున్నాయి. అన్నమయ్య సంకీర్తనలు 1. శ్రుతులు,

2, శాస్త్రాలు, 3. పురాణ కథలు, 4. సుజ్ఞాన సారాలు, 5. యతిలోకాగమ వీధులు, 6. విపుల మంత్రార్థాలు, 7. నీతులు, 8. కృతులు, 9. నుతులు, 10.వేంకటపతి రతి క్రీడా రహస్యాలు. ఈ పదింటిలో తొమ్మిది సంఖ్య వరకు ఉన్నవన్నీ అధ్యాత్మ సంకీర్తనలకు చెల్లే విషయాలు. ఎనిమిదవ అంశమైన కృతులు అనే మాటకు సంగీత ప్రధానమైన రచనలని అర్థం చెప్పవచ్చు. సాధారణంగా 'కృతి'లో సాహిత్యం గౌణంగా సంగీతం ప్రధానంగా ఉంటుంది. వాడిన మాటలు సంగీత వాహికలుగా ఉంటాయి. 'త్యాగరాజ కృతులు' అనడం అందరికీ తెలిసిందే. అన్నమయ్య తన సంకీర్తనలను కృతులుగా కూడా భావించాడు. అన్నమయ్య సంకీర్తనలు సంగీత ప్రాధాన్యతను కూడా కలిగి ఉండడం గాయకులకు తెలిసిన విషయం. అన్నమయ్య సంకీర్తనలకు పదములని కూడా పేరుంది. క్షేత్రయ్య రాసినవీ పదాలే. క్షేత్రయ్య పదాలకు జావళీలని మరోపేరుంది. గ్రామ్య గాన పద్ధతిలో సరళమైన వ్యావహారిక భాషలో శృంగారాత్మకంగా సాగే తేలిక పదాలు జావళీలు. ఈ లక్షణం క్షేత్రయ్య పదాలకు ఉండడం వల్ల అవి జావళీలు. జావళి అభియాత్మకంగా కూడా ఉండినా అందులో లలితమైన శృంగారపు స్ఫురణ ఎక్కువ. ఈ అర్థంలో పరిశీలిస్తే అన్నమయ్య శృంగార సంకీర్తనలకు 'పదములు' అనేమాట చెల్లుతుంది.

అన్నమయ్య సంకీర్తనలు ఆయన రచించిన 'వచోనూత్న క్రియలు'. ఇందులోని 'వచో' అనే మాటకు 'చెప్పిన' అనే అర్థం తీసుకుంటే అన్నమయ్య నూతనంగా చెప్పిన సంకీర్తనలు అనే తాత్పర్యం పొసగుతుంది. లేదా వచనంలో కొత్తగా తయారుచేసిన సాహిత్య రూపాలు అని భావించినా భావించవచ్చు. అయితే యతి ప్రాసలతోనూ రాగ నిర్దేశితాలుగానూ ఉండడం వలన సంకీర్తనలు వచనాలుగా ఆలోచించడానికి వీలులేదు. అందువల్ల మొదటి అభిప్రాయమే సరైంది. అన్నమయ్య సంకీర్తనలకు గల పది స్వరూపాలలో పదవది 'వేంకటపతి రతిక్రీడా రహస్యాలు'. ఇదొక్కటే శృంగార సంకీర్తనలను స్ఫురింపజేస్తుంది. ఆయన రచించిన సంకీర్తనలు 'వరమంత్రములు ముప్పది రెండువేల'ట. ఇది అన్నమాచార్య చరిత్రలో చిన్నన్న చెప్పిన మాట. లభ్యమై ముద్రింపబడినవి సుమారు

పదునాలుగువేలు. దొరుకు తున్న ఈ సంకీర్తనలను ఇటీవల (1998) దేవస్థానం వారు 29 సంపుటాలుగా ముద్రించారు. వీటిలో 10వ సంపుటి చిన తిరుమలాచార్యుల అధ్యాత్మ శృంగార సంకీర్తనలు గలది. 15వ, 17వ సంపుటాలలో పెద తిరుమలాచార్యుల అధ్యాత్మ శృంగార సంకీర్తనలున్నాయి. ఈ మూడు సంపుటాలు పోగా మిగిలిన 26 సంపుటాలు అన్నమయ్యవి. ఈ 26 సంపుటాలలో మొదటి నాలుగు అధ్యాత్మ సంకీర్తనలకు సంబంధించినవి. మిగిలిన 22 సంపుటాలు అన్నమయ్య శృంగార సంకీర్తనలకు సంబంధించినవి. ఇలా పరిశీలిస్తే దొరికిన సంకీర్తనలలో శృంగార సంకీర్తనలే అధికం. ఈ ఆధిక్యతను గమనించడానికే పై లెక్కలు వివరాలు. అన్నమయ్య సంకీర్తనలలో ముప్పాతిక మువ్వీసం భాగం శృంగార సంకీర్తనలే. ఒకవేళ కాలప్రవాహంలో ఇంకా కొన్ని సంకీర్తనలు దొరికినా అప్పుడు కూడా శృంగార సంకీర్తనలే ఎక్కువుగా ఉంటాయి. అధ్యాత్మ విద్యా మర్మజ్ఞుడుగా పేరుపొందిన అన్నమయ్య శృంగార సంకీర్తనలనే ఎక్కువగా రచించడానికి కారణమేమైనా ఉందేమో పరిశీలించాలి.

'కామంచ యౌవనే, స్థావిరే ధర్మ మోక్షంచ' అనేసూత్రాలు శాస్త్రకారులవి. (యౌవనంలో కామం లేదా శృంగారం, వృద్ధాప్యంలో ధర్మ మోక్షాలు). ఈ రెండు సూత్రాలు మానవ జీవితంలోని రెండు దశలను - శృంగార వైరాగ్య దశలను తెలియ జేస్తాయి. రెండు దశలు కలిస్తేనే సంపూర్ణ జీవితం. ఇలాంటి జీవిత వ్యాఖ్యానమే అన్నమయ్య శృంగారధ్యాత్మ సంకీర్తనలు. అన్నమయ్యలో గొప్ప ఆలంకారికుడు దాగి ఉన్నాడు. అతడే శృంగార సంకీర్తనలలోనూ, అధ్యాత్మ సంకీర్తనల లోనూ ప్రకృతి నుండి తత్సంబంధమైన రస సామాగ్రిని తెచ్చి విభావానుభావాలను కూర్చి రసోల్బణంగా వర్ణించి శృంగార భక్తి రసాలుగా పరిణమింపజేసి అనుభవ యోగ్యం చేశాడు. అన్నమయ్య జీవించిన కాలంనాటి సాహిత్య లక్షణం కూడా ఇదే. శృంగారాన్ని రసరాజంగా నిర్ణయించిన భోజుని 'శృంగార ప్రకాశిక' అనే కావ్యలక్షణశాస్త్రం వెలువడిందీకాలంలోనే. ఈ కాలంవాడైన పోతన కూడా మానవునికి ఉపాధేయాలైన రక్తిని, భక్తిని స్వతంత్ర రసాలుగా పోషించాడు. అయితే ఈ ఇద్దరు కవులు శృంగారంలో అధ్యాత్మ

భావాలను దర్శించారు. అదే కాలానికి చెందిన శ్రీనాథుని కావ్యాలలో కూడా భౌతిక అధ్యాత్మిక (శృంగార, భక్తి లేదా శాంత) విలువల సంఘర్షణ కనిపిస్తుంది.

అన్నమయ్య సంకీర్తనలు ముక్తకాలు. ఒక్కొక్క సంకీర్తనలో ఒకోరకమైన లోకానుభవం ఉంది. ఆయన చేసిన సంకీర్తన యజ్ఞానికి వేదిక సమాజం. సమాజానికి గల అనేకానేక భావాలలో ప్రధానమైనవి శృంగార అధ్యాత్మభావాలు. ఈ రెండు భావాల మధ్య సమస్త విశ్వభావనలు ఇమిడి ఉన్నాయి. అన్నమయ్య దృష్టిలో శాశ్వతమైన భావం అధ్యాత్మభావం. అయితే ఇది అందరికీ ఆకర్షకం కాదు. పైగా శృంగారానికి ఉన్నంత తీవ్రత, ఆకర్షణ దీనికి లేవు. అందువల్ల శృంగార భావాలను అతిగా వర్ణించి, కచకుచాద్యవయవాలను స్ఫురింపజేసి, వెగటు పుట్టించి తద్వారా జీవిని సత్వభావ సంపన్నమైన అధ్యాత్మదశకు మరలించి స్వామికి అభిగమ్యుని చేయడం అన్నమయ్య శృంగార సంకీర్తనాయజ్ఞ ప్రయోజనం. ఇది అన్నమయ్య శృంగార సంకీర్తనలకు గల మౌలికమైన, లౌకికమైన లక్షణం.

అన్నమయ్య శృంగార సంకీర్తనల ఆధిక్యతకు మరొక అలౌకిక కారణం ఉంది. ఆత్మ పరమాత్మల కలయికను అన్నమయ్య రెండు దేహాల కలయికగా చెప్పినాడు. రెండాత్మలు ఒకటి కావాలనుకొన్నపుడు రెండుదేహాలు ఒకటి కావొచ్చునని ప్రతిపాదించే తత్త్వమే శృంగార సంకీర్తనల తత్త్వం. ఈ తత్వ నిరూపణకు ప్రతి శృంగార సంకీర్తనా లక్ష్యమైనపుడు ఉదాహరణలు చూప వలసిన పనేముంది? రెండాత్మలు ఒక ద్వంద్వం. ఒకటి ఆత్మ – మరొకటి పరమాత్మ. రక్తితో ప్రారంభమై భక్తిగా పరిణమించే మోక్ష కాముకత్వం వైష్ణవ సిద్ధాంతం. 'పుంసాం మోహన రూపాయ' అన్నది శ్రీకృష్ణ తత్వం. శ్రీకృష్ణునికి తిరువేంకటపతికి అభేదం.

**'వాసుదేవ పుమానేక నాశ్చర్యం సకలం జగత్**
**గోవింద ఏవపురుషో బ్రహ్మాద్యాః స్త్రియ ఏవచ**
**పుమాన్ విష్ణురితిఖ్యాతః స్త్రీప్రాయమితరం జగత్**
**సఏవ వాసుదేవోఽసౌ సాక్షాత్ పురుష ఉచ్యతే**
**స్త్రీప్రాయ మితర స్సర్వం . . . . . . . .'**

పై ఉపనిషత్కథనంలో వివరింపబడిన అంశాలు మధురభక్తికి సంబంధించినవి. దీనికే ప్రేమభక్తి అని మరోపేరు. రాధాకృష్ణుల ప్రణయ తత్త్వం ఈ కోవలోనిదే. బ్రహ్మ వైవర్త పురాణ, దేవీ భాగవతాల్లో రాధామాధవులు పరస్పరారాధకులుగా కనిపిస్తారు. ఆత్మ పరమాత్మల తత్త్వంలాగే వీళ్ళదీ ఒకే తత్త్వం. తన శృంగార సంకీర్తనల విషయం కూడా అలాంటిదేనని చెప్పడానికి కాబోలు అన్నమయ్య –

**అతిశోభితేయం రాధా**
**సతత విలాస వశా రాధా** (4వ సం. 48వ సంకీర్తన)

**రాధామాధవ రతిచకితమితి**
**బోధాపహం శ్రుతి భూషణం** (3వ సం. 664వ సంకీర్తన)

**పావన రాధా పరిరంభ సుఖ**
**శ్రీవైభవ సుస్థిరో భవతి** (12వ సం. 166వ సంకీర్త)

ఇత్యాది అనేక సంకీర్తనలలో మధురభక్తి సహితమైన రాధాకృష్ణుల ప్రణయతత్త్వాన్ని వర్ణించడం గమనింపదగిన అంశం. సంస్కృత పురాణాంతర్గతమైన ఆ విషయాన్ని సంస్కృత సంకీర్తనలలో వివరించడం, శృంగార సంకీర్తనలలో కృష్ణావతార విశేషాలు ఎక్కువగా ఉండడం కూడా తత్పోషక విషయమే.

ఇంత ఉదాత్తంగానూ, తాత్త్వికంగానూ ఆలోచించదగిన శృంగార సంకీర్తనలలో విచ్చలవిడి కామకేళికి సంబంధించిన విషయాలు కనిపించడం జీర్ణించుకోలేని విడ్డూరం.

**'ఆ కృష్ణమాచార్యు నధ్యాత్మ వినుతి**
**రాకఁ గొన్నాళ్ళు విరక్తుండనైతి**
**జగతి నీ శృంగార సంకీర్తనముల**
**కగపడి మంచి ప్రాయపు వాడనయితి**
**నని వేంకటేశ్వరుఁ దన్నమాచార్యుఁ**
**గనుకొని వాక్రుచ్చి గౌరవించుటయు'**

అన్నమాచార్య చరిత్రలోగల ఈ ద్విపద పంక్తులు స్వామివారి కోరిక మేరకే లోతైన శృంగారానుభవ సారం శృంగార సంకీర్తనల కెక్కినట్లు వెల్లడి చేస్తున్నాయి. దీనికి తోడు అన్నమయ్య కాలంనాటి శృంగారం ఈనాడు అనుకనేటంత రహస్యం కాదు. అది ఆకాల స్వభావం. శృంగార భావాలతో శృంగార రాయుడైన కోనేటిరాయని కీర్తించడానికి సృష్టికి హేతువైన శృంగార భావాలను దాపరికం లేకుండా చెప్పడం వల్ల శృంగార సంకీర్తనలలో కొంత వరకు నగ్నత భాసిస్తుంది. శృంగారానికి స్థాయిగా గల 'రతి'కి భోగం, ఐశ్వర్యం అనే అర్థాలున్నాయి. స్వామికి గల అనంత గుణాలలో ఈ రెండు ప్రధాన గుణాలు.

# అన్నమయ్య సంకీర్తనలలో పౌరాణిక గాథా విశేషాలు

పాతదైనా కొత్తగా భాసించేది పురాణం (పురా అపి నవం పురాణం). కొత్తగా భాసించేది వస్తువు అంటే కథ. సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం. వంశానుచరితం అనేవి పురాణానికి పంచ లక్షణాలు. ఈ లక్షణాలన్నీ భూత కాలానికి సంబంధించినవే. అందువల్ల జరిగిపోయిన వృత్తాంతాలను కథలుగా చెప్పేది పురాణమని అర్థమవుతుంది. జరిగిపోయిన వృత్తాంతాలు పాతవి కాబట్టి అవి కొత్తగా ఎలా కనిపిస్తాయని సందేహం కలుగుతుంది. పాత కథాసంఘటనల ద్వారా పాఠకుల శ్రోతల సమస్యలను పరిష్కరించడం, వారిని విజ్ఞానులను చేయడం పురాణం పని. పురాణం చెప్పడం, చెప్పించు కోవడం మనదేశంలో ప్రాచీన పద్ధతులు. పురాణాలు చెప్పేవాళ్ళు పౌరాణికులు. ఒక పౌరాణికుడు ఒక పురాణ కథను ఒక రకంగా చెపితే మరొక పౌరాణికుడు అదే కథను మరొక పద్ధతిలో వివరిస్తాడు. చెప్పే పద్ధతిలో నవ్యత ఉంటుంది. కథాంశాలను వినేవారి జీవితాలకు తగిలేటట్లు చెప్పడం నవ్యత. పురాణకథలు పాతవైనా పౌరాణికుని ప్రతిభతో వింటున్న ప్రతిసారీ కొత్తగానే అనిపిస్తాయి. ఇది పురాణానికి ప్రధాన లక్షణం. ఈ లక్షణమే లేకుంటే పురాణ సాహిత్యం ఎప్పుడో మన జీవితాలనుండి తప్పుకొనేది.

ప్రాచీన కవులంతా పురాణ సాహిత్యంలోని సూక్ష్మాంశాలను తమ కావ్యాలలో విపులీకరించారు. వాగ్గేయకార సార్వభౌముడైన అన్నమయ్య కూడా ఈ పని చేశాడు. అన్నమయ్య సంకీర్తన వాఙ్మయం ఒక భక్తి సింధువు. భక్తి

సింధువులో మునిగిన అన్నమయ్యకు సర్వం శ్రీనివాసమయంగా కనిపించింది. పరమాత్మను చేరుకొనే ప్రయత్నం చేశాడు. పరమాత్మను ప్రస్తుతించాడు తన వేదనను వ్యక్తపరచు కొన్నాడు. జీవుడు తన వేదనను పరమాత్మకు విన్నవించుకోడానికి ఉపకరించిన వాహికలే లేక వాఙ్మూపాలే సంకీర్తనలు. అన్నమయ్య సంకీర్తనల నిండా పురాణ కథలు నిండి ఉన్నాయి. శ్రీహరి పురాణ పురుషుడు. ఆయన కథే పురాణ కథలన్నింటికి మూలమని అన్నమయ్య భావించాడు.

**"వారిదేపో జన్మము - వడి నిన్ను దెచ్చిరి**
**భారత రామాయణాలై - పరగె నీకథలు**
**భువిమీద రావణుడు - పుట్టగా రాముడవై**
**తవిలి యిందరికి బ్ర - త్యక్షమైతివి**
**వివరింప నంతవాడు - వెలసితేగా నీవు**
**అవతార మందితే ని - న్నందరు జూతురు."**

**- ఆధ్యాత్మ సం.6-160**

ఈ సంకీర్తనలో శ్రీమన్నారాయణుని కథలు భారత రామాయణాలైనట్లు చెప్పబడింది. సృష్టి స్థితి లయలకు ఆధార భూతమైన ధరిత్రి శ్రీమన్నారాయణుని విరాడ్రూపం.

**"విశ్వమెల్ల నీవిరాడ్రూపము**
**శాశ్వత హరి నీ శరణులము**
**కన్నుల సూర్యుడు కమలాప్తుడు నీ**
**పన్నిన మోమున బ్రాహ్మణులు**
**వున్నతి వైశ్యులు వూరువులందును**
**యన్నగ శూద్రులు యిదె పాదముల"**

అనే సంకీర్తన అన్నమయ్య హరిని దర్శించిన పద్ధతిని వివరిస్తుంది.

అన్నమయ్యకు పురాణ వాఙ్మయమంతా కరతలామలకం. సందర్భాను సారంగా ఆయన సంకీర్తనలలో పురాణ కథలు తమంత తాముగా వచ్చి కుదురు

కుంటాయి. పురాణ కథలతో పాటు విశిష్టాద్వైత వేదాంత విషయాలన్నీ సంకీర్తనలలో వ్యాఖ్యానింప బడ్డాయి. పురాణ కథలను, వేదాంత రహస్యాలను అన్నమయ్య భక్తజనులకు సుబోధం చేయడానికే సంకీర్తనలలో విశిష్టాద్వైత వేదాంత రహస్యాన్ని తొమ్మిది మాటలలో వివరించ వచ్చునని చెపుతూ ఈ సంకీర్తన రచించాడు.

**"మూడేమాటలు - మూడు మూండ్ల తొమ్మిది**
**వేడుకొని చదవరో - వేదాంత రహస్యము ॥పల్లవి॥**

**జీవస్వరూపము - చింతించి యంతటాను**
**దేవుని వైభవము - తెలిసి**
**భావించి ప్రకృతి సం - పద యిది యెఱుగుటే**
**వేవేలు విధముల - వేదాంత రహస్యము**
**తనలోని జ్ఞానము - తప్పకుండా దలపోసి**
**పనితోడ నందువల్ల - భక్తి నిలిపి**
**మనికిగా వైరాగ్యము - మఱవకుండుటే**
**వినవలసిన యట్టి - వేదాంత రహస్యము**
**వేడుకతోనాచార్య - విశ్వాసము కలిగి**
**జాడల శరణాగతి - సాధనముతో**
**కూడి శ్రీవేంకటేశ్వరు - గొలిచి దాసుడౌటే**
**వీడని బ్రహ్మానంద - వేదాంత రహస్యము"**

ఈ సంకీర్తనలో వివరించిన వేదాంతం విశిష్టాద్వైత వేదాంతం. తత్త్వం-హితం - పురుషార్థం అనేవి మూడు మాటలు. జీవుడు - దేవుడు - ప్రకృతి - జ్ఞానం - భక్తి - వైరాగ్యం - ఆచార్య విశ్వాసం - శరణాగతి - భగవద్దాస్యం అనేవి తొమ్మిది విషయాలు. విశిష్టాద్వైత వేదాంత సిద్ధాంతం ఇలా ఉంటుంది. "శ్రీమన్నారాయణ ఏవ చిద చిద్వి శిష్టాద్వైత తత్త్వమ్, భక్తి ప్రపత్తిభ్యామ్ ప్రసన్నః స ఏవ ఉపాయః అప్రాకృత దేశ విశిష్టః స ఏవ ప్రాప్య ఇతి వేదాన్త వాక్యైః" - చిత్తు అంటే జీవుడు. అచిత్తు అంటే ప్రకృతి. ఈ రెండింటికి ఆత్మ

శ్రీమన్నారాయణుడు. చిదచిదీశ్వరులు నిత్యులు. ఈశ్వరుని నియమాన్ననుసరించి చిదచిత్తులు ప్రవర్తిస్తాయి. పౌరాణిక కథలతో పాటు ఈ సిద్ధాంత విషయాలు కూడా అన్నమయ్య సంకీర్తనలో ప్రధాన విషయాలుగా కనిపిస్తాయి.

పౌరాణిక విషయాలలో తనకు గల అభిరుచిని, పాండిత్యాన్ని ప్రకటించు కోవడానికి, పురాణ కథలను పాఠకులకు లేదా భక్తులకు పరిచయం చేయడానికి అన్నమయ్య ప్రయత్నం చేయలేదు. వేదేతిహాస పురాణాలలో ఆయనకు గల అసమానమైన పాండిత్యం అలవోకగా, అప్రయత్న పూర్వకంగా సంకీర్తనలలో కనిపిస్తుంది. సంకీర్తనలలో కనిపించే పౌరాణిక విశేషాలను నిశితంగా పరిశీలిస్తే పురాణ కథలను ఆయన కొన్ని నిర్దిష్ట ప్రయోజనాల కోసం వివరించినట్లు అర్థమవుతుంది. సంకీర్తనలలో ఆయన రాజకీయ ఆర్థిక సామాజిక సాంస్కృతిక అంశాలనే గాక కుటుంబ వ్యవస్థ, వ్యక్తుల నడవడిక మొదలైన అనేకానేక అంశాలను పొందు పరిచాడు. అయితే ఈ విషయాలన్నీ భక్తి ప్రపత్తులలో మునిగి సందర్భాను సారంగా ఉండడంచేత విడివిడిగా మనకు స్ఫురించవు. బాగా ఆలోచిస్తే వక్తవ్యాంశాన్ని దృష్టాంత పూర్వకంగా వివరించడానికి పురాణ కథలు ఉపయోగించి నట్లు అర్థమవుతుంది. ఎంతటివాడైనా విధికి తలవంచ వలసిందే. ఈవిషయాన్ని స్థాపించడానికి పురాణకథలు వినియోగింపబడినాయి.

**ఎంత సేయగలేదు యిటువంటి విధి యభవు**
**నంత వానిని భిక్ష మడుగు కొన జేసె ॥పల్లవి॥**

**కోడి చంద్రుని బట్టి గురు తల్పగుని జేసె**
**కూడి మలరంగ నింద్రుగోడి జేసె**
**ఘోర కుదువంగ త్రిశంకుని నంత్యజుని జేసె**
**వీరుడగు నీలుబట్టి విద్రూపు జేసె**
**అతివ నొడ్డుగ జూదమాడ ధర్మజు జేసె**
**సతి నమ్ముకొన హరిశ్చంద్రు జేసె**
**కుతలపడ శూద్రకుని గొట్టె ముచ్చుగ జేసె**
**మతిమాలి కురురాజు మడుగు జొర జేసె**

**పదని పాట్ల బఱచి బ్రహ్మ తలవో జేసె**
**తొదరి కాలునికాలు దునియ జేసె**
**అదరని విధికి విధియగు వేంకటేశు కృప**
**పదయకుండగ భంగ పడక పోరాదు** **అధ్యాత్మ సం.5-76**

అభవుడు (శివుడు) ఇతరులకు ఐశ్వర్య ప్రదాత. అయినా కూటికి గతిలేని వానివలె భిక్ష మడుగు కొని జీవించాడు. జ్ఞానవంతుడైన చంద్రుడు జ్ఞాన హీనుడై గురు తల్పగుడయ్యాడు అంటే గురుపత్నియైన తారను కూడాడు. దేవతలకు రాజైన ఇంద్రుడు ఒక మానవాంగన పొందుకోసం కోడిగా మారాడు. ఈ విషయాలన్నీ వివిధ పురాణాలలోని కథాంశాలు. ఈ సంకీర్తనలో ఇంకా ఇలాంటి పురాణ కథాంశా లెన్నో ఉన్నాయి. దేవతలు, మహా పురుషులే విధి చేష్టలను తప్పించుకోలేక అనేక కష్టాలు అనుభవించారు. ఇక సాధారణ మానవులు చేయగలిగినదేముంది? అన్నివేళల పురుష ప్రయత్నం ఫలించదు. విధికి ఎదురొడ్డి నిలవడం సాధ్యంకాదు. కాబట్టి ఎలాంటి పరిస్థితులనైనా బెంబేలు పడకుండా ధైర్యంతో ఎదుర్కోవాలి. అనే విషయాన్ని అన్నమయ్య ఈ కీర్తన ద్వారా తెలిపాడు. చేసిన పాపం నుండి తప్పించుకోడానికి భగవంతునికైనా సాధ్యం కాదని పాపంవల్ల కలిగే ఫలితాన్ని తప్పక అనుభవించ వలసి వుంటుందని అన్నమయ్య నమ్మకం. భగవంతుడైన శ్రీమన్నారాయణునికే ఇది తప్పనప్పుడు సామాన్య మానవులు ఎలా తప్పించుకో గలరంటున్నాడు క్రింది సంకీర్తనలో –

**ఎట్టి వారికి నెల్ల నిట్టి కర్మములు మా**
**యిట్టి వారికి నింక నేది త్రోవయ్య** **॥పల్లవి॥**

**పాము చంపిన యట్టి పాతకమున పెద్ద**
**పాము మీద నీకు బవళింప వలసె**
**కోమలి జంపిన కొరతవల్ల నొక్క**
**కోమలి నెద బెట్టుకొని యుండవలసె**
**బండి విరిచినట్టి పాతకమున పెద్ద**
**బండి బోయిడవై పనిచేయ వలసె**

**కొండ వెతికిన యట్టి గుణమున దిరుమల**
**కొండమీద నీకు కూచుండ వలసె** **అధ్యాత్మ సం.5-180**

ఈ సంకీర్తనలో శ్రీకృష్ణావతార ఘట్టాలను వర్ణించి ఆయా ఘట్టాలకు సంబంధించిన స్వామివారి అనంతర స్థితులను వివరించి కర్మానుభవ సిద్ధాంతాన్ని వ్యాఖ్యానించాడు అన్నమయ్య.

2. ఒక వీరుని జీవిత ఘట్టాలను వివరించడానికి పురాణ కథనంతటిని సంక్షిప్తంగా చెప్పడం లేక వీరుని జీవిత ఘట్టాలను వివరిస్తూ పురాణ కథనంతటిని స్ఫురింపజేయడం.

శ్రీరాముని జీవితంలోని వివిధ ఘట్టాలే శ్రీమద్రామాయణ కావ్యం. ఈ క్రింది సంకీర్తనలో శ్రీరాముని జీవితమంతా సంక్షిప్తంగా కనిపిస్తుంది.

**రామ రామచంద్ర రాఘవా రాజీవలోచనా రాఘవా**
**సౌమిత్రి భరత శత్రఘ్నుల తోడ జయమందు దశరథ రాఘవా**
**॥ పల్లవి ॥**

**శిరసు కూకటుల రాఘవా - చిన్నారి పొన్నారి రాఘవా**
**గరిమ నా వయసున దాటకి జంపిన - కౌసల్య నందనా రాఘవా**
**అడవి యజ్ఞము గాచు రాఘవా - అట్టే హరుని విల్లు విరచిన రాఘవా**
**సిరులతో జనకుని యింటను - జానకి జెలగి పెండ్లాడిన రాఘవా**
**మలయు నయోధ్య రాఘవా - మాయా మృగాంతకా రాఘవా**
**చెలగి చుప్పనాతి గర్వమడచి దైత్య - సేనల జంపిన రాఘవా**
**సొలసి వాలి జంపి రాఘవా దండి - సుగ్రీవునేలిన రాఘవా**
**జలధి బంధించిన రాఘవా - లంకేశు సంహరించిన రాఘవా**
**- అధ్యాత్మ సం.5-217**

మానవుడుగా దశరథుని పుత్రుడుగా జన్మించిన శ్రీరాముడు చేసిన వీరోచితమైన పనులన్నింటిని చెప్పడం మానవుని కర్తవ్యోన్ముఖుని చేయడానికే. ఇన్ని పనులు చేసిన తరువాతనే శ్రీరాముడు దైవంగా స్తుతింప బడినాడు. మానవుడు

మహనీయుడు కావాలంటే కర్తవ్య పాలనలో వెనక పడకూడదనే సత్యాన్ని ఈ సంకీర్తన బోధిస్తున్నది.

3. భగవంతుని కంటె కొన్ని సందర్భాలలో భక్తుడే గొప్పవాడని చెప్పడానికి, భగవంతుడు చేసిన పనులు భక్తులకు మార్గ నిర్దేశం చేస్తామని చూపడానికి పురాణ కథలను దృష్టాంతాలుగా గ్రహించడం.

సృష్టి కర్తృత్వం, లక్ష్మీపతిత్వం తప్ప తక్కిన అన్నివిషయాలలో ముక్తులైన భక్తులు పరమేశ్వరునితో సమానులని, నిత్యవిభూతికి నిలయమైన వైకుంఠంలో స్వామి సన్నిధిలో ఆనందిస్తూ వుంటారని శ్రీవైష్ణవం చెపుతుంది. అన్నమయ్య ఈ విషయాన్ని పురాణ కథల ద్వారా తన సంకీర్తనలలో స్పష్టం చేశాడు. శ్రీరాముడు చేసిన పనులన్నీ హనుమంతుడు చేశాడు. పైగా ఈ పనులు చేయడంలో శ్రీరాముడు పడినంత శ్రమ హనుమంతుడు పడలేదు. అవలీలగా శ్రమలేకుండా చేశాడు. అందువల్ల దేవునికంటె భక్తుడు గొప్పవాడనిపిస్తుంది. అయితే ఆ గొప్పతనం భక్తునిదా లేక దేవునిదా అన్నపుడు ఇద్దరిదీకాదు భక్తిదేనని సమాధానం.

**ఇతడే యతడు గాబోలేలిక బంటునునైరి**
**మితిలేని రాఘవుడు మేటి హనుమంతుడు ॥పల్లవి॥**

**జలధి బంధించిదాటె చలపట్టి రాఘవుడు**
**అలరి వూరకె దాటె హనుమంతుడు**
**అలుకతో రావణుని యదటణచె నతడు**
**తలచి మైరావణుని దండించె నితడు**
**కొండ పెల్లగించె తొల్లి గోవర్ధనుడతడు**
**కొండతో సంజీవియెత్తె గోరి యితడు**
**గుండు గరచె నహల్య కొరకు సీతాపతి**
**గుండు గరగక బాడె కోరి యితడు**
**అంజనా చలము మీద నతడు శ్రీవేంకటేశు**
**డంజనీ తనయుడా యనిలుజుడు**
**కంజాప్త కుల రామ ఘనుడు దాకును దయా**
**పుంజమాయ మంగాంబుధి హనుమంతుడు**

ఈ సంకీర్తనలో భగవంతుడు భక్తుడు, సమానులుగా చూపబడినారు. ఒకరు మితిలేనివారు. మరొకరు మేటి. ఒకరు ఏలిక. మరొకరు బంటు. వీరిది యజమాని సేవక సంబంధం. ఈ సంబంధానికి భక్తి పునాది. భక్తిలో తరించిన సేవకునికి యజమాని గుణం అబ్బుతుంది.

4. భక్తులకు భగవంతునితో గల సంబంధం చెపుతూ ఆ భక్తుల కథలను వివరించి తద్వారా ఆ కథలకు లోకప్రాచుర్యం కలిగించడం-

భక్తి ప్రధానమైన పురాణ కథలను ప్రచారం చేయడం భక్తిని ప్రచారం చేయడమే అవుతుంది. ఈ క్రింది సంకీర్తనలో అన్నమయ్య భవరోగాలను పోగొట్టుకోడానికి శ్రీమన్నారాయణుని శరణు పొందడమే గొప్ప మందని చెపుతున్నాడు.

**కొనరో కొనరో మీరు - కూరిమి మందు**
**ఉనికి మనికి కెల్ల - నొక్కటే మందు ॥పల్లవి॥**

**ధ్రువుడు గొనిన మందు - తొల్లియు బ్రహ్మాదుడు**
**చవిగా గొనిన మందు - చల్లని మందు**
**భవ రోగములు వీడి - పారగ పెద్దలు మున్ను**
**జవకట్టి కొనిన ని - చ్చలమైన మందు**
**నిలచి నారదుడు గొ - నినమందు జనకుడు**
**గెలుపుతో గొని బ్రతి - కిన యామందు**
**మొలిచి నాలుగు యుగ - ముల రాజులు ఘనులు**
**కలకాలము గొని - కడగన్న మందు**
**అజునకు పరమాయువై - యొసగిన మందు**
**నిజమై లోకము లెల్ల - నిండిన మందు**
**త్రిజగములు నెఱుగ - తిరు వేంకటాద్రిపై**
**ధ్వజమెత్తి గోనేటి - దరినున్న మందు**

శ్రీమన్నారాయణుడనే మందు ఉనికికి మనికికి ఆధారమైన మందు. ఆ మందే దేవర్షులు రాజర్షులు రాజులు మొదలైన వారు బ్రహ్మానందం పొందడానికి అనువైన

మందు. సమస్త విశ్వానికి సృష్టి కర్తయైన బ్రహ్మకు పరమాయువు ఆ మందు. తిరుమలలో కోనేటి గట్టుననున్న ఆమందు ముల్లోకాలకు తెలిసేటట్లు 'నావలె భవరోగాన్ని పరిమార్చే మందింకొకటి లేదు' అని ధ్వజమెత్తి చాటినది. ఈ సంకీర్తన ధ్రువుడు, ప్రహ్లాదుడు మొదలైన భక్తుల కథలను స్పృశిస్తూ భక్తి ప్రాశస్త్యాన్ని చాటుతున్నది.

ముకుందమాలలో కులశేఖరాళ్వారు కృష్ణుడు అనే అమృతమొక్కటే జనన మరణాది దుఃఖాలను తొలగించే దివ్యౌషధమని –

**వ్యామోహ ప్రశమౌషధమ్ ముని మనోవృత్తి ప్రవృత్త్యౌషధమ్**
**దైత్యేం ద్రార్తి కరౌషధమ్ త్రిభువనీ సంజీవనై కౌషధమ్**
**భక్తాత్యంత హితౌషధమ్ భవభయ ప్రధ్వంసనై కౌషధమ్**
**శ్రేయః ప్రాప్తి కరౌషధమ్ పిబ మన శ్రీకృష్ణ దివ్యౌషధమ్**

**(ముకుందమాల – 24వ శ్లోకం)**

అనే శ్లోకంలో కీర్తించాడు. ఇలాగే అన్నమయ్య కూడా

**"వేదమంత్ర మింకనేలవేరు వెల్లంకులు నేల**
**పుడమిధరుడు మాకు భువనౌషధము"**

అని, "అన్నిటికినిది పరమౌషధము – వెన్నుని నామమె విమలౌషధము" అని కీర్తించాడు.

5. అన్నమయ్య పురాణ కథలద్వారా జనులకెదురయ్యే లౌకిక విషయాలను పరిష్కరించే ప్రయత్నం చేశాడు.

**కలదిదివో సుఖము గలిగినను – గర్భము నిలువక మానునా**
**మలసికామ్య కర్మలకు జొచ్చిన – మగుడ బుట్టువులు మానునా**

**॥పల్లవి॥**

**పరగ నింద్రజిత్తుడు హనుమంతుని – బ్రహ్మాస్త్రంబున గట్టి**
**అరయనందు పై మోకులు గట్టిన – నలబ్రహ్మాస్త్రము వదిలె**
**తిరుగ కర్మమార్గమునకు జొచ్చిన – దేవుడు తనవాత్సల్యము వదలు**

**అలరిన సంసార భ్రమ విడిచి - యడవిలోన జడభరతుడు**
**తలపుచు నొక యిఱ్ఱి బెంచినంతనే - తనకును నారూపు దగిలె**
**ములుగుచు లంపటములు దెగవిడిచి - మోక్షము వెదకెడి నరుడు**
**కలవని దుస్సంగతులు బెంచినను - వాసనలంటక మానునా**

ఒకపెద్ద ప్రయత్నంతో జీవిత ధ్యేయాన్ని సాధింపగోరినవాడు దానికి తగిన అర్హత సంపాదించుకొని మరల దుస్సాంగత్యం పెంచుకుంటే జన్మ హేతువులైన మాలిన్యాలు అంటుతాయి. చేసిన ప్రయత్నం భగ్నమై పోతుంది. ఈ విషయాన్ని అన్నమయ్య వాల్మీకి రామాయణం సుందరకాండ 48వ సర్గలోగల ఇంద్రజిత్తు వృత్తాంతంతో నిరూపించాడు. ఇంద్రజిత్తు హనుమంతుని బ్రహ్మాస్త్రంతో బంధించి మరల మోకులతో కట్టివేశాడు. బ్రహ్మాస్త్ర ప్రభావం తెలియక అలా చేసినందువల్ల బ్రహ్మాస్త్ర ప్రభావం హనుమంతుని మీద లేకుండాపోయింది. ఇలాగే జడభరతుని వృత్తాంతం కూడా. సంసార భ్రమను వదలిపెట్టి అడవిలో వాసంచేస్తూ జడభరతుడు అక్కడ ఒక ఇఱ్ఱిని పెంచాడు. ఇది అతనిలోని ప్రవృత్తిని ప్రేరేపించి అతనికి ఇఱ్ఱి రూపు కలిగేటట్లు చేసింది. ఈ విషయాలను తెలుసుకుంటే సాధారణ మానవులు కూడా తమతమ జీవిత ధ్యేయ సాధనలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకో గలుగుతారు.

6. అన్నమయ్య సంకీర్తనలలో దశవతారస్తుతి చేసిన కీర్తనలెన్నో వున్నాయి. ఆయన చేసిన దశావతార స్తుతినికూడా కొన్ని విభాగాలుగా చేసి పరిశీలించ వచ్చు.

అ) హస్తవర్ణన వ్యాజంతో దశావతారాలలో దేవుడుచేసిన కృత్యాలు చూపబడి నాయి.

**ఇందరికి నభయంబు - లిచ్చు చేయి**
**కందువగు మంచి బం - గారు చేయి** ॥పల్లవి॥

**వెలలేని వేదములు - వెదికి తెచ్చిన చేయి**
**చిలుకు గుబ్బలి కింద - చేర్చు చేయి**

కలికియగు భూకాంత - కౌగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ - వాడి చేయి
తనివోక బలిచేత - దానమడిగిన చేయి
ఒనరంగ భూదాన - మొసగు చేయి
మొనసి జలనిధియమ్ము - మొనకు దెచ్చిన చేయి
మెనయ నాగేలు ధరి - యించు చేయి
పురసతుల మానములు - పొల్లు చేసిన చేయి
తురగంబు బరిపెడి - దొడ్డ చేయి
తిరువేంకటాచలాధీశుడై - మోక్షంబు
తెరువు ప్రాణులకెల్ల - దెలిపెడి చేయి.

ఈ సంకీర్తనలో మత్స్య కచ్ఛప వరాహ నారసింహ వామనాది దశావతారాలు ప్రస్తుతింపబడినాయి.

ఆ) ఒకపెద్ద భూతాన్ని వర్ణించే నెపంతో దశావతార వర్ణన.

పుడమి నిందరిబట్టె - భూతము కదు
బొడవైన నల్లని - భూతము
కినిసి ఓడమిం - గెడి భూతము
పునుక వీపు పెద్ద - భూతము
కనలి కవియు చీ - కటి భూతము
చేటకాళ్ళ మిం - చిన భూతము
పోటుచారల - పెద్ద భూతము
గాటపు జడల బిం - కపు భూతము
జూటరి నల్ల ము - సుగు భూతము
కెలసి బిత్తలే తిరి - గేటి భూతము
పొలుపు దాంట్ల పెద్ద - భూతము
బలుపు వేంకటగిరి - పయిభూతము
పులుగు మీది మహా - భూతము

ఈ సంకీర్తనలో సర్వ భూతాలను తనలో లయింప జేసుకొన్న అది భూతమైన శ్రీమన్నారాయణుని దశావతార లీలలు స్తుతించబడినాయి. అసలు భూతం ఏ కొందరినో పడితే ఈ పెనుభూతం పుడమిలోని వారందరిని పడుతుందని చెప్పడంలో స్వామి సర్వోన్నతి, విశ్వవ్యాపకత్వం వ్యక్తమవుతున్నాయి.

ఇ) దశావతార వర్ణనతో ముడిపెట్టి సంసారి సాధు జీవితాన్ని వివరించడం.

**సంసారమే మేలు - సకల జనులకు**
**కంసాంతకుని భక్తి - గలిగితే చాలు ॥పల్లవి॥**

**వినయపు మాటల - విద్య సాధించితే మేలు**
**తనిసి యప్పులలోన - దాగకుంటే మేలు**
**మునుపనె భూమి దన్ను - మోదించకుంటే మేలు**
**వెనుకొన్న కోపము - విడిచితే మేలు**
**కోరి ఒకరి నడిగి - కొంచ పడకుంటే మేలు**
**సారె సారె జీవులను - చంపకుంటే మేలు**
**భారపుటిడుమలను - పడకుండితే మేలు**
**కారించి తిట్లకొడి - గట్టకుంటే మేలు**
**పరకాంతల భంగ - పరచకుంటే మేలు**
**దొరకని కెళవులు - దొక్కకుంటే మేలు**
**అరుదైన శ్రీవేంక - టాద్రి విభుని గొల్చి**
**యిరవై నిశ్చింతుదైతే - నిన్నిటా మేలు**

ఏ పనినైనా సాధించాలంటే సక్రమమైన మార్గంలోనే ప్రయత్నించాలి. అపమార్గములను ఆశ్రయించకూడదు. చేసిన ప్రయత్నం నేరమని బాగా తెలిసినపుడు ప్రయత్నించి భంగపడడం కంటె మిన్నకుండడమే మంచిది. వివిధ సందర్భాల్లో దేవుడు ప్రయత్నించి సాధించిన పనులన్నీ మానవులకు దృష్టాంతాలుగా ఈ సంకీర్తనలలో చూపబడినాయి.

ఈ) దశావతారాలను ఒకే సంకీర్తనలో వర్ణించడమే గాకుండా ఒక్కొక్క అవతారాన్ని ఒక్కొక్క సంకీర్తనలో కూడా అన్నమయ్య వర్ణించాడు. ఉదాహరణకు నృసింహావతారాన్ని వర్ణించిన కింది సంకీర్తనను చూడవచ్చు.

**శరణని బ్రతుకరో - జనులారా**
**గరిమ మెరసె నిదె - కనకపు సింహము** ॥పల్లవి॥

**అహరహముల బ్ర - హ్లోదుడు దొరకొని**
**బహు విధముల హరి - మహిమలు వొనరగ**
**కహకహ హిరణ్య - కశిపుడు నగిహరి**
**సహజమేది యని - చఱచె గంభము**

దశావతార వర్ణనలు అన్నమయ్య సంకీర్తనలలో మరెన్నో రకాలుగా కనిపిస్తాయి. అన్నమయ్య దశావతార వర్ణన ప్రత్యేక పరిశీలన కర్తవ్యమైన విషయం.

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలను పరిశీలిస్తే ఏదో ఒక పౌరాణికాంశం లేని కీర్తన కనపడదు. వివిధ ప్రయోజనాల దృష్టితో ఆయన పౌరాణిక కథలను సంకీర్తనలలో స్పృశించాడు.

# అన్నమయ్య - శ్రీనివాసతత్త్వం

తాళ్లపాక అన్నమాచార్యులు మొదట స్మార్త సంప్రదాయానికి చెందిన వాడైనా వైష్ణవుడైన తరువాతనే వాగ్గేయకారుడయినాడు. వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యాలను ప్రతిపాదించే వేలకొలది శృంగార సంకీర్తనలను, వేంకటపతినే పరతత్త్వంగా భావిస్తూ వేలకొలది అధ్యాత్మ సంకీర్తనలను రచించాడు. అన్నమయ్య మొదట దార్శనికుడైన కవి. తరువాతనే వాగ్గేయకారుడు. ద్వంద్వాత్మకమైన మానవ జీవిత వ్యాఖ్యానమే శృంగార అధ్యాత్మ సంకీర్తనల సారం. ఈ సంకీర్తనలన్నీ శ్రీవేంకటేశ్వరునికి అంకితాలు. ప్రతి సంకీర్తన చివరి చరణంలో వేంకట పతి పద ముద్ర కనిపిస్తూ అన్నమయ్య భక్తిని చాటుతున్నది. వేంకటపతే తిరుమల వాసుడు. శ్రీనివాసుడు. శ్రీకి నిలయమైనవాడు, లేక శ్రీని తనవక్షస్థలంలో పదిల పరచు కొన్నవాడు శ్రీనివాసుడు. శ్రీనివాస తత్త్వమంటే లక్ష్మీనారాయణ తత్త్వమే. శ్రీవైష్ణవం లక్ష్మీనారాయణ తత్త్వాన్ని విశేషంగా ప్రతిపాదించి సర్వసృష్టిని ఈ దివ్యదంపతుల లీలా ప్రవృత్తిగా వర్ణించింది. వేంకటపతి సశ్రీకుడుగానే అన్నమయ్యకు కనిపించాడు. వైష్ణవ సంప్రదాయం భగవంతునికి ఐదు స్థితులున్నట్లు వివరించింది. అని పర, వ్యూహ, విభవ, అంతర్యామి అర్చాస్థితులు. పరమంటే శ్రీ వైకుంఠంలోని శుద్ధ సత్త్వమయమైన పరవాసుదేవ స్థితి. నిత్యులు, ముక్తులు ఈ స్థితిని దర్శించ గలుగుతారు. వ్యూహమంటే వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ వ్యూహాలు. విశిష్టాద్వైతంలో ఈ వ్యూహ నిర్మాణ పద్ధతి జీవుడు క్రమంగా అధిరోహించే సోపానాల క్రమం. విభవమంటే దుష్టశిక్షణ శిష్టరక్షణార్థం శ్రీనివాసుడు వైకుంఠంలోని నిత్యవిభూతి నుండి ఏదో ఒక రూపాన్ని ధరించి

లీలా విభూతిలోకి రావడం. దీన్నే అవతారమంటారు. అంతర్యామి అంటే చరాచరాత్మకమైన జగత్తంతా వ్యాపించిన వాడని అర్థం. దీనినే వాసుదేవతత్త్వం అంటారు. 'సర్వస్య చాహం హృది సన్నివిష్టః (గీత 15–1), ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి (గీత 18–61) అనే గీతా వాక్యాలు దీనికి ప్రమాణం. అర్చ అంటే భక్తుడు పూజించు కోవడానికి వీలుగా విగ్రహరూపంగా వెలసిన మూర్తి విశేషం. అంతర్యామి తత్త్వం నిరాకారం, నిర్గుణం, అవ్యక్తం. అర్చారూపం సాకారం, సగుణం, వ్యక్తం. అన్నమయ్య ఈ అర్చారూపంలోని శ్రీనివాసునే సంకీర్తన సుమాలతో అర్చించాడు.

అన్నమయ్య భావించిన శ్రీనివాసతత్త్వం రెండు రకాలుగా కనిపిస్తుంది. 1. అంతర్యామితత్త్వం. 2. అర్చామూర్తితత్త్వం. అంతర్యామి అన్న పేరే దాని లోపలి తత్త్వమని స్ఫురింప జేస్తున్నది. అర్చా అనేపేరు అర్చించుకొనే విగ్రహంగా అర్థమవుతున్నది. అనిర్వచనీయమైన శ్రీనివాసతత్త్వాన్ని అర్చాతత్త్వంగా రూపొందించుకొని ఆయన అనంత కల్యాణ గుణాలను సంకీర్తనలుగా పాడి ఆరాధించాడు అన్నమయ్య. అర్చ రూప విషయం కాబట్టి, జగత్తు నామ రూపాత్మకమైంది కాబట్టి నామజపాన్ని కూడా అర్చాతత్త్వంగానే భావింప వలసి ఉంది. భగవంతుని అనంత నామాలను కీర్తించడం. ఈ వివిధ భక్తిమార్గాలలో 'కీర్తనం' మార్గానికి చెందుతుంది. అందుకే అన్నమయ్య శ్రీమన్నారాయణుని నామాలను జపించి తరించాడు.

**"తలచరోయీతని పుణ్యనామములు**
**సులభముననే సర్వ శుభములు గలుగు"** నని ప్రకటించాడు.

శృంగార సంకీర్తనలలో జీవేశ్వరుల శృంగారాన్ని మధురభక్తిగా వ్యాఖ్యానించాడు. అధ్యాత్మ సంకీర్తనల్లో జీవేశ్వరుల అనాది సంబంధాన్ని భగవంతునికి జ్ఞాపకం చేస్తూ 'అంతర్యామి'గా అందరిలో ఉన్న నీవే అర్చామూర్తిగా వెలసిన వెంకటేశ్వర స్వామివని నిష్కర్షగా చెపుతాడు.

అంతర్యామి తత్త్వాన్ని అనుభూతిలోకి తెచ్చుకొని దేవుని నిరాకార నిర్గుణత్వ అవ్యక్తాలను భావించడం ఎంతో క్లిష్టమైన పని. ఇది పరమ భక్తులకు కాని

సాధ్యం కాదు. ఇది అద్వైత పద్ధతి. మరి అన్నమయ్య విశిష్టాద్వైతిగా, రామానుజ మత ప్రవర్తకుడుగా ఎన్నో సంకీర్తనల సారాన్ని బట్టి అర్థమవుతున్నది.

**పురుషుండని శృతి పొగడీనట ఆ పురుషుడు నిరాకారమట**
**విరస వాక్యము లొండొంటికి నివి వింటే నసంబద్ధములు**
**మొగమున బ్రాహ్మలు మొలిచిరట - ఆ మూరితి అవయవ రహితుడట**
**తగు బాహువులను రాజులట ఆ తత్త్వమె యెంచగ శూన్యమట**

...... ...... ...... ...... ...... ...... ...... ......

**పంతపు శ్రీవేంకట పతి మాయలు పచారించిన నివియట**

**(అధ్యాత్మ 2-252)**

ఈ సంకీర్తనలో అద్వైత విశిష్టాద్వైతముల సమన్వయముంది. వ్యక్తదశలో శ్రీనివాసుడు సాకారుడుగా, అవ్యక్త దశలో నిరాకారుడుగా అన్నమయ్య భావంలో నిలవడం దీనికి కారణం. శ్రీనివాసుని అనంత కల్యాణ గుణాలతోపాటు శ్రీమన్నారాయణుని వివిధ రూపాలను కూడా అన్నమయ్య ఎన్నో సంకీర్తనలలో తనివి తీరా వర్ణించాడు. శ్రీవేంకటేశ్వర స్వామిని పరదైవంగా భావించే అన్నమయ్యకు స్వామికి సంబంధించిన ఇతర అర్చామూర్తులందరూ సాక్షాత్కరించారు. అన్నమయ్య చేసిన దశావతార వర్ణనలన్నీ ఈ మూర్తులను అర్చించినవే. నృసింహ శ్రీరామ శ్రీకృష్ణాది అవతారాలను, చెన్నకేశవ విట్ఠలాది అర్చామూర్తులను శ్రీనివాసునికి అభేదంగా వర్ణించాడు అన్నమయ్య. నృసింహ శ్రీరామ శ్రీకృష్ణులను వర్ణించిన సంకీర్తనల సంఖ్య అధికం.

**హరి కర్ఘ్యము లీయరో జయంతి పండుగ సేయరో**
**కెరలి శ్రీ వేంకటాద్రి కృష్ణుడితడు (అ.సం.4-1)**

**మిగుల శ్రీ వేంకటాద్రి మీది దైవమితడా**
**తగి రామ కృష్ణావతారమందె నిప్పుడు (అ.సం.4-6)**

**శ్రావణ బహుళాష్టమి జయంతినేడు**
**సేవించరో నరులాల శ్రీకృష్ణుడితడు**

**అలిమేల్మంగకుఁబతియట్టె శ్రీ వేంకటాద్రి**
**నిలపై జన్మించినాడు యిదె కృష్ణుడు (అ.సం.4-139)**

**రామచంద్రుడితడు రఘువీరుడు - కామిత ఫలము లియ్యగలిగె నిందరికి**
**కలదన్నవారి పాలి కన్నులెదుట మూరితి వెలయ శ్రీవేంకటాద్రి విభుడీతడు**
**(అ.సం. 4-147)**

**వినోదకాడవు విఠలేశ్వరా - వినుతించ నెయివచ్చు విఠలేశ్వరా**
**బల్లిదపు శ్రీ వేంకటపతివై పాండురంగాన - చల్లగా నెలకొంటివి**
**జయ విఠలేశ్వరా (అ.సం.4-171)**

ఇత్యాది సంకీర్తనలన్నింటిలో ఒకే తత్త్వానికి చెందిన అర్చామూర్తులు శ్రీ వేంకటపతిలో సమన్వయం పొందడం కనిపిస్తుంది. అన్నమయ్య శ్రీనివాస తత్త్వంలోని ప్రధానాంశమిది. హనుమంతాది భక్తులు శ్రీనివాసుని బంట్లు కావడం వల్లనే ఘనమైన పనులెన్నో చేయగలిగారని కూడా చెపుతాడు అన్నమయ్య.

**"ఎక్కడ నెదురులేక ఈ రేడు లోకములందు**
**వొక్కడే నిలిచెనమ్మ వుగ్ర హనుమంతుడు"**

అంటూ హనుమంతుని గొప్పతనాన్ని వర్ణించి దానికి కారణం శ్రీపతి బంటు కావడమేనంటాడు. వైష్ణవంలో భాగవతుడు లేదా భక్తుడు కూడా భగవంతునితో కొన్ని విషయాలలో సమానుడవుతాడు. భాగవతులు కూడా అర్చారూపంలో పూజింప బడటం దీనికి నిదర్శనం. ఇలాంటి భాగవతులైన అర్చారూపాలను పూజిస్తే ఫలితమిచ్చేవాడు శ్రీనివాసుడే. అందువల్ల శ్రీనివాస తత్త్వంలో అన్నమయ్యకు వివిధ అర్చారూపాలు కనిపించడం, లేక అన్నిటిలో ఏకోనారాయణ తత్త్వం స్ఫురించడం సాధారణ విషయం.

**'పురుషుడని శ్రుతి పొగడీనట - ఆ పురుషుడు నిరాకారమట'** అనే సంకీర్తనలో అన్నమయ్య భావించిన సమన్వయం అద్వైత విశిష్టాద్వైతములకు అందకుండా పోతున్నందువల్లనే అవన్నీ వేంకటపతి లీలలని మామూలుగా చెప్పడం

జరిగింది. అన్నమయ్య శ్రీనివాస తత్త్వం ఈపాటలో ఇంకా బాగా ఫలవంతమై కనిపిస్తున్నది.

**పరమాత్ముడు సర్వ పరిపూర్ణుడు**
**సురలకు నరులకు చోటయి యున్నాడు**
**కన్నులఁ గంటానే కడు మాటలాడు తానే**
**తన్నుఁగాని వానివలె దాఁగి యున్నాడు**
**అన్నియు వింటానే అట్టే వాసన గొంటానే**
**వన్నెల నూనె కుంచము వలె నున్నాడు-**
**తనువులు మోచియు తలఁపులు దెలిసియు**
**యెనసియు నెనయక యిట్లున్నాడు**
**చెనకి మాయకుమాయై జీవునికి జీవమై**
**మొనసి పూసల దారము వలె నున్నాడు**
**వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై**
**పూవుల వాసనవలెఁ బొంచి యున్నాడు**
**భావించ నిరాకారమై పట్టితే సాకారమై**
**శ్రీవేంకటాద్రి మీద శ్రీపతై యున్నాడు** - ఈ సంకీర్తనలో

అన్నమయ్య అంతర్యామి తత్త్వాన్ని దర్శించాడు. '**పరమాత్ముడు సర్వ పరిపూర్ణుడు**' అనే విషయం 'యచ్చ కించి జ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతేఽపివా - అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః' అనే శ్లోకభావాన్ని తాకుతున్నది. మనకు సర్వజగత్తులో ఏది కనబడుతున్నదో, ఏది వినబడు తున్నదో, వాటి లోపలా బయటా కూడా వ్యాపించి ఉన్నవాడు ఆ నారాయణుడేనని ఈ శ్లోకార్థం. దేవతలకు అతడే దిక్కు - దిక్కులేనివారికి అతడే దిక్కు అంటూ మానవులేగాక దేవతలు కూడా ఉపాసించే దైవం వేంకటాద్రి పతేనని చెపుతున్నాడు అన్నమయ్య. దేవుడు మాయకు మాయగా, జీవునికి జీవమై ఉన్నాడట. తానే మాయ. తానే జీవుడు. అంటే జీవుని ఆవరించిన మోహపు పొరయైన మాయగాను, జగత్తును పరివేష్టించిన వైష్ణవ మాయగాను తానున్నాడు. రెండవ చరణంలోని '**పూసలలో దారమువలె**' అనేవిషయం ముఖ్యమైంది. ఇది -

**మత్తఃపర తరం నాన్యత్ కించి దస్తి ధనుంజయ**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ (భ.గీ.7-7)**

అనే శ్లోకభావాన్ని స్ఫురింప జేస్తుంది. నాకంటే ఉత్కృష్టమైనదేదీ లేదు.

పూసలు దారంతో గుచ్చబడినట్లు ఈ భూత జాలమంతా నాయందు గుచ్చబడి ఉంది. పూసలు నిలవడానికి అందులో కానరాకుండా ఉండే సూత్రం ఆధారమైనట్లు వ్యక్తమైన ఈ ప్రాణికోటిలో అవ్యక్తంగా నేను వ్యాపించి ఉన్నాను అని తన అంతర్యామి తత్త్వాన్ని గురించి గీతలో భగవంతుడే చెప్పాడు. దీనిని అన్నమయ్య ఈ సంకీర్తనలో వివరించి తన భావాన్ని ఇంకా స్పష్టంగా

**భావించ నిరాకారమై, పట్టితే సాకారమై**
**శ్రీ వేంకటాద్రి మీద శ్రీపతై ఉన్నాడు**

అని చెప్పాడు. భగవత్తత్త్వం అనుభూతి దశలో నిరాకారం. అభివ్యక్తి దశలో సాకారం. ఉపాసన లేని భక్తి నిర్గుణోపాసనగా సగుణోపాసనగా ఉంటుంది. నిరాకారం నిర్గుణోపాసనకు, సాకారం సగుణోపాసనకు చెందుతాయి. అద్వైతం నిర్గుణ నిరాకార అవ్యక్త తత్త్వానికి ప్రాధాన్యమిస్తే, విశిష్టాద్వైతం సగుణ సాకార వ్యక్త తత్త్వానికి ప్రాధాన్యమిచ్చింది. వైష్ణవ మత పరంగా చూస్తే భగవంతుడు అనుభూతి దశలో అంతర్యామి - నిరాకారుడు, నిర్గుణుడు, అవ్యక్తుడు - అభివ్యక్తి దశలో అర్చామూర్తి - సాకారుడు సగుణుడు, వ్యక్తుడు. అద్వైతం చెప్పిన నిర్గుణత్వాన్ని విశిష్టాద్వైతం ఈ దశలో తనలో ఇముడ్చుకొంది. ఈవిధంగా అభివ్యక్తీకరింపబడిన పరమాత్మ శ్రీ వేంకటాద్రిమీద శ్రీపతైయున్నాడు అని అన్నమయ్య స్పష్టీకరించాడు. ఇది బాహ్యాభ్యంతర సమన్వయం. ఈ సమన్వయ సూత్రంతో అన్నమయ్య వేలకొలది సంకీర్తనలు రచించాడు. ఇలా పరిశీలిస్తూ పోతే అన్నమయ్యది అంతర్యామి అర్చాతత్త్వాల సమన్వయ మనిపిస్తుంది. ఇదే ఆయన భావించిన శ్రీనివాసతత్త్వం.

అన్నమయ్య ఇలా ఆలోచించడం వల్లనే 'అంతర్యామి' అనేమాట ఎన్నో సంకీర్తనలో కనిపిస్తున్నది. అన్నమయ్యకు శ్రీవేంకటేశ్వరుడే అంతర్యామి.

భవబంధాలు తెంచుకోవడానికి ప్రయత్నించి అది సాధ్యపడక పోగా చివరకు శ్రీపతి తెంచితేనే అవి తెగుతాయని నమ్మి అంతర్యామినే శరణుపొందిన పరమభక్తుడు అన్నమయ్య. సర్వ ప్రాణి కోటికి శరణాగతి తత్త్వాన్ని విశదపరచే ఈ సంకీర్తన ఆయన అంతర్యామి - అర్చాతత్త్వాల సమన్వయానికి ఒక గొప్ప తార్కాణం.

**అంతర్యామీ అలసితి సొలసితి**
**ఇంతట నీ శరణిదే చొచ్చితిని**
**కోరిన కోర్కెలు కోయని కట్లు**
**తీరవు నీవని తెంచకా**
**భారపుఁబగ్గాలు పాపపుణ్యములు**
**నేరుపుల బోవు నీవు వద్దనకా**
**జనుల సంగములఁ జక్క రోగములు**
**విను విడువవు నీవు విడిపించకా**
**వినయపు దైన్యము విడువని కర్మము**
**చనదది నీవిట సంత పరచకా**
**మదిలో చింతలు మయిలలు మణుగులు**
**వదలవు నీవని వద్దనకా**
**యెదుటనె శ్రీవేంకటేశ్వర నీవదె**
**అదన గాచితివి అట్టిట్టనకా**

ఈ సంకీర్తన నిర్మాణం కూడా అన్నమయ్య అంతర్యామి అర్చాతత్త్వాల సమన్వయాన్నే నిరూపిస్తుంది. 'అంతర్యామి' అని ప్రారంభమైన ఈ కీర్తన శ్రీవేంకటేశ్వరా అని ముగియడం ఈ నిర్మాణంలోని సొగసు. **'కోరిన కోర్కెలు కోయనికట్లు - తీరవు నీవవి తెంచకా'** అనే పాదాన్ని వివరిస్తే - అప్పటికప్పుడు కలిగే కోరికలు బ్రతుకును బంధించిన దారాల ముడులు. కోరికల తీవ్రత హెచ్చేకొద్దీ ముడులు ఇంకా బిగుసుకుంటాయి. జీవితాంతం ప్రయత్నించినా ఈ ముడులు వీడవు. ఈ ముడుల చిక్కులు తొలగించగల నేర్పరి శ్రీనివాసుడొక్కడే.

ఆయన సర్వాంతర్యామి. ఆ సర్వాంతర్యామి తెంచాలనుకుంటే ఆ ముడులు వీడడం చిటికెలో పని. కాని ఆయన అనుకోవాలి గదా! ప్రాణులు శరణు పొందినపుడే ఆయన ఆ ముడుల బంధాలు సడలింపజేసి ముక్తిని ప్రసాదిస్తాడు. ఇంతటి విషయ గాంభీర్యం కలిగి ఉన్నా శ్రీనివాసుని జగదేక తత్త్వాన్ని ఈ సంకీర్తన అతి సులభంగా అందరికీ బోధించే రీతిలో ఉంది. ప్రాణులు శారీరక బలంతో మోహపు మదితో చేసే పనులన్నీ తమ శక్తి సామర్థ్యాల ఫలితమే నని భ్రమించడం సహజం. శరీరాన్ని – దానికి కావలసిన బలాన్ని, కోరికను – దానిని నెరవేర్చుకొనే పద్ధతిని వేంకటపతే ప్రాణికి సమ కూర్చుతున్నాడని తెలుసుకుంటే 'సర్వం విష్ణుమయం జగత్' అనేవిషయం అర్థమై శ్రీనివాసుని లోకనాయకత్వాన్ని భావిస్తూ ప్రతిప్రాణి శాంతస్థితిని పొంది తద్వారా జీవిత గమ్యాన్ని చేరుకోగలదని అన్నమయ్య–

**"మనసు నీవిచ్చితివి మాటలు నీవిచ్చితివి**
**తనువు నీవిచ్చితివి అంతర్యామీ**
.... .... .... .... .... ....
**సత్తువ నీవిచ్చితివి చలము నీవిచ్చితివి**
**తత్తర మిచ్చితివి అంతర్యామీ**
.... .... .... .... .... ....
**మాయలు నీవిచ్చితివి మదము నీవిచ్చితివి**
**ఆయపు శ్రీవేంకటాద్రి అంతర్యామీ"**

**(అ.సం. 4–396)**

అనే సంకీర్తనలో స్పష్టం చేశాడు.

అన్నమయ్య విశిష్టాద్వైతి. విశిష్టాద్వైతులకు అష్టాక్షరి మూలమంత్రం. **'ఓం నమో నారాయణాయ'** అని జపించే వీరికి ఇతర దేవతల స్ఫురణ కలుగదు. కలిగినా వారిని శ్రీమన్నారాయణుని శరీరానికి చెందినవారుగా భావించడం ఉంది. ఆయన శరీరి. ఇతర ప్రకృతి, మానవులు, దేవతలు అందరూ ఆయనకు శరీరం. శ్రీమన్నారాయణుడే శ్రీనివాసుడుగా, శ్రీనివాసుడే సకల ప్రాణులకు

అంతర్యామిగా, ఆ అంతార్యామి తత్త్వమే అభివ్యక్తి దశలో అర్చామూర్తియైన వేంకటేశ్వరస్వామిగా అన్నమయ్య ఎలా భావించాడో ఇప్పటికే మనకు తెలుసు. శ్రీనివాస తత్త్వం తన కాలం వరకు భక్తులకు అర్థమవుతూ వచ్చిన తీరును అన్నమయ్య గుర్తించాడు. శ్రీనివాసుడు శివతత్త్వమని, శక్తితత్త్వమని ఆయన కాలానికి ప్రచారంలో ఉంది. రామానుజుల వారు ఎన్నో పురాణాల నుండి. ఉపనిషత్తుల నుండి ఉపపత్తులు చూపించి తిరుమల దైవం వైష్ణవ దైవమేనని నిరూపించినా లోకంలో కొన్నిసందేహాలు ఆనాటికి మిగిలే ఉండినాయి. ఇలాంటి సందేహాలు రావడానికి కారణం ఆళ్వారుల అభిప్రాయాలు. తొండరడిప్పొడి ఆళ్వారు, మధురకవి ఆళ్వారు తప్ప మిగిలిన ఆళ్వార్లందరూ తిరుమలను తిరుమల నాథుని తమ దివ్య ప్రబంధాలలో కీర్తించారు. పేయాళ్వారు "చల్లని కొండ కాలువలో రమణీయమైన వేంకటాచలంపై వేంచేసియున్న స్వామికి తలపై జటలు, కిరీటం చేతిలో గొడ్డలి, చక్రం, మొలలో నాగాభరణం, బంగారు మొలతాడు ఉండడం వల్ల ఈయన హరిస్వరూపి హర స్వరూపిగా కూడా భావింపబడుతున్నాడు" అని ఒక పాశురంలో వర్ణించాడు. తిరుమలను పేర్కొన్న మొదట ఆళ్వారు ఈయనే. ఆళ్వార్ అంటేనే విష్ణుభక్తుడని అర్థమున్నపుడు ఆళ్వార్లు స్వామిని శివుడంటారా? స్వామి విరాడ్రూపంలో ఇతర దైవాంశాలన్నీ సమన్వయం పొంది కనిపించినట్లు వీరి అనుభూతి. పేయాళ్వార్ ఆలోచన కూడా ఇదే. తమిళ దేశంలో శైవం వైష్ణవం ఇంచుమించు ఒకే కాలంలో ప్రాచుర్యం పొందడం కూడా దీనికి కారణం. అందువల్ల ఆళ్వారుల దృష్టిలో స్వామి శ్రీనివాసుడేగాని శివుడుకాదు. అయితే ఈ తత్త్వాన్ని అర్థంచేసుకోవడంలోని వ్యత్యాసాల కారణంగా ప్రజలలో ఈరకమైన అభిప్రాయాలు ఏర్పడి అవి అన్నమయ్య కాలందాకా కొనసాగాయి. ఈ విషయాలన్నిటిని అన్నమయ్య గమనించాడు. శ్రీనివాసుని వివిధ రూపాలలో అర్చించే భక్తులను కూడా ఆయన చూశాడు. కొందరు శివుడని, కొందరు శక్తియని భావించడం- ఆయంశాలన్నీ పరబ్రహ్మలో అంతర్లీనంగా ఉన్నవేనని నమ్మిన అన్నమయ్యకు వింతగా తోచలేదు. శ్రీనివాసుని ఇలా వివిధ రూపాలుగా చూడడం అవసరం లేదని ఆయన శ్రీమహావిష్ణువేనని ఋజువు చేయవలసిన అవసరం ఉందని అన్నమయ్య భావించలేదు. వివిధ రూపాలలో కనిపించే దేవతలకు

జరిగే పూజలన్నీ మహావిష్ణువుకే చెందుతాయన్నది వైష్ణవ సిద్ధాంతం. అందువల్ల స్వామిని ఇతర రూపాలుగా భావించి అర్చించడంలో తప్పులేదని అన్నమయ్య మతం. ఈ విషయాలన్నీ తెలిపే ఒక ప్రధానమైన సంకీర్తనను ఆయన రచించాడు.

**ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంత మాత్రమే నీవు**
**అంతరాంతరము లెంచి చూడఁ బిండంటే నిప్పటి యన్నట్లు**
**॥పల్లవి॥**

**కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని**
**పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు**
**తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు**
**అలరి పొగడుదరు కాపాలికలు ఆదిభైరవుండనుచు ॥ఎంత॥**

**సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు**
**దరిసనములు (ల) మిము నానావిధులను తలపుల కొలదుల భజింతురు**
**సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచిన వారికి నల్పం బవుదువు**
**గరిమల మిము నేఘనమని తలచిన ఘనబుద్ధులకు ఘనుడవు**
**॥ఎంత॥**

**నీ వలన గొరతే లేదు మరి నీరుకొలది తామెరవు**
**ఆవల బాగీరథి దరి బావుల ఆ జలమే వూరిన యట్లు**
**శ్రీ వేంకటపతి నీవైతే మముఁజేకొని వున్న దైవమని**
**యీ వలనే నీ శరణనియెదను యిదియే పరతత్త్వము నాకు**
**॥ఎంత॥**

అన్నమయ్యకు శ్రీ వేంకటేశ్వరుడే పరతత్త్వం. ఆ పరతత్త్వాన్ని వైష్ణవులు విష్ణుడవి, శైవులు శివుడని, కాపాలికులు భైరవుడని, శాక్తేయులు శక్తియని పిలిచారు. ఈ యంశాలన్నీ సమన్వయం పొందిన పరతత్త్వం వేదాంతులు దర్శించే పరబ్రహ్మ స్వరూపం. శివుడు, భైరవుడు శైవ తత్త్వానికి చెందిన అంశాలు. శైవ తత్త్వంలో శాంత రూపం శివుడైతే క్రోధ రూపం భైరవుడు. శివుడు శుభంకరుడు. భారత దేశంలో శివతత్త్వం అనాదిగా ఉంది. ఋగ్వేదంలో అభవ, శివ, రుద్ర అనే

రూపాలు కనిపిస్తాయి. అందుకే అన్నమయ్య ఆది భైరవుణ్ణి పేర్కొన్నాడు. సృష్టిని నియంత్రించేది శక్తి. శక్త్యారాధకులు శాక్తేయులు. ఈమె స్త్రీ దేవత. ఉత్కృష్టమైన పరతత్త్వానికి స్త్రీ, పురుష భేదం లేదు. ఈ భేదం ఉపాసకుని దృష్టిననుసరించి ఏర్పడింది. అన్నమయ్యకు స్వామి శివుడుగా, భైరవుడుగా శక్తిగా కనిపించలేదని, ఆయన మనోదృష్టిలో ఎప్పుడూ భువన సుందరుడైన శ్రీమన్నారాయణుడు గానే గోచరమై నాడని ఆయన వ్రాసిన అనేకానేక పాటలు నిరూపిస్తాయి. ఇలా అన్నాడంటే అది ఆనాడు సంఘంలో నలుగుడు పడుతున్న కొందరి అభిప్రాయ ప్రకటనమేనని భావించాలి. అన్నమయ్య నాటికి స్వామిని గురించి ఇలాంటి ఆలోచనలున్నాయని ఈ పాట వ్యక్తం చేస్తున్నది. అప్పటి నుండి శ్రీ వేంకటేశ్వరుడుగా ఆరాధింపబడే తిరుమల దైవం వైష్ణవ దైవమేననీ అభిప్రాయం లోకంలో ఒకవైపు స్థిరపడినా స్వామి శివుడనే అభిప్రాయం కూడా కొనసాగుతూ వచ్చింది. ఎవరు ఎలా భావిస్తే స్వామి వారిని అలా ఉద్ధరిస్తూ రావడం వల్ల ఆ అభిప్రాయాలకు తావు లేకుండా పోయింది. ఇది వేంకటాచల మహాత్మ్యం. శ్రీనివాసుని సంకల్పం.

అయినా స్వామిని శైవ దైవమని భావించేవారు ఇప్పటికీ లేకపోలేదు. 1-6-1904లో వెంకయ్య అనే శాసన పరిశోధకుడు ఆనాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపిన శాసన వార్షిక నివేదికలో తిరుచానూరు దేవాలయానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలున్నాయి. ఈ నివేదిక ప్రకారం పద్మావతీ దేవి ఆలయం ప్రాచీన కాలంలో తిరువిళం గోయిల్ అని, 20వ శ. ప్రారంభంలో ఇదే ఆలయం సుందరరాజ పెరుమాళ్ ఆలయంగా పిలువబడేదని తెలుస్తున్నది. 1904కు కొన్ని సంవత్సరాల ముందు కూల్చబడిన ఈ దేవాలయం తిరువేంగడంలో కొలువున్న దేవునికి అనుబంధంగా నిర్మింపబడినట్లు కూడా ఈ నివేదిక పేర్కొంటున్నది. సుందరరాజ పెరుమాళ్ శైవ దైవం కాబట్టి తిరువేంగడంలోని దేవుడు కూడా శైవ దైవమేనన్న అభిప్రాయం ఇందులో ధ్వనిస్తున్నది. వెంకయ్య చెప్పిన ఈ విషయం ఆనాటి ప్రజల వ్యవహారంలో ఉండిన ఒక అభిప్రాయం. కుంఫిణీ ప్రభుత్వం 21-4-1843లో తిరుచానూరు పద్మావతీ దేవాలయాన్ని కూడా శ్రీహతీరాంజీ మఠానికి అప్పగించినట్లు చరిత్ర చెబుతూండడం వల్ల పద్మావతీ దేవాలయం అప్పటికీ బాగా ప్రసిద్ధి చెందిన దేవాలయంగా ఉండినట్లు

అర్థమవుతుంది. ఈ దేవాలయాన్ని వెంకయ్య 'Comparatively Recent one' అన్నాడు. అంటే 1904 నాటికి సుమారు వంద సంవత్సరాల ముందుదిగా అనుకోవచ్చు. మరి అప్పటినుండి తిరుమలలో కూడా శ్రీనివాసుడు వైష్ణవ దైవంగా అర్చింపబడుతూ రావడం ఇతర దైవాంశలనే సందేహం లేక పోవడం గమనింప దగిన విషయం.

ముందే చెప్పినట్లు అన్నమయ్య మొదట దార్శనికుడైన కవి - ఆపైన వాగ్గేయ కారుడు. ఈ కవి - వాగ్గేయకారునిలో ఒక తాత్త్విక జిజ్ఞాసువు అంతర్గతంగా ఉన్నాడు. **'ఏకం సద్విప్రా బహుధా వదన్తి'** అనేది తాత్త్విక సిద్ధాంతం. చూచే చూపును బట్టి, చేసే ఆలోచనను బట్టి వస్తుతత్వం ఆవిష్కృతమవుతుంది. ఇది దార్శనికత ఏ కొద్దిగానైనా ఉన్న ఎవరి విషయంలోనైనా సత్యమే. అందువల్లనే అన్నమయ్యకు శ్రీనివాసతత్త్వం అనంత ముఖాలుగా విస్తరించి ప్రత్యక్షమైంది. ఒక మూర్తి నుద్దేశించి ఇన్నివేల సంకీర్తనల్లో ఇన్నివేల రకాలుగా ఆలోచించి భావాలను రూపుకట్టించడం అందరికీ సాధ్యమయ్యే పనికాదు. సృష్టి స్థితి లయములకు హేతుభూతుడు నారాయణుడేనని నమ్మి ఆయన అనంత తత్వాన్ని ప్రకృతి అంతటా దర్శించ గలిగిన అన్నమయ్యకే అది సాధ్యమైంది. చూచే చూపును బట్టి దివ్యత్వం రూపుదాల్చి కనిపిస్తుందని చాటడానికి రాసిన ఈ సంకీర్తనను చూడండి.

**చూచే చూపొకటి సూటిగురి యొకటి**
**తాచి రెండు నొకటైతే దైవమే సుండీ**
**యేనుగ దలచితే యేనుగై పొడచూపు**
**బట్ట బయలు దలచ బయలై పొడచూపు**
**శ్రీ వేంకటాద్రి మీద శ్రీపతి దలచితేను**
**శ్రీ వేంకటాద్రి మీద శ్రీపతై పొడచూపు**
**భావమే జీవాత్మ ప్రత్యక్షము పరమాత్మ**
**తావు మనో గోచరుడు దైవమే సుండీ**

ఈ సంకీర్తన అన్నమయ్య దార్శనికతను పట్టి చూపుతున్నది. శ్రీనివాసుని సర్వవ్యాపకత్వం, సర్వేశ్వరత్వం అన్నమయ్య సంకీర్తనల నిండా కనిపిస్తూ ప్రాణుల మానసాలలో భక్తి భావాన్ని నింపుతున్నది. అన్నమయ్యలోని అంతర్యామి శ్రీనివాసుడు తన ఉనికిని సంకీర్తనల ద్వారా ప్రకటించుకొన్నాడు. అన్నమయ్య గొంతుక భక్తజనులను తరింప జేయడానికి ఒక వాహికగా మారింది. ఈ ఘన కార్యాన్ని సాధించడానకి స్వామి అన్నమయ్యను ఎన్నుకోవడం అన్నమయ్య చేసుకొన్న సుకృతం. అన్నమయ్యకు శ్రీనివాసతత్త్వం ఒక దివ్యతత్త్వం. ఆ తత్త్వంలో సర్వమూ అన్నమయ్యకు గోచరమైంది. అన్నమయ్య శ్రీనివాసతత్త్వం అంతర్యామి - అర్చాతత్త్వాల సమన్వయం. భక్తులందరూ ఈ తత్త్వాన్ని దర్శించి తరించాలని ఆ వాగ్గేయకారుని సంకల్పం.

# అన్నమయ్య సంకీర్తనలు
# శృంగారతత్త్వం

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో కనిపించే శృంగారం విచ్చలవిడిగా, పచ్చిగా, మోతాదును మించి ఉన్నదనే విషయం పండితులందరూ అంగీకరించినదే. అన్నమయ్య శృంగారభావం చరణాలలో అతివేలంగా కచకుచాది సామగ్రితో విస్తరింపబడి చివరి చరణంలోని చివరి రెండుపాదాలలో అలివేలుమంగ శ్రీవేంకటేశ్వరుల శృంగార కలయికలో సమన్వయం పొందుతుంది. చివరి చరణంలో నాయికా నాయకుల కూడిక తప్పనిసరిగా ఉంటుంది. ఒకటి, రెండు చరణాలలో నాయిక మోవి, కురులు, చన్నులు, కటి, ఊరువులు ఇత్యాది అంగ ప్రత్యంగాల ప్రదర్శన ద్వారా లౌకిక నాయికా నాయకులను స్ఫురింపజేసి మూడవ చరణంలో వాళ్లను అలౌకికులుగా మార్చడం అన్నమయ్య పద్ధతి. స్వల్పమార్పులు కనిపించినా శృంగార సంకీర్తనల నిర్మాణ పద్ధతి ఇదే.

శృంగార సంకీర్తనలలో పచ్చి శృంగారపు వెల్లువ ప్రవహిస్తున్నప్పటికి ఈ శృంగారం దివ్యమని, అలౌకికమని, మధురభక్తికి సంబంధించినదని అభిప్రాయ బడుతూ దీనిని భగవద్రతితో సమన్వయ పరచి అన్నమయ్యది భక్తి శృంగారమని, మోక్ష శృంగారమని తాళ్లపాక సాహిత్య పరిశోధకులు నిర్ణయించారు. ఈ నిర్ణయమే పరిశోధకులకు ఆమోదయోగ్యమైనట్లు కనిపిస్తున్నది. అన్నమయ్య శృంగార సంకీర్తనల మీద జరిగిన పరిశోధన అంతంత మాత్రమే. ఈ సంకీర్తనల అంతరంగాన్ని దర్శించాలన్న ప్రయత్నం ఇంతవరకూ ఎవరూ చేసినట్లు కనపడదు.

శృంగార సంకీర్తన సంపుటాలను పరిష్కరించిన పండితులు ఇదే అభిప్రాయాన్ని ప్రతిపాదిస్తూ, వ్యాఖ్యానించడానికి వీలుగానంత పచ్చిశృంగారమున్న సంకీర్తనలు కొన్ని ఉన్నాయని చెపుతూ వాటిని గురించి మాట్లాడకుండా వదిలేశారు. ఇవి మధురభక్తి కిందికి ఎందుకు రాలేదోమరి. ఇలా తప్పించుకోవడంలో అంతరార్థమేమిటో? శృంగారంలో కనిపించే పచ్చిదనం లౌకికమైనది కావడం వల్ల, ఆనాటి సమాజంలో వ్యక్తమయ్యే మరుగులేని కామవ్యవస్థకు సంబంధించినది కావడం వల్ల దీనిని అన్నమయ్యకు ఆపాదించడం అంత బాగుండదని వీళ్లు భావించి ఉండవచ్చు. శృంగార సంకీర్తనలలో కనిపించే చుంబన, ఆలింగన, గుహ్యాకార్య, దంతక్షత, నఖక్షత స్తన మర్దనాది విషయాలు నాట్యధర్మి సహితమైన అభినయంలో ఔచిత్యవంతంగా కనిపిస్తాయని సమర్థించిన వారున్నారు. ఇలాంటి సమర్థన అవసరం లేదనిపిస్తుంది.

అన్నమయ్య మహాకవి. మహాపండితుడు. మహాభక్తుడు. ఎవరికీ సందేహం లేని విషయమిది. ఈ లక్షణాలన్నీ ఆయన కవిత ద్వారానే వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి పరవశింపజేసే భక్తి కవిత్వమైనా సామాజిక సాంస్కృతిక వ్యవస్థను ప్రతిబింబించక పోదు. భక్త కవిలో కూడా సామాజిక స్పృహ తప్పకుండా ఉంటుంది. ఇది అన్నికాలాలకు అన్నిప్రాంతాలకు వర్తించేమాట. రస స్ఫురణ లేనిమాట నీరసమైన మాట. మహాకవుల మాటలు నీరసంగా ఉండవు. ఏమిచెప్పినా రసతుందిలంగానే ఉంటుంది. కవికి కావలసిన రససామగ్రి ప్రకృతి నుండి లేదా సమాజం నుండి లభిస్తుంది. అన్నమయ్య శృంగార సామగ్రికూడా సమాజం నుండి లభించినదే. 'వధూమృదు మధుర మనోజ్ఞ వాక్య మిశ్రితములు శృంగార పదములని, వాటిలో గ్రామ్యోక్తులు కూడా ఉండవచ్చునని సంకీర్తన లక్షణంలో చెప్పబడిన మాటను మరిచిపోలేము. అన్నమయ్య చెప్పదలచినది దివ్య శృంగారమైనా దానికి లోకంలోని శృంగార స్పర్శ తగిలింది. దివ్యశృంగారంలో సామాజిక శృంగారపు పోకడలు కలసిపోయాయి. దివ్య దంపతుల గుణాలలో విటీవిటుల గుణాలు చేరిపోయాయి. అన్నమయ్య నాయిక, స్వామి నాయకుడు అని చెప్పుకొనే మధురభక్తి లేదా దివ్యశృంగారం లౌకికంగా మారిపోవడంలో

వింతలేదు. ఎందుకంటే అన్నమయ్య కవితకు ఆలంబనం సమాజం కాబట్టి. అన్నమయ్య కవిత్వం సమాజం కోసమేనన్న విషయం ఎవరూ కాదనలేరు. ఈ కారణాలవల్ల అన్నమయ్య శృంగారానికి మరొక రంగు పులిమి మహత్తును ఆపాదించనవసరం లేదు. ఆయన శృంగారం మహత్తు గలదే. కాదనలేము. లౌకిక కామ విషయాలను కూడా దాపిరకం లేకుండా తనలో కలుపుకొని సమకాలీన శృంగార వ్యవస్థను చిత్రిస్తున్నదనడం తిరుగులేని సత్యం.

అన్నమయ్యది క్రీ.శ.15వ శతాబ్దపు సమాజం. ఈ సమాజపు సాహిత్యమంతా ప్రధానంగా శృంగారం చుట్టూనే తిరిగింది. ఈ కాలపు కవులైన పోతన శ్రీనాథాదుల కవిత్వం పైకి శృంగారాత్మకం. లోపలికి చూస్తే తాత్త్వికం. శృంగారాత్మకం కావడానికి కారణం సమాజం. ఆ కాలపు స్వభావమే అది. శృంగారం మిథున గతమే కాకుండా అనేక విచ్చలవిడి రకాలుగా కనిపించిన కాలమది. కామశాస్త్రాన్ని తడవని కవులరుదు. వాత్స్యాన కామశాస్త్రం ఈ కాలంలో అనువదింపబడింది కూడా. కామ సుఖానికి మించిన సుఖం మరొకటి లేదని భావిస్తుండిన రోజుల్లో రచింప బడిన అన్నమయ్య సంకీర్తనలలో మాత్రం సమాజ శృంగారపు స్పర్శలేకుండా ఎలా వుంటుంది? అన్నమయ్య వర్ణించినది భగవద్రతిని అయినపుడు వందల కొలది రతులను పేర్కొనవలసిన అవసరంలేదు. సంకీర్తనలలో సమరతి, ఉపరతి వంటిమాటలు కొల్లలుగా కనిపిస్తాయి. ఇవి రెండు రతి భేదాలేనని చెప్పనవసరం లేదు. దొంతరరతులు, తమకపురతులు, వేకపురతులు, వెక్కసపురతులు, ఇంగితపు రతులు, ఉమ్మగిలురతులు ఇత్యాది పేర్లతో కొన్నివందల రతులను అన్నమయ్య పేర్కొన్నాడు. శృంగార సంకీర్తనలలో ఆయన వాడిన ఇలాంటి మాటలను సేకరించి పరిశీలిస్తే కామశాస్త్రానికి సంబంధించిన విషయాలెన్నో అర్థమవుతాయి.

శాస్త్రకారులు వివరించిన దంతక్షత నఖక్షతాలు అనేక సంకీర్తనలలో కనిపిస్తాయి. కుచముల, మోవుల ప్రస్తావన లేని కీర్తన ఒక్కటికూడా కనిపించదు. పొదలు గుబ్బలు, జక్కవచన్నులు, గుత్తపు గుబ్బలు, గట్టి చన్నులు, పొగరు కుచగిరులు.... ఇలా ఎన్నిరకాలనో ఈ సంకీర్తనలు ప్రదర్శిస్తున్నాయి. '**తరుణీ**

**స్తన ఏవ దీప్యతే'** అనడం దీనికి కారణం. నాయిక మోవి పానకం కోసం నాయకుడు ఎలా వెంపరలాడేది ఈ కీర్తనలు బొమ్మకట్టి నిరూపిస్తాయి. పానకాన్ని స్రవించే అధరం ఎంత మధురంగా కనిపిస్తున్నదో అన్నమయ్యకు. **'రతి సర్వస్వమధరమ్'** అంటుంది శాకుంతల నాటకం. శాస్త్రకారులు పేర్కొన్న రతి స్థానాలను లేదా కశాస్థానాలను అన్నమయ్య 'ఆయము'లని 'మర్మము'లని పేర్కొన్నాడు. ఆయములు సలపడం, మర్మములు కరగడం, ఆయములంటడం, ఆయములు రేగడం కామకళకు ప్రథమ సోపానంగా ఈ కీర్తనలలో కనిపిస్తుంది. శాస్త్ర ప్రతిపాదితమైన విషయాలనెన్నిటినో అన్నమయ్య చూపి ఉండడం వల్ల ఆయనకు ఆ శాస్త్రాలలో పరిచయం ఉండడమేగాక ఆ విషయాలు ఆనాటి సమాజానికి పరిచయమైనవిగా కూడా అర్థమవుతుంది.

సమాజంలో అన్నమయ్య విన్న, కన్న విషయాలు, అనుభవంలోకి వచ్చిన విషయాలు అలవోకగా సంకీర్తనల కెక్కినాయి. శృంగార సంకీర్తనల లోని పచ్చిదనం ఆనాటి ప్రజల జీవితాలనుండి పైకుబికినదే. స్త్రీ పురుషుల మధ్య కొనసాగిన శృంగార సంబంధం నుండి ఎన్నివిషయాలు బహిర్గతమైనాయో అవన్నీ సంకీర్తనలలో కనిపిస్తున్నాయి. బహుభార్యాత్వం, ఇతర స్త్రీలతో సంబంధం, మరుగులేని శృంగారం ఆనాటి సామాజిక వ్యవస్థలో భాగాలై శృంగారానికి రూపురేఖ లేర్పరిచాయి. శృంగారం వయసువారికే కాబట్టి వాళ్లలో ఇతర గుణాలెలా ఉన్న తృతీయపురుషార్థం విషయానికొస్తే విచ్చలవిడిగుణమే కనిపిస్తుంది. నలుగురు కలిస్తే ఇతర విషయాలతోపాటు కామవిషయాలను గురించి చర్చించుకొనే సందర్భాలు బోలెడు. స్త్రీ పురుషుల జాణతనాన్ని పట్టిచూపే పదాలనెన్నిటినో అన్నమయ్య వాడాడు. వాడవనితలు (22-535), పొత్తులల్లుడు (16-391), సందడి సవతులు (16-41), వేడుక కాడు (22-181), ఎరవుల సతులు (21-160), పెక్కిండ్ల విందుగాడు (21-97), ఉమ్మడివాడు (21-274), ఊరపొత్తుల వాడు (18-453), సంతవలపు బేరాల జట్టికాడు (5-145), సందడి జాణడు (20-34) మొదలైన పదబంధాలన్నీ ఆనాటి సామాజిక వ్యవస్థను కండ్లముందు బెట్టేవే. ఈ పదబంధాల అర్థాలను, అంతరార్థాలను వ్యాఖ్యానిస్తే

అప్పటి కామకళ ఎంత స్వేచ్ఛగా కొనసాగిందో తెలుస్తుంది. పొత్తుల మొగుడు (22-410), పొత్తుల మగవాడు (22-516) లలో కనిపించే పొత్తు ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలతో పెట్టుకొనే సంబంధం. ఆ ఇద్దరు స్త్రీలు సవతులుగావచ్చు లేక ఒకరు ఆలు మరొకరు వెలయాలు కావచ్చు. శృంగార సంకీర్తనలలో వేశ్యాశృంగారం లేదని కొందరంటున్నారు. అలాంటి వాళ్లకు ఎరవుల సతులు (21-214) కనిపించ కుండా ఎలా దాక్కొన్నారో మరి.

అంగడి బెట్టే వయసు (21-404) వాళ్లకే శృంగారమన్నాడు అన్నమయ్య. వయసుండగానే అనుభవింపదగినవాటిని అనుభవించాలని కూడా అన్నాడు (12-361). మనసు మనసుతో కలవాలంటే శరీరం శరీరంతో కలవాలని, 'పచ్చియైన పనులకు పాడియేల పంతమేల' నని (11-26) వయసుడిగిన తరువాత శృంగారానికి స్థానంలేదని అన్నమయ్య అభిప్రాయం. ఈ విషయంలో తొలిశాస్త్ర కారుడు వాత్స్యాయనుని అభిప్రాయం కూడా ఇదే. వయసు వారికి శృంగార విషయాలు తెలియాలని, కామపురుషార్థాన్ని ఒకకళగా సాధించాలని, దానికొక శాస్త్రమవసరమని వాత్స్యాయనుడు భావించినట్లు ఆయన రచనే చెపుతున్నది. అన్నమయ్య కాలంలో రతిసౌఖ్య లాలసత పెరిగి రత్యానందానుభవం కోసం స్త్రీ పురుషులు నైతికాంశాన్ని పక్కన బెట్టినట్లు అనేకాంశాలు నిరూపిస్తాయి. ఈ యంశాన్నే శృంగార సంకీర్తనలు స్పష్టంగా ప్రదర్శించాయి. ఇరువురి మధ్య శృంగార మున్నపుడు అది రహస్యం. ముగ్గురికి నలుగురికి సంబంధించినపుడు అందులో దాచుకోవలసిన అవసరం లేదు. స్త్రీ పురుషుల మధ్యగల లైంగికత అందరికి తెలిసినదే. దానిని గురించి చర్చించుకోవడం ఆరోజుల్లో సహజం. ఇక సిగ్గుపడవలసిన అవసరమేముంది? **'అందరు నెరిగినవే అన్నిపనులు – అందియ్య రాదా వీడెము అంతసిగ్గేటికి'** (13-513) అంటున్నాడు అన్నమయ్య. వీడెము అందియ్యడమంటే అంగీకారాన్ని తెలపడమని అర్థం.

మగని రసికత్వాన్ని ఒక స్త్రీ గొప్పగా చెప్పుకుంటుంది (16-30). ఒకతను చెరుగు మాసిన దానిని కూడినాడు (16-241), ఇద్దరు సవతులు కొట్లాడు కొంటూంటే మగడు వారించాడు (18-450). ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలను

కౌగిలించుకొమ్మని తాను ఆనందపడుతున్నాడు (12-498). సమయానికి దొరికిన స్త్రీని వదలగూడదు (12-398). స్త్రీ ఒక్కటే అంగడి సరుకు కాదు మగవాడూ అంగడి సరుకే (14-68). స్త్రీ పురుషులు తమ ఆయాలమీద సత్యం చేసుకుంటారు (19-175). నిద్రిస్తున్న స్త్రీతో సరసమాడడం ఒక అనుభవం (19-338). ప్రేమ నిలవాలంటే పెనుగులాట ఉండాలి (20-572). ఇద్దరు భార్యలున్నపుడు వంతుల వారిగా కూడాలి (21-1). తనువులేకములైన తప్పులు నొప్పులు లేవు (19-484). పొత్తుల యెంగిలితోడి భోగం, సానబట్టే సరసాలు తనకు వద్దంటుంది ఇంటి ఆలు (11-556). ఇవన్నీ ఆనాడు అన్నమయ్య దర్శించిన సామాజికాంశాలు. **'మట్టుమీర నవ్వినవ్వి మానముపై చేయివేసి అట్టులుసేసేవు'** (13-119) వంటి విషయాలెన్నో శృంగార సంకీర్తనలలో కనిపిస్తాయి. ఈ విషయాలు ఆధారంగా అన్నమయ్య శృంగార తత్త్వాన్ని విశ్లేషించవచ్చు.

అన్నమయ్యకు ముందు చాలమంది కావ్యకవులు, పదకవులు (జయదేవుని అష్టపదులు పదసాహిత్యం కిందికే వస్తాయి) శృంగారధ్యాత్మ రచనలు చేశారు. శృంగార భావాలలో ఆధ్యాత్మ భావాలను పొదగడం అన్నమయ్య నాటికి కొత్తేమీ కాదు. అయితే అవన్నీ సంస్కృత రచనలు. భర్తృహరి ఈ విషయంలో చేయి తిరిగినవాడుగా కనిపిస్తాడు. శ్రీకృష్ణకర్ణామృతం, గీతగోవిందం ఇలాంటి కావ్యాలే. గీతగోవిందం కేశవకేళి రహస్యాన్ని వర్ణిస్తే శ్రీకృష్ణకర్ణామృతం గోపికాకృష్ణుల సంబంధాన్ని వివరించింది. ఈ రచనలలో శృంగారం భక్తికి, అధ్యాత్మ భావానికి లోబడి కనిపించినా దాని ఉరవడి ఎక్కువే. ఈ రచనలు సామాజికాంశాలను ఎక్కువగా పట్టించుకోలేదు. అన్నమయ్య సామాజికాంశాలకే పెద్దపీట వేశాడు. ఆరకంగా అన్నమయ్య వాళ్లకంటె భిన్నుడు. ఆయన శృంగార సంకీర్తనలు వేంకట శైలవల్లభు రతిక్రీడా రహస్యములైనా అవి సామాజిక పార్శ్వాన్ని కూడా ప్రదర్శించాయి. అన్నమయ్య స్పృహతోనే సమాజంలోని కామవిషయాలను అతిసహజంగా వివరించి ఆనాటి ప్రాయపు పడతుల, మగవాళ్ల శృంగార క్రీడల వ్యాఖ్యాత అయినాడు. అందువల్ల అన్నమయ్య శృంగార సంకీర్తనలలో లౌకిక విషయాలే ఎక్కువగా ఉన్నాయడనం నూటికి నూరుశాతం నిజం.

# అన్నమయ్య - శరణాగతి తత్త్వం

అన్నమయ్య శ్రీహరిని శరణుపొందిన భక్తాగ్రేసరుడు. పంచముద్రలను ధరించి **'సర్వం విష్ణుమయం జగత్'** అనే విశ్వాసంతో శ్రీవేంకటేశ్వరుని త్రికరణ శుద్ధిగా నమ్మి తన సర్వస్వాన్ని స్వామి పాదాలముందు అర్పణచేసి తాను తరించి తన వంశం వాళ్లకందరికి తరుణోపాయం చూపిన వైష్ణవోత్తముడు అన్నమయ్య. ఆయన రచించిన సంకీర్తనలలో అధ్యాత్మ సంకీర్తలన్నీ ఈ విషయాన్ని నిరూపిస్తాయి. ఆత్మ, పరమాత్మ, ప్రకృతి అనే మూడంశాల సంబంధం, సమన్వయం ప్రతి అధ్యాత్మ సంకీర్తనలోని విషయం. ఆయన రచించిన శృంగార సంకీర్తనలలో కూడా అధ్యాత్మ తత్వం గోచరిస్తున్నదంటే ఆయన మనస్సు ఎంత తాత్త్వికమో తెలుస్తుంది. **'కామిగాక మోక్షకామిగాదు'** అన్న మానవ మానసిక తత్త్వం ఆయన సంకీర్తనలకు అక్షరాలా సరిపోతుంది. ప్రేమనుండి దివ్యప్రేమ పుట్టడం మహాత్ముల అనుభవంలోని విషయం. దీనిని మరొక రకంగా చెపితే శృంగారం నుండి అధ్యాత్మ తత్త్వం అవతరించడమని చెప్పాలి. శృంగార అధ్యాత్మ భావాల సమ్మేళనమే మానవ జీవితం. ఇది భారతీయ సాహిత్య లక్షణం కూడా.

తాళ్లపాక కవులనగానే ముందు మనకండ్లకు కనిపించే మూర్తి అన్నమయ్యదే. తమ వంశాన్ని ఉద్ధరించినవాడుగా అన్నమయ్యను ఆవంశం వాళ్లంతా కీర్తించారు. కొడుకులు, మనుమలు ఆయననొక దైవంగానే గాక తాము తరించడానికి మార్గం చూపినవాడుగా భావించి అమార్గంలో పయనించి వైష్ణవ తత్త్వాన్ని తమ సాహిత్యం ద్వారా ప్రచారంచేసి చరితార్థులైనారు. దీనికిగల ప్రధానకారణం అన్నమయ్య స్వామిసేవలో మునిగి, స్వామికి శరణాగతుడై తద్వారా జీవితాన్ని పండించు కోవడమే. అన్నమయ్య స్వామి శరణు పొందడంలోని భిన్నదశలను గురించి

తెలుసుకోవాలంటే ఆయన రచనలను, ముఖ్యంగా సంకీర్తనలను అందులోనూ అధ్యాత్మ సంకీర్తనలను అధ్యయనం చేయాలి. దీనికొక క్రమముంది. రజోగుణ పరివృతుడైన జీవి సాత్త్విక దశను చేరుకోవడానికి చేసే ప్రయత్నం సోపాన క్రమంలో ఈ సంకీర్తనలలో దర్శించ వీలవుతుంది. **'అన్యథా శరణం నాస్తి - త్వమేవ శరణం మమ'** అనడం చాలసులభం. అన్న ఈమాటను త్రికరణశుద్ధిగా ఆచరించడమే కష్టం. ఆచరణలోని క్లిష్టతను ఎలా అధిగమించాలన్న విషయం అన్నమయ్య శరణాగతి తత్త్వాన్ని తెలుసుకొంటే అర్థమవుతుంది. శరణాగతిలో అనేక అంశాలున్నాయి. ముందు ఆ విషయాలను గురించి తెలుసుకోవడం అవసరం.

**శరణాగతి :** 'శరణం గృహ రక్షిత్రోః' అని అమరం. దీని ప్రకారం శరణమంటే గృహం, రక్షకుడు అనే అర్థాలు కనిపిస్తున్నాయి.

> **'ఉపాయే గృహ రక్షిత్రో శ్శబ్దః శరణమిత్యయం**
> **వర్తతే సాంప్రతం చైవ ఉపాయార్థైక వాచకః'** అనే

అహిర్బుధ్న్య సంహితలోని శ్లోకాన్ననుసరించి శరణ శబ్దానికి ఉపాయం అనికూడా అర్థముంది. శరణాగతిలో ఉపాయమే ప్రధానం. శరణు పొందదానికి వెళ్లడమని తాత్పర్యం. శరణాగతికి ప్రపత్తి, న్యాసవిద్య, భరన్యాసం, సాధనయోగం అనికూడా పేర్లున్నాయి. శరణాగతిని గురించి చెప్పిన మొదటి కావ్యం వాల్మీకి రామాయణం. యుద్ధకాండలో శ్రీరామచంద్రుని వ్రతం ఏమిటో కింది శ్లోకం వివరిస్తుంది.

> **'సకృదేవ ప్రపన్నాయతవాస్మీతిచ యాచతే**
> **అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతం మమ' (యుద్ధ.18-33)**

తన అభయం కోరిన సర్వప్రాణులకు శరణు ప్రసాదించడం తన వ్రతమని శ్రీరాముడు చెప్పిన మాటలలో శరణాగతి కనిపిస్తున్నది. రాముని ప్రసన్న జనోద్ధరణ అహల్యతో ప్రారంభమవుతుంది. రామాయణంలోని సుగ్రీవుడు, విభీషణుడు, భారతంలోని ద్రౌపది, భాగవతంలోని ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు భగవంతుని శరణుపొంది తరించినవారు.

**శ్రీ వైష్ణవం :** శ్రీవైష్ణవం మోక్షోపాయంగా శరణాగతిని ప్రతిపాదించింది.

ఆళ్వారుల దివ్యప్రబంధాలలో శరణాగతికి పెద్దస్థానం కనిపిస్తుంది. నమ్మాళ్వారు శ్రీవేంకటేశ్వరుని పాదపద్మాలను శరణుపొందినట్లు ఆయన పాడిన పాశురాలలో ఉంది. స్వామి జీవులను సంసారం నుండి ఉద్ధరించడానికి మూడు రహస్యాలను (మంత్రాలను) ఉపదేశించాడని ఆళ్వారుల నమ్మకం.

1. తిరుమంత్రం - **'ఓం నమో నారాయణాయ'** స్వామి బదరి కాశ్రమంలో నరునికి ఉపదేశించిన మంత్రమిది.

2. ద్వయమంత్రం- **'శ్రీమన్నారాయణ చరణౌశరణం ప్రపద్యే'**
**'శ్రీమతే నారాయణాయ నమః'** ఈ మంత్రాన్ని స్వామి శ్రీమహాలక్ష్మికి ఉపదేశించినట్లుంది.

3. చరమశ్లోకం - **'సర్వధర్మాన్ పరిత్యజ్య ------'** యుద్ధభూమిలో స్వామి అర్జునునికి చెప్పిన మంత్రమిది.

ఇవి మూడు శరణాగతికి అనుష్ఠాన మంత్రాలు. ఈ మంత్రాలను ఆళ్వార్లు తమ పాశురాలలో వ్యాఖ్యానించారు.

ఆళ్వార్లు ప్రతిపాదించిన శరణాగతి మార్గాలను క్రోడీకరించి ఒకపద్ధతిగా లేక ఒక తత్త్వంగా రూపొందించినవారు ఆచార్య పురుషులు, నాథముని, యామునా చార్యులు, రామానుజులు, వేదాంత దేశికులు, పిళ్లలోకాచార్యులు, మనవాళ మహాముని - ఈ ఆచార్య పరంపర.

**నాథముని -** ఆళ్వార్లందరి నాలుగువేల పాశురాలను క్రోడీకరించి నాలాయిర దివ్యప్రబంధంగా కూర్చాడు. ఆ పాశురాలను ఎలా పాడాలో శిష్యులకు నేర్పి వైష్ణవ దేవాలయాల్లో పాడే ఏర్పాటు కూడా చేశాడు.

**యామునా చార్యులు -** కర్మజ్ఞాన భక్తి మార్గాలను అనుసరించలేనని స్వామిని శరణుపొందినట్లు ఈయన 'స్తోత్రరత్న'లో చెప్పుకొన్నాడు. కంచి వరదరాజ స్వామిని శరణుపొంది రామానుజ వైష్ణవమత ప్రవక్తగా దీవించమని ప్రార్థించాడు.

**రామానుజులు** - వేదోపనిషత్పురాణాలతోపాటు ఆళ్వార్ల దివ్యప్రబంధాలను సమన్వయించి వైష్ణవాన్ని విశిష్టాద్వైత సంప్రదాయంగా రూపొందించాడు. అందుకే శ్రీవైష్ణవం ఉభయ వేదాంతమైంది. ఈ సంప్రదాయ ప్రమాణానికి ప్రచారానికి యామునాచార్యుల సలహామీద శ్రీభాష్యం రచించాడు. మోక్ష విషయంలో కలిగిన సందేహాలను వరదరాజ స్వామి తీర్చాడని, 'మోక్షోపాయ ప్రపత్తిస్యాత్' అని స్ఫురింప జేశాడని ఒక నమ్మకముంది. తాను రచించిన భాష్యాలలో భక్తి కంటే ప్రపత్తికి ప్రాధాన్యమిచ్చాడు. అందుకే శరణాగత గద్య రచించాడు. ఇది లక్ష్మి ప్రార్థనతో ప్రారంభమవుతుంది. తన తరపున ఆమె స్వామికి చెప్పి తనశరణాగతిని అంగీకరించేటట్లు చేయమని లక్ష్మిని ప్రార్థించాడు.

**వేదాంత దేశికులు** - తనగ్రంథాలలో శరణాగతి గద్యలోని విషయాలను విపులతరం చేశాడు. శరణాగతిని సాధనయోగంగా నమ్మి ప్రచారంచేశాడు.

## శరణాగతి అంగాలు

| | | |
|---|---|---|
| ఆనుకూల్యసంకల్పం | - | వేదోక్తమైన నిత్య నైమిత్తికాల యందు, భగవద్విషయాలోను శ్రద్ధ కలిగిఉండడం. |
| ప్రాతికూల్యవర్జనం | - | భగవద్విరుద్ధాలను పరిహరించడం. |
| రక్షష్యతీతి విశ్వాసం | - | భగవంతుడు తప్పక రక్షిస్తాడన్న గాఢవిశ్వాసం |
| గోప్తృత్వవరణం | - | భగవంతుడే రక్షకుడుగా నిర్ణయించు కోవడం |
| ఆత్మ నిక్షేపం | - | తనకు సంబంధించిన సర్వభారాన్ని స్వామికే సమర్పించడం (పోషణ, రక్షణ, ఆపదల నుండి కాపాడడం, పరమపదానికి తీసుకొని పోవడం ఇత్యాది) |

ఈ ఆరింటిని శరణాగతికి అంగాలుగా వైష్ణవులు నమ్ముతారు.

**మరికొన్ని ముఖ్యాంశాలు :** వైష్ణవంలో ఆచార్యునికి గొప్పస్థానముంది. శరణాగతి పొందడానికి మొదటి మెట్టు గురువిశ్వాసం. శరణాగతిని గురు ముఖంగా

పొందాలి. నేరుగా స్వామిని శరణు పొందడం క్లేశంతో కూడుకొన్నపని. అనుష్ఠానంలోని ఇలాంటి క్లేశాలను ఆచార్యుడు తొలగించి ఒకమార్గం సూచిస్తాడు. శరణాగతి ఎవరికోసమంటే – కర్మజ్ఞానభక్తి యోగాలు ఆచరించ లేనివారికి, ఉపాసనకు చెందిన శాస్త్రవిషయాలు తెలియనివారికి. మోక్షేచ్ఛ కలిగి త్వరగా సాయుజ్యం పొందాలనుకొనేవారికి. అయితే వీరికి శేషశేషి భావం తెలియాలి. అకించనత్వాన్ని, అనన్యగతిత్వాన్ని తెలుసుకోవాలి. ఈ విషయాలన్నీ ఆచార్యుని ద్వారానే తెలుస్తాయి.

శరణాగతి అర్చామూర్తికి సంబంధించినదే. సాధకుడు అర్చామూర్తినే శరణు పొందాలి. ఈవిషయాలను కూడా ఆచార్య విశ్వాసం తెలియ జేస్తుంది. శరణాగతి పొందడానికి ఎలాంటి నిబంధనలు లేవు. కుల, ప్రాంత, లింగ, సమయ భేదాలు లేవు. సర్వులూ అర్హులే. శరణాగతి పొందిన వారికి అన్నిరకాల తపస్సుల యజ్ఞాల తీర్థయాత్రల ఫలితం చేకూరుతుంది. ఇలాంటి ఫలితం మరేమార్గం ద్వారా రాదు. ఇదే శరణాగతిలోని గొప్పతనమని అహిర్బుధ్న్య సంహిత తెలియజేస్తున్నది. పాపికి మోక్షం రావడానికి కూడా స్వామి కృప కారణమంటారు వైష్ణవులు. స్వామి కృప నిర్హేతుకం. జన్మ జన్మల సంస్కార ఫలితంగా ప్రపత్తి కుదురుతుంది.

**అన్నమయ్య** : తనకు కలిగిన భక్తి ప్రపత్తులకు, వైష్ణవుడు కావడానికి స్వామి నిర్హేతుక కృపయే కారణమని చెప్పాడు అన్నమయ్య.

**'గతులన్ని ఖిలమైన కలియుగ మందును**
**గతి యీతడే చూపె ఘన గురుదైవము**
**ఈతని కరుణనే కా యిల వైష్ణవుల మైతి**
**మీతని వల్లనే కంటి మీ తిరుమణి**
**యీతడే కా వుపదేశమిచ్చె నష్టాక్షరి మంత్ర**
**మీతడే రామానుజులు ఇహపరదైవము'**

అన్నమయ్య రామానుజాచార్యులవారిని గురువుగా, దైవంగా భావించాడు. శ్రీవైష్ణవ పరంపరలో ఎందరో ఆచార్య పురుషులుండగా అన్నమయ్య రామానుజుల వారిచే పేర్కొనడానికి కారణముంది. రామానుజుల వారు ఆదిశేషుని అంశతో

జన్మించిన కారణ జన్ముడని, శ్రీరాముని తమ్ముడైన లక్ష్మణుని అంశ కలవాడు కావడం చేత సేవ్య - సేవక సంబంధం బాగా తెలిసినవాడని వైష్ణవ లోకంలో ప్రసిద్ధి ఏర్పడింది. లౌకికంగా ఒక గురువు దగ్గర చక్రాంకితుడై దీక్ష తీసుకొన్నప్పటికి అన్నమయ్యను వైష్ణవానికి అభిముఖంగా ప్రేరేపించినవాడు భగవద్రామానుజుల వారు. అన్నమయ్య కాలం నాటికే వైష్ణవాలయాలలో రామానుజుల వారి ప్రస్తావన తప్పనిసరి అంశంగా ఉన్నట్లుంది. పై సంకీర్తనలో అన్నమయ్యకు వైష్ణవం వంటబట్టిన క్రమముంది. ఈ సంకీర్తన పూర్తిగా రామానుజులవారిని గురించే. వేద రహస్యాలు తనకు తెలియడానికి, ప్రపన్నులకు సంబంధించిన నియమాలు తెలియడానికి, రామానుజులవారే కారణమంటున్నాడు అన్నమయ్య. అష్టాక్షరిని ఉపదేశించింది, శరణాగతి మార్గాన్ని నిర్దేశించింది, దయతో మోక్ష పథమును దర్శింప జేసింది రామానుజుల వారేనని అన్నమయ్య ప్రపన్నుడై చాటుకొన్నాడు. అన్నమయ్య శరణాగతి తత్త్వాన్ని దర్శించడానికి ఎంతో ముఖ్యమైన సంకీర్తన ఇది. ఇందులో అన్నమయ్య వాడిన శరణాగతి, ప్రపత్తి ఆయనకు బాగా అర్థమైన తత్త్వాలు.

అన్నమయ్య శాస్త్ర కారుడుగాని, మతప్రవక్తగాని కాడు. మహాకవి. మహాపండితుడు. పైగా వాగ్గేయకారుడు. ఆయన వివరించింది తత్త్వాన్నైనా చెప్పింది కవిత్వం ద్వారా. సంకీర్తనలలో ఉత్తమ కవిత్వ లక్షణాలున్నాయి. అప్పటి కవిత్వమంతా ఆలంకారికమైనదే. అన్నమయ్య కవిత్వం ఆలంకారికులకు లోబడి కొంత, పైబడి కొంత కనిపిస్తుంది. ఇది కవిగా ఆయన స్వేచ్ఛను వివరించే అంశం. అందుకే అన్నమయ్య తత్త్వవిషయాలను కూడా శాస్త్రకారులు వివరించి నంతగా వివరించ లేదు. తత్త్వం ఆయన కవిత్వానికి ఒదిగిపోయింది. కవిత్వం నుండి తత్త్వాన్ని విడదీసుకోవలసిన పని విన్నవాళ్లది, చదివినవాళ్ళది. తత్త్వమంటే శరణాగతి తత్త్వమే. వేదోపనిషత్తులకు చెందిన విషయాలెన్ని చెప్పినా అవన్నీ శరణాగతికి అంగభూతంగానే ఉంటాయి. ఆయనకు కనిపించింది శ్రీవేంకటేశ్వరుడు, ఇతరమైన చరాచర సృష్టి. ఈ రెండంశాలకు వారధి అన్నమయ్య. ఒక్కోసారి సృష్టిలోని సామాన్యుడుగా కూడా కనిపిస్తాడు. అన్నమయ్య అధ్యాత్మ భావన ఇక్కడనుండే మొదలవుతుంది:

శరణాగతి ఒక తత్త్వంగా రామాయణాది కావ్యాలలో, భాగవతాది పురాణాలలో ప్రపంచింపబడింది. ఈ యంశాన్ని శాస్త్రీయం చేశారు వైష్ణవా చార్యులు.

**'పితాచ రక్షక శ్శేషీ భర్తా జ్ఞేయోరమాపతిః**
**స్వామ్యాధారో మమాత్మాచ భోక్తా చాద్యమనూదితః'**

అనే భాగవత సంప్రదాయం వీళ్ళచేతులలో శరణాగతి విద్యగా రూపుదిద్దు కొన్నది. అన్నమయ్య వైష్ణవ సాహిత్యాన్ని ఆమూలాగ్రం చూచినవాడు. సంకీర్తనలలో వైష్ణవ సంప్రదాయం బాగా కనిపిస్తుంది.

1. ఎవరిని శరణుపొందాలి? ఉపాస్యదైవం ఎవరు? అనే విషయాలను వివరించడానికి ముందు అన్నమయ్య వైష్ణవమంటే ఏమిటో చెప్పాడు.

**'వలెనను వారిదె వైష్ణవము - ఇది వలపు దేనె పోవైష్ణవము**
**కోరిక లుడుగుచు గుతి నన్నిటిపై - వైరాగ్యమె పో వైష్ణవము**
**సారెకు కోపము చలము తనలో - వారించుట పో వైష్ణవము,**

ఈ సంకీర్తనలో విష్ణుత్వమే వైష్ణవమని, విష్ణువొక్కడే దేవుడని చెప్పబడింది. సుఖ దుఃఖము లంటనిది, ఇంద్రియాలకు వశం కానిది వైష్ణవం. సకలోపాయాలను వదలి వేంకటేశ్వర నామాన్ని వదనం మీదికి చేర్చడం వైష్ణవం. **'విష్ణువొక్కడే విశ్వాత్మకుడు - వైష్ణవమే సర్వంబును'** అనే సంకీర్తనలో సృష్టియావత్తూ నారాయణుని మహిమ వలననే వర్థిల్లుతున్నదంటాడు. పరమేష్ఠి బ్రహ్మాండ సృష్టి, హరుని సంహారశక్తి, ఇంద్రుని పరిపాలన శ్రీహరి మహిమ వలననే జరుగు తున్నాయని చెపుతాడు. పంచ భూతములలోని గుణాలు, నవగ్రహ విహారాలు, కాలత్రయ ధర్మాలు, అంతటాగల మాయా విలాసాలు, పరమపద భోగాలు అన్నీ శ్రీవేంకటేశ్వరుని మహిమలేనని అన్నమయ్య నిర్ణయించాడు. నారాయణుడే పరబ్రహ్మమని, ఆ పరబ్రహ్మం ఒక్కటేనని **'బ్రహ్మమొక్కటే'** అనే సంకీర్తనలో చెప్పాడు. ఆ పరబ్రహ్మను ఎవరికి తోచిన రీతిలో వారు ఆరాధిస్తున్నారని **'ఎంతమాత్రమున నెవ్వరు దలచిన - అంతమాత్రమేనీవు'** అంటూ పరబ్రహ్మలోని

వైవిధ్యాన్ని ప్రకటించాడు. తాను నమ్మిన ఈ విషయాలను శరణాగతి పొందడానికి అనువుగా ఇతరులకు బోధించడానికే సంకీర్తనల కెక్కించాడు.

2. వైష్ణవంలో ఆచార్యునికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆచార్యుని దైవంగా త్రికరణ శుద్ధిగా నమ్మాలి. ఆచార్య విశ్వాసం శరణాగతికి మూలమంత్రం.

**'వేడుకతో నాచార్య విశ్వాసము గలిగి – జాడల శరణాగతి సాధనముతో కూడి, శ్రీవేంకటేశ్వరు గొలిచి దాసుడౌటే – వీడని బ్రహ్మానంద వేదాంత రహస్యము'** అనే సంకీర్తనలో అన్నమయ్య ఈవిషయం స్పష్టంచేశాడు. ఆచార్య భక్తిగలవాడే పరబ్రహ్మను సాక్షాత్కరించుకొనునని **'ఆచార్యవాన్ పురుషో వేదః'** అనే శ్రుతివాక్యం చెపుతున్నది. దివ్య ప్రబంధాలను సంతరించిన ఆళ్వారులు కూడా ఒకరకంగా ఆచార్యులే. అయితే ఆళ్వారుల పాశురాలలో నిక్షిప్తమైన శరణాగతి విద్యను వివరించిన ఆచార్యులలో రామానుజులవారు ముఖ్యులు. ఆచార్య ప్రభావం ఆలకించి శ్రద్ధతో శరణాగతిని పాటించినప్పుడే మోక్షం కరతలామలకం అవుతుందని అన్నమయ్య సంకీర్తనలలో విశదం చేశాడు.

**'అన్నిటా నా వెనకటి అపరాధమేమి గల్లా**
**మన్నించి నా గురు జూచి మానవయ్యా'**

అనే సంకీర్తనలో అన్నమయ్య తనలో దోషములేమైనా ఉంటే తన గురువును చూచి తనను మన్నించమని స్వామిని వేడుకొన్నాడు.

3. పరిపూర్ణమైన విశ్వాసంతో హరిని కొలవడం శరణాగతి. శరణాగతి తప్ప ప్రపన్నులకు మరొక ఉపాయం లేదు. స్వామి శరణు పొందడానికి కూడా ఒక ఉపాయం కావాలి. శరణాగతి చేసిన జీవికి ఉపాయం తనంతట తానే స్ఫురిస్తుంది. అన్నమయ్యకు ఉపాయమూ, ప్రాప్యమూ రెండూ శ్రీవేంకటేశ్వరుడే.

**'సర్వోపాయములు జగతి నాకితడే**
**పూర్వీధరుడు పురుషోత్తముడితడే'**

అని నమ్మినాడు అన్నమయ్య. **'నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని'** ఉన్న వాళ్లకు వేరే ఉపాయం ఎందుకని అన్నమయ్య ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానం

అన్నమయ్యకు స్వామిపై ఉన్న అచంచల విశ్వాసం. రక్షిస్తావో రక్షించవో అనే సందేహం మనసులో లేదు. ఇతరులలో ఉన్నందున పొందిన దైన్యం, వెతలలో చిక్కినపుడు కలిగే వెఱపు అన్నమయ్యకు లేవు. అస్తిత్వం మీద విశ్వాసం లేనివాడు సంశయాత్మకుడు. జ్ఞానహీనుడు, శ్రద్ధారహితుడు అయిన సంశయాత్మకుడు నశిస్తాడని, సంశయమున్నవాడికి ఇహపరాలుండవని భగవద్గీత (4-40) ప్రకటించింది.

4. నిత్య నైమిత్తిక కర్మలను భగవత్పరం చేయడం శరణాగతి లోని మరోఅంశం. భగవత్పరం కాని నిత్య కృత్యాల వల్ల జీవునికి పరమాత్మకు ఎడం ఏర్పడుతుంది. ఈ ఎడం పోవాలంటే సమస్త కర్మలు భగవత్పరం కావాలి. అందుకే భాగవతం-

'కమలాక్షు నర్చించు కరములు కరములు - శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ' అని ప్రకటించింది.

**కాకున్న సంసార గతులేల? లోక కంటకములగు లోభంబు లేల?**
**వినికి గనవలసినను విష్ణుకీర్తన చెవికి - వినికి చేసిన నదియె వేదాంతబోధ**
**మనికి గనవలసినను మధువైరిపై భక్తి**
**- యునికి ప్రాణులకు బ్రహ్మోపదేశంబు**
**చదువు గనవలసినను శౌరినామము దిరుగ**
**- జదువుటే సకల శాస్త్రముల సమ్మతము**
**నిదుర గనవలసినను నీరజాక్షునికి దన**
**- హృదయమర్పణసేయుటది యోగనిదుర**

ఈ సంకీర్తనలో కనిపించే విష్ణుకీర్తన, వేదాంతబోధ, మధువైరిపై భక్తి, బ్రహ్మోప దేశం, శౌరినామం, శాస్త్ర సమ్మతం, యోగనిదుర మొదలైన విషయాలు వైష్ణవ సంప్రదాయానికి సంబంధించినవైనా ఇవన్నీ అన్నమయ్య జీవితంలో ఏర్పడిన అనుభవాలే. సంప్రదాయం, అనుభవం రెండూ చక్కగా కలసిపోయి సంకీర్తనలలో కనిపిస్తాయి.

5. ఆపన్నులను కాపాడడం దేవుని కర్తవ్యమని నమ్మి ఆపన్నత పొందడం మరొక అంశం. దేవుడు ఈ విషయాన్ని గుర్తించాలని భక్తుడైన అన్నమయ్య

కోరుతున్నాడు. ఆపన్నులను అవసరంలో రక్షించక పోతే దేవుడి ఆర్తత్రాణ పరాయణత్వం విలువ లేకుండా పోతుందని కూడా ఆయన అభిప్రాయం

**తెలియ జీకటికి దీపమెత్తక పెద్ద - వెలుగు లోపలికి వెలుగేలా?**
**అరయ నాపన్నుని కభయమీవలె గాక - ఇరవైన సుఖి గావనేలా?**
**వఱత బోయెడివాని వడిదీయవలె గాక - దరివాని దివియగ దానేలా?**
**ఘన కర్మారంభుని కట్లు విడవలె గాక - యెనసి ముక్తుని గావనేలా?**
**అనయము దుర్బలుని కన్నమిడవలె గాక - తనిసిన వానికి దానేలా?**

ఈ సంకీర్తనలోని ప్రశ్నలన్నీ జీవుడు దేవుడికి వేస్తున్నవి. ఈ ప్రశ్నల వెనుక సందేహం లేని ఒక నమ్మకం కనిపిస్తుంది. ఆ నమ్మకమే భక్తికి సోపానం.

6. స్వామిని శరణు పొందిన పురాణ పురుషుల కథల ద్వారా భక్తులను శరణాగతికి ప్రోత్సహించడం అన్నమయ్య చేసిన మరో మంచిపని.

**'కొనరో కొనరో మీరు కూరిమి మందు - ఉనికి మనికి కెల్ల నొక్కటే మందు**
**ధ్రువుడు గొనిన మందు తొల్లియు బ్రహ్మాదుడు**
**- చవిగొనిన మందు చల్లని మందు**
**భవ రోగములు వీడి పారగ పెద్దలు మున్ను**
**-జవకట్టి కొనిన నిచ్చలమైన మందు'**

అనే ఈ సంకీర్తనలో సంసార మగ్నత అనే రోగానికి మందు శ్రీహరి సేవనమేనని నిశ్చితమైన నిర్ణయం కనిపిస్తున్నది. ప్రహ్లాదాది పురాణ పురుషులెందరో ఈ మందును సేవించి ధన్యులైన విషయాన్ని ఈ సంకీర్తన గుర్తుచేస్తున్నది. సంసార మగ్నతే కాక జరామరణాది భవరోగాలను పోగొట్టుకోడానికి వివేకవంతుడు పరమాత్ముడనే ఔషధాన్ని సేవించాలంటున్నాడు అన్నమయ్య. ఈ విషయాన్ని అనేక సంకీర్తనలలో వెల్లడి చేశాడు.

**'వేదమంత్ర మింకనేల వేరు వెల్లంకులు నేల**
**పుడమి ధరుడు మాకు భువనౌషధము'**

అనే సంకీర్తనలో రోగనివారణకు మంత్ర తంత్రాలు పనిచెయ్యవని, ఏకైక ఔషధం పుడమి ధరుడేనని చెప్పడం ఈ విషయ విస్తరణే.

'ఒక్కడే మోక్ష కర్త వొక్కటే శరణాగతి - దిక్కని హరిగొల్చి బతికిరి తొంటివారు' అనే సంకీర్తనలో చెప్పిన విషయాలు 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అనే గీత లోని చరమ శ్లోక భావాన్ని గుర్తుకు తెస్తాయి. మోక్ష విషయంలో తలెత్తిన అనేక సందేహాలను ఈ సంకీర్తన నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నది.

7. వైష్ణవంలో దాసానుదాసత్వానికి ఒకప్రత్యేకత ఉంది. ఇది గురు శిష్య సంబంధాన్ని, సేవ్యసేవక సంబంధాన్ని వివరించే ఒకమార్గం. హరిదాసుడు, దాసాను దాసుడు వంటి మాటలు వైష్ణవ వాఙ్మయంలో ఎక్కువగా కనిపిస్తాయి.

**'త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య**
**భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ'**

కులశేఖరాళ్వారు ముకుందమాల లోని ఈ శ్లోకం దాసానుదాసత్వాన్ని చక్కగా ఆవిష్కరిస్తున్నది.

**'ఇన్నిటికి నీశ్వరేచ్ఛ యింతేగాక - తన్నుతానే హరిగాచు దాసుడైతే చాలు'**
**'మిమ్ము నెఱిగిన యట్టి దాసుల నెఱిగే-సమ్మతి విజ్ఞానమే చాలదా నాకు'**
**'దైవమా నీకంటే నీదాసులే నేర్పరులు'**
**'మేటి తపముల మెచ్చి కైకొనని నీవు**
**-గాటపు దాసులైతేనే కైకొని మన్నించితివి'**

ఇత్యాది సంకీర్తనల పంక్తులు అన్నమయ్య శరణాగతికి అవసరమైన దాసాను దాసత్వాన్ని ప్రకటిస్తున్నాయి.

8. శరణాగతి తప్ప ఇతరోపాయాలు తనకు నచ్చవని అన్నమయ్య అనేక సంకీర్తనలలో స్పష్టంచేశాడు.

**'ఏమనవచ్చును గొందరి కింపౌబులుసులు తీపులు**
**సోమరి తనమున నిన్నిట - జొరదీ నా తలపు**
**పదిలంబున సర్వాత్మక - భావము దలచిన పిమ్మట**
**ముదమున నెవ్వరి జూచిన - మొక్కక పోరాదు**

**వదలక యిన్నిటను శ్రీ - వల్లభుడున్నాడుండిన**
**హృదయము చంచల మిన్నిట - నెనయదు నా మనసు**

**ఎక్కడ జూచిన ప్రాణుల - కిన్నియు నాచారములే**
**చిక్కక యిన్నియు గైకొని - చేయక పోరాదు**
**మక్కువ నిన్నియు శ్రీహరి - మతములె కానీ అయినా**
**ఒక్కటియే చాలును నా - కొడబడ వితరములు'**

ఈ సంకీర్తనలో అన్నమయ్య కాలంనాటి మత సంస్కృతి వివరంగా కనిపిస్తున్నది. ఒక స్థిరమైన అభిప్రాయం లేనివాళ్లు రకరకాల విషయాలు చెప్పి లేనిపోని సందేహాలను కలిగిస్తారు. ఇలాంటి వారికి పులుసులు తీపులు ఇంపౌతాయంటు న్నాడు అన్నమయ్య. ఈ విషయాన్ని భగవద్గీత ఇలాచెప్పింది.

**'యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః**
**వేదవాద రతాః పార్థ నాన్యదస్తీతి వాదినః' (సాంఖ్య-42)**

వేద విషయాలు తమకే తెలుసునని, కనిపించేది తప్ప మరొకటి లేదని, అదే సత్యమని తియ్యగా మాట్లాడేవాళ్లంతా అపండితులని పై శ్లోకార్థం. ఇలాంటి సోమరుల మాటలు నమ్మదగవని, తనకు తెలిసినది శ్రీహరియందు సర్వాత్మ భావం కలిగి ఉండడమేనని అన్నమయ్య చాటడంలో శరణాగతి స్ఫురిస్తుంది.

9. మధురభక్తి సంప్రదాయం శరణాగతి తత్త్వమే. శృంగారాత్మకమైన భక్తి మధురభక్తి. ఇది అధ్యాత్మ శృంగారం. అధ్యాత్మ భావాలలో శృంగారం ప్రదర్శించడం, శృంగారభావాలలో అధ్యాత్మ భావాలను చూపడం పదసాహిత్యం లోనే కనిపిస్తున్న ప్రత్యేక విషయం. ఇది అన్నమయ్యతోనే మొదలు కాకున్నా ఆయన సంకీర్తనల ద్వారానే ఒక సిద్ధాంతంగా రూపొందింది. ఆయనకు ముందుండిన పద్యకవులు దీనిని స్పృశించక పోలేదు. అయితే అక్కడ అంతప్రధానం కాలేదు. మధురభక్తి సంప్రదాయంలో కవి భగవంతుని సన్నిధానాన్ని కోరు కొంటాడు. ఎడబాటును సహించలేడు. శృంగార సంకీర్తనలలో శ్రీవేంకటేశ్వరుడు నాయకుడుగా నానావిధ నాయికలను జోడించి సంయోగ వియోగ భేదాలతో,

శృంగార రీతులతో రచన సాగించిన అన్నమయ్యది నాయిక స్థానం. నాయిక లక్షణాలను తనలో ఆరోపించుకొని నాయకుని సంపర్కం కోసం చేసిన ప్రయత్నం అనేక సంకీర్తనలలో కనిపిస్తుంది. ఇందులో పరమాత్మ సాక్షాత్కారం కోసం తపస్సు చేసే యోగి లక్షణముంది. పరమాత్మ భావం మనసులో ఏర్పడిన స్థితికి మించిన వైభవం మరొకటుండ దంటున్నాడు అన్నమయ్య.

**ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మతి**
**యిదిగాక వైభవంబిక నొకటి కలదా**
**అతివ జన్మము సఫలమై పరమయోగి వలె**
**నితర మోహాపేక్షలిన్నియును విడిచె**
**సతికోరికలు మహాశాంతమై యిదె చూడ**
**సతత విజ్ఞాన వాసనవోలె నుండె**
**శ్రీ వేంకటేశ్వరుని జింతించి పరతత్త్వ**
**భావంబు నిజముగా బట్టె చెలియాత్మ**
**దేవోత్తముని కృపాదీనురాలై యిపుడు**
**లావణ్యవలికి నుల్లంబు తిరమాయ**

ఈ సంకీర్తనలో యోగికి, వియోగినియైన నాయికకు సమానధర్మం, సమానఫలం చూపబడినాయి. భాగవతంలోని శ్రీకృష్ణునితో గోపికలకు గల సంబంధం ఈ విషయాన్నే నిరూపిస్తుంది.

ఇప్పటి వరకు చూపిన అంశాలన్నీ అన్నమయ్య పాటించిన లేక ప్రతిపాదించిన శరణాగతి తత్త్వానికి భిన్న సోపానాలు.

# అన్నమయ్య కవితా వైభవం

ఏవేల్పు సర్వేశుఁడే వేల్పు పరమేశుఁ
దే వేల్పు భువనైక హిత మనోభావకుఁడు
ఏ వేల్పు కడు సూక్ష్మ మే వేల్పు కడు ఘనము
ఆ వేల్పు తిరు వేంకటాద్రి విభుఁడు ..........

అని తనువెల్లా భక్తితో పులకించి శ్రీనివాసుని సేవించి తరించినవాడు అన్నమయ్య. ఆయన నిలువెల్లా కవి. తిరుమల వాసునితో సాన్నిధ్యం కల్పించుకోవడానికి ఆయన ఎన్నుకొన్న మాధ్యమం పదం. ఇది 'సుప్తిఙ్గతం' వంటి పదం కాదు. శ్రీపతిని కీర్తించడానికి దొరకొన్నపదం. చిన తిరుమలాచార్యులు సంకీర్తన లక్షణంలో-

**"వర కవితాగుణ చతురత, లరుదారగఁ దాళ్ళపాక యన్నయ ధరలో**
**దిరు వేంకటాద్రిపతిపై, దొరకొని చెప్పంగఁ బదము తుది పదమయ్యెన్"**

అన్నాడు. తుది పదమంటే ఉత్కృష్టమైన పదమని అర్థం. లౌకిక సంకేతార్థాలను తెలియ జేయడానికి మనం వాడే సాధారణ వర్ణాల కూర్పు కాదిది. జగత్తంతా నిండిన శ్రీనివాస తత్త్వాన్ని భక్తులకు వివరించి చూపడానికి ఉద్దిష్టమైనదీ పదం. మానవుడిలోని సత్త్వభావ సంపన్నమైన అధ్యాత్మదశను ప్రదీప్తం చేయడానికి అన్నమయ్య పద సాహిత్య సృష్టి చేశాడు. ఒక్కొక్క సంకీర్తనను ఒక్కొక్క పుష్పంగా భావించాడు. ఇలాంటి అనేక సంకీర్తన సుమాలతో స్వామిని అర్చించాడు. సృష్టి పరమాత్మకు వ్యాఖ్యానమని పండితులు చెపుతారు. అందువల్లనే అన్నమయ్యకు ప్రకృతిలోని ప్రతి అణువులోను శ్రీనివాసత్వం ద్యోతకమయింది. అందుకే లౌకికా

లౌకిక జగత్తులోని సమస్త విషయాలు ఆయన కవితకు వస్తువులయ్యాయి. వైవిధ్య భరిత వస్తు సంపదను గుదిగుచ్చిన సూత్రం హరిభక్తి. ఇదే అన్నమయ్య కవిత్వం.

ఆయన కవితను గురించి ఆయన మనుమలు చెప్పిన అభిప్రాయాలు కొన్ని ఉన్నాయి. అన్నమయ్య పదాలు **'వరకవిత్వ వాణీ వీణా నాదంబులు'** అని, **'వర కవితా గుణ చతురత'**తో ఒప్పారుతాయని, ఆయనది **'చాటూక్తి పదబంధ కవిత'** అని చిన తిరుమలా చార్యులు సంకీర్తన లక్షణంలో పేర్కొన్నాడు.

**"యోగమార్గంబున నొకకొన్ని, బుధులు**
**వైరాగ్య రచనతో వాసింపఁ గొన్ని**
**రాగిల్ల శృంగార రసరీతిఁ గొన్ని**
**సారస నేత్రుపై సంకీర్తనములు**
**సరసత్వమునఁ దాళ సముఖముల్ గాఁగ**
**వర మంత్రములు ముప్పది రెండువేలు"**

రచించినట్లు తాళ్ళపాక చిన్నన్న 'అన్నమాచార్య చరిత్ర'లో చెప్పాడు. వైరాగ్య రచనలో వాసించే అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార రసరీతిలో ఉండే శృంగార సంకీర్తనలు సరసత్వంతో చతురతతో రచింప బడినట్లు స్పష్టమవుతున్నది. సరసత్వం, చతురత రెండూ 'చతురోక్తి'లో అంతర్భవిస్తాయి. చమత్కార పూర్ణమైన ఉక్తి అని దీనికర్థం. ఎర్రన లాంటి ఇతర కవుల విషయంలో 'చతురోక్తి' అనంత విధాలుగా కనిపిస్తుంది. అన్నమయ్య విషయంలో ఆయన కవితా సామ్రాజ్యం నుండి పుట్టిన ప్రతి చమత్కార పూర్ణవచనము వేంకటవిభుని దివ్య వైభవాన్ని అనేక విధాలుగా వ్యక్తం చేయడానికే ఉపయోగపడింది. చిన తిరుమలాచార్యులు పేర్కొన్న 'వరకవిత'కు అర్థం 'శ్రేష్ఠమైన కవిత' అని చెపితే సరిపోదు. 'వరుడు' అంటే సమస్త సృష్టిని మోహింపజేయగల భువన సుందరుడు. **'కలౌ వేంకటనాయకః'** అనే సూక్తిననుసరించి ఆయన అస్థిత్వాన్ని ధ్వనింపచేయడానికి అన్నమయ్య పలికిన ప్రతిపలుకూ వరకవిత్వమైంది.

అనేక కవుల కావ్యాలను, వాటి కవితా విశేషాలను పరిశీలిస్తే వస్తువుకు, కవితామార్గానికి స్థూలంగానైనా సంబంధమున్నట్లు కనిపిస్తుంది. వస్తువు ఇతిహాస

పురాణాలకు చెందినదైనపుడు కవితా శైలి తదనుగుణంగానే ఉంటుంది. కవిత్రయం వారి కవిత్వం ఇలాంటిదే. వస్తువు కల్పనా చాతుర్యంతో నిండి ఉన్నపుడు శైలి ఆలంకారికంగా, వర్ణనాత్మకంగా ఉంటుంది. ప్రబంధ కవులదీపద్ధతి. ఈ రెండు రకాల పద్ధతులు అన్నమయ్యలో కనిపించినా ఆయన కవితా పద్ధతికొక ప్రత్యేకత ఉంది. అన్నమయ్యకు కవితావస్తువు కానిదేదీ లేదు. అట్లని అందులో కథలు గాని, సంఘటనలు గాని లేవు. శ్రియః పతికి, అన్నమయ్యకు – అంటే ఆత్మ పరమాత్మలకు గల సంబంధమే అన్నమయ్య కవితా వస్తువు. దీనికి భౌతిక ద్రవ్యాపేక్ష లేదు. అంతరంగంలో పొటమరించే భావజాలాన్ని ఆవిష్కరించడమే ఆయన కవితకు లక్ష్యం. అయితే ఇందులో రెండంశాలు స్ఫుటత్వం దాల్చి కనిపిస్తాయి. ఒకటి – పరమాత్మ సాక్షాత్కారం కోసం జీవి అనుభవించే ఆర్తి. ఇది అధ్యాత్మపరంగా శృంగారపరంగా ఆవిష్కరింప బడడానికి కారణం జీవికి రెండు దశలలో దివ్యత్వాన్ని దర్శించగల శక్తి ఉండడం. భోగకళ ద్వారా ఆత్మికమైన ఆనందాన్ని పొందడం ఒక యోగం. యోగ సాధన లేకుండా అనుభవించేది కేవలం కామం. ఇది అశాశ్వతం. అందుకే భారతీయ సాహిత్యంలో భోగకళ కామకళగా, శాస్త్రంగా మారింది. మనస్సు, ఇంద్రియాలు చలన రహితంగా పరమాత్మలో లీనమైనపుడు కలిగే ఆనందమే బ్రహ్మానందం. **'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్'** అనే ఉపనిషద్వాక్యం ద్వారా ఈ విషయం నిరూపించబడింది. అన్నమయ్య సంకీర్తనలు ఇంతలోతైనవి. వాడుక మాటలలో ఉన్నా అవి అన్నమయ్య కొండలయ్యను భావించడంలో కలిగే ఆనందంలో పర్యవశిస్తాయి. రెండు – తన అంతరంగములో నిండిన పరతత్త్వాన్ని భక్తులందరికీ ప్రత్యక్షీకరించే ప్రయత్నంలో అన్నమయ్య పొందిన లౌకిక దశనుండి కనిపిస్తున్నవన్నీ ప్రాపంచిక విశేషాలు. ఈదశలో అన్నమయ్య తడవని ప్రాపంచిక వస్తువులేదు. ఆయనకు గల అనంతమైన లోకానుభవం ఈ దశలో కనిపిస్తుంది.

అన్నమయ్య ఇతర రకాల రచనలు చేసినా ఆయన కవిత్వమంటే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది సంకీర్తన వాఙ్మయమే. ప్రతి సంకీర్తనలోనూ పల్లవి, మూడు చరణాలు నియతంగా కనిపిస్తాయి. నిరూపించ దలచిన విషయాన్ని

పల్లవిలో చెప్పి దాన్ని మూడు చరణాలలో విస్తరిస్తూ వెళ్ళి చివర వేంకటేశ్వర ముద్రతో సమన్వయం పొందించడం ఆయన కవితాశిల్పం. పదానికి ఒక మకుటం ఉండాలి కాబట్టి మకుటావృత్తి అవసరం కాబట్టి అన్నమయ్య అలాంటి సమన్వయం కుదిరించి ఉంటాడని చెప్పడం సాధారణ విషయం. త్రిమూర్త్యాత్మకమైన జగత్తులోని లౌకిక విషయాన్ని సత్త్వోపసంపన్నంగా మార్చడం, ప్రతిపాదింప దలచిన విషయాన్ని త్రికరణ శుద్ధిగా ప్రకటించడం, సమస్త విషయాలు పరమాత్మతో సంయోగం పొందుతాయని నమ్మడం అన్నమయ్య సంకీర్తన నిర్మాణంలో కనిపించే విశేష విషయం. ఈ అభినివేశం ఆయనకు ఉంది కాబట్టి సృష్టిలోని సమస్త మానవులలో ఏ ఒక్కరూ మరొకరితో సమానం కానట్లు ఇన్ని వేల సంకీర్తనలలో ఎక్కడా పునరుక్తులు కనిపించవు.

సాధారణంగా ఏ కవి కవితనైనా కావ్య లక్షణ శాస్త్రాన్ని అనుసరించి మదింపు చేయడం విమర్శ పద్ధతి. ఆ పద్ధతిలో కూడా అన్నమయ్య కవిత లక్షణ లక్ష్య ప్రాయమవుతుంది. భావుకత, చమత్కార వైభవం, వర్ణనా వైదగ్ధ్యం, ఆలంకారిక శైలీ విన్యాసం ఇత్యాది లక్షణాలు ఉత్తమకవితా లక్షణాలు. ఇవన్నీ అన్నమయ్య కవితలో పుష్కలంగా కనిపిస్తూ ఆయన కవితా రామణీయకతను ప్రదర్శిస్తాయి. ఈ గుణాలన్నిటిలో ఎన్నదగింది భావుకత. ఎన్ని గుణాలున్నా భావుకత లేనివాడు కవి కాలేదు. అన్నమయ్య భావుకత పఠితలను సంభ్రమాశ్చర్యాలలో ముంచుతుంది. సాళువ నరసింగరాయల కొలువులో ఆయన పాడిన-

**ఏమొకో చివురుటధరమున యెడనెడఁ గస్తురి నిండెను**
**భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుకదా ॥పల్లవి॥**

**కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోచిన**
**చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు**
**నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటిన యాకొన చూపులు**
**నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా ॥ఏమొకో॥**

**ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల**
**వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు**

**గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున**
**అద్దిన సురతపుఁ జెమటల అందము కాదుగదా ॥ఏమొకో॥**

అనే పదం భావుకతకు అద్దం పడుతుంది. ప్రియుని శృంగార చేష్టలను అనుభవిస్తూ పారవశ్యంపొందిన ఒక నాయిక మన కండ్ల ముందు కనిపిస్తుంది. ఆయన వేంకట విభుడు. ఆమె మంగతాయారు. సృష్టిలోని సమస్త శృంగార రహస్యాలను అన్నమయ్య వారిద్దరి దివ్య శృంగారంలో సమన్వయించి చూపిస్తాడు. ఈ సమన్వయంలో శాస్త్ర విషయాలతోపాటు లోకానుభవాలు కూడా ఉంటాయి. ఈ పదంలో అన్నమయ్య పొదిగిన భావాలు శృంగారానికి పరాకాష్ఠ.

**'బాహ్యమాభ్యం తరం చేతి ద్వివిధం రతముచ్యతే**
**తత్రాద్యం చుంబనాశ్లేష నఖదంత క్షతాదికమ్**
**ద్వితీయం సురతం సాక్షాన్నానాకరణ కల్పితమ్'**

అనే కామశాస్త్ర విషయాలు ఈ సంకీర్తనలో కనిపిస్తాయి. అరుణాధరం నల్లని సిరాతో వ్రాసిన పత్రికగా ఉత్ప్రేక్షింపబడింది. ఇది భామిని విభునకు వ్రాసిన ప్రేమలేఖ వలె ఉన్నదని అన్నమయ్య భావించాడు. ఎర్రని నాయిక పెదవిపై నల్లని మరకలు ఎలా వచ్చాయనడానికి అన్నమయ్య సమాధానం చూడండి. నాయిక కస్తూరీ తిలకాంకితమైన నాయకుని ముఖాన్ని పలుమారు ముద్దిడుకోవడం చేత ఆమె పెదవిపై నల్లని గుర్తులేర్పడ్డాయి. ఆమె పెదవిని లేఖగా ఊహించడానికి తగినన్ని కస్తూరి ముద్రలు ఉన్నాయంటే ఆమె ఎన్నిసార్లు ముద్దుపెట్టుకొని ఉంటుందో మనం భావించాలి. దీనిద్వారా నాయకుని మోహ సౌందర్యం వ్యంజితమవుతున్నది. నాయిక కన్నులకొసలు ఎర్రబడ్డాయి. దానికి కారణం ప్రియునిపై నాటిన చూపును బలవంతంగా వెనుకకు లాగుకోవడం. దీనివల్ల కంటికి గాయమై నెత్తురు మరక ఏర్పడిందని ఊహించడంలో ఎంతో సొగసుంది. ఇందులో నాయిక ఏకాగ్రతను, తప్పని సరియై చూపును ఊడబెరక వలసిన స్థితిని సహృదయులే అర్థం చేసుకోగలరు. పడతి చనుగన మెరుగులు పయ్యెద వెలుపలికి కనిపించడం అతిశయోక్తి. చనుగవపై మొలిచిన నఖ శశి రేఖలు

కాంతిని వెలుపలికి చిమ్మడం దానికి కారణమట. నాయిక చెంపలపై చెమటబొట్లు ముత్యాలవలె కనిపించడం సహజమే. అయితే ఆ చెమట బిందువులు నాయకుడు ఆమె చెంపలపై అద్దిన సురతపు చేష్టలుగా ఉత్ప్రేక్షించడం అన్నమయ్య భావుకత. ఇంతలోతైన భావాలను సహజాలంకార యుక్తంగా లలితములైన తెలుగు పదాలతో వ్యక్తం చేయడం అన్నమయ్యకు తప్ప మరొకరికి సాధ్యమవుతుందనలేము.

ఈ సంకీర్తనలో అన్నమయ్య చిత్రించినది అలమేలుమంగ సౌందర్యాన్నే కాదు. ఆమె సురత పారవశ్యాన్ని కూడా. ఈ పారవశ్యం ఆమెకు నాయకుని శృంగార లాలన వల్ల కలిగింది. నాయకుడి మనస్సులో రేగిన కోరికలు ఆమె శరీరంపై కలిగిన పులకరింపులతో సఫలమయ్యాయి. సంకల్పమాయనిది. సఫలత ఆమె లావణ్యదేహానిది. స్వామికి మంగ సౌందర్యం ఆనంద పారవశ్యకం. ఆయన భువన మోహనుడు. ఆయననే మోహింపజేయగల సౌందర్యరాశి ఆమె. సృష్టిలో స్త్రీ అందంకంటే మించిన అందంలేదని చెప్పే అనుభవజ్ఞుల అభిప్రాయం ఈ సంకీర్తనలో రూఢి పరచబడినది. ఇలా ఆలోచిస్తూ పోతుంటే ఇందులోని సౌందర్యం అనుభవయోగ్యమవుతూనే ఉంటుంది.

అన్నమయ్య భావుకతకు మరెన్నో సంకీర్తనలను లక్ష్యాలుగా చూపవచ్చు. మరొక సంకీర్తనను చూడండి –

**చెప్పరాదీయింతి సిరులు – దీని**
**వొప్పులన్నియుఁ జూడ వొరపులోకాని ॥పల్లవి॥**

**ముదిత జఘనము మీద మొలనూలి గంటలవి**
**కదలు రవమెట్లుండెఁ గంటిరే చెలులు**
**మదనుఁడుండెడి హేమ మందిరము దిరిగిరాఁ ॥చెప్ప॥**
**గదసి మ్రోసెడి పారి ఘంటలో కాని**

**కొమ్మపయ్యెదలోని కుచముల రుచి వెలికిఁ**
**జిమ్ముటది యెట్లుండెఁ జెప్పరే చెలులు**

యిమ్మైన మరు ధనములెల్ల రాసులు వోసి
కమ్ముకొని చెంగావి గప్పిరో కాని ||చెప్ప||

నెలత కంఠమునందు నీల మణి హారములు
అలరుటెట్లుండు కొనియాడరే చెలులు
లలితాంగి ప్రాణవల్లభుడు వేంకటవిభుడు
నెలకొన్న కౌగిటనె నిలిచెనో కాని ||చెప్ప||

**"ఏమొకో చివురుటధరమున ........."** అనే సంకీర్తన లోని రెండవ చరణమే ఈ సంకీర్తన లోని రెండవ చరణంగా మారింది. అయితే దానికిది మెరుగు. కుచముల కాంతి పయ్యెద వెలుపలికి వ్యాపించడం రెండిటా సమానం. అక్కడ నఖశశిరేఖల వెన్నెల కారణం. ఇక్కడ చూపిన కారణం మరింత హృదయంగమంగా ఉంటుంది. కుచములు మరుని ధనరాశులవలె ఉన్నాయి. ఆ ధనరాశుల పై చెంగావి కప్పబడి ఉంది. ధనాన్ని గుప్తంగా ఉంచుకోవడం సహజం. ఆ ధనం బయటికి కనిపించేటట్లు ఎవరూ ఉంచరు. ఈ లౌకిక ధర్మాన్ని అన్నమయ్య శృంగారంలో పర్యవశింపజేశాడు. స్త్రీత్వాన్ని ద్యోతకం చేసే మరుధనమది. పూర్తిగా కనిపిస్తే అశ్లీలమవుతుంది. పూర్తిగా కనిపించకపోతే అందమే లేదు. అందువల్ల అందాన్ని బయటకి ప్రసరింపజేయగల సన్నని చెంగావి వస్త్రాన్ని పయ్యెదగా చేశాడు. అన్నమయ్యవంటి రససిద్ధులైన కవీశ్వరులకే ఇలా భావించడం సాధ్యం. మామూలు కవులకు ఈ భావనలు కలగవు.

ముందే చెప్పినట్లు ఆలంకారిక పద్ధతిలో విశ్లేషించినా అన్నమయ్య కవిత్వం లక్షణ లక్ష్య ప్రాయంగా సొగసులను విరజిమ్ముతుంది. అంతటితో సరిపెట్టుకొంటే ఆయన కవితా విలాసాన్ని సగం దర్శించిన వాళ్ళమే అవుతాం. మిగిలిన సగం ఆయన శృంగారంలో ముంచి పైకెత్తిన అధ్యాత్మ భావాలలో దర్శించగలం. శృంగార అధ్యాత్మ భావాలను సమానంగా ప్రతిపాదించడం సాధారణ విషయం. పైకి శృంగారంగా కనిపించినా లోతుగా పరిశీలిస్తే అధ్యాత్మ వాసనలు గుప్పుమనే భావాలనెన్నిటినో ప్రోదిచేయడం ఆయన ప్రత్యేకత. శృంగారం నుండి వైరాగ్య

వాసనలు ఎలా పొటమరిస్తాయో అర్థమయితే తప్ప అన్నమయ్య శృంగార అధ్యాత్మ సంకీర్తనల సమన్వయం అర్థంకాదు. నాయికకు శృంగార పరమైన భావాలెన్నో మనసులో ఉన్నాయి. అవి మానసిక అలజడికి కారణమయ్యాయి. ఆ అలజడి తగ్గి మనసులో శాంతి నెలకొనాలని ఆమె కాంక్షించింది. ఆమెకు చిత్త శాంతిని కలిగించడానికి కావలసిన ఔషధం నాయకుడు. ఆయన సాంగత్యం కోసం తపస్సు చేసింది. చిత్తంలో ఆయన సాక్షాత్కరించాడు. మానసికాందోళన తగ్గింది. సౌఖ్యం అనుభవగోచరమైంది. దేనికోసం ఆమె ఇంతవరకు వెంపరలాడిందో ఆ పెన్నిధి లభించింది. ఇక ఆమెకు కావలసినదేముంది? రెండు శరీరాల కలయిక కాదిది. రెండు చిత్తాల కలయిక. శృంగార అధ్యాత్మ భావాలు పరస్పర విరుద్ధాలైనా వాటి మధ్య విరోధాన్ని తొలగించి సమన్వయ ధోరణిలో ప్రతిపాదించడం అన్నమయ్య కవితా విశేషం. ఈ సమన్వయం చక్కగా అమరిన సంకీర్తనలెన్నో ఉన్నాయి. వాటిలో ఒకటి -

ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
యిదిగాక వైభవం బిక నొకటి గలదా ॥పల్లవి॥

అతివ జన్మము సఫలమై పరమ యోగివలె
నితర మోహాపేక్షలిన్నియును విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదెచూడ
సతత విజ్ఞాన వాసనవోలె నుండె ॥ఇది॥

తరుణి హృదయము కృతార్థతఁ బొంది విభుమీది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ ॥ఇది॥

శ్రీ వేంకటేశ్వరునిఁ జింతించి పరతత్త్వ -
భావంబు నిజముగాఁ బప్పె చెలియాత్మ

**దేవోత్తముని కృపాధీనురాలై యిపుదు**
**లావణ్యవతికి నుల్లంబు తిరమాయ** ॥ఇది॥

పతితో కలసి ఉన్నప్పుడే సతికి సౌభాగ్యం. అది తపస్సుచేసి సాధించుకునే వైభవంతో సమానమైంది. స్త్రీకి దీనికి మించినది మరొకటేముంటుంది? మోహాపేక్షలు విడిచిన పరమ యోగి వలె ఆమె మోహాపేక్షలన్నీ ఇతర వస్తుగతము కాకుండా పతియందే పర్యవశించినపుడు దానికి ఫలితంగా లభించేది శాంతస్థితి. ఇది కామ వాసనా దూషితం కాని అనిర్వచనీయ స్థితి. విభుని వలన కలిగే 'పరవశానంద సంపద' వల్ల ఆమె హృదయం కృతార్థతను పొందుతుంది. యోగి పొందిన నిశ్చల భావం కలుగుతుంది. మనస్సు గెలుపుననుభవిస్తుంది. ప్రవృత్తి యోగం నుండి నివృత్తి యోగానికి మరలిన పరమయోగి స్థితి ఇది. లౌకిక స్థితిని దాటి ఆత్మలో నాయకుని ప్రతిబింబింపజేసుకున్న నాయికకు ఉల్లము తిరమవుతుంది. ఆమె లావణ్యవతి. ఆ లావణ్యంతో నాయకుని ఆకర్షించి ఆయన అనురాగాన్ని పొందింది. 'కృపాధీనత' అనేది యోగికీ అవసరమే. ఈరంగా ఈ సంకీర్తనలో యోగికి, నాయికకు చిత్తస్థాయికి సంబంధించిన అభేదం కనిపిస్తున్నది. ఆ యోగి, ఆ నాయక ఇద్దరూ ఒకరే. ఆ ఇద్దరూ అన్నమయ్యే. ఈ కవిత ద్వారా ఆ లావణ్యవతికి ఉల్లం తిరంకావడమేకాదు అన్నమయ్య ఉల్లం తిరంకావడం విశేషం. పరమాత్మ సాక్షాత్కారం కోసం చేసే ప్రయత్నం మొదట ప్రేమతోనే ప్రారంభమవుతుంది. భక్తి ప్రేరూపమే గదా! కంసారి కరుణను కవితద్వారా సాధించాడు అన్నమయ్య. ఆయన కవితకు మనం ఆపాదించ వలసిన గొప్పతనమిదే. ఇలా శృంగార అధ్యాత్మ భావ సమ్మిళితాలైన సంకీర్తనలనెన్నిటినో ఆయన రచించాడు.

అలంకారాలను సార్థకంగా వాడుకోవడం, తెలుగు నుడులను, జాతీయాలను తవ్వి గంపలకెత్తడం, వాడుక భాషనుండి అనేక అపూర్వ పదాలను ప్రయోగించడం మొదలైనవన్నీ కవితా వైభవాన్ని మదింపు వేసే సంభారాలే. ఈ ప్రయత్నంతో అన్నమయ్య కవితను చూడడం ఒక పెద్ద పరిశోధన. ఈ దిశగా పరిశోధన

జరుగుతూనే ఉంది. పరిశోధకులనేకులు తాళ్ళపాక వాఙ్మయంలోని పద మాణిక్యాల నిగనిగలను పరికిస్తూనే ఉన్నారు. ఇదొక్కటే అన్నమయ్య కవితను మదింపు వేయలేదని నా అభిప్రాయం. అనేక మంది తెలుగు కవులకు అలవడని అపురూపమైన భావుకత ఆయనది. ఆయన భావనలో ఒక చమత్కారం ఉంటుంది. ఒక సార్థకత ఉంటుంది. ఒక సమన్వయముంటుంది. అది పఠిత మనసులో ఆనందంగా మారుతుంది. ఊహా వైచిత్రితితోపాటు కార్యకారణ సమన్వయం కూడా కనిపించే ఒక సంకీర్తనను ఉదాహరణగా చూద్దాం-

**ఈకెకు నీకుదగు నీడు జోడులు**
**వాకుచ్చి మిమ్ముఁ బొగడ వసమయొరులకు ॥పల్లవి॥**

**జట్టిగొన్న నీదేవులు చంద్రముఖి గనుక**
**అట్టె నిన్ను రామచంద్రుఁడన దగును**
**చుట్టమై కృష్ణ వర్ణపు చూపుల యాపె గనుక**
**చుట్టుకొని నిన్ను కృష్ణుడ వనదగును ॥ఈకె॥**

**చందమైన వామలోచన యాపె యౌఁగనుక**
**అందరు నిన్ను వామనుడన దగును**
**చెంది యాకె యప్పటికిని సింహమధ్య గనక**
**అంది నిన్ను నరసింహుడని పిల్వదగును ॥ఈకె॥**

ఈ సంకీర్తనలో నాయికా నాయకుల అనురూప్యం చిత్రితమైంది. వీరిద్దరి మధ్య ఈడూ జోడూ చక్కగా ఉందట. ఇందులో కొట్టవచ్చినట్లు కనిపించేది కారణం కాని దానివల్ల కార్యం జరగదు. నాయిక చంద్రముఖి. కనుక నాయకుడు రామచంద్రుడయ్యాడు. ఆమె చూపులది కృష్ణ వర్ణం కనుక ఆయన కృష్ణుడయ్యాడు. ఆమె వామలోచన గనుక ఆయన వామనుడయ్యాడు. ఆమె సింహమధ్య గనుక ఆయన నరసింహుడయ్యాడు. కారణం లేకుండా కార్యం కలిగినట్లు చెపితే 'విభావన' అలంకారమవుతుంది. అన్నమయ్య ఈ అలంకార సహాయంతో ఊహా వైచిత్రిని

సాధించినాడంటే సరిపోతుందా? సరిపోతుందనుకుంటే ఆయన మామూలు కవిమాత్రమే. ఈ సంకీర్తనలో అన్నమయ్య విభావనాలంకారం మూలంగా రెండు ప్రయోజనాలను సాధించాడు. ఒకటి - ఆమె ఆయనకు తగినది, ఆయన ఆమెకు తగినవాడు. రెండు - ఆమెగుణం ఆయనకు రావడం. ఇందులో కనిపించే మరొక సొగసు రెండురకాల వర్ణనలు శరీరగతంగా సాగడం. ఈ జంటను పొగడడం ఎవరికీ సాధ్యం కాదనడంలో వారిది దివ్యమైన జంట అని చెప్పకనే చెప్పినట్లవుతున్నది.

ఇలాంటి అనేక సంకీర్తనలలో కనిపించే అన్నమయ్య భావుకత ఆయననొక రససిద్ధుడుగా, జరా మరణములు లేని కవిగా రూపొందించింది. తరువాత వారెందరో ఆయన భావాలను పట్టుకొన్నారు. అయినా ఆయన లాగా రసశిల్పులు కాలేక పోయారు.

# తాళ్లపాక పెద తిరుమలయ్య సుదర్శన రగడ

పెద తిరుమలయ్య రచనలలో సుదర్శన రగడ ఒక ప్రత్యేకతను పొందిన రచన. తాళ్లపాక కవులకు వైష్ణవాచార్యులలో రామానుజాచార్యుల వారిమీద అచంచల భక్తి ప్రపత్తులున్నాయి. రామానుజులవారి రచనలను వీళ్లంతా చదివిన వాళ్లే. ఆళ్వారుల, మిగిలిన ఆచార్యుల ప్రభావం తాళ్లపాక కవుల మీద ఉంది. వైష్ణవ సంప్రదాయానికి చెందిన వివిధాంశాలను వీళ్లు తమ రచనలలో ప్రస్తావించడమేగాక సరైన వివరణలు కూడా ఇచ్చారు. ఆళ్వారుల పాశురాలలో వైష్ణవ సంప్రదాయ సూత్రీకరణ జరిగింది. ఈ సూత్రీకరణను తమ స్తోత్ర సాహిత్యంలో విపులంగా వివరించినవారు ఆచార్యులు. వీళ్ల ఆలోచనలో వైకుంఠం నిత్యవిభూతి. భూలోకంలో నిత్య విభూతి అంశను పొందిన క్షేత్ర రాజం శ్రీరంగం. వైష్ణవుల శరణాగతి మార్గం శ్రీరంగధామం నుండే అవతరించింది. ఈ మూడు విషయాలమీద రామానుజులవారు గద్యత్రయాన్ని రచించారు. అవే వైకుంఠ గద్య, శ్రీరంగ గద్య, శరణాగతి గద్యలు. ఈ గద్యత్రయంలో విశిష్టాద్వైత సంప్రదాయ విషయాలు ముఖ్యంగా కనిపిస్తాయి. స్వామివారి అసంఖ్యాక కల్యాణ గుణాలతోపాటు ఆయన ధరించే వివిధ ఆయుధాల స్వరూప స్వభావాలు కూడా ప్రసక్తాను ప్రసక్తంగా ఉటంకింప బడినాయి. ధర్మసంస్థాపనలో సుదర్శన చక్రానికి ఎంతో ప్రాముఖ్యం ఉండడం వల్ల అనేకులు దీనిని అనేక రకాలుగా స్తుతించారు. తత్ప్రభావితుడైన పెద తిరుమలయ్య సుదర్శన చక్రాన్ని రగడలో స్తుతించాడు. రగడ ఒక దేశీయ ఛందో భేదం.

శ్రీమహావిష్ణువుకు శంఖం, చక్రం, ఖడ్గం, గద, బాణం అనే పంచాయుధా లున్నాయి. వీటికి వేరు వేరుగా పేర్లు, ప్రతీకలు ఉన్నాయి. పాంచజన్యం, సుదర్శనం, నందకం, కౌమోదకి, శార్ ఙ్గం అనేవి ఈ ఆయుధాలకు వరుసగా పేర్లు. పాంచజన్యం అహంకారానికి, సుదర్శనం మనస్సుకు, నందకం అధ్యాత్మ విద్యకు (జ్ఞానస్య ఖడ్గ రూపత్వమ్), కౌమోదకి బుద్ధికి, శార్ఙ్గం ఇంద్రియాలకు ప్రతీకలుగా చెపుతారు. ఈ ప్రతీకలన్నీ మనిషి జీవితంలోని వివిధ అంశాలను తెలుపుతున్నాయి. ఇవన్నీ విశ్వవ్యాపకుడైన నారాయణుని ఆయుధాలు కావడంలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఆయుధాల స్వరూప స్వభావాలను పరిశీలిస్తే సృష్టి సమస్తం శ్రీమన్నారాయణుని స్వాధీనంలో ఉన్నట్లు అర్థమవుతుంది. ఆయుధాల అంశలను కలిపిచూస్తే పరమాత్మ స్వరూపం కనిపిస్తుంది. స్వామి ఇచ్ఛానుసారం ఇవి పనిచేస్తాయి. సృష్టిలోని అజ్ఞానాన్ని, అధర్మాన్ని ఛేదించి జ్ఞానాన్ని ధర్మాన్ని దీపింప జేయడం ఈ ఆయుధాల తత్త్వం. విష్ణువు ఆయుధాలను దేవతలుగా మూర్తిమత్వం కల్పించుకొని పూజించడం శ్రీవైష్ణవం లోని ఒక అంశం. ఆళ్వారుల జీవితాలను పరిశీలిస్తే స్వామివారి ఆయుధాంశలతో వాళ్లు అవతరించినట్లు తెలుస్తున్నది.

| **ఆయుధాంశం** | **అవతరించిన ఆళ్వార్** |
|---|---|
| పాంచజన్యం | పొయిగై ఆళ్వార్ |
| సుదర్శనమ్ | తిరుమలేశాళ్వార్ |
| నందకం | పేయాళ్వార్ |
| కౌమోదకి | భూతాళ్వార్ |
| శార్ఙ్గం | తిరువేంగళాళ్వార్ |

శ్రీమన్నారాయణుని సేనాని విష్వక్సేనుని అంశతో నమ్మాళ్వార్, గరుత్మంతుని అంశతో పెరియాళ్వార్, ఆదిశేషుని అంశతో రామానుజాచార్యులవారు, కౌస్తుభరత్నం అంశతో కులశేఖరాళ్వార్ అవతరించినట్లు వైష్ణవ సంప్రదాయం. ఆయా యంశలతో జన్మించిన ఆళ్వార్లు దివ్యాయుధాలను దేవతామూర్తులుగా భావించి స్తుతించారనడం

పునరుక్తం. స్వామి ధర్మసంస్థాపనం చేసింది సుదర్శన చక్రంతోనేనని చెప్పడానికి అనేక ఆధారాలున్నాయి. అన్ని పురాణాలటుంచి శ్రీమద్భాగవత పురాణంలోనే సుదర్శన చక్రం నిర్వహించిన ఘనకార్యాలెన్నో ఉన్నాయి. తనకంటె ముందు ప్రచారంలో ఉండిన పూర్వ రచనలనెన్నిటినో చూడడం వల్ల, వైష్ణవ సంప్రదాయంలో పంచాయుధాల ప్రాధాన్యతను గమనించడం వల్ల, ముఖ్యంగా గద్యత్రయ ప్రభావం తనమీద ఉండడం వల్ల పెదతిరుమలయ్య సుదర్శన రగడను రచించాడని భావించవచ్చు.

## సుదర్శన చక్రం పవిత్రత - ప్రాధాన్యత

శ్రీ మహావిష్ణువు చేతిలో ఉన్న చక్రానికి సుదర్శనమనే పేరుందని, అది స్వామివారి సంకల్ప శక్తికి క్రియారూపమని, సృష్టి అంతటా సంచరించి చైతన్యాన్ని కలిగించే శక్తి దీనికుందని అహిర్బుధ్న్య సంహిత పేర్కొంటున్నది. పరబ్రహ్మ స్వరూపుడైన స్వామివారి అచ్యుతమైన సంకల్ప శక్తికే సుదర్శనమని పేరున్నట్లు కూడా ఈ సంహితలో ఉంది. తమిళ వైష్ణవ సంప్రదాయం దీనిని సుదర్శన చక్రత్తాళ్వార్‌గా గుర్తించింది. ఈ సుదర్శనాన్ని పరమ పురుషుడుగా గుర్తించారు ఆళ్వారులు ఆచార్యులు. సకల సృష్టి రక్షణ భారాన్ని ఈ సుదర్శన పురుషుని కప్పగించి దివ్య దంపతులైన లక్ష్మీనారాయణులు విలాస వంతులుగా ఉంటారని వైష్ణవుల అభిప్రాయం.

**'యస్మిన్విన్యస్యభారం విజయని జగతాం జంగమ స్థావరాణాం**
**లక్ష్మీనారాయణాఖ్యం మిథున మనుభవ త్యద్యుదారా న్విహారాన్**
**ఆరోగ్యం భూతి మాయుః కృత మిహ బహునా యద్య దాస్థా పదం వః**
**తత్తత్సద్య స్సమస్తం దిశతు స పురుషో దివ్యహేత్యక్ష వర్తీ'**

కూరేశ మిశ్రుల సుదర్శన శతకంలోని పైశ్లోకం ఈ విషయాన్ని నిరూపిస్తున్నది. దివ్యాయుధమైన సుదర్శన చక్రం మధ్యలో గల దివ్యపురుషుడు (సుదర్శనుడు) మీకు ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆయువు మొదలైనవే గాక మీ కోరికలకు లక్ష్యమైన ప్రతిదానిని ప్రసాదించుగాక అని ఈ శ్లోక భావం.

పరబ్రహ్మ సంకల్పశక్తి అవ్యయం అచ్యుతం. అదే సుదర్శనం. పాంచ రాత్రాగమంలో సర్వేశ్వరుని సంకల్పశక్తి సుదర్శన చక్రంగా ఉన్నట్లు చెప్పబడింది. సుదర్శన చక్రం కాలాన్ని నియత్రిస్తుందని కూడా పురాణకథనం. (ఋతుస్సుదర్శనః కాల ఇతి దిగ్బంధః). సనకసనందనాది దివ్యసూరుల వలె సుదర్శనం కూడా నిత్య విభూతిలో ఉంటూ స్వామి దివ్యమంగళ విగ్రహ సౌందర్యాన్ననుభవిస్తూ ఇతరుల నుండి అపాయం రాకుండా రక్షిస్తుంటుందని కూడా భక్తుల విశ్వాసం. స్వామి చెయ్యే చక్రం. చక్రమే చెయ్యి. శంఖు చక్రాలున్న స్వామిని పరతత్త్వంగా భావించడం ఉంది. అందువల్ల చక్రానికి కూడా పరతత్త్వ చిహ్నమని పేరుంది. చక్రం స్వామికి ఒక అందం. ఒక అలంకారం. పంచాయుధ స్తోత్రంలో మొదటనే సుదర్శన చక్ర ప్రపత్తి ఉంది. అందులోని మొదటి శ్లోకమిది.

**స్ఫురత్సహస్రార శిఖాతి తీవ్రం**
**సుదర్శనం భాస్కరకోటి తుల్యం**
**సురద్విషాం ప్రాణ వినాశి విష్ణోః**
**చక్రం సదాఽహం శరణం ప్రపద్యే**

వేయి ఆకులనెడి జ్వాలా శిఖలతో కోటి సూర్యుల వెలుగుతో రాక్షసులను నాశనం చేసే విష్ణుచక్రాన్ని శరణు పొందుతున్నానని పై శ్లోక తాత్పర్యం. సుదర్శన షట్కమ్ లోని మొదటిశ్లోకంలో కూడా సహస్రాదిత్యుల వెలుగు కలిగి వేయి అంచులు గలిగిన సుదర్శనానికి ప్రణమిల్లుతున్నానని చెప్పబడింది. ఇలాగే వేదాంత దేశికుల సుదర్శనాష్టకంలో కూడా సుదర్శన స్వరూప స్వభావాలతోపాటు జగదుద్ధరణ, ధర్మప్రతిష్ఠాపనాది విషయాలు స్పృశింపబడినాయి.

## సుదర్శనం - ఆళ్వారులు

ఆదిశేషుడు, గరుడుడు, విష్వక్సేనుడు ఇత్యాది నిత్య సూరులతోపాటు సుదర్శనుడు కూడా నిత్య విభూతికి చెందినవాడని ఆళ్వారులు విశ్వసించారు. సర్వేశ్వరుని పంచస్థితులైన పర వ్యూహ విభవ అంతర్యామి అర్చా తత్త్వాలతో సుదర్శనునికి సంబంధం ఉంది. ఈ అయిదు అంశాల వివరణలను పరిశీలిస్తే

నిత్య సూరత్వం పొందిన సుదర్శనం ప్రమేయం తప్పనిసరిగా ఉంటుంది. పర స్థితిలో ఉండిన సర్వేశ్వరుడు వైకుంఠం నుండి గజేంద్రుని రక్షించడానికి వచ్చాడు. వ్యూహ స్థితిలో దేవాసుర యుద్ధాలు, మధుకైటబ సంహారాది సంఘటనలున్నాయి. స్వామి నృసింహుడుగా అవతరించిన విషయం విభవ స్థితికి చెందినదని పెరియాళ్వార్, నమ్మాళ్వార్ తమ పాశురాలలో కీర్తించారు. గజేంద్ర మోక్షణ సందర్భంలో మకరిని సంహరించింది, దేవాసుర యుద్ధాలలో దేవతలకు విజయం సాధించి పెట్టింది సుదర్శన చక్రమే. పంచాయుధాలలో స్వామి చక్రం వాడినంత తరచుగా ఇతరాయుధాలు వాడినట్లు కన పడదు. హిరణ్య కశిపుని వక్షం చీల్చిన వాడి గోరులో చక్రం ప్రవేశించిందని నమ్మాళ్వార్ చెపుతారు. వామనావతార సందర్భంలో శుక్రుని కన్ను పోవడానికి ఉపయోగించిన దర్భమొనలో కూడా చక్రం ప్రవేశించిందని పొయిగై ఆళ్వార్. తిరుమంగై ఆళ్వార్ గానంచేశారు. రామావతార సమయంలో శూర్పణఖ నాసికాఛేదం చేసింది, కృష్ణావతార కాళియ మర్ధన, గోవర్ధన పర్వతోద్ధరణ లను చేసింది సుదర్శనమేనని నమ్మాళ్వార్ 'పెరియ తిరువందాది'లో స్పష్టం చేశారు. ఇలాగే కృష్ణావతారంలో దుర్జనులనేకుల తలలు తరిగినది సుదర్శన చక్రమే నని ఆయా కథలను బట్టి తెలుస్తుంది. శ్రీరంగం లోని రంగశాయి చేతి లోని చక్రం, తిరుమల శ్రీనివాసుని చేతిలోని చక్రం అర్చాస్థితికి సంబంధించిన విషయమని ఆళ్వార్లు విశదం చేశారు. ఊయలలో ఊగుతున్న చిన్నికృష్ణుడు యశోదకు రెండు చేతులతో కనిపించాడు. పెరియాళ్వార్‌కు మాత్రం నాలుగు చేతులతో కనిపించాడు. పైగా శంఖచక్రాలు ధరించి కనిపించాడు. శ్రీరంగ దేవాలయంలోని మూలవిరాట్టుకు రెండుచేతులున్నా తిరుప్పానాళ్వార్ నాలుగు చేతులున్నట్లు, రెండుచేతులతో శంఖచక్రాలు ధరించినట్లు కీర్తించారు. కంచి, ట్రిప్లికేన్, శ్రీరంగం, కుంభకోణం, తిరుక్కోవిలూర్, శ్రీవిల్లిపుత్తూర్ దేవాలయాలలోని అర్చామూర్తి చక్రం ధరించి కనిపిస్తుంది.

సుదర్శన చక్రం మధ్యలో కనిపిస్తున్న పురుషుని సుదర్శన పురుష మూర్తిగా గుర్తించిన వాళ్ళు ఆళ్వార్లు. ఆ మూర్తి అర్చామూర్తితో సంబంధం కలిగి ఉండడం వల్ల సుదర్శనాళ్వార్‌గా ప్రసిద్ధి ఏర్పడింది. ఆళ్వార్ అనేమాటకు స్వామిసేవలో

తరించేవాడని అర్థముండటం వల్ల, సుదర్శనమూర్తి స్వామి సేవలో ఉన్నవాడు కావడం వల్ల సుదర్శనుడు ఆళ్వార్‌గా ప్రసిద్ధి పొందాడు. భగవంతుని లక్షణాలు భాగవతులలో అన్నీ గాకపోయినా కొన్నైనా ఉంటాయని, అందువల్ల భాగవతుల సేవ కూడా గొప్పదేనని వైష్ణవ సంప్రదాయం. అలాంటప్పుడు సుదర్శనానికి దివ్యత్వ ముండడంలో వింతలేదు. పైగా సుదర్శనుడంటే విష్ణువే కదా.

## సుదర్శనం – తెలుగు కవులు

ఆళ్వారుల తరువాత సుదర్శనాన్ని గురించి సంస్కృత సాహిత్యంలో గల విషయాలను పరిశీలించాలి. వైష్ణవ స్తోత్ర సాహిత్య ప్రేరణతో పెద తిరుమలయ్య సుదర్శన రగడ రచించిన విషయం సత్యం కావడం వల్ల సంస్కృత సాహిత్య ప్రసక్తి అవసరమని పించలేదు. పరిశీలిస్తే చాల విషయాలుంటాయి. తెలుగు సాహిత్యంలో నన్నయ భారతం మొదలుకొని అనేక గ్రంథాలలో సుదర్శన చక్ర ప్రసక్తి కనిపిస్తున్నది. సభాపర్వంలోని శిశుపాల వధ సందర్భంలో నన్నయ శ్రీకృష్ణుని 'చక్రధరుడ'ని సంబోధించాడు. శిశుపాలుడు చేసిన అవమానం సహించలేని శ్రీకృష్ణుడు వానిని చక్రంతో సంహరిస్తాడన్న స్ఫురణ ఈ సంబోధనలో ఉంది. **'అనల శిఖాలి దూల దనుజాంతక చక్రము'** (సభా. 2-68) తో శిశుపాలుని శిరమును తురిమినాడు కృష్ణుడు. 'దనుజాంతక' అన్నది గమనింప దగిన మాట. దనుజులంటే రాక్షసులు. వీళ్లు అధార్మనికి ప్రతీక. చక్రం అధర్మాన్ని ఛేదిస్తుందన్నది ఈ మాటకు గల అంతరార్థం.

నాచన సోముని ఉత్తర హరివంశంలో నరకాసురవధ, పౌండ్రక వాసుదేవుని సంహరణ సందర్భాలలో చక్ర ప్రసక్తి ఉన్నది. కాశీపతి ద్వారకపై కృత్యను పంపించిన సందర్భంలో శ్రీకృష్ణుడు కృత్యపై చక్ర ప్రయోగం చేసినట్లుంది. కృత్యపై లంఘించిన చక్ర స్వరూప స్వభావాలను గురించి సోమన దీర్ఘంగా వర్ణించాడు. పోతన చేసిన చక్ర స్తవం భాగవతంలోని అంబరీషోపాఖ్యానంలో విపులంగా ఉంది. ఈ చక్రస్తుతి అంబరీషుడు చేసినట్లుంటుంది. సుదర్శన చక్రం ఇంద్ర శాత్రవ ధూమకేతువు. ధర్మసేతువు. విమలరూపం. విశ్వదీపం (నవమస్కంధం. 134).

**" నీవు పావకుడవు నీవ సూర్యుండవు నీవచంద్రుడవు నీవ జలము**
**నీవు నేలయునింగి నీవ సమీరంబు నీవ భూతేంద్రియ నికరములును**
**నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును నీవ యజ్ఞంబును నీవ ఫలము**
**నీవ లోకేశులు నీవ సర్వాత్మవు నీవ కాలంబును నీవ జగము**
**నీవ బహు యజ్ఞ భోజవి నీవ నిత్యమూలతేజంబు...."(నవమ-128)**

ఈ పద్యం లోని విషయాన్ని పరిశీలిస్తే విష్ణు చక్రానికి గల సర్వవ్యాపకత్వం అర్థమవుతుంది. ఆముక్తమాల్యదలో రాయలవారు చక్రాన్ని సుదర్శన దేవుడుగా భావించారు. ఆయన దృష్టిలో పంచాయుధాలు దేవతలు. వీటిలో చక్రానికి గల ప్రాధాన్యత ఎక్కువ. రాయలు పరమ వైష్ణవుడు. ఆయన అలా భావించడంలో వింతలేదు. తెలుగు కవులందరూ చక్రమంటే రాయలు సుదర్శన దేవుడన్నాడు.

**అడరు గళాస్ర ధారలు మహోముఖ వాంత సుధాంబు ధారలు**
**న్నొదవగు వహ్నికీలములుఁ బొంగునుగాఁ బెఱదైత్య కోటికి**
**న్నెడిదవుఁ గిన్కతో నెసరువెట్టిన పెద్ద పనంటిఁ బోలె నె**
**క్కుడు వెస రాహు మస్తకముఁ గొన్న సుదర్శన దేవుగొల్చెదన్**
**(ఆముక్తమాల్యద 1-9)**

ఈ పద్యంలో రాయలు రాహు మస్తకాన్ని ఖండించిన సుదర్శన చక్రాన్ని స్తుతించారు. ఈ రచనల నన్నిటిని పెదతిరుమలయ్య పరిశీలించి ఉండడానికి అవకాశముంది. తెలుగు గ్రంథాలలో కనిపిస్తున్న సుదర్శన సంబంధి విషయాలకు సంస్కృత స్తోత్రసాహిత్యం మూలమైనా కొన్ని అదనపు విషయాలు కూడా లేకపోలేదు. ఈ విషయాలన్నీ సుదర్శన రగడలో ఉన్నాయి.

## సుదర్శన రగడ

సుదర్శనం ఒక తత్త్వానికి ప్రతీక. అదే విష్ణుతత్త్వం లేక సర్వవ్యాపకత్వం. సుదర్శన అంటే బాగా దర్శించేదని అర్థం. దేనిని అంటే విష్ణుతత్త్వాన్ని. పెద తిరుమలయ్య అష్టోత్తర శతపంక్తులలో ఈ రచన చేశాడు. అన్నమయ్య పలు తావులలో చక్రస్తుతి చేశాడు. అన్నమయ్య చేసిన చక్రస్తుతి రూపుదాల్చిన ఒక సంకీర్తన ఇది-

నమో నమో దానవ వినాశ చక్రమా
సమర విజయమైన సర్వేశు చక్రమా ॥పల్లవి॥

అట్టె పదారు భుజాల నమరిన చక్రమా
పట్టిన ఆయుధముల బలుచక్రమా
నెట్టిన మూడు గన్నుల నిలిచిన చక్రమా
అట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా ॥నమో॥

అరయ నారు కోణాల నమరిన చక్రమా
ధారలు వేయింటి తోడ తగు చక్రమా
ఆరక మీదికి వెళ్లే అగ్నిశిఖల చక్రమా
గారవాన నీదాసుల గావవే చక్రమా ॥నమో॥

రవి చంద్రకోటి తేజో రాశియైన చక్రమా
దివిజ సేవితమైన దివ్య చక్రమా
తవిలి శ్రీవేంకటేశు దక్షిణ కర చక్రమా
యివల నీదాసులము యేలుకోవే చక్రమా ॥నమో॥

ఈ సంకీర్తనలో కనిపించే చక్రానికి గల లక్షణాలన్నీ సుదర్శన రగడలోనూ కనిపిస్తాయి. ఈ సంకీర్తనలోను, ఆ రగడలోను ప్రారంభంలో భేదమున్నా చివర మాత్రం సామ్యం కనిపిస్తుంది. సంకీర్తనలోని చివరి రెండు పాదాలు '**భావించు సుజన పాలన చక్రము - శ్రీవేంకటపతి చేతిది చక్రము**' అనే రగడ చివరి పాదాలకు చక్కగా సరిపోతాయి.

తాళ్లపాక కవులు చక్రోపాసకులుగా కనిపిస్తారు. వీళ్ల కుటుంబం తిరుపతికి వచ్చినప్పటికే ఇక్కడి గోవిందరాజస్వామి ఆలయంలో, వరదరాజస్వామి ఆలయంలో సుదర్శన స్వామి పూజలందుకొంటున్నట్లుంది. గోవిందరాజస్వామి గుడి పడికావలిగోపురం ఆనుకొని ఉత్తరం వైపున 16 చేతులతో ఉన్న చక్రత్తాళ్వార్ ప్రతిమను ఇప్పుడు కూడా భక్తులు విశేషంగా కొలుస్తున్నారు. తిరుమలలో బ్రహ్మోత్సవాలు మొదలైన తరువాత ఉత్సవం చివరిరోజున సుదర్శన చక్రాన్ని

అవబృధ స్నానార్థం ఆళ్వార్ తీర్థానికి తీసుకొని పోయే సంప్రదాయం మొదలైంది. 1531 నాటి దేవస్థాన శాసనం ప్రకారం అచ్యుత రాయలకు పుణ్యంగా ఆళ్వార్ తీర్థానికి నాలుగు వైపుల సుదర్శన చక్రాంకిత శిలలు నెలకొల్పబడినాయి. ఇది తాళ్లపాక వారి ప్రోత్సాహంతో జరిగింది. ఉత్సవ సమయాల్లో చక్రత్తాళ్వారుల తిరుమంజనానికి, తిరుమంజన వేళల వేదాంతదేశిక చక్రస్తవ శ్లోకాల పఠనానికి తాళ్లపాకవారు ఏర్పాటుచేసిననట్లు 1554 నాటి శాసనంలో ఉంది. ఈ శ్లోకాలను పఠించడానికి 6 సువర్ణ రేఖల జీతంతో పొత్తపి వెంగళయ్యను చినతిరుమలయ్య కుమారుడు వెంగళనాథయ్య ఏర్పాటుచేశాడు. సుదర్శన రగడ కూడా తిరుమంజన వేళల గానం చేయడానికే రచింపబడి ఉంటుంది. సంకీర్తనల్లాగా ఇదికూడా కీర్తితం కావాలనే తలంపు పెదతిరుమలయ్యకు కలిగి ఉంటుంది. ఈ విషయాలను బట్టి చూస్తే సుదర్శన రగడ 1531కి ముందే రచింపబడి ఉండాలి.

## సుదర్శన షట్కమ్ - సుదర్శన రగడ

స్వామి మహత్తు పంచాయుధాలకుంది. ఆయుధాలలో సుదర్శనం మరీ మహత్తు గలది. శ్రీవైష్ణవులు స్వామిని శరణు పొందినట్లే సుదర్శనాన్ని కూడా శరణుపొందినారు. చక్రాన్ని శరణాగతి పొందిన విషయాన్ని వివరించే సుదర్శన షట్కమ్‌లో కనిపించే సుదర్శన చక్ర స్వరూప స్వభావాలను తెలుసుకోవడానికి ఆ యారు శ్లోకాలను చూడాలి.

## సుదర్శన షట్కమ్

**మూలమంత్రం - ఓం సహస్రార హుంఫట్ స్వాహ**

1. సహస్రాదిత్య సంకాశం సహస్రవదనం పరం
   సహస్రదో స్సహస్రారం ప్రపద్యేఽహం సుదర్శనమ్
2. హసంతం హార కేయూర మకుటాంగద భూషణైః
   శోభనైర్భూషిత తనుం ప్రపద్యేఽహమ్ సుదర్శనమ్
3. స్రాకార సహితం మంత్రం వదంతం శత్రునిగ్రహమ్
   సర్వరోగ ప్రశమనం ప్రపద్యేఽహమ్ సుదర్శనమ్

4. రణత్కిఙ్కిణి జాలేన రాక్షసఘ్నం మహాద్భుతం
వ్యాప్తకేశం విరూపాక్షం ప్రపద్యేऽహమ్ సుదర్శనమ్

5. హుంకార భైరవం భీమం ప్రణతార్తి హరిం ప్రభుం
సర్వపాప ప్రశమనం ప్రపద్యేऽహమ్ సుదర్శనమ్

6. ఫట్కారాంత మనిర్దేశ్య దివ్యమంత్రేణ సంయుతమ్
శుభం శివం ప్రసన్న వదనం ప్రపద్యేऽహమ్ సుదర్శనమ్

ఏతైః షడ్భిః స్తుతోదేవః ప్రసన్నః శ్రీ సుదర్శనః
రక్షాం కరోతి సర్వాత్మా సర్వత్ర విజయీభవతే

సుదర్శన చక్రం వెయ్యి ఆదిత్యుల ప్రకాశం గలది. వెయ్యి అంచులు గలది. వెయ్యి బాహువులు గలది. హారకేయూరాది భూషణ శోభగలది. వేయిసార్లు మూల మంత్ర జపం ద్వారా శత్రువులను నిగ్రహించ గలది. సర్వరోగాలను తుడిచిపెట్టగలది. తన శబ్దం చేతనే రాక్షసుల హతం చేయగలది. విశ్వవ్యాపకం గలది. సూర్యచంద్ర అగ్నులను అక్షులుగా గలది. ప్రణతుల ఆర్తిని పోగొట్ట గలది. శుభంకరమైనది. సుదర్శానికి గల ఈ లక్షణాలన్నీ సుదర్శన రగడలో కనిపిస్తాయి.

1. పెదతిరుమలయ్య సుదర్శన రగడలో చెప్పిన విషయాలివి : ఈ చక్రం ప్రణవాక్షర సంయుక్తం. ఫట్కార రవ పరబ్రహ్మం. మిహిర తుహినకర మిళితం. జ్వాలాకేశ విశాలం. మంత్రాధిరాజ (ఓం నమో నారాయణాయ) మానితం. వేయంచుల సమన్వితం. సుదర్శన మంత్ర (ఓం సహస్రార హుంఫట్ స్వాహా) యుక్తం. ఈ లక్షణాలన్నీ సుదర్శన షట్కం నుండి గ్రహింపబడినవే.

2. సుదర్శన చక్ర స్వరూపం – 108 రగడ పంక్తులలో స్వరూపానికి సంబంధించిన అంశాలను క్రోడీకరిస్తే ఇలా ఉంటాయి.

సాంక మధ్య వలయాంతర చక్రము
పూర్వకోణ సంపూర్ణము చక్రము

**గురుగతి రెండవ కోణపు చక్రము**
**గుణయుత చతుర్థ కోణపు చక్రము**
**షట్కోణాంత విశాలపు చక్రము**
**షోడశ భుజ సంశోభిత చక్రము**
**యంత్ర పీఠ మధ్యాసిత చక్రము**
**వలయము మీదట వలగొను చక్రము**
**బలవదష్టదళ పద్మపు చక్రము**
**ఎడలకేసరము లెనసిన చక్రము**
**షోడశ దళముల సొంపగు చక్రము**
**వీడని కీసర వితతుల చక్రము**
**మొగి మూడు వలయములు గల చక్రము**

సుదర్శన చక్ర నిర్మాణానికి సంబంధించిన ఈ పంక్తులను పరిశీలిస్తే చక్రనిర్మాణం ఇలా ఉంటుందనిపిస్తుంది. మూడు వలయాలు గల ఈ చక్రంలోపల ఆరుకోణాల ఆకారం ఉంటుంది. ఆరు కోణాలచుట్టూ షోడశ భుజాలుంటాయి. మధ్యలో యంత్రపీఠముంటుంది. ఇది అష్టదళ పద్మాకారంలో కనిపిస్తుంది. దళాల మధ్యభాగాలలో గల కేసరాలు చలించినట్లు కనిపించడం వల్ల పద్మదళాలు తిరుగుతూ ఉన్నట్లు కనిపిస్తుంది. అందువల్ల చక్రం వేయివిధాలుగా చలిస్తున్నట్లుంటుంది. ఇది స్థూలంగా పరిశీలనకు తోచిన విషయం.

## 3. సుదర్శన చక్ర ప్రభావం

పాషండుల మతాలను ఖండిస్తుంది. రక్షోగణ గళాలను రక్తం సిక్తం చేస్తుంది. దుష్టుల ప్రాణాలను భక్షిస్తుంది. చీకటిని నశింపజేసి భూమ్యాకాశాల నడుమ దట్టమైన కాంతిని వ్యాపింప జేస్తుంది. వేదరాశిని ఉద్ధరించి లయకాలంలో యమభావం పొంది సమస్తాన్ని నశింపజేస్తుంది. పాపాలను పరిహరిస్తుంది. వజ్రాయుధాలను వర్షిస్తుంది. బహ్మాది దివిజులను పాలిస్తుంది. భక్తజనులను పోషిస్తుంది. రాక్షసుల ఆగడాలను అణచివేస్తుంది. దివ్యమునివరులకు ధ్యేయం. సుజనులను పరిపాలిస్తుంది.

## 4. వివిధ ఆయుధాల సమన్వయ రూపం

**చక్రం కున్తం కృపాణం పరశు హుత వహా అంకుశ దండశక్తీ**
**శంఖం కోదండ పాశౌహల ముసల గదా వజ్ర శూలాంశ్చ హేతీన్**
**దోర్భిః సవ్యాపసవ్యైః దధత్ అతుల బల స్తమ్భితారాతి దర్పైః**
**వ్యూహస్తేజోభిమానీ నరక విజయినో జృమ్భతాం దేవః**

ఈ శ్లోకంలో పంచాయుధాలనే గాక ఇతర దేవతలు వాడే ప్రసిద్ధ ఆయుధాలను రెండు చేతులతో ధరించి రాక్షస వీరుల దర్పాన్ని అణచి నరకునిపై విజయం పొందిన దేవుని ప్రసక్తి ఉంది. ఈ శ్లోకంలో దర్శనీయమవుతున్న మూర్తి విశ్వరూప ధరుడైన విరాట్పురుషుడు. పురుష సూక్త వర్ణనలోని ఒకఅంశం ఈ శ్లోకం.

**అనేక వక్త్రం నయనం అనేకాద్భుత దర్శనమ్**
**అనేక దివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ (భ.గీ. 11-10)**

శ్రీకృష్ణుని విశ్వరూప వర్ణనలోని పైశ్లోకం వివిధ ఆయుధాలను ధరించి కనిపిస్తున్న విషయాన్ని రూపు కట్టిస్తున్నది. వివిధ దేవతల అంశలన్నీ విరాట్పురుషునిలోనే ఉన్నాయని, వాళ్లు ధరించే ఆయుధాల నన్నిటిని ఆయన ధరించి కనిపిస్తున్నాడని అర్థం చేసుకోవాలి.

**దంభోళి నఖర దారుణ చక్రము**
**కాలదండ శత కాండము చక్రము**
**జిహ్వాగ భూషణ జీవిత చక్రము**
**ప్రేంఖత్పరశు విభీషణ చక్రము**
**అసి గదా త్రిశూలాంకుశ చక్రము**
**ముసల పాశ హల మోహన చక్రము**
**లగ్న కుంత శుభ లక్షణ చక్రము**

సుదర్శన రగడలోని పై పంక్తులలో వివిధాయుధాలు చక్రంలో సమన్వయం పొందిన విధం కనిపిస్తున్నది. దంభోళి (వజ్రాయుధం), కాలదండం(యమదండం),

జిహ్వాగ భూషణం (శివుని మెడలోని సర్పం), పరశు (గండ్రగొడ్డలి), త్రిశూలం (శివుని ఆయుధం), ముసలం (హలాయుధం), పాశం (యమపాశం), కుంతం (ఈటె) మొదలైన ఆయుధాలన్నీ సుదర్శన చక్రంలో కలసిపోయి చక్ర తీవ్రతను పెంచాయి.

## 5. సుదర్శన చక్రం - వైరివీరులు

సుదర్శన చక్రం ఖండించిన వైరి వీరులను ఈ రగడలో పెదతిరుమలయ్య ప్రస్తావించాడు. దీనిద్వారా చక్రం ధర్మ సంస్థాపన చేసినట్లు అర్థమవుతుంది.

**నిఘ్నబాణ కర నికరము చక్రము**
**విహ్వాలిత నరక వీరము చక్రము**
**ముష్కర పౌండ్ర నిమూలన చక్రము**
**నక్రకంఠ దళనక్రమ చక్రము**
**త్రిపుర విజయకర తీవ్రము చక్రము**

ఈ ఐదు రగడ పాదాలలో ఐదుగురు వైరివీరులను చక్రం ఖండించిన విషయం వివరింపబడింది. మొదటిపాదంలో బాణాసురుని చేతులను ఖండించిన విషయ ముంది. బాణాసురుడు సహస్ర బాహువులతో శ్రీకృష్ణునితో యుద్ధానికి తలపడి నపుడు సుదర్శనుడు సుదర్శన చక్రప్రయోగం చేశాడు. ఆ చక్రం

**సమసెను బాణాసురుడని**
**యమరులు సంతోష మొంద నఖిలోజ్జ్వలమై**
**యమరారి భుజములన్నియు**
**గొమరారగ నఱికి నఱికి కుప్పలు...'** **(ఉ.హ. 6-221)**

పెట్టింది. శంకరుని ప్రార్థన మీద శ్రీకృష్ణుడు బాణాసురుని క్షమించి వదలిపెట్టగా ఆ దనుజుడు మహాకాళుడనే పేరుతో శివుని సైన్యాధ్యక్షుడయ్యాడు. రెండవ పాదంలో చక్రం నరకాసురుని శిరస్సును ఛేదించిన విషయం ప్రస్తావించబడింది. పౌండ్రక వాసుదేవుని సంహరించిన విషయమున్నది మూడవపాదం. కరూశ దేశాధిపతి

అయిన పౌండ్రక వాసుదేవుడు శ్రీకృష్ణుని వలె శంఖచక్రాది ఆయుధాలు ధరించి తానే నిజమైన వాసుదేవుడనన్న గర్వంతో శ్రీకృష్ణుని తుదముట్టించాలని ద్వారకపై దండయాత్ర చేశాడు. ఆ అపరాధం వల్ల అతడు చక్రంతో ఖండింపబడినాడు. గజేంద్రుని రక్షించడానికి మకరిని ఖండించడం, త్రిపురాసురుల వధలో పాల్గొనడం నాలుగు ఐదు పాదాలలోని విషయాలు. త్రిపురాసుర సంహారంలో ఈశ్వరునికి ప్రాధాన్యత ఉన్నా సుదర్శనుడికి కూడా కొంత భాగస్వామ్యం ఉంది. మయుడు ఇనుము, వెండి, బంగారాలతో కాల గమనం గల మూడు నగరాలను నిర్మించి అసురుల కిచ్చాడు. ఆ నగరాలలో ప్రవేశించి వాళ్లు దేవతలను బాధించడం ప్రారంభించారు. విష్ణువు వాళ్లను తన బాణాలతో కొట్టాడు. దెబ్బదిన్నవాళ్లను మయుడు సిద్ధ రసమున్న ఒక బావిలో ఉంచాడు. ఆ రస ప్రభావం వల్ల ఆ రాక్షసులకు బాధ కలగలేదు. విష్ణువు ధేనువుగా బ్రహ్మ లేగగా వచ్చి ఆ సిద్ధ రసాన్ని పూర్తిగా తాగేశారు. రసం లేకపోవడం వల్ల దనుజులు నిర్బలులైనారు. అప్పుడు శివుడు త్రిపురాలను కూల్చివేశాడు. భాగవతంలోని కథ ఇది. ఈరకంగా త్రిపురాసురల వధలో సుదర్శనుని ప్రచ్ఛన్న హస్తముండినట్లు అర్థమవుతుంది.

## 6. కుండలినీ యోగ సమన్వయం

ప్రతి రచనకు ఒక ప్రయోజనముంటుంది. తాళ్లపాక కవులు చక్రోపాసకులు కాబట్టి చక్రోపాసన ద్వారా భక్తి స్థిరపడి ఆయురారోగ్యాలు కలుగుతాయని భావించి ఉంటారు. సుదర్శన రగడ రచన ద్వారా పెద తిరుమలయ్య ఈ ప్రయోజనాలతో పాటు కుండలినీ యోగసాధనను గురించి కూడా ఆలోచించి నట్లు అర్థమవుతున్నది. కుండలిని యోగంలో ఆరుచక్రాల ప్రసక్తి ఉంది. అవి వరుసగా మూలాధార చక్రం, స్వాధిష్ఠాన చక్రం, మణిపూరక చక్రం, అనాహత చక్రం, విశుద్ధా చక్రం, ఆజ్ఞేయ చక్రం అనేవి. ఆజ్ఞేయ చక్రానికి పైన సహస్రార పద్మం ఉంటుంది. ఈ పద్మం తిరగబడి ఉంటుంది. యోగికి అందులోని మకరందం ఆహారం. మూలాధారంలో కుండలినీ శక్తి మూడు వలయాలుగా ఉంటుంది. ఈ విషయాన్ని స్ఫురింపజేయడానికి పెదతిరుమలయ్య 'మొగి మూడు వలయములు గల చక్రము'

అన్నాడు. యోగి సాధనా బలంతో సుషుమ్న నాడిద్వారా ఆజ్ఞేయ చక్రం వరకు తన ఇచ్ఛాశక్తితో నడిపి సహస్రారంలో లయంచేస్తే ఆత్మజ్ఞానం, ఆత్మానందం కలుగుతాయి. తిరుమల కొండలలో ఏడవ కొండ సహస్రారం. దీన్ని సూచించడానికి **'శ్రీవేంకటపతి చేతిది చక్రము'** అన్నాడు కవి. ఆరు కొండలు మూలాధారం నుండి ఆజ్ఞేయం వరకు. ఏడవ కొండపైన స్వామిదర్శనం లభిస్తుంది. స్వామే చక్రం. చక్రమే స్వామి. స్వామిని దర్శించి నపుడు కలిగే ఆనందం దివ్యానందం. అవధులులేని ఆనందం. తన ప్రాణశక్తిని సహస్రారం దాకా తీసుకొని పోగలిగిన యోగి పొందే ఆనందం. **'బలవదష్ట దళ పద్మపు చక్రము'** అనే పాదంలోని పద్మం సహస్రార పద్మాన్ని సూచిస్తుంది. **'అనఘ చక్ర గాయత్రిక చక్రము'** అన్న పాదంకూడా ఈ విషయానికి పోషకంగానే ఉంది. సాధన ద్వారా యోగి పొందే ఆనందాన్ని భక్తుడు ఏడుకొండలెక్కి ఏడవ కొండపైన గల స్వామిని దర్శించి పొందుతాడు. ఈ విషయాన్నే పెదతిరుమలయ్య నిరూపించాలనుకొన్నది.

## 7. మరికొన్ని విశేషాలు

సుదర్శన చక్రం రుద్రైకాదశ రూపం. హర, బహురూప, త్ర్యంబక, అపరాజిత, వృషాకపి, శంభు, కపర్ది, రైవత, మృగవ్యాధ, సర్వ, కపాలి – ఇవి ఏకాదశ రుద్రరూపాలు. దీనిని బట్టి శివుని లక్షణాలన్ని ఈ చక్రంలో ఉన్నాయని భావించాలి. సుదర్శనం విపుల నవరస నవీనం. చక్రపరంగా రస అనేమాటకు నవరస స్ఫురణ గలదని చెప్పాలి. చక్రాన్ని చూచేవాళ్ల దృష్టిని బట్టి ఎప్పటికప్పుడు నూతనంగా కనిపించడమే గాక శత్రువులకు వీరరస స్ఫోరకంగా, భక్తులకు శాంతి దాయకంగా కనిపిస్తుంది.

**రంజిత పుష్పపరాగము చక్రము**
**సంధ్యారుణ పట సంవృత చక్రము**
**కల్హార మాలికా ధర చక్రము**
**సిల్హధూప సంశ్లిష్టము చక్రము**

ఈ నాలుగు పంక్తులు సుదర్శన చక్ర వర్ణాన్ని తెలియజేయదానికి ఉద్దేశింప బడినాయి. పుష్పపరాగం లేత ఎరుపు రంగులో ఉంటుంది. సంధ్యారుణిమ రంగు అదే. కల్హారం అంటే కొంచం ఎరుపు కొంచం తెలుగు గల సువాసనా భరితమైన కలువ. సిల్హధూపమంటే ఒకరకమైన గుగ్గిలపు పొగ. ఈ వర్ణనను బట్టి సుదర్శన చక్రం తెలుపు మీరిన ఎరుపురంగులో ఉండినట్లు అర్థమవుతుంది.

**'యజ్ఞోవై విష్ణుః'** అని శ్రుతి. యజ్ఞం విష్ణు స్వరూపమేనని అర్థం. యజ్ఞ స్వరూపమే ఆయన అయినపుడు యజ్ఞభోక్త కూడా ఆయనే. చక్రానికి స్వామికి అభేదం కాబట్టి చక్రమే యజ్ఞ ఫలితాలను గ్రహిస్తుందని **'హవ్యకవ్య వివిధాశన చక్రము'** అన్నాడు పెద తిరుమలయ్య. శుభాశుభ హోమాలలో వేల్చిన అశనాన్ని చక్రమే గ్రహిస్తుందని, చక్రాన్ని శ్రీమహావిష్ణువుగానే భావించాలని కవి ఉద్దేశం. విష్ణు సహస్ర నామావళి సృష్టి వ్యాపకత్వానికి సంకేతం. విష్ణువుకు గల వెయ్యి నామాలు సుదర్శన చక్రానికి కూడా సరిపోతాయని పెదతిరుమలయ్య అభిప్రాయం.

**నానావిధ హరినామపు చక్రము**
**వేయు విధంబుల వెలసిన చక్రము**
**వేయంచులు గల విశ్వపు చక్రము**

ఈ మూడుపాదాలు చక్రాన్ని గూడా ఆ పేర్లతో పిలవడానికి అవకాశముందని తెలియజేస్తున్నాయి. చక్రం విశ్వరూపం గలదని, విశ్వవ్యాప్తమైనదని, **'వేయంచులు'** అనడం వల్ల సృష్టి వైశాల్యం స్ఫురిస్తున్నదని అనుకోవచ్చు.

ఇప్పటి వరకు సుదర్శన రగడలోని కొన్ని విశేషాలు మాత్రం వివరింప బడినాయి. చక్రాన్ని గురించి వివరించడమంటే సాక్షాత్తు శ్రీమన్నారాయణుని గురించి వివరించడమే అవుతుంది. ఆయుధాలలో శంఖ చక్రాలు శ్రీవారి దివ్యమంగళ విగ్రహానికి మరింత శోభను కలిగిస్తున్నాయి. స్వామివారిని దర్శించడానికి వచ్చే భక్తులను ఇవి స్వామికి పరిచయం చేస్తున్నాయన్నట్లు కనిపిస్తాయని ఒక ఆళ్వారు అభిప్రాయం. దేవుని కంటె సుదర్శన చక్రానికే భక్త జనుల మీద ప్రేమ అధికమని 'తిరువిరుత్తమ్'లో నమ్మాళ్వారు చెపుతున్నారు (అరుళార్ తిరుచ్చక్కరమ్).

## స్తుతిపరమైన రగడలు

రగడకు పాద నియమం లేదు. వస్తు విస్తృతిని బట్టి ఎన్నిపాదాలైనా ఉండవచ్చు. ప్రబంధాలలో పుష్పాపచయం, వధువుకు తల్లిదండ్రులు కానుకలు ఇవ్వడం వంటి సందర్భాలలో తప్పని సరిగా రగడలే కనిపిస్తాయి. రగడలకు మారుగా వృత్తాలను రాసిన కవులు కూడా కొందరు లేకపోలేదు. భక్తి విషయ ప్రతిపాదనకు రగడ బాగా పనికొస్తుంది. రగడ ఒక దేశీయ ఛందో భేదం. సంస్కృత సాహిత్యంలో కనపడదు. ద్విపద లాగా రెండుపాదాలతో యతి, పాదాది పాదాంత ప్రాసలతో ఉంటుంది. జానపద గేయాలలో విశేషంగా రగడ భేదాలు కనిపిస్తాయి. పెద తిరుమలయ్యకు ముందే స్తుతిపరమైన రగడలున్నాయి. 14వ శతాబ్ది పూర్వార్ధంలో చక్రపాణి రంగనాథుడనే వైష్ణవకవి శివసంబంధమైన రగడలు రచించాడు. ఈ కవి శివ కవియైన పాల్కురికి సోమనతో వాదించి ఓడిపోయి శైవుడుగా మారడం వల్ల ఇలాంటి రగడలు రచించ వలసి వచ్చింది. ఈయన సోమన చేతిలో ఓడిపోయిన విషయం కన్నడ కవులైన విరక్తతొంటెదార్యుని 'సోమనాథ పురాణం' ద్వారా, సిద్ధనంజేశకవి 'గురురాజ చరిత్రం' ద్వారా తెలుస్తున్నది.

పాల్కురికి సోమనతో జరిగిన వాదంలో రంగనాథుడు ఓడిపోయాడు. ఇంటికి వెళ్తున్న దారిలో శ్రీశైలం ఉంది. రంగనాథుడు అక్కడ ఆగి మల్లికార్జున స్వామిని దర్శించుకోకుండా వెళ్లాడు. అందువల్ల అతని రెండు కళ్లు పోయాయి. అహోబిలం చేరుకొని నృసింహ స్వామిని ప్రార్థించాడు. నృసింహస్వామి ఆరోజు రాత్రి రంగనాథుని కలలో కనపడి శివుని గొప్పతనాన్ని గురించి చెప్పారట. రంగనాథుడు శ్రీశైలం వెళ్లి అక్కడి మల్లికార్జునుని పూజించాడు. ఒక కన్ను వచ్చింది. తరువాత పాల్కురికి సోమన క్షమాపణ కోరాడు. రెండవ కన్ను వచ్చింది. ఆ సందర్భంలో రంగనాథుడు ఒక రగడలో దేవుని స్తుతించాడు. ఈ రగడలో ప్రతిపాదం చివర 'కంటి' అనేమాట కనిపిస్తుంది.

**శ్రీ వల్లభుని శిఖరంబుఁ బొడగంటి**
**కాశీ పురాధీశు గౌరీశుఁ బొడగంటి**

సర్వలోకేశ్వరుని సర్వేశుఁ బొడగంటి
సర్వ సంరక్షకుని సర్వంబుఁ బొడగంటి
పరమాత్ము నీశానుఁ బరమేశుఁ బొడగంటి
చంద్రార్క శిఖినేత్రు శంకరునిఁ బొడగంటి

...... ..... ..... ..... .....

నయముగా నయనములు నాకీయఁ బొడగంటి
భయభక్తులీ భర్గు పాదములుఁ బొడగంట

...... ..... ..... ..... .....

త్రిభువనము భక్తులకు తృణకణములని కంటి
సభలందు భక్తులకు జయవాదమని కంటి

ఇలా 342 పాదాల వరకు సాగిన ఈ రగడకు నయన రగడ అనిపేరు. దీనికి శివభక్తి దీపిక అని మరోపేరు. చక్రపాణి రంగనాథుడు శివభక్తుడైన తరువాత చాల రచనలు చేశాడు. వీటిలో స్తుతిపరమైన నమశ్శివాయ రగడ కూడా ముఖ్యమైనదే.

శ్రీ గిరీశ వశ్యమాత్ర సేకరము నమశ్శివాయ
ఆగమోపదిష్ట విధి మహాకరము నమశ్శివాయ

ఇలా 108 పాదాల వరకు సాగే ఈ రగడకు నమశ్శివాయ రగడ అనిపేరు.

తాళ్లపాక కవులు కృష్ణమాచార్యుల సింహగిరి నరహరి వచనాలను చూశారనడంలో సందేహం లేదు. ఇంచుమించు కృష్ణమాచార్యుల కాలానికే చెందిన చక్రపాణి రంగనాథుని రచనలను, ముఖ్యంగా రగడలను కూడా చూసే ఉంటారు. సుదర్శన రగడ ఆవిర్భవించడానికి శైవ పరమైన రగడలు కూడా కారణం కావచ్చు. అందుకే కాబోలు-

రుద్రైకాదశ రూపము చక్రము
కాలకూట నిభకాంతుల చక్రము
త్రిపుర విజయకర తీవ్రము చక్రము

వంటి పంక్తులు సుదర్శన రగడలో చోటుచేసుకొని శైవాంశ కూడా చక్రంలో సమన్వయమైనట్లు కనిపిస్తున్నది. పంచాయుధాలలో చక్రేతరమైన ఆయుధాలను గురించి తాళ్లపాక కవులు వాళ్ల రచనలలో అక్కడక్కడ ప్రస్తావించారు. ప్రత్యేక స్తుతులు కనపడవు. సంస్కృత స్తోత్ర సాహిత్యంలో కూడా చక్రస్తుతే అధికంగా ఉండడం దీనికి కారణం. ఆళ్వారుల ఆచార్యుల చక్రస్తుతులలోని విషయాలన్నిటిని సేకరించి పెదతిరుమలయ్య సుదర్శన రగడను రచించినట్లుంది.

**ప్రతిభటశ్రేణి భీషణ వరగుణస్తోమ భూషణ**<br>
**జని భయస్థాన తారణ జగదన స్థాన కారణ**<br>
**నిఖిల దుష్కర్మ కర్శన నిగమసద్ధర్మ దర్శన**<br>
**జయజయశ్రీ సుదర్శన జయజయశ్రీ సుదర్శన**

**-వేదాంత దేశికుల సుదర్శనాష్టకంలోని మొదటి శ్లోకం.**

# చిన తిరుమలాచార్యుల రచనలు

తాళ్లపాక కవులలో మూడు తరాలవాళ్లు - అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య సంకీర్తనలు రచించారు. ఈ వంశంలోని మిగిలిన కవులు సంకీర్తనేతర రచనలు చేశారు. చిన తిరుమలయ్యకు తండ్రిమీద గౌరవముంది. అంతకు మించిన గౌరవం తాతగారిమీద ఉంది. తన రచనలలో తాతను ఎన్నో రకాలుగా కీర్తించాడు. అప్పడైన వేంకటేశ్వరుని వరప్రసాది, ఆది నారాయణుని తన మనసులో నిలిపినవాడు, సనకసనందనాదు లంతటివాడు, హరిపై ఎన్నో సంకీర్తనలు రచించినవాడు, వేదాల అర్థం తెలుసుకొని అందరికి తెలిపినవాడు, శ్రీవేంకటేశ్వరుని విందువలె తమ వంశం వాళ్లకు దయచేసిన వాడు తన తాత గారైన అన్నమయ్యే నని పొంగి పోతూ చెప్పుకొన్నాడు చిన తిరుమలయ్య. తనకు ఉపనయం చేసిన వాడు కూడా అన్నమయ్యేనట. తన తల్లి, తండ్రి, గురువు అన్నీ తాతగారే నట. పచ్చి తామసులైన తమను అన్నమయ్య సాత్త్వికులుగా మార్చాడని, తమ వంశంలో మొదట శ్రీవైష్ణవాన్ని స్వీకరించిన వాడతడే నని చెప్పాడు. ముదిరిన పాప కర్మలను పోగొట్టి పుణ్యాత్ములను చేయడమే కాకుండా సంకీర్తన విద్యను ఉపదేశించాడని కూడా చెప్పాడు. తండ్రి తాతలవలె చిన తిరుమలయ్య కూడా అధ్యాత్మ సంకీర్తనలను, శృంగార సంకీర్తనలను రచించాడు.

ఇప్పటి వరకు దొరికిన తాళ్లపాక వారి సాహిత్య సంచయంలో శృంగార, అధ్యాత్మ సంకీర్తనలు, సంకీర్తన లక్షణం, అష్ట భాషా దండకం చిన తిరుమలయ్యవిగా ప్రకటింప బడినాయి. ఏ సంకీర్తన అయినా శ్రీహరిని నుతించేదే అయినపుడు

ఈ కవులు రెండు రకాలుగా విభజించి రాయడం ఎందుకని సామాన్యుడికి అనిపిస్తుంది. మనిషి పరబ్రహ్మాన్ని తన రూపంలో ఊహించుకొని ప్రార్థిస్తున్నాడు. తన జీవిత దశలైన శృంగార స్థితిని, అధ్యాత్మ స్థితిని భావించుకొని పరబ్రహ్మాను ఆరకంగానే స్తుతి చేస్తున్నాడు. రక్తి, విరక్తి అనేవి ప్రతి ప్రాణి జీవితంలోను అపరిహార్యమైన దశలు. వయసు ననుసరించి ఈ భేదాలు ప్రాణికి అనుభవ గోచరమవుతాయి. ఋషిత్వాన్ని సముపార్జించుకొన్న కవులు తత్త్వవేత్తలు కావడం వల్ల తాళ్లపాక కవులు జీవితాన్ని రెండు దశలుగా దర్శించారు. అందుకే వారి సంకీర్తనలు శృంగారాలు, అధ్యాత్మికాలు అయినాయి.

చిన తిరుమలయ్య 60 అధ్యాత్మ సంకీర్తనలను, 119 శృంగార సంకీర్తనలను వెరసి 179 సంకీర్తనలను రచించినట్లు ఆయన పేరుమీద ముద్రితమైన ఒకే ఒక సంపుటాన్ని బట్టి తెలుస్తున్నది. తి.తి.దే. వారు 1998లో ముద్రించిన తాళ్లపాక వారి సంకీర్తనల సంపుటాల్లో చిన తిరుమలయ్యది పదవ సంపుటం. దీని పరిష్కర్త ఎ.వి. శ్రీనివాసా చార్యులుగారు. ఈ 179 సంకీర్తనలలో చినతిరుమలయ్య ప్రదర్శించిన విషయాలను చూద్దాం.

విషయ పరిశీలన దృష్టితో తాళ్లపాకవారి సంకీర్తనలను విభజించి పరిశీలించడం కొంత కష్టం. ఒకవేళ విభజించినా ప్రతి విభాగం అసంపూర్ణంగా మిగిలి పోతుంది. ప్రతి సంకీర్తనలోను అనేక విషయాలుండడం, అసలు సంకీర్తనల లోనే అనంతమైన వస్తు వైవిధ్యం ఉండడం దీనికి కారణం. అన్నమయ్య సంకీర్తన లయితే విషయ విభాగాలకు లొంగవు. అయనా వీలైనంత వరకు కొన్ని విభాగాల కింద చిన తిరుమలయ్య శృంగార సంకీర్తనలను వివరించే ప్రయత్నం చేస్తాను.

**1. శ్రీ వేంకటేశ్వరుని దక్షిణ నాయకత్వాన్ని స్ఫురింప జేయడం** – స్వామి సమస్త ప్రకృతిని మోహింపజేసే విశ్వైక మోహనుడు. ఆయనను స్వంతం చేసుకోవడానికి సాధ్యంకాదు. ఆయన సామీప్యం కోసం జీవులు తహతహ లాడతాయి. ఆయనను ఆకర్షించాలనుకొనే నాయిక అది సాధ్యంకాక ఆయన సాహచర్యంలో ఉండేవాళ్లలో

తానొకతెగా ఉండినా చాలునను కొంటుంది. ఈ విషయంలో సవతి మాత్సర్యం కూడా మరచి పోతుంది.

**ఇల శ్రీవేంకటనాథు డిద్దరి మన్నించి కూడె**
**మలసి మనలో నిక మచ్చరా లేమిటికె** (శృం. 3)

**అంది శ్రీవేంకటనాథ ఆపెను నన్ను గూడితి**
**ఎందరు నీ చేతలివి యెంచకుండేరా** (శృం. 56)

అనే చరణాల్లో స్వామి దక్షిణ నాయకత్వం, సంయోగ శృంగారం స్ఫురిస్తున్నాయి. ఇలాంటి ఉదాహరణలెన్నో ఉన్నాయి.

**2. వియోగ శృంగారం –** స్వామి విరహంతో తపించే నాయికల మనోవృత్తులను చిన తిరుమలయ్య సహజంగా మనోహరంగా వర్ణించాడు. ఈ పట్టులలో చిన తిరుమలయ్య మీద ఆయన తండ్రి తాతల ప్రభావమేకాక ఆనాటి ప్రబంధ కవుల ప్రభావం కూడా కనిపిస్తుంది.

**పడతి నీయాసనె బతికున్నది**
**యెడయక నీవింక నెట్టయినా జేయుమీ**
**గుబ్బలమీదఁ జెలి కొంగు వేయదు**
.... .... .... .... ....
**అబ్బురపు విరహమూ నాపలేక వున్నది**
**పొలతి మేన కస్తూరి పూయనొల్లదు**
.... .... .... .... ....
**బలమైన తాపముల బారి బడియున్నది** (శృం. 16)

అనే కీర్తనలో నాయిక విరహావస్థ స్పష్టంగా కనిపిస్తున్నది. కొంగు సరిచేసుకోక పోవడం, శరీరానికి కస్తూరి పూసుకోకపోవడం, చల్లగాలి, వెన్నెల, కోకిలారవం నాయిక విరహాన్ని అధికం చేయడం, చెలులామె స్థితిని నాయకునికి విన్నవించడం

ఇత్యాది వియోగ శృంగార సామగ్రి పాఠకులలో శృంగారానుభవాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది.

శృంగార రసాన్ని పరిపుష్టం చేసేది విప్రలంభమే. ఈ సంకీర్తనలలోని విప్రలంభానుభవం కవిది గానే అర్థం చేసు కోవాలి. నాయిక మిషతో కవి నాయికగా మారి భగవత్తత్వాన్ని దర్శించడానికి తొందర పడడం కనిపిస్తుంది. ఇలాంటి సందర్భాలలో శృంగారం భక్తిలోను, భక్తి శృంగారంలోను మిళితమై పోతాయి. ఇదే మధురభక్తి. నాయికా నాయకుల ఐక్యత జీవేశ్వరుల ఐక్యతే. తాళ్లపాక వారి శృంగార సంకీర్తనలలో కనిపించే ప్రధాన లక్షణమిది. శృంగార పరంగా ఆత్మ నివేదన చేసుకోవడం శ్రీవైష్ణవం లోని ప్రపత్తి యోగానికి సంబంధించిన అంశం. ఇలాంటి శృంగార రసపుష్టికి నాయికా నాయకుల మధ్య ఉండదగిన సంబంధం రసవంతంగా ఉండాలి. సన్నివేశాలను రసవంతం చేయడానికి చినతిరుమలయ్య అనేక రకాలుగా ప్రయత్నిస్తాడు. నాయికా నాయకుల వింతవర్తనం, నాయిక వేరొక నాయికను నిందించడం, చెలికత్తె ద్వారా తన ప్రణయ సందేశాన్ని తన నాయకునికి పంపడం,తన ప్రణయ విషయాలను నాయకుడు నాయిక ముందు పెట్టడం ఇత్యాది వర్ణనలద్వారా తిరుమలయ్య విప్రలంభాన్ని పోషించినట్లు తెలుస్తుంది.

## 3. శృంగార పరంగా పురుషుని దౌర్బల్యం

శృంగార రసానికి స్త్రీ పురుషులిరువురు ఆలంబనమైనా ఒక సందర్భంలో స్త్రీ మరొక సందర్భంలో పురుషుడు శృంగార లాలసతో బలహీనపడి కనిపించడం సహజం. '**స్త్రీ ప్రాయమితరం జగత్**' అనే సత్యాన్ని చెప్పడానికి చినతిరుమలయ్య స్త్రీ పురుషుల మానసిక బలహీనతలను చూపిస్తాడు. పరమాత్మను చేరడానికి పడే తపన ఇరువురిలోను సమానం గానే ఉంటుంది. ఎవరి మానసిక బలహీనత అయినా అది పరమాత్మ శృంగార లోకంలో విహరించడానికే. పరమాత్మకు సంబంధించిన దివ్య శృంగారానికి కీర్తనలలో కనిపించే శృంగారం వికృతిరూపం. వికృతిరూపంలో వ్యక్తమయ్యే శృంగారం ద్వారా దివ్య శృంగారపు అనుభవం పొందడం తాళ్లపాక కవుల శృంగార సంకీర్తనల లక్ష్యం.

**ఈడేర వలచితే యేపని సేయగరాదు**
**యేదనైనా యెగ్గు సిగ్గు లెంచేరా భూమిని ॥పల్లవి॥**

**వనిత చెప్పితే చాలు వారిధైనా నీదేవు**
**అనువుగా కొండ మోయమన్నా మోసేవు**
**తనివోక భూమెల్లాఁ దవ్వుమన్నాఁ దవ్వేవు**
**వొనర బహురూపాన నుండుమన్నా నుండేవు (శృం.75)**

ఈ సంకీర్తనలో స్వామి లీలావిభూతికి చెందిన అవతార విశేషాలు శృంగారం కోసం ఎలా వినియోగ పడినామో తిరుమలయ్య చక్కగా వ్యక్తంచేశాడు. ఇలా చెప్పడం వల్ల శృంగారం గొప్ప భావమని, భక్తితో ఆలోచించినపుడే శృంగారంలోని గొప్పతనం అర్థమై తద్వారా పరమాత్మకు దగ్గర కావచ్చునని కవి భావించి ఉంటాడు.

## 4. శృంగారం దాంపత్య ధర్మంగా చెప్పడం

తమ సంకీర్తనలలో కనిపించే శృంగారం దివ్యమని ఎన్నిరకాలుగా చెప్పినా శరీరాత్మల భేదం తెలియని పామరులు అర్థంచేసుకోలేరని చిన తిరుమలయ్యకు అనిపించి ఉంటుంది. అందుకే శృంగారతత్త్వం తెలియనివారికి బాగా బోధ పడేటట్లు చెప్పాలనుకొన్నాడు. ముందు దాంపత్య శృంగారం తెలిస్తే తప్ప దివ్య శృంగారం అవగాహనకు రాదని దాంపత్య పరిమళమే శృంగారమని ఒక సంకీర్తనలో చెప్పాడు. శృంగారం కోసం వెంపరలాడే స్త్రీకిగాని పురుషునికిగాని జారత్వం తగదని, శృంగారం ధర్మబద్ధంగా ఉండాలని ఈ సంకీర్తనలో తెలియ జేశాడు.

**ఏమిమందు గద్దె యింతులాల! యీ!**
**రామకుఁ దిరుపతి రాముఁడే మందు**
**వెలసెటి విరహాన వేఁగెటి యింతికి**
**చెలియలాల యేమిసేతమే**
**చలివేడి వలపుల చవిగొన్న యీపెకు**
**వలపించిన తన వరుడే మందు (శృం. 108)**

'మగడే మగువకు మందు' అని, ఆ మందు ఆమె విరహాన్ని తమకాన్ని పోగొడుతుందని చెప్పాడు. అలాగే మగువే మగడికి మందు అని కూడా అర్థం చేసుకోవాలి.

## అధ్యాత్మ సంకీర్తనలు

భక్తి తత్త్వాన్ని రూపు కట్టించడానికి, స్పష్టం చేయడానికి రచింపబడిన అధ్యాత్మ సంకీర్తనలలో భక్తితో పాటు నీతి వైరాగ్యాలు కూడా చోటుచేసుకొన్నాయి. హరిభక్తి కల్పవృక్షం వంటిదని చిన తిరుమలయ్య భావించాడు. ఇహలోక సుఖాలు క్షణభంగురమని, హరిభక్తి ఒక్కటే శాశ్వతమైన స్థితిని కలిగిస్తుందని చాటిచెప్పినాడు. మాయలలో చిక్కుకోవద్దని, ఆశలకు బానిసలు కావద్దని, కాలాన్ని వృథాచేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రబోధించాడు. మనిషిని మోహ పరిచేవి ఇంద్రియాలు. ఇంద్రియాలను అదుపులో పెట్టుకొంటే సమాధిస్థితిని పొందడానికి సాధ్యమవుతుంది. అలాంటి విశ్చల స్థితిలో హరిమీద భక్తి కుదురు తుంది. ఆ భక్తి భవసాగరానికి నావగా పనిచేసి ఆత్మావలోకాన్ని కలిగిస్తుందని, దానివల్ల హరిసామీప్యం పొందవచ్చునని చినతిరుమలయ్య తన అధ్యాత్మ సంకీర్తనల్లో ప్రకటించాడు. ఈయన అధ్యాత్మ సంకీర్తనల్లో కనిపించే కొన్ని ప్రధానాంశాలు.

**1. లోకంలో కనిపించే ప్రకృతి వికృతులన్నీ శ్రీహరి కల్పితాలని చెప్పడం-**

> **పచ్చిగా దెలియకుంటే బహుముఖమై తోచు**
> **అచ్చమై యిన్నియును శ్రీహరి కల్పితములే (అధ్యాత్మం -13)**

అనే సంకీర్తనలో తిట్టడం – దీవించడం, కోపపడడం – వేడుక పడడం శ్రీహరి కల్పితాలని **'కొంతచోట మనుజులు కొంతచోట దేవతలు'** ఉండడానికి కారణం శ్రీవేంకటనాథుని ఆజ్ఞ అని చెపుతాడు. వికృతిని వివేచనతో తెలుసుకొంటే ప్రకృతి అర్థ మవుతుంది. ఈ అర్థ జ్ఞానంవల్ల ఆత్మను పరమాత్మవైపు తిప్పడానికి సాధ్యమవుతుందని చినతిరుమలయ్య అభిప్రాయం. మనిషిలోని భావాలన్నీ

వికృతులే. మానసిక భావం కోరికను కలిగిస్తుంది. అదీ కల్పనే. అయితే మానవుడు దీనిని గుర్తించడం లేదు. మానసిక భావాలన్నీ సుఖదుఃఖాల మధ్యనే సమన్వయ మవుతాయి. సుఖదుఃఖాలు, పాపపుణ్యాలు, కలిమిలేములు హరి సంకల్పములై నపుడు మానవుడు ప్రయత్నంచేసి సాధించదగింది ఏమీలేదు. సాధించ వలసినది హరిమీద భక్తిని నిలపడమే. చినతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనలన్నీ ఈ విషయాన్నే విపులంగా వ్యాఖ్యానిస్తాయి.

**2. శరణాగతి తత్త్వం -**

**హరికి మొరవెట్టితె అన్నిపనులు లెస్సవును**
**సరవి ఎన్నాళ్లని జాలి బడవచ్చును (అధ్యాత్మ-6)**

అనే సంకీర్తనలో పంచేంద్రియాలనే శత్రువర్గంతో పోరాడడం ఎప్పటికి ముగిసిపోదని, దానివల్ల సంసార వారధిని ఈదుతూనే ఉండవలసి వస్తుందని చెపుతాడు. ఈ జంజాటం తప్పించుకోవాలంటే హరికి మొరపెట్టుకోవడం ఒక్కటే మార్గమని, అది శరణాగతివల్ల సాధ్యమవుతుందని చెపుతూ శరణాగతి తత్త్వాన్ని వివరించడం ఎన్నో సంకీర్తనలలో కనిపిస్తుంది.

**3. అన్ని ఇడుములకు మూలం సంసారంలో మునిగిపోవడం -**

సంసారి కాకుండా మానవుడు ఉన్నతుడు కావడం సాధ్యం కాదని తాళ్లపాక కవులు ఎన్నో సంకీర్తనలలో చెప్పారు. 'కామిగాక మోక్షకామికాదు' అన్న సిద్ధాంతాన్ని నమ్మినవారు వీరు. అయితే సంసార కూపంలో మునిగిపోకూడదు. సంసారాన్ని ఒకతెప్పగా మార్చుకోవాలి. **'తామ్ర పత్ర మివాం భసా'** అన్నట్లు మెలగాలి. ఇలా మెలగడం చాలకష్టం. సంసారానికి సంబంధించిన ఎన్నో విషయాలు మానవుని మోహ పరుస్తాయి.

**చలమె చెల్లించుకొన్న సతులాల**
**సులభమో మీతో పొందు సుతులాల (అధ్యాత్మ-28)**

అనే సంకీర్తనలో సతులు – సుతులు ఎంత జంజాటంగా మారతారో చూపబడింది. బంధువులు, ధనధాన్యాలు, కామక్రోధాలు పంచేంద్రియాలు మొదలైనవన్నీ మునినైనా ఋషినైనా మోహపరుస్తాయి. ఈ సంకటాలను తొలగించుకోవాలంటే సద్గురునాశ్రయించి తగిన బోధన పొందాలి. సద్గురువు మోహ పంజరం నుండి బయట పడడానికి 'శ్రీ వేంకటనాథుని పాదాలు' చూపించి శరణుపొందమంటాడు. శరణుపొందే విధానాన్ని, శరణుపొందితే కలిగే ప్రయోజనాన్ని వివరించి చెపుతాడు. అందుకే చినతిరుమలయ్య **'ఘనుడైన శ్రీవేంకటనాథు పాదములు, చనవున జూపితిరాచార్యులాలా'** అని ఈకీర్తనను ముగించాడు. ఈయనకు శ్రీనివాసుని పాదాలు చూపించినవాడు అన్నమయ్య.

**4. పురాణాలన్నీ శ్రీపతిని పొగడడానికే పుట్టినాయి –**

**సకల పురాణములు చాటి నిను బొగడగా**
**తక మకలుగా నర్థార్థము చెప్పదగునా (అధ్యాత్మ – 58)**

అనే సంకీర్తనలో పురాణ కథలన్నీ శ్రీహరి అసంఖ్యేయ కల్యాణ గుణాలను, భువన సుందరత్వాన్ని చాటడానికి పుట్టినాయని చెప్పబడింది. మనిషికి సంబంధించిన విషయాలన్నీ పురాణాలలోని కథలద్వారా, తత్త్వప్రతిపాదనల ద్వారా ప్రపంచింపబడినాయి. శ్రీవైష్ణవ తత్త్వానికి పురాణాలు కూడా లక్ష్యభూతాలే. పెద్దలు చెప్పినా గురువులు చెప్పినా అర్థం కానివాళ్లకు, ఆధారాలకోసం అన్వేషించే వాళ్లకు పురాణాలు సమాధానాలు చెపుతాయని చిన తిరుమలయ్య అభిప్రాయం.

**5. నామ సంకీర్తన శాంతిదాయకం –** ఎన్ని ఉన్నా ఏమిచేసినా మనస్సు శాంత స్థితికి రాకపోతే ప్రయోజనం శూన్యం. దేవుని నామాన్ని జపించడం వల్ల శాంతి లభిస్తుందని చిన తిరుమలయ్య ఎన్నో సంకీర్తనలలో ప్రతిపాదించాడు.

**'గోవింద గోవింద యని కొలువరె**
**గోవిందా యని కొలువరె'**

అనే సంకీర్తనలో శ్రీనివాసుని అచ్యుత, పురుషోత్తమ, పరమ పురుష, సిరివర, పాండవ వరద, అండజ వాహన, కొండల రాయ, మాధవ, శ్రీవిభు, అనంత అని కీర్తించాడు.

బ్రహ్మ గన్నవాడు పసిబిడ్డ
బ్రహ్మమైన వాడు పసిబిడ్డ

అనే కీర్తనలో చిన్నబిడ్డగా ఉండిన దశలో శ్రీకృష్ణుడు నిర్వహించిన పూతన సంహరణం, శకటాసుర వృత్తాంతం, గోవర్ధనోద్ధారణం, కంసవధ మొదలైన విషయాలన్నీ స్పృశింపబడినాయి. ఇలా ఎన్నో సంకీర్తనలలో స్వామి లీలా విభూతికి చెందిన వృత్తాంతాలను స్ఫురింపజేసే గుణాలను తనివితీరా వర్ణించాడు చినతిరుమలయ్య.

## కవిగా చిన తిరుమలయ్య

ప్రధానంగా సంకీర్తనాచార్యుడైనా చినతిరుమలయ్య గొప్ప కవిగా కనిపిస్తాడు. ఆయన చేసిన వర్ణనలు, ఊహలు అలంకారశాస్త్ర సమ్మతంగా ఉంటాయి. ఆయనను గడుసరిగా నిరూపించే కీర్తనలెన్నో ఉన్నాయి. ఈ కీర్తన ఆయన కవితా వైదుష్యానికి గొప్ప ఉదాహరణ.

**వెలపించితివిగా వోయి వేడుక కాడ**
**తెలవ నీమాటవిని డిందుపడెగాని**
**పొలతి నీ మోము చూచి పున్నమి చందురుడని**
**వెల వెల బారి చాలా వెరచెనయ్యా**

.... .... .... .... .... ....

**కొమ్మ నీ కురులు చూచి గుంపుఁదుమ్మిదలనుచు**
**వుమ్మలూర మదిలోన నులికె నయ్యా**

.... .... .... .... .... ....

**నల్ల గలువ చేపట్టి నయముతో నీవు రాగా**
**పల్లదపు మరుడని భామలోని కేగెను**
**వెల్ల విరై కాగిట శ్రీవేంకటనాథ యింతిని**
**చల్లగా నీవు గూడగ సమరతి సేసెను (శృంగార-105)**

నాయిక విరహావస్థను మనోజ్ఞంగా చూపిస్తున్న సంకీర్తన ఇది. విరహంతో వేగుతున్న నాయికకు నిండు చంద్రుడు మంటల కుంపటిగా కనిపిస్తాడు. తుమ్మెదల రొద చీకాకు పరుస్తుంది. మరునిభావం మదిలో కలత రేపుతుంది. ఈ ఉద్దీపన సామగ్రి నాయిక విరహాన్ని రెట్టింపుచేస్తుంది. ఇది ప్రబంధ కవుల భావనా వైచిత్రి. శ్రీనివాసుని మోము పున్నమి చంద్రుడువలె ఉంది. ఆయన ముఖాన్ని చంద్రుడుగా భ్రమించి నాయిక భయంతో వెలవెల పోతున్నది. నిజానికి ఆయన ముఖం చంద్రుడుకాదు. ఆమె వెలవెల పోవడానికి అది కారణం కాదు. కారణ రహితంగా కార్యం జరగడం విభావనాలంకార లక్షణం. ఈ వర్ణన కవి అలంకార కౌశలాన్ని మోహనంగా చాటుతున్నది. ఇలాగే ఈ సంకీర్తనలో స్వామి కురులు ఆమెకు తుమ్మెదల గుంపుగా కనిపించడం, నల్ల కలువ చేతబట్టిన స్వామి మన్మథుడుగా కనిపించడం విభావనాలంకార లక్ష్యాలుగా పొసగి చిన తిరుమలయ్యను గొప్ప కవిగా ప్రతిపాదిస్తున్నాయి.

## సంకీర్తన లక్షణం

చిన తిరుమలయ్య రచించిన సంకీర్తన లక్షణం అన్నమయ్య సంస్కృతంలో రచించిన లక్షణ గ్రంథానికి అనువాదం. అన్నమయ్య సంకీర్తన లక్షణానికి పెద తిరుమలయ్య వ్యాఖ్యానం రాశాడు. సంస్కృత సంకీర్తన లక్షణంగాని, పెద తిరుమలయ్య వ్యాఖ్యానం గాని దొరకడం లేదు. దొరుకుతున్నది చిన తిరుమలయ్య అనువాద గ్రంథమే.

దైవ స్తుతికి చెందిన స్తోత్ర సాహిత్యానికి లక్షణాలను నిర్దేశించిన గ్రంథమిది. దీనికి సంకీర్తన లక్షణం, పదచ్ఛందం అనే పేర్లున్నాయి. సంకీర్తన, పదం ఒకదాని కొకటి పర్యాయాలు. భరతుడు నాట్యశాస్త్రం 15వ అధ్యాయంలో పదానికి లక్షణాలు చెప్పాడు. సంగీత రత్నాకరం, సంగీత చంద్రిక, సంగీత చూడామణి, సంగీత సుధాకరం వంటి లక్షణ గ్రంథాలలో పదానికి లక్షణాలు చెప్పబడినాయి. ఈ లక్షణ గ్రంథాలన్నిటికి భరతుని నాట్యశాస్త్రం మూలం. భరతుడు చెప్పిన లక్షణాలనే అన్నమయ్య మరికొంత విపులీకరించి చెప్పాడు.

సంకీర్తన లక్షణంలోని విషయాలను తెలుసుకొనే ముందు చిన తిరుమలయ్య తాత తండ్రుల గ్రంథాల నుండి సేకరించి వివరించిన ఉపోద్ఘాత ప్రాయాలైన విషయాలను తెలుసుకోవాలి. పదం అనేమాటకు కవిత్వం అని అర్థం చెప్పవచ్చు. వేంకటపతిపై చెప్పిన పదమే తుది పదమట. కవిత్వానికి పరాకాష్ఠ లేక ప్రయోజనం వేంకటపతిని నుతించడమే నని తుది పదానికి వ్యాఖ్యానం. తాళ్లపాక అన్నయ పదాలు హరిభక్తి విభావనలు. శ్రీహరి గుణ సుజ్ఞాన ధనాలు. బహుదేశాలలో వ్యాపించి సుజనులకు హ్లాదాన్ని కూర్చేవి. విన్నంతనే పాపాన్ని హరించేవి. శంకాతంకములను పోగొట్టి సర్వేశ్వరునిపై భక్తిని పదిల పరిచేవి. ఇలాంటి అన్నమయ్య పదాలను చదివి అర్థం చేసుకొంటే బాలుడు ప్రౌఢుడవుతాడు. సంకీర్తనల పరిశుద్ధికోసం అన్నమయ్య సంకీర్తన లక్షణం రచించాడు. తండ్రి అనుమతితో ఆమ్నాయ సమానమైన సంకీర్తన లక్షణాన్ని లక్షణ శాస్త్రజ్ఞులు ఔదల దాల్చునట్లుగా పద్యరూపంలో చెపుతున్నానని చిన తిరుమలయ్య ప్రకటించుకొన్నాడు.

భరతుని మతానుసారం అన్నమయ్య ఏర్పరచిన సంకీర్తన లక్షణాన్ని ఇలా క్రోడీకరించవచ్చు. **'పదమన సుప్తిఙ్ఞంతము – పదమవయవ మవయవియును బదమన బరగున్'** అని పద నిర్వచనం. ఈ నిర్వచనంలో లక్షణార్థమే కాకుండా ఒక విశేషార్థం కూడా ఉంది. అవయవము అంటే శరీరం. అవయవి అంటే శరీరి. ఈ రెంటి సమాహారమే పదం. శరీరి శరీరుల సంబంధాన్ని, వీటికి పరమాత్మతో గల సంబంధాన్ని వివరించేది పదం అనే విశేషార్థం కూడా ఈ నిర్వచనంలో ఉంది. అవయవ పదం చతుష్పాదం. దీనిని వృత్త ధాతు అవయవాల పేర్లతో పిలవవచ్చు. వృత్తపదం, నిబంధపదం, అనిబంధపదం అని పదం మూడు రకాలుగా ఉంటుంది.

వృత్తపదం విషమం, సమం, అర్ధసమం అని మూడురకాలు. పదంలోని చరణాలలో నాలుగు పాదాలు నాలుగు రకాలుగా ఉంటే అది విషమ పదం. నాలుగు పాదాలు ఒకేరకంగా ఉంటే సమపదం. చరణంలో రెండురకాల లక్షణ ముంటే అది అర్ధసమం. నిబంధ పదానికి యతులు ప్రాసలు మాత్రాగణాలు

మార్గదేశికాలాలు ముద్ర అనే ఐదంగాలుంటాయి. ఉద్గ్రాహం, మేళాపం, ధ్రువం, అంతం, ఆభోగం అనే ఐదవయవాలుంటాయి. సాధారణంగా పల్లవి రెండు పాదాలలో ఉంటుంది. ఏక పాదంతో ఉండేదాన్ని శిఖాపదమంటారు. నిబంధ పదంలో పల్లవి ఉంటే శిఖాపదముండదు. శిఖాపదముంటే పల్లవి ఉండదు. పల్లవి శిఖా పదాలతో కూడిన పదప్రయోగ సంప్రదాయాలను బట్టి చతుర్థాతుక, త్రిధాతుక, ద్విధాతుక, ఏకధాతుక పదాలని నాలుగు రకాల పదాలేర్పడతాయి. చతుర్థాతుక నిబంధపదంలో ఉద్గ్రాహ మేళాప ధ్రువ ఆభోగాలుంటాయి. త్రిధాతుక నిబంధ పదంలో ఉద్గ్రాహధ్రువ ఆభోగాలుంటాయి. అంతరి మేళాపాలుండవు. ద్విధాతుక నిబంధ పదంలో ఉద్గ్రాహ ధ్రువాలుంటాయి. ఏకధాతుక పదంలో ఉద్గ్రాహం మాత్రమే ఉంటుంది. అన్నిటిలో పల్లవి ఉంటుంది.

వృత్తాలు నాలుగు పాదాలతో, జాతులు రెండు పాదాలతో ఉండినట్లు సంకీర్తనలు నాలుగు, రెండు పాదాలతో ఉంటాయి. ఇలాంటి కీర్తనలలో దరువులు జక్కుల రేకులు గొబ్బిళ్లు భాసుర వాక్యాలు చందమామ పదాలు గుర్తించదగినవి. దరువు, ఏలలు అర్ధచంద్రిక గొబ్బిళ్లు చందమామ పదాలు రెండు పాదాలతో ఉంటాయి. దరువు ద్రుత మధ్యమానాలతో చిత్రవర్ణ తాళాలు కలిగి ద్వి చతుష్పాదా కృతిలో ఉంటుంది. అర్ధచంద్రిక పదాలు ఉద్గ్రాహ, ధ్రువ ఆభోగాలు కలిగి పల్లవితో కూడి ఉంటాయి. నాయకాహ్వాన పూర్వమై మ్లేచ్ఛ భాషలో రాగమిళితమై నాయక సంబుద్ధి మధ్యమై ఉన్నవి ఏల పాటలు. చందమామ పదాలు ద్వి చతుష్పాదాకృతిని కలిగి ఉంటాయి. ఎనిమిది పదాలు పల్లవితో కూడి ఉంటే అష్టపదులవుతాయి. మనోహరమైన పల్లవితో అర్థచాతురితో సీసమాలికలవలె ఉన్నవి పదమాలికలు. శరభ పాదాలు ఎనిమిది పాదాల చరణాలతో అష్టపదుల కంటె భిన్నంగా ఉంటాయి. అనిబంధ పదం తాళ ఛందో విరహితమై చూర్ణమని పిలువబడుతుంది. దీనికి తాళగంధి అని మరొకపేరు. సంక్షిప్తంగా సంకీర్తన లక్షణంలో చిన తిరుమలయ్య వివరించిన లక్షణాలివి.

గ్రంథం చివర దేశి పదమంటే ఏమిటో వివరింపబడింది. వివిధ దేశాలలో అనేకమంది కవులచే రచింపబడిన రచనలు తానక రాగంతో ఒప్పారితే దేశి

రచన లవుతాయి. భావ రసాలంకార శయ్యా సౌభాగ్యాలతో ఒప్పి దైవములమీద మానవులమీద రచింపబడిన బంధాలు పదములనే పేరుతో వ్యవహరింప బడతాయి. సంకీర్తన లక్షణంలోని విషయాలన్నీ అన్నమయ్యవి కాబట్టి ఈ గ్రంథంలోని అభిప్రాయాలతో చిన తిరుమలయ్యకు పూర్తిగా సంబంధముందని చెప్పనవసరం లేదు.

సంకీర్తన లక్షణ గ్రంథాన్ని మహత్తరమైన వాఖ్యానంతో **'ది ట్యూన్స్ ఆఫ్ డివినిటీ'** అన్న పేరుతో ఆచార్య సాళ్వ కృష్ణమూర్తి గారు 1989లో ప్రకటించారు. వాఖ్యానం ఆంధ్రాంగ్ల భాషల్లో ఉంది. దీనికి సంబంధించిన వివరాలు కావలసిన వారు ఆ వ్యాఖ్యాన గ్రంథాన్ని చూడవచ్చు. సంకీర్తన సాహిత్యానికి లక్షణ నిర్దేశం చేసిన గ్రంథం సంకీర్తన లక్షణమొక్కటే. అంతకు ముందుగాని, ఆ తరువాత గాని సంకీర్తన వాఙ్మయం వెలువడింది కాని లక్షణ గ్రంథాలేవీ రాలేదు. ఈ రకంగా ఈ గ్రంథం ఎంతో విలువైంది. ఈ గ్రంథ విషయాలు తెలిస్తే పద రచనా సంప్రదాయం చక్కగా అర్థమవుతుంది.

## అష్టభాషా దండకం

దండకం ఏక గణ ప్రస్తారకం. సంస్కృత సాహిత్యంలో దండకం ఒక ప్రత్యేక ప్రక్రియగా వర్ధిల్లింది. సంస్కృత కావ్యాల్లో కథాపరంగా అవసరమైన చోట్ల దండకం కనిపిస్తుంది. భావావేశ ప్రసారానికి, వర్ణ్య వస్తు విస్తృతికి దండకం అనువైన రచన. దండకంలో సాధారణంగా తగణం పునరావృత్తమవుతుంది. తగణావృత్తిలో శ్రవణ సుభగత్వముంది. ఆదికవి నన్నయ అర్జునుని నోట శివస్తోత్ర పరంగా దండకం పలికించాడు. తెలుగు సాహిత్యంలో ఇదే మొదటి దండకమని విమర్శకుల అభిప్రాయం. కావ్యాంతర్గతంగా కాకుండా ప్రత్యేక ప్రక్రియగా పోతన భోగినీ దండకం రచించాడు. ఇది మానవ సంబంధమైన దండకం. సాధారణంగా దండకం దైవస్తుతి పరంగానే ఉంటుంది.

తెలుగు కవులు ప్రాకృత భాషలో పాండిత్యం సంపాదించిన తరువాత సాహిత్యంలో 'అష్ట భాషలు' అనేమాట ప్రచారమైంది. ఇది నన్నయ తిక్కనల

కాలంలో లేదు. అప్పటికి ఉభయ భాషలే ప్రచారంలో ఉండినాయి. అవి సంస్కృతం, తెలుగు. ఈ రెండు భాషలతో ప్రాకృతభాషా భేదాలను ఆరింటిని చేర్చి అష్ట భాషలు ప్రచారం చేయబడినాయి. తెలుగు సాహిత్యంలో మొదటి సారిగా భాస్కర రామాయణ కవులలో ఒకరైన మల్లికార్జున భట్టు 'శ్రీమదష్టభాషా కవి మిత్ర కుల పవిత్ర భాస్కర సత్కవి పుత్ర మల్లికార్జున భట్ట ప్రణీతంబైన' అని చెప్పుకొన్నాడు. వెన్నెలకంటి అన్నయ్య షోడశ కుమార చరిత్రలో 'అష్టభాషల మధురాశు విస్తర చిత్ర కవితల' అని రాశాడు. ఇలా ఈ అష్టభాషా సంప్రదాయం తెలుగు సాహిత్యంలో పరిణామం చెందుతూ కనిపించింది.

తాళ్లపాక కవులలో పెద తిరుమలా చార్యులు శృంగార దండకం రచించాడు. ఈ దండకంలో అలివేల్మంగా శ్రీనివాసుల దివ్యశృంగారం వర్ణితం. తరువాత చిన తిరుమలయ్య అష్ట భాషా దండకం రచించాడు. ఈ దండకం కూడా శ్రీవేంకటేశ్వరస్వామికి సంబంధించిన శృంగార వర్ణనతో నిండి కనిపిస్తుంది. ఆ తరువాత కూడా అష్ట భాషా సంప్రదాయం తెలుగు సాహిత్యంలో కొనసాగింది. దోనేరు కోనేరు నాథకవి 'భాసుర సంస్కృత ప్రాకృతాది శాస్త్ర భాషా కవిత్వ సౌభాగ్య నిపుణుడ' నని, 'వినుతాష్ట భాషా కవిత్వ ప్రచండుడ'నని చెప్పుకొన్నాడు. ధరణి దేవుల రామమంత్రి 'సంస్కృత ప్రాకృతాద్యష్ట భాషా కవిత్వ సంవేది'నని రాసుకొన్నాడు. తంజావూరు నాయక రాజుల కాలంలో అష్టభాషలలో సమస్యాపూరణం జరిగినట్లు తెలుస్తున్నది. సాహిత్య రత్నాకరంలో ఇచ్చిన సమస్యా పూరణ ఉదాహరణలను బట్టి ఆకాలపు అష్టభాషలివి– సంస్కృతం, ప్రాకృతం, శౌరసేని, మాగధి, పైశాచి, చూళికా పైశాచి, అప్రభంశం, ఆంధ్రం. ఈ ఎనిమిది భాషలనే అప్పకవి కూడా అష్ట భాషలుగా పేర్కొన్నాడు.

చిన తిరుమలయ్య పేర్కొన అష్టభాషలు – సంస్కృతం, ప్రాకృతం, శౌరసేని, మాగధి, పైశాచి, ప్రాచీ, అవంతి, సార్వదేశి. ఈయన అష్ట భాషలలో తెలుగును చేర్చలేదు. విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి రంగాజమ్మ ఉషా పరిణయ ప్రబంధంలో 'అతులితాష్ట భాషా కవితా సర్వంకష మనీషా విశేష

విశారద'నని చెప్పుకొన్నది. మన్నారుదాస విలాసంలో సంస్కృతం, ప్రాకృతం, శూరసేని, మాగధి, పైశాచి, చూళిక, అపభ్రంశం, దేశిలను అష్ట భాషలుగా ఆమె పేర్కొన్నది. వీటితోపాటు 'భాండరీ భాష' అనే మరొక ప్రాకృత భాషా భేదాన్ని పేర్కొన్నదేగాని తెలుగును అష్టభాషలలో ఒకటిగా చెప్పలేదు. ఈ విషయంలో ఈమె చిన తిరుమలయ్య మార్గాన్నే అనుసరించింది.

ఈ దండక రచనతో చిన తిరుమలయ్య అష్ట భాషా చక్రవర్తిగా బిరుదు పొందాడు. భారతదేశంలోని అన్ని ప్రాంతాల నుండి భక్తులు శ్రీవేంకటేశ్వరుని దర్శించడానికి వస్తారు కాబట్టి ఆయాప్రాంతాల ప్రజలకు అర్థం కావడానికి చిన తిరుమలయ్య ఎనిమిది భాషలలో ఈ దండకం రచించాడని పండితుల అభిప్రాయం. ఈ దండకం స్వామికంకితం. దండక ప్రారంభంలో రెండు స్రగ్ధరావృత్తాలు రచించాడు. మొదటిది సంస్కృతంలోను రెండవది ప్రాకృత అపభ్రంశ భాషలలోను ఉన్నాయి.

**'శ్రీకాంతా కాంత వక్షోమణి ఘృణి రవి సంపుల్ల కంజాత నాభీ'** అని ఈ దండకంలోని మొదటి శ్లోకం ప్రారంభమవుతుంది. శ్రీకాంత కాంతుడైన విష్ణువు వక్షస్థలం మీద సూర్యునివలె వెలిగే కౌస్తుభ రత్నముంది. ఈ వెలుగుతో నాభిలోని పద్మం వికసించింది. పౌర్ణమి కాంతిని అనుకరించే నవ్వుగల వికసించిన లక్ష్మి నేత్రాలనే కలువపూలు కలవాడు, ఇంద్రాది దేవతలచే పూజింపబడేవాడు, ప్రియదాసులైన భక్తులే సాధనాలుగా కలవాడు అయిన శ్రీవేంకటేశ్వరస్వామి మమ్ము రక్షించు గాక అని ఈ శ్లోక తాత్పర్యం. విష్ణువు వక్ష స్థలమందున్న కౌస్తుభం సూర్యుడు. ఆ వెలుగు సోకి నాభీ కమలం వికసించి పౌర్ణమి వెన్నెలను తలపిస్తున్నది. ఆ వెన్నెలను పరిహసించే నవ్వులతో లక్ష్మి కనులు కలువలై ప్రకాశిస్తూ ఆయననే చూస్తున్నది. ఈ శ్లోకంలో భక్తితోపాటు చక్కని కవితాశిల్పం కనిపిస్తున్నది.

అష్టభాషా దండకంలో వేంకటనాథుని శృంగార మూర్తిగా వర్ణించడమే గాక ఆయన గుణ కీర్తనం కూడా చేయబడింది. **'శ్రీ వేంకటాద్రి జీమూత నీలాంజన**

**గ్రావ బృంద ప్రభా భాసమానాంగ శృంగార రూపోల్లసత్కోటి కందర్ప లావణ్య వారాన్నిధే'– ఇలా సాగుతుంది** సంస్కృతంలో రచింపబడిన దండకం. తరువాత షడ్విధ ప్రాకృతాలైన ప్రాకృత శౌరసేని మాగధి పైశాచి ప్రాచీ అవంతి భాషల్లో కొన్ని భాగాలు రచించి తన బహుభాషా వైదుష్యాన్ని ప్రకటించుకొన్నాడు. చివర సార్వదేశీ భాషలో కొన్ని పంక్తులు రచించాడు. **'హే భట్టియో సవ్వదేసే సకం హ్లో కుడుంగేదు మంతత్తియే జుత్తగోవీ జణం....'** ఇలా సాగుతుందీ సార్వదేశి భాషా రచన.

సార్వదేశి భాషలో రచించిన భాగానికి తరువాత అంకితాంక శ్లోకం సంస్కృతంలో ఉంది.

> **'వాణీ వీణా నినాద ప్రతిమ చతురవాక్ తాళ్లపాకన్నయార్యః**
> **తత్పుత్ర స్తిమ్మయార్యో జిత ఫణి భణితి స్తత్సుతే నాష్టభాషః**
> **క్లు ప్తోయం తిమ్మయేనా రచిత పదగతిర్వేంకటాంద్రీంద్ర భర్తుః**
> **తస్యోద్యత్కీర్తి కేతుర్జగతి విజయతాం దండకః పండితేభ్యః'**

ఈ శ్లోకంతో అష్టభాషా దండకం ముగుస్తుంది. దీనిని పండితులెందరో పరిశీలించారు. సంస్కృత భాగానికి మాత్రం వ్యాఖ్య రాశారు. మిగిలిన భాగాలను వ్యాఖ్యానించలేదు. భవిష్యత్తులో ఎవరైనా ఈపని చేస్తారని నమ్ముదాం.

# అన్నమయ్య - సారంగపాణి

అన్నమయ్య పదకవితా పితామహుడు. ఆయన చేతిలో పదం వింత సొగసులు సంతరించుకొన్నది. పదకవిత భక్తి సాహిత్యంలో ఒక భాగమైనా ఆయన కాలంలో ఒక స్వతంత్ర ప్రక్రియగా నిలదొక్కుకున్నది. ఆయన సృష్టించిన పదసాహిత్యం రాశిలోను వాసిలోను గొప్పది. మధుర భక్తి ఒక తత్త్వంగా ఆయనకు ముందే తెలుగు సాహిత్యంలో అరగొరగా గోచరించినా ఆయన రచనలలోనే అది సార్థకంగా సుస్థిరమైంది. అనంతర భక్త కవులెందరో ఆ భావాన్ని పొదివి పట్టుకొన్నారు. వీటితోపాటు అన్నమయ్యలో కనిపించే మరొక ప్రధానాంశం ప్రాపంచిక విషయాల తీరుతెన్నులను ప్రదర్శించడం. ధార్మిక నైతిక విషయాలతో పాటు సామాన్యుల నడవడిని చక్కదిద్దడానికి కావలసిన ఎన్నో లౌకిక విషయాలు కూడా అన్నమయ్య సాహిత్యంలో కుప్పలుగా కనిపిస్తాయి. ఆయన కాలానికి అన్నమయ్యది ఒక గొప్ప భక్తి ఉద్యమం. సాహిత్యం దీనికి వాహిక. ఇంతటి విశిష్టతను సంతరించుకొన్న అన్నమయ్యతో పోల్చదగిన వాగ్గేయకారులు అనంతర కాలంలో ఎక్కువమంది లేరు. ఆయన దారిలో పయనిస్తూ పదరచనలు చేసిన కొందరిలో క్షేత్రయ్య, సారంగపాణి ముఖ్యులు. వీళ్లిద్దరు అన్నమయ్యకు త్యాగరాజుకు మధ్యకాలంలో పదకర్తలుగా పేరు పొందారు.

సారంగపాణి అన్నమయ్యకు అర్వాచీనుడు. వీళ్లిద్దరి మధ్య మూడు వందల సంవత్సరాల కాల వ్యత్యాసముంది. పద సాహిత్య సృష్టిలో మేరునగ ధీరుడైన అన్నమయ్యతో సారంగపాణిని పోల్చి చూడడం అంత సబబుకాదు. ఇప్పటికి

దొరికి ప్రచురింపబడిన సారంగపాణి పదాలు రెండు వందలా పది. ముప్పై రెండువేల సంకీర్తన లెక్కడ ఈ రెండు వందలా పది ఎక్కడ. అయితే విషయ విశ్లేషణ దృష్టితో పరిశీలిస్తే ఈ రెండు వందలాపది పదాలలో అన్నమయ్య తన సంకీర్తన వాఙ్మయంలో ప్రదర్శించిన విషయ విన్యాసం కొంత అద్దంలో కనిపించినట్లు కనిపిస్తుంది. సాధారణంగా పదకర్తలందరూ భక్తి సింధువులో మునిగి పవిత్రులైన తరువాతనే రచనలు చేయడం వల్ల వాళ్లు ఏమిచెప్పినా ఎలా చెప్పినా అందులో భక్తి అంతర్వాహినిగానే ఉంటుంది. శృంగారాన్ని వర్ణించినా వైరాగ్యాన్ని వర్ణించినా భక్తి భావమే పునాదిగా ఉంటుంది. లోక నీతులు చెప్పడానికి కారణం మానవుల నడతలను మార్చి పారమార్థిక దశకు తీసుకొని పోవాలను కోవడం. ఈ దృష్టితో పచ్చిశృంగారం నిండిన జావళీలుగా క్షేత్రయ్య పదాలను పేర్కొన్నా ఆ శృంగారం వెనక అధ్యాత్మ వాసనలు గుభాళిస్తాయని కూడా అభిప్రాయ పడేవాళ్లున్నారు. పద కవిత ఉద్దేశమే ఇది. ఈ రకంగా చూచినపుడు అన్నమయ్యకు సారంగ పాణికి సామ్యాలు కనిపిస్తాయి. అన్నమయ్య వేలకొలది శృంగార సంకీర్తనలు చెపితే సారంగపాణి డెబ్బై అయిదు శృంగార పదాలు చెప్పాడు. అన్నమయ్య వేలకొలది అధ్యాత్మ సంకీర్తనలు చెపితే సారంగపాణి 72 కీర్తనలు చెప్పాడు. ఇవిగాక సారంగపాణి 66 దేశీయ పదాలను, 17 జాతీయ పదాలను రచించాడు.

వస్తువును దర్శించడంలో వీళ్లిద్దరికి భేదముంది. సర్వం శ్రీ వేంకటేశ్వర మయంగా కనిపిస్తుంది అన్నమయ్యకు. ఆయన ఏవిషయాన్ని ఎలా చెప్పినా అందులో శ్రీనివాసతత్త్వాన్నే దర్శిస్తాడు. సారంగపాణి ఏ విషయం చెప్పినా దాన్ని సమకాలీన దృష్టితోను, భవిష్యద్దృష్టితోను చూస్తాడు. ఆ రకంగా ఆయన భావాలు రంజక మయినాయి. అన్నమయ్యకు సమకాలీన దృష్టిమెండుగా ఉన్నా ఆయన శ్రీనివాసుని కొలువులోని కవి కావడం వల్ల లౌకిక విషయాలను కూడా అధ్యాత్మకంగానే సమన్వయించడం కనిపిస్తుంది. అయితే వర్ణ్య వస్తువులో ఈ ఇరువురు కవులు పొదిగే భావం చాల తీవ్రంగా ఉంటుంది. దీనికి ప్రధాన కారణం వీళ్లు నివసించిన సమాజాలు వేరు వేరు కావడం. అన్నమయ్య నివసించినది

నిష్ఠురమైన రాచరిక వ్యవస్థతో నిబంధింప బడిన సమాజంలో. సారంగపాణి కాలం నాటికి రాచవ్యవస్థ శిధిలమైపోయింది. ఆంగ్లేయుల పాలన వచ్చింది. పాశ్చాత్య సంస్కృతి ఫలితంగా సమాజంలో సంప్రదాయం చెడింది. అనూహ్యమైన మార్పులు చోటుచేసుకొన్నాయి. కవిగా సారంగపాణి ఆవ్యవస్థను జీర్ణం చేసుకోలేక పోయాడు.

పదకర్తలుగా భక్తులుగా వీళ్లిద్దరి మధ్య సామ్యముంది. అన్నమయ్య సంకీర్తనలన్నీ శ్రీవేంకటేశ్వర నామ ముద్రాంకితాలైతే సారంపాణి పదాలు కార్వేటి నగరంలో (చిత్తూరు జిల్లా) వెలసిన రుక్మిణీ సత్యభామా సమేతుడైన వేణుగోపాల స్వామి నామాంకితాలు. ఇద్దరూ వైష్ణవ కవులే. సారంగపాణి కార్వేటినగర సంస్థానాధీశుడైన మాకరాజు వేంకట పెరుమాళ్రాజు (క్రీ.శ. 1800) ఆస్థానంలో విద్యాధికారి. వైణిక విద్వాంసుడు. అభినయాచార్యుడు. పైగా వాగ్గేయకారుడు. ఈ రాజుమీద కూడా సారంగపాణి మూడు శృంగార పదాలు చెప్పాడు. రాజాస్థానంలో ఉంటూ రాజుల మనస్తత్వాలను గ్రహించడమే గాక ఆనాటి రాచ వ్యవస్థ చుట్టూ పడుగు పేక వలె అల్లుకొని పోయిన సామాజిక శృంగారపు వింత పోకడలను గమనించినవాడు సారంగపాణి. రాజుల ప్రాపకం పొందినవారి డాబుసరితనాన్ని, సామాన్యుల అసహాయతను గుర్తించడమే గాక సారంగపాణి ఆనాటి కుంఫిణీ అధికారుల సంస్కృతి తమప్రాంతాన్ని ఎలా ప్రభావితం చేసిందో చూశాడు. సంఘంలో వేశ్యా వ్యవస్థ సంసార వ్యవస్థను ఎలా కలవర పరిచిందో గమనించాడు. ఈయన శృంగార పదాలు, దేశీయ పదాలు ఈ సాంఘిక నేపథ్యం ఆధారంగా రచింపబడినాయి. అందువల్ల ఈ వాగ్గేయ కారుని పదాలలో శృంగారం అతివేలంగా కనిపిస్తుంది.

సాధారణంగా పదాలలో కనిపించే నాయకుడు ఆపదకర్త ఉపాస్యదైవం. తానే నాయికగా మారి కవి స్వామి సన్నిధానం కోరుకుంటాడు. శృంగారం ద్వారా భగవంతునిలో ఐక్యాన్ని అభిలషిస్తాడు. ఇది అనేక విధాలుగా జరుగుతుంది. లోకవృత్తాన్ని బట్టి నాయిక వర్ణనలో అనంత వైవిధ్యం గోచరిస్తుంది. అందువల్ల అన్నమయ్య సంకీర్తనలలో ఎన్నోరకాల నాయికలు కనిపిస్తారు. అష్టవిధ శృంగార

నాయికలు శాస్త్ర లక్షణాన్ననుసరించి దర్శనమిస్తారు. ఎంత విచ్చలవిడిగా వర్ణించినా అన్నమయ్య శృంగారంలో అశ్లీలత కనిపించదని కొందరంటారు. ఇప్పటి దృష్టితో పరిశీలిస్తే కొన్ని శృంగార సంకీర్తనలలోని విషయాలు అశ్లీలంగా తోచకపోవు. అన్నమయ్య కాలం పరిస్థితి వేరు. శృంగారం అంతగా దాచుకో దగిన అంశంగా అప్పటివాళ్లు అనుకోలేదు. తాళ్లపాక సాహిత్య పరిశోధకులు అన్నమయ్య శృంగారంలో అశ్లీలత లేదని చెపుతారు. ఇది పూర్తిగా నిజంకాదు. సారంగపాణి సమాజాన్ని ఎక్కువగా పట్టించుకొన్న వాడు కావడం వల్ల అప్పటి శృంగార స్థితి ఆయన పదాలలో యథాతథంగా అంటే పచ్చిగా అశ్లీలంగా కనిపిస్తున్నది. అది ఆయన దృష్టిలో వాస్తవ చిత్రణేగాని అశ్లీలత కాదు. ఇలా ఇరువురి సాహిత్యంలో పచ్చి శృంగారం కనిపిస్తున్నది.

స్థూలంగా చూస్తే వీళ్లిద్దరి శృంగారాంశాలు సమానంగా కనిపించినా ఒక చిన్న తేడా కూడా ఉంది. అన్నమయ్య భావాలు తీవ్రంగా, పలుకులు ఆలంకారి కంగా కనిపిస్తాయి. సారంగపాణిలో ఆలంకారికత లేదు. చెప్పిన విషయాలు అతిసహజమైన మట్టివాసన గలవిగా ఉంటాయి. రెండు ఉదాహరణలతో ఈ విషయం స్పష్టమవుతుంది.

మతివెనక నాతోను మాటలాడుదువుగాని
గుఱుతులు దాచుకోవే కొమ్మలు నవ్వేరు ॥పల్లవి॥

పిక్కటిల్లుఁ జన్నులపై పెనగొన్న హారాలు
చిక్కువడీ దిద్దుకోవే చక్కగా నీవు
చుక్క బొట్టు చెమటలఁ జొబ్బిలఁగా గరగెను
గక్కన నద్దము చూచి గందము పెట్టుకోవే ॥మతి॥

కొప్పులోని సంపెఁగలు కొణికల వెంట జారీ
విప్పక ముడుచుకోవే వేగఁదురుము
పిప్పిగట్టి పెదవులు పిడచినట్టున్నది
దప్పి దేర వేసుకోవే కప్పుర భాగాలు ॥మతి॥

**కట్టిన చీర వదలి కాన వచ్చీఁ బోక ముడి**
**వొట్టి బిగించు కొనవే వొడ్డాణము**
**యిట్టె శ్రీవేంకటేశుడే నలవేలుమంగను**
**నెట్టన నన్నేలెఁ బొందు నీవూఁ దెలుపుకోవే ॥మతి॥**

పై అన్నమయ్య శృంగార సంకీర్తనలో సంయోగానంతర నాయిక శరీరావస్థ మృదు మధురంగా రూపుకట్టి కనిపిస్తున్నది. నాయిక ఇలాంటి అవస్థను పొందడానికి శృంగార సముద్రంలో ఎంతో లోతు మునిగి ఉండాలి. ప్రయత్నించి పని సాధించిన తరువాత పడిన శ్రమను గురించి ఆలోచించినట్లు ఈ నాయిక సురత శ్రమను సుతారంగా వెల్లడిచేస్తున్నదీ సంకీర్తన. పైకి సాధారణంగా కనిపిస్తున్నా ఎంతో భావ గాంభీర్యతను దాచుకొన్న ఈ కీర్తన శృంగారానికి పరాకాష్ఠ. చన్నులపై పెనుగొన్న హారాలు, చెమటతో చుక్కబొట్టు కరిగిపోవడం, కొప్పునుండి సంపెంగలు వాడి రాలడం, పెదవులు పిప్పి గట్టడం, చీర కుచ్చెళ్లు సడలడం ఇత్యాది శృంగార సామగ్రి సురత పారవశ్యం అనుభవిస్తున్న నాయికను మన కండ్లముందు నిలుపుతున్నది. శృంగార కళను వ్యక్తంచేసే ఇలాంటి సంకీర్తన లెన్నో ఉన్నాయి. రత్యానంతర నాయిక సొగసును అనంతరకాల పదకర్తలుకూడా బాగానే వర్ణించారు.

**'మగువ తన కేళికా మందిరము వెడలెన్**
**వగకాడ మా కంచి వరద తెల్లవారెననుచు'**

అనే క్షేత్రయ్య పదం **'తరితీపు సేయు సమసురత బడలిక'**తో, **'ఇరుగడల కైదండ లిచ్చు తరుణులతో'** కంచి వరదరాజస్వామి మందిరం నుండి బయట కొస్తున్న అమ్మవారి సొంపును కండ్లకు కట్టినట్లు వ్యక్తంచేస్తున్నది.

ఇలాంటి శృంగార పదాలను సారంగపాణి కూడా రచించాడు. అయితే అన్నమయ్య శృంగార సంకీర్తనలలో కనిపించే ఆలంకారికత, మార్మికత వీటిలో కనిపించవు. సమాజంలో కనిపించే వాస్తవాలనే ప్రతిబింబిస్తాయి.

వలచి యుండితే నీవు వలచేది ఘనమా
వెలది కార్వేటి నగర వేణుగోపాలుడు ॥పల్లవి॥

అండ జేరి వేడేది అతని ముద్దిమ్మనేది
వుండి వుండి తమకమున వుస్సురనేది
యెండమావుల సామ్య మేమనుకోరాదికను
కొండకేగే వాని మొలను కొడవలి చెక్కినట్లాయె ॥వలచి॥

కదుప్రేమ బుట్టించేది కదిసి కౌగిలించేది
తొదరి మోవినొక్కేది దొరవనేది
మదుపులందిచ్చేది మనసురాదనేది
పదతి పులగముమీది పప్పుసామితె ఆయె ॥వలచి॥

మేలు మరువ ననేది వేళ మంచిదనేది
పాలుమాలక విటుని పైకొనేది
రాలు గాయనగ వుప రతుల తనియించేది
ఆలిమీద లంజరిక మనుమాట నిజమాయ ॥వలచి॥

ఈ సారంగపాణి పదంలో కనిపించే శృంగార స్థితి కవి కాలంనాటిది. ఇందులో నిజమైన కోరికగాని, నిజమైన ఆనందంకాని కనిపించవు. ఇంత కృతకంగా ప్రాపకం కోసం బలవంతపు శృంగారానికి పాల్పడడం కవి కాలం నాటి వ్యవస్థ. అందువల్ల శృంగారం పచ్చిదనం పెరిగి సొంపు తరిగి నీరసమైంది. సమాజంలో ఎలా కనిపిస్తే అలాగే ఎలాంటి అలంకారాలు తొడుగులు లేకుండా సహజంగా కనిపిస్తుంది. సారంగపాణి అలంకార శాస్త్రం తెలియనివాడు కాదు. ఆలంకారికంగా కవితకు నగలను నాణాలను పెడితే సహజత్వం కనిపించదని ఆలోచించాడు. శృంగారం అంగడి సరుకు కావడం ఆయన జీర్ణించుకోలేక పోయాడు. సమాజంలోని పచ్చిదనాన్ని చూపిస్తూ కూడా అన్నమయ్య ఆలంకారికతకు ఒదిగి నట్లుగా కనిపిస్తాడు. ఈ లక్షణం సారంగపాణిలో లేదు. ఇదే ఈ ఇద్దరు వాగ్గేయ కారుల మధ్య ఉన్న భేదం.

**పదతిరో వేణుగోపాలుదద్దమరేయి**
**విడిదికి వేంచేసి వేడుకలరగాను**
**తడయక నిను రతుల తమిని గూడేవేళ**
**బెడసరమటే రెండు తొడలదుముకో వలెనా**

అని సారంగపాణి చెప్పడంలో కొంత అశ్లీలత ఉంది. ఇది ఆ సంఘంలోని వ్యక్తుల నడవడిలోని అంశం కావడం వల్ల కవి చెప్పవలసి వచ్చింది. మధుర భక్తి సంప్రదాయంలో అశ్లీలతకు తావులేదు. కవి మనోనేత్రానికి ఎలా కనిపిస్తే అలా, భావనకు ఎలా తోస్తే అలా ఎలాంటి మరుగులేకుండా చెప్పడం మధుర భక్తిని ప్రదర్శించే పదకర్తల పద్ధతి. ఈ విధంగా సారంగపాణి పదంలో కనిపించే అశ్లీలతను సమర్థించవచ్చు. ఆయన పదాలు వేణుగోపాలాంకితాలైనా ఆయన దృష్టి సమాజం మీదనే. మధురభక్తి పదకర్తకు ఉపాస్య దైవానికి మధ్యగల సంబంధం మీద ఆధారపడుతుంది. సారంగపాణికి ఈ లక్షణంలేదు. అందువల్ల నిగూఢమైన భావావేశం ఆయన పదాల్లో ఉండదు. లోకపు నడతను అనాచ్ఛాదితంగా చూపాలన్నదే ఆయన ఉద్దేశం.

దేశీయ పద విభాగంలో సారంగపాణి పదాలన్నీ విటీవిటుల సంభాషణలా అనిపిస్తాయి. వేణుగోపాలుడు కేవలం సాక్షీభూతుడే. ఒక విటుడు ఒక వేశ్య ఇంటికి వచ్చాడు. ఆమె రూకలు ఇస్తేగాని లోనికి రానీయనన్నది. వక్కాకు ఇస్తేగాని మంచమెక్కనీయలేదు. ఆ విటుని మానసం నీరసమై పోయింది. ఆ వేశ్యది కోమటి విశ్వాసమట. అంబలి తాగుతూ ఉండిన వేశ్యకు సంబావడ్ల అన్నం రుచించలేదట. నిష్కర్షగా రాత్రికొచ్చేవాడవైతే నిష్కాలు తీసుకొని రమ్మని మొగమోటం లేకుండా చెప్పింది. ఒట్టిచేతులతో వచ్చినానని చులకనగా చూడకు పట్టపేనుగును తెచ్చి నీ వాకిట కట్టేస్తానంటాడు విటుడు. వారస్త్రీ నీపక్కలోకి ఊరక వచ్చునా అని నిలదీస్తుంది. నీవేనా శాస్త్రం నాచేత కాసుంటే నీయక్క ఇంకొకతె అంటాడతడు. ఇంతకంటె ఎక్కువ ఎవడిచ్చునే యేమిటికే గొణిగేవు అని ఆమెను బ్రతిమాలు కుంటాడు. ఈ విభాగంలోని పదాలన్నీ ఇలా సాగుతాయి.

పర నాగరికతా వ్యామోహంలో పడి వేశ్యలతో పాటు వావి వరుసలు లేకుండా పోకిరి ముచ్చట్లాడే కులస్త్రీలను కూడా సారంగపాణి గర్హించాడు. బడవతనంతో ఇలాంటి పనికిమాలిన తొత్తులు మగని కన్ను గప్పి అడ్డ తిరిగుళ్లు తిరిగి శగరోగాన్ని ఒళ్లున ఇమిడించుకొని సంఘాన్నే రోగగ్రస్థం చేశారు. వేశ్యావ్యవస్థ కుటుంబ వ్యవస్థను చెడగొట్టిన రోజులవి. భర్తలు వేశ్యలను మరిగి ఇండ్లు దోచి వారికి కానుకలు పెడుతూంటే కుల స్త్రీలు పడిన బాధను సారంగపాణి అర్థంచేసుకొన్నాడు. 'కులస్త్రీలు మనసు నొచ్చుకొని అసురుసురంటే మంచిదేమే నీకు' అని వార వనితలను మందలించాడు. సంసార వ్యవస్థను చిన్నా భిన్నం చేసిన కుల స్త్రీలను కూడా సారంగపాణి నిందించాడు.

**కులకాంతలు విడిబడి నలుదిక్కుల చెలరేగి రిదేటి పాపమో**
**వెలయాండ్లకు జీవన మేమిక శ్రీవేణుగోపాలా సంకరమై**
**ఉగదెలియని బిడ్డల నెడబాసి వున్న మూల ముంత దాటవేసి**
**మగని పేరు కారాదని రోసి మన్నెకాపురము వ్యర్థము జేసి**
**అందెలు మట్టెలు రవికలో జుట్టి అత్తమామలకు దుద్దులు బెట్టి**
**బందరు పావడలో సద్దిగట్టి పట్ణము జూతామని భ్రమబుట్టి**
**జారుపైట చెరగు మెడకు జుట్టి తేర లంజకాండ్ర చెట్టబట్టి**
**ఊరిదిక్కు రోత బుట్టి ఉబ్బిబ్బై తొడదట్టి**
**పగలురేయి జాగ్రత్తగా నడిచి బాపనిండ్ల పూటకూళ్లు గుడిచి**
.... .... .... .... .... .... .... ....

ఈ పదం పర నాగరకత స్త్రీలలో కలిగించిన అవాంఛనీయమైన మార్పులను రూపు కట్టిస్తున్నది. ఇలాంటి పదాల ద్వారా ప్రజలలో నైతిక వర్తన కలిగించడానికి సారంగపాణి ప్రయత్నించాడు. కవిగా వాగ్గేయకారుడుగా సంఘ సంస్కరణను ఒక ఉద్యమంగా భావించాడు. అందువల్లనే శృంగార విషయాలను ఆవిధంగా నిర్వహించాడు.

శృంగారంలో భక్తి, భక్తిలో శృంగారం పడుగు పేకగా అల్లుకొని పోయిన అన్నమయ్య సంకీర్తనలలో సంస్కరణ భావాలు ఉన్నాయి కాని సంస్కరణను ఒక

ఉద్యమంగా నడప వలసిన అవసరం ఆయనకు కలుగలేదు. సమాజంలో అందరూ సమానమని, ధర్మంగాని నీతిగాని అందరికీ ఒకేరకంగా ఉండాలని అనేక సంకీర్తనలలో అన్నమయ్య బోధించాడు. అయినా ఆయన భక్తి ఉద్యమానికది గౌణంగానే ఉండిపోయింది. సారంగపాణి కాలంనాటి సాంఘిక స్థితి అన్నమయ్య కాలంలో లేదు. 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మ మొక్కటే' అనే సంకీర్తనలో అన్నమయ్య అందరూ సమానమని చాటడం సంస్కరణలో భాగమైనప్పటికి ఆ సమానత్వం పరబ్రహ్మ దృష్టిలోనని చెప్పడం వల్ల అది సిద్ధాంతంగానే మిగిలిపోయింది. పరబ్రహ్మ దృష్టిలో సమానమైన మానవులలో ఏర్పడిన వృత్తిభేదాలు, సాంస్కృతిక భేదాలు సారంగపాణి దృష్టిలో పడి ఆయా పదాలకు వస్తువు లయినాయి. సంప్రదాయ విచ్ఛేదకంగా పరిణమించిన మార్పులను సారంగపాణి తీవ్రంగా గర్హించాడు. అన్నమయ్యకు సారంగపాణికి గల ప్రధానమైన దృష్టి భేదమిదే.

కీర్తనల విభాగంలోని పదాలలో సారంగపాణి లౌకిక విషయాలెన్నిటినో చేర్చిసమకాలీన సమాజస్థితిని మన కండ్ల ముందు నిలబెట్టినాడు. ఈ దృష్టితో పరిశీలిస్తే అన్నమయ్య సంకీర్తనలలో కూడా ఎన్నో లౌకిక విషయాలు కనిపిస్తాయి.

**తలచిన వన్నియు తనకొరకే**
**సూదుల మాటల సుఖము లివి**
**కొండవంటిది యాస - గోడవంటిది తగులు**
**అప్పులేని సంసారమైన పాటే చాలు -**
**తప్పులేని జీతమొక్క తారమైన చాలు**
**కాయ పండు సేయబోతే -**
**కడుపులే గాక**

ఇత్యాది నీతివాక్యాలుగా కనిపించే విషయాలన్ని అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలలో కనిపిస్తాయి. సంఘపు నడత కుంటు పడడానికి ప్రధాన కారణమైన వేశ్యా వ్యవస్థ అన్నమయ్య కాలంలోనూ ఉంది.

**చక్కదనముల వార సతులార**
**యిక్కువ తెక్కువల మీరేమి సేసేరింకను** ॥పల్లవి॥

ఒప్పుగా నరకము మామంబళిచ్చిన మనమెల్ల
కప్పము గొంటిరా యంగనలార
అప్పుడే గోవిందునికి ఆహి వెట్టితి చిత్తము
యిప్పుడు యెమ్మెలను మీరేమి సేసేరింకను ॥చక్క॥

పంచమహాపాతకాల బారిందోసి మాసిగ్గులు
లంచము గొంటరిగా నెలంతలారా
వంచన తోడుత హరివారమైతి మింక మీ
యించుక గుట్టుల మీరెందుజొచ్చేరింకను ॥చక్క॥

దొంగిలి మాగుట్టులెల్ల దోవచేసి మరుబారి
భంగపెట్టితిరిగా వో భామలార
చెంగలించి వేంకటేశు సేవకుం జొచ్చితిమి
యెంగిలి మోవులును మీరేడబడే రింకను ॥చక్క॥

పై అన్నమయ్య సంకీర్తన ఆనాటి వేశ్యలకు లోబడని, వారిపై మోహంలేని భక్తి చిత్త ప్రణవులైన వారిని చిత్రిస్తున్నది. ఇందులో అన్నమయ్య స్వవిషయం ఉందా లేదా అనేది ముఖ్యం కాదు కాని అప్పటి ఆచార వంతులను వేశ్యాశృంగారం ఎలా లోగొన్నది చర్చనీయాంశం. సమాజాన్ని శృంగారం పరిపాలిస్తుండిన ఆకాలంలో వేశ్యా సంపర్కం లేనివాళ్లు బహుకొద్దిమందే. వీళ్లు భక్తులు కావచ్చు లేక సామాన్యులు కావచ్చు. వారసతుల అందానికి దాసులు కాబోయి అంతలోనే తప్పు గ్రహించి విముఖులైన వారు కూడా కొద్దిగానైనా ఆకాలంలో ఉన్నారు. వారకాంతల మోహంలో పడితే విటులుగా మారిపోతారు. దీనికి విముఖులైన వారు భక్తులవుతారు లేదా మంచి గృహస్థులవుతారు. ఈ రెండు దశలకు పరీక్షా స్థానం వేశ్యాశృంగారం.

వేంకటేశ్వరుని సేవకులుగా హరివారలుగా చిత్తం శ్రీహరికర్పించిన అన్నమయ్య వంటివారిని ఎలాంటి వేశ్యలైనా ఏమీ చేయలేరని ఈ సంకీర్తన సారాంశం. ఏమీ చేయలేరని అన్నమయ్య చెపితే వేశ్యలవల్ల పాడైన వారిని

గురించి సారంగపాణి చెప్పాడు. సంఘంలో మానవుడు మంచివాడుగా జీవించడం ఎంత కష్టమో సారంగపాణికి తెలుసు. కుటుంబ వ్యవస్థను గురించి వేణుగోపాలుని పరంగా సారంగపాణి చెప్పిన ఈ పదం అప్పటి సమాజ దృష్టితో చాల ముఖ్యమైంది.

**నీవారి నడత లన్నియు నేనేమెరుగనా**
**భావజ జనక వేణుగోపాలా నాతో దాచితేనే**
**తల్లి నిన్ను రోలగట్టె తండ్రి యావుల మేప బంపె**
**యిల్లాలు సద్దసేయక యిల్లిల్లు విహరించ సాగె**
**అత్తగారు నరనాథుల కందరికి పొత్తుల బాయ**
**ఉత్తముడౌ నీయన్న నాగేలెత్తుకొని తిరుగులాడె**
**కోడలందరి నోళ్లనిలిచె కొడుకు తలగొట్ల మారాయె**
**నాడే నీ సోదరి యొక సన్యాసి నంటుకొని జరిగె**
**కూతురు పారుబోతాయె నీతి దప్పి నడిచేను నీమరిది**
**భూతేశుడైన మీ బావ చేతగాక బిచ్చమెత్తె**
**హింసకు వెరవని కాల కంసుడు మేనమామ నీ**
**సంసార మిటువంటి దయ్యె స్వామి వేణుగోపాల**

ఈపదంలో వర్ణితమైన సంసారం సారంగపాణి కాలంనాటి సంసారాలలో ఒక నమూనా సంసారం. వ్యక్తికి వ్యక్తికి మధ్యగల సంబంధం సక్రమంగా ఉంటే సంసారం సారవంతంగా ఉంటుంది. ఈ సంబంధం చెడిపోతే ఎన్ని సమస్యలు పుట్టుకొస్తాయో ఈ పదం వివరిస్తున్నది. ఇలాంటి సంసారపు వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించిన సంస్కరణాభిలాషి సారంగపాణి. సారంగపాణి పదాలలో ఆయనలోని కవి, విమర్శకుడు, సంస్కరణాభిలాషి ఒకరిని తోసుకొంటూ మరొకరు ప్రత్యక్షమవుతారు.

భాషా విషయకంగా ఏ పదకర్తకూ రాని గొప్ప ఖ్యాతి సారంగపాణికి కలిగింది. దీనికి కారణం ఆయన వాడిన పామరభాష. విద్యాగంధం లేనివాళ్లు

పామరులు. వాళ్లు ఎలాంటి భాష మాట్లాడతారో అలాంటి భాషలోనే రాయడం పాత్రోచిత భాష అనేమాట కర్థం. వ్యవహారభాష వేరు. పామర భాష వేరు. పదకర్తలలో అన్నమయ్య గ్రామ్య భాషలో రాయవచ్చునని చెప్పినట్లు సంకీర్తన లక్షణంలోని–

**'పల్లవ నారీ మ్లేచ్ఛా, ద్యుల్లాసమనోజ్ఞ బంధురోక్తులు చవియై**
**చెల్లును గ్రామ్యము లైనను, హల్లీసక ముఖ్య నాటకాదిక ఫణితిన్'**

అనే పద్యం సాక్ష్యం. పల్లవులు, స్త్రీలు, మ్లేచ్ఛులు వారివారికి సహజమైన భాషలో మాట్లాడితే వినసొంపుగా ఉంటుంది. ప్రాచీన కాలం నుండి సంస్కృత నాటకాలలో ఈ పద్ధతి ఉంది. తానుచెప్పిన లక్షణానికి అనుగుణంగానే అన్నమయ్య తన సంకీర్తనలలో అప్పటి ప్రజలెలా మాట్లాడే వారో ఆవిధంగానే రాశాడు.

కలుగక మానీనా, సుదతి నీకితవంటా చూచెగాని, దేవరవవుత యింత తెలియరా నేను మొదలైన ప్రయోగాల్లో మానీనా ఇతవంటా, అవుత వంటి క్రియలు ఆనాటి వ్యవహారంలో ఉండినాయి. 'ఏమిరే ఓ చెలులాల' అనే ప్రయోగంలో కిమర్థకమైన 'ఏమి' అను దానిమీద 'రే' అనే ఆమంత్రణ వాచకం పరమై కనిపిస్తున్నది. ఏమిర ఏమిరే వంటి రూపాలు ఇప్పటి రాయలసీమ వ్యవహార భాషలో ఉన్నాయి.

**తలచి రాగల మేలు తానే వచ్చురే**
**పోగల వెల్ల వడిఁ దానే పోవురే**
**తను దానే చింతింప తలపు నిలుచురే**
**పాపాలు మంచు విచ్చినట్టు విచ్చురే**

ఇత్యాది వాక్యాలలో ఈ ప్రయోగం ఉంది. **'కరఁగు కోవయ్యా లోలో గట్టి మనసు'** అనే వాక్యంలో కరఁగుకోవడమంటే కరిగించుకోవడమని అర్థం. ఇది ప్రేరణార్థక క్రియ. మనుజలాల, తమ్ములాల, అన్నలాల, అమ్మలాల వంటి ప్రయోగాలు అన్నమయ్య సాహిత్యంలో కొల్లలుగా కనిపిస్తాయి. అన్నమయ్య కడప జిల్లా వాడు కాబట్టి ఆ ప్రాంతపు ఎన్నో వ్యావహారిక, గ్రామ్య ప్రయోగాలు

సంకీర్తనలకెక్కినాయి. పెదతిరుమలయ్య భగవద్గీతా వ్యాఖ్యానంలో కూడా రాయలసీమ గ్రామ్యభాష కనిపిస్తుంది. తాళ్లపాక కవుల తరువాత గ్రామ్య భాషను ఎక్కువగా ఆదరించినవాడు సారంగపాణి. అన్నమయ్య సారంగపాణి ఇద్దరూ రాయలసీమ వాళ్లు కావడంవల్ల, ఇద్దరూ గ్రామ్యభాషా పదాలను తమ రచనలలో ఉపయోగించడం వల్ల, రాయలసీమలో వెలువడిన పదసాహిత్యం పాత్రోచిత భాషలోనే రావడం వల్ల, ఈ ప్రాంతంలో ఇలాంటి భాషా సంప్రదాయం అన్నమయ్య కాలం నుండి కొనసాగిందని చెప్పవచ్చు. క్షేత్రయ్య పదాలలోను, త్యాగయ్య కీర్తనలలోను కనిపించే భాష సంప్రదాయ సాహిత్య భాషకు దగ్గరగా కనపడుతుంది.

సారంగపాణి జాతీయ పదాలుగా పేర్కొనిన 17 పదాలలో ఆనాటి పల్లె ప్రజలు మాట్లాడే భాష యథాతథంగా వాడబడింది. పామర ప్రజల భాషను ప్రత్యేకంగా గ్రంథస్థం చేసినవారు ఆయనకంటె ముందు ఎవరూ కనిపించరు. ఈ 17 పదాలు చదివినపుడు మనకు వెంటనే అర్థంగావు. పామరభాషలో సహజంగా దొరిలే పదాలు, పదబంధాలు ఈనాటి వ్యవహారభాషలో కనిపించవు. పదాల స్వరూపాన్ని, ప్రజల సాంస్కృతిక జీవితాన్ని అర్థంచేసుకొంటే తప్ప సారంగ పాణి వాడిన భాష అర్థంకాదు.

ఈ 17 పదాలు సారంగపాణి కాలంనాటి కరువు పరిస్థితులను, భిక్షగాండ్ల బెడదను, పల్లెటూళ్లలో జరిగే తిరునాళ్లను, పల్లెటూరి సంతలను, పామర విటుల - వేశ్యల సంబంధాలను యథాతథంగా చిత్రిస్తున్నాయి. విషయ వివరణలకంటె సారంగపాణి వాడినభాష ఎలా ఉన్నదో చూపడానికి ఒకపదాన్ని పరిశీలించడం అవసరం.

**నగరాన తెప్పతిర్నాల్ల యేడిక సూన్ను**
**నాగు నూరాలేదంటే అపిడె ॥పల్లవి॥**

**అగుముడి యల్లచ్చి తొగటాయాటను బశివి**
**చిగ మెత్తినట్టెళ్లి వొగరితో సెప్పకనే రెయ్యి ॥అనుపల్లవి॥**

పదమ చరుచువాడ పందిల్లె బిగినోదం
సదురేశిందే చోదెం చామిదేయింతా
యెదురు మలుగ కూ దొండేశి రింటెలుపున
అదె శెయి సూపియ్యేశి రాన్నే మాశి కింతతై ॥నగ॥

చోమాదిగులయ్యో ర్లేమో యేటల సంపి
వోమా మగ్గిలో యేసే రౌనము కాదా
యేమా బేమనమూక యెక్కడి యిషమ రార్ఘుం
రామానుజ పజలో రాల్నంటె యిశికేస్తే ॥నగ॥

అంగల్ల వొరుతుకూల అయ్యతోడే యేశగార్ల
బంగారు గరుకు మొల్ల బారు మేలాల
చంగినీ గుత్తాల లచ్చలయి పల్లకేనిగల
జంగమాల్లా బేదె మంగలోల్లు వాశేదే ॥నగ॥

ఈ పదంలో కనిపించే యేడికె, సూన్ను, ఎత్రి, రెయ్యి, చరచు, చామి, యేట, బేమనమూక, వొరుతుకుల, యేశగార్ల, ఊబేదె, వాశేదే ఇత్యాది పదబంధాలన్నీ పామరుల వ్యవహారం లోనివి. ఇతర పదాలలో కనిపించే పాయం, సాం్రబాణి, మారాముళ్లు, మచ్చు, చీటి, తెగువ, దేవర, బూటకం, సందేల, మిద్దియిల్లు, సొమ్ములు, వడ్డి, విటుకులాడి, వేటగొట్టు, రూక, రాకడి, దుడ్డు, కజ్జాయం, ఉప్పుచట్టి, అంబలి, దండిగ, తిరిపం, సున్నపాకు, వేకటి, పిడచ మొదలైన పదాలన్నీ ఆనాటి వ్యవహారం లోనివే. ఈ 17 పదాలలో సారంగపాణి వ్యవహారంలోని పదాలతో పామర పదాలను కలిపి వాడుకొన్నాడు. ఆనాటి ప్రజల సామాజిక స్థితిగతులను తెలిసికొని ఈ పదాలను గురించి ఆలోచిస్తే అప్పటి సామాజిక వ్యవస్థ అర్థమవుతుంది.

భాషా విషయంలో సారంగపాణిని ఉన్నత శిఖరంపై నిలిపినది జాతీయ పదాలలో ఆయన వాడిన పామర భాష. గ్రామాలలో తిరునాళ్లు జరుపుకోవడం, సంతలకెళ్లడం పామరులకు రుచించినట్లు పండితులకు రుచించదు. పామరులు

వాళ్లకలవాటైన భాషలోనే మాట్లాడుకొంటారు. పామరుల భాషమీద మరొక భాషా పద్ధతికి చెందిన ప్రభావం కనిపించదు. పామరులతో కలసి మెలసి ఉంటున్నప్పటికి పండితులు పామర భాషాపదాలను తమ రచనలలో వాడుకోవడం అరుదు. సారంగపాణి మాత్రం పట్టుబట్టి జాతీయ పదాలను పామర భాషలో రచించి తన పాత్రోచిత భాషా ప్రియత్వాన్ని ప్రకటించుకొన్నాడు.

పదసాహిత్యంలో అన్నమయ్య మొదలుపెట్టిన ఈ భాషా ఉద్యమాన్ని సారంగపాణి కొనసాగించడమేగాక దానికి ప్రాచుర్యం కలిగించాడు. దేశ భాష లేర్పడి ఆ భాషలకు సాహిత్య స్థితి సిద్ధించిన తరువాత కవులు పాత్రోచిత భాషా సిద్ధాంతం దృష్టిలో పెట్టుకొని కొంతవరకైనా పాత్రల మధ్య భాషాభేదం చూపుతూ వచ్చారు. తెలుగులో ఈ పద్ధతి కొంతవరకు కొనసాగి అవసాన స్థితికి వచ్చిన సమయంలో సారంగపాణి పట్టుబట్టి ఈ పామర భాషకు పెద్దపీట వేశాడు. అన్నమయ్యకు, సారంగపాణికి మధ్యగల మూడువందల సంవత్సరాల కాలంలో పాత్రోచిత భాషా సిద్ధాంతాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఆంధ్రదేశంలో తరువాత జరిగిన భాషా పరిణామాన్ని బట్టి వ్యావహారికభాషా ఉద్యమానికి సారంగపాణి ఆద్యుడని చెప్పవలసి ఉంది. ఈ ఉద్యమం ఇలాగే కొనసాగి కొక్కండవారిలో మొలకెత్తి, వీరేశలింగం గారిలో కొంత తలఎత్తి, వేంకటరాయ శాస్త్రిలో అటూ ఇటూ ఊగులాడి, అప్పారావు గారిలో వేళ్లు దన్ని, రామమూర్తి గారిలో పల్లవించి పుష్పించి ఫలించింది. ఇలా అన్నమయ్యకు సారంగపాణి సాహిత్య వారసుడేగాక అన్నమయ్య భాషోద్యమాన్ని కొనసాగించి ఆ తరువాత ఏర్పడిన వ్యావహారిక భాషోద్యమానికి దోహదం చేశాడు.

# అన్నమయ్య సంకీర్తనేతర రచనలు

కలియుగంలో హరి సంకీర్తన వల్ల జనులు ముక్తి పొందుతారని విష్ణు పురాణం చెపుతున్నది. ఈ విషయాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి సంకీర్తన యజ్ఞంలో పునీతులైనవారు తాళ్లపాక కవులు. ఈ వంశంలో జన్మించిన నాలుగు తరాల కవులు సంకీర్తన సుమాలతో శ్రీవేంకటేశ్వరుని అర్చించి తమ పుట్టుకను సార్థకం చేసుకోవడమేగాక భవిష్యత్తరాల వారమైన మనకందరికీ హరిసంకీర్తనా మృతాన్ని పంచిపెట్టిపోయారు. తాళ్లపాక కవులు సంకీర్తన, వచనం, ద్విపద, దండకం, ఉదాహరణ మొదలైన దేశి కవితా ప్రక్రియలలో అనంతమైన సాహిత్యాన్ని సృష్టించడమేగాక సంకీర్తన లక్షణం, రేఫఱకార నిర్ణయం వంటి లక్షణ గ్రంథాలను కూడా రచించారు. అయినా తాళ్లపాక వారనగానే మనకు సంకీర్తన వాఙ్మయమే గుర్తుకొస్తుంది. ఈ వంశానికి మూలపురుషుడు హరి సంకీర్తనా చార్యుడు, పద కవితా పితామహుడు అయిన తాళ్లపాక అన్నమయ్య. ఆయన కాలం నాటికి తెలుగు సాహిత్యంలో భక్తి ఉద్యమం ప్రచురంగా ప్రచారంలో ఉంది. భగవద్రామానుజులు ఆంధ్రదేశానికి వచ్చి అప్పటికే ఇక్కడ ఉండిన వైష్ణవానికి ఎనలేని ప్రాభవం కలిగించారు. భక్తుల మానసాలు వైష్ణవ సిద్ధాంతోన్ముఖంగా ఉండిన సమయంలో అన్నమయ్య నవవిధ భక్తిమార్గాలలోని సంకీర్తనం ద్వారా ముముక్షత్వం పొందవచ్చునని చెప్పడానికి, వైష్ణవాన్ని అనంత విధాలుగా ప్రచారం చేయడానికి పూనుకొన్నాడు. ఈ ఉద్యమాన్ని సాహిత్యం ద్వారా సాధించే ప్రయత్నంలో ఆయన సంకీర్తనను వాహికగా తీసుకొన్నాడు. భక్తిని ప్రధాన విషయంగా గ్రహించి శ్రీవేంకటేశ్వరార్పణంగా సంకీర్తనలు రచించి సంకీర్తనా

చార్యుడయ్యాడు. ఈయనతోపాటు ఈయన కుమారులు, మనుమలు, మునిమనుమలు కూడా దేశిప్రక్రియలలో సృష్టించిన సాహిత్యం ద్వారా స్వామిని ఆరాధించారు.

తాళ్లపాక చిన్నన్న అన్నమయ్య చరిత్రను ద్విపదలో రచించాడు. ఇందులో అన్నమయ్య జీవితంలోని వివిధ సంఘటనలే కాక ఆయన సాహిత్యం కూడా ప్రస్తావించబడినాయి. చిన్నన్న చెప్పిన విషయాలను బట్టి అన్నమయ్య సాహిత్యం శతకంలో ప్రారంభమైనట్లు చెప్పవచ్చు. పసితనంలో అన్నమయ్య స్వామి దర్శనం కోసం కొండ ఎక్కుతూ మోకాళ్ల పర్వతం దగ్గర సొమ్మసిల్లి పడిపోగా అలిమేలుమంగ వచ్చి సేదదీర్చినట్లు, ఆ సందర్భంలో అమ్మమీద ఆశువుగా ఒక శతకం చెప్పినట్లు చిన్నన్న కథనం. తరువాత దేవాలయంలో స్వామిని దర్శించడానికి వెళ్ళి అప్పటికే అర్చకులు గుడి తలుపులు మూసి ఉండడం చూచి వేంకటపతి మీద మరొక శతకం చెప్పాడని, ఆశతకంలో వ్యక్తమయ్యే భక్తి ప్రపత్తులే గుడితలుపులను తెరచుకొనేటట్లు చేశాయని అన్నమాచార్య చరిత్రలో ఉంది. ఇలాంటి శతకాలను అన్నమయ్య పన్నెండింటిని రచించినట్లు చిన్నన్న చెపుతున్నాడు. అయితే ప్రస్తుతం శ్రీవేంకటేశ్వర శతకం ఒక్కటే దొరుకుతూ ఉంది.

అన్నమయ్య అంతరంగాన్ని స్వామికి అతిసన్నిహితం చేసినవి ఆయన సారస నేత్రునిపై రచించిన వరమంత్రాలుగా పేరుపొందిన సంకీర్తనలు. అన్నమయ్య కాలం నుండి సంకీర్తన వాఙ్మయమనే ఒక దేశీయశాఖ ప్రాచుర్యంలోకి వచ్చింది. అందువల్లనే అన్నమయ్యకు సంకీర్తన లక్షణం చెప్పవలసిన అవసరమేర్పడి సంకీర్తన లక్షణ గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. ఆయన రచించిన శృంగార ధ్యాత్మ సంకీర్తనలన్నీ దీనికి లక్ష్యాలు. సంకీర్తనలలో ప్రపంచించిన శరణాగత తత్త్వానికి మరొక ప్రమాణ గ్రంథాన్ని లక్ష్యంగా చేయాలని కాబోలు ద్విపద రామాయణం రచించాడు.

జీవేశ్వరుల సంయోగాన్ని మధుర భక్తియుతంగా వివరించడానికి అన్నమయ్య చేసిన ప్రయత్నం శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్నది. జీవేశ్వరుల

శృంగారం లక్ష్మీనారాయణుల శృంగారం నుండి విడివడిన విషయం. దీనిని నిరూపించడానికి అన్నమయ్య పద్మావతీ వేంకట విభుల దివ్యశృంగారాన్ని శృంగార మంజరి అనే కావ్యంగా నిబంధించాడు. భువనమోహనమైన దివ్యశృంగారం అనుభవంలోకి వస్తున్న తరుణంలో భక్తులు స్వామివారి కల్యాణ లీలలను మనసుతో ఆస్వాదించే ప్రయత్నం చేస్తారు. ఈకారణం చేతనే అన్నమయ్య పద్మావతీ శ్రీనివాసుల ప్రణయాన్ని పండించిన కల్యాణ గాథను వివరించడానికి సంస్కృతంలో వేంకటాచల మాహాత్మ్యం రచించాడు. ఇలా పరిశీలిస్తే భగవత్ప్రాప్తి కోసం ప్రయత్నించే భక్తుల ఆర్తిని, వాళ్ల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకొని దివ్య తత్త్వాన్ని వాళ్లకు దగ్గర చేయడానికి నిర్మించిన సోపానాలా అన్నట్లు వాళ్లకోసం వివిధ రచనలు చేసి తానుకూడా తరించినట్లు అర్థమవుతుంది.

## వేంకటేశ్వర శతకం

'వేంకటేశ్వరా' అన్న మకుటంతో ఉన్న ఈ శతకంలో అలివేలుమంగా శ్రీనివాసుల దివ్యశృంగారం వర్ణింపబడింది. ఈ శతకాన్ని అన్నమయ్య ఏ సందర్భంలో రచించినది స్పష్టంగా తెలియదు. తొలిసారిగా కొండకు వెళ్ళినప్పుడు మోకాళ్ల పర్వతం దగ్గర అలివేలుమంగ సేదదీర్చిన సందర్భంలో ఆశువుగా చెప్పిన శతకమని కొందరి అభిప్రాయం. 'వేంకటేశ్వరా' అనే మకుటం తప్ప అలిమేలు మంగకు సంబంధించిన విషయాలే ఎక్కువగా ఉండడం దీనికి కారణం. అయితే అంత చిన్నవయస్సులో ఇంతటి గంభీరమైన ప్రణయ విషయాలు చెప్పడం సాధ్యంకాదని కూడా ఒక అభిప్రాయం ఉంది. స్వామి దర్శనానికి వెళ్లి ప్రధాన ద్వారం మూసివేసి ఉండడం చూచి ఈ శతకం చెప్పినట్లు కొందరి అభిప్రాయం. ఈ శతకావిర్భావానికి ఈ సందర్భం కూడా తగిన సందర్భం కాదు. అన్నమయ్య గృహస్థుడై తిరుమలలో కాపురముండిన కాలంలో ఈ శతకం రచించి ఉంటాడని నమ్మవచ్చు. శృంగారధ్యాత్మ సంకీర్తనలు రచిస్తూ మధుర భక్తి వైపు మొగ్గుతూ ఉండిన వయస్సులో లౌకికానుభవాలను అధ్యాత్మ భావాలతో జతకూర్చడం కోసం ఈ శతకం రచించి ఉంటాడు.

నూరు పద్యాలున్న ఈ శతకంలో భక్తి శృంగారాలతోపాటు వివిధ లౌకిక విషయాలు చోటుచేసుకొన్నాయి. ఇది చంపకోత్పల వృత్తాలలో ఉండడం అన్నమయ్య అలిమేలుమంగా శ్రీనివాసులను చంపకోత్పల పుష్పాలతో అర్చిండమే నని భావించవచ్చు. అన్ని శతకాలలో వలె ఇందులో కూడా మకుటం, సంఖ్యా నియమం, స్తుతి ప్రాధాన్యం ఉన్నప్పటికి ఇతర శతకాలలో అంతగాలేని ప్రణయేతి వృత్తం ఈ శతకాన్ని శృంగార శతకంగా మార్చింది. శృంగార ప్రధానమైన శతకాలలో ఇదే మొదటిదని కూడా చెప్పవచ్చు.

సాధారణంగా ఏ వస్తువు శతకంలో విస్తరింప బడుతుందో దానికి సంబంధించిన మకుటం ఉంటుంది. కాని ఇందులో 'వేంకటేశ్వరా' అనే మకుటం ఉన్నప్పటికి ప్రతిపద్యంలో అలిమేలుమంగ ప్రస్తుతి ఉండడమేగాక ఆమెకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. అందువల్ల దీనిని మంగాంబికా శతకం అనవచ్చునని, అన్నమయ్య మొదటి శతకం ఇదేనని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అభిప్రాయ పడినారు. కాని ఆనందమూర్తిగారు మాత్రం అలివేలుమంగమ్మ మీద చెప్పిన శతకం, ఈ శతకం వేరువేరని చెపుతున్నారు. చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో ఒకచోట–

**'అలివేలు మంగకు నాశుమార్గముగాను**
**సలలితంబుగ నొక్క శతకంబు చెప్పె'** అని, మరొకచోట –

**'వితత వృత్తంబుల వేంకటపతికి**
**శతకంబు కుతుకంబు సమకూరజేసి'** అని చెప్పడం దీనికాధారం.

ఈ శతకానికి ముందే శివపార్వతుల ప్రణయాన్ని ఇతివృత్తంగా గ్రహించి రావిపాటి త్రిపురాంతకునిచే రచింపబడిన 'అంబికా శతకం' ప్రచారంలో ఉంది. ఈ శతకం అన్నమయ్యకు ప్రేరణ కలిగించి ఉండవచ్చు.

**వాలిన కన్ను ముంగురులు వాతెఱ కెంపు మెఱుంగుఁ జంటిపై**
**గ్రాలెడు తారహారమును గంకణ చారుకరంబు తేటలన్**

**దూలుచు నున్న పయ్యెదయుఁ దోచిన కన్నుల మోడ్చి మోడ్చి నీ**
**పాలగు నీశుమేని సగబాలు మనంబున జేర్తు నంబికా**

ఇత్యాది పద్యాలలో అంబికకే ప్రాధాన్యత ఉండడం వల్ల దీనికి అంబికా శతకమనే పేరు అన్వర్థమైంది. కాని అన్నమయ్య వేంకటేశ్వర శతకం స్వామిపేరు మీద ఉన్నప్పటికి అమ్మవారి లీలలే అధికంగా కనిపిస్తూ ఆమె ప్రాధాన్యాన్ని నొక్కి చెపుతున్నాయి. దీనికి కారణం శ్రీవైష్ణవంలో అమ్మవారికి గల స్థానం. ముందు లక్ష్మిని తరువాత స్వామిని స్తుతించడం వైష్ణవుల మార్గం. ఆమె తద్వక్షస్థల నిత్యవాసరసిక, తత్కాంతి సంవర్ధిని కావడం దీనికి కారణం. ఈ కారణాల వల్ల అన్నమయ్య వైష్ణవం బాగా పక్వమైన తరువాతనే ఈ శతకం రచింపబడి ఉంటుందనడం సబబు.

ఈ శతకంలో విషయాలెన్ని ఉన్నా ఆ దివ్య దంపతుల శృంగార లీల ప్రధానమైంది. అన్నమయ్య ఈ శృంగారాన్ని ఎందుకు వర్ణించాడంటే అది విశ్వైక మోహన శృంగారం కాబట్టి. ఆ శృంగారం సృష్టికి హేతువు. సమస్త ప్రాణులు అందులోనుండి పొటమరిల్లుతున్నాయి. ఇది ఒక కారణం. నిత్య విభూతిలోని దివ్య శృంగారాన్ని లీలావిభూతికి దింపడం ప్రాణులకోసం. ప్రాణుల ఆనందం కోసం. ప్రాణులు తమ ఉనికిని తాము తెలుసుకోవడం కోసం. ఇది మరొక కారణం. శృంగారం ఎలా ఉంటుందో తెలియజెప్పాలనుకోవడం మూడోకారణం. శృంగారం దాంపత్య గతంగా ఉంటుంది. దంపతులిద్దరిదీ ఒకే తత్త్వం. ఇరువురి మధ్య హెచ్చు తగ్గులుండవు.

**'సీత శ్రీరామచంద్రుని చిత్తపథము**
**రామచంద్రుడు జానకీ ప్రాణ పదము**
**రామ సర్పఫణామణి రమణి సీత**
**ధరణిజా జీవితాతప తరణి స్వామి'**

అనే శ్రీమద్రామాయణ కల్పవృక్షంలోని పద్యంలో సీతారాముల దాంపత్య ధర్మం రూపుదాల్చి కనిపిస్తున్నది. ఇందులో ఎవరు ఎక్కువ తక్కువ లన్నది లేదు.

ఇరువురి మధ్య ఉన్నది ఒక అద్వైత స్థితి. వాళ్లు ఒకరికోసం ఒకరున్నారు. ఇదీ శృంగార మంటే. ఇంత నిగూఢమైన శృంగారాన్ని కవి ఎందుకు చెప్పాడంటే లోకం కోసం.

అన్నమయ్య శతకంలో కూడా ఈ సిద్ధాంతం అంతర్వాహినిగా ఉంది. ఒక పద్యంలో **'ఓ యలిమేలుమంగ నీ చూచిన చూపులే విభుడు చూచిన చూపుల'**ని, ఖేచర సిద్ధకామినులు ఆ చూపులను కీర్తన చేస్తారని ఉంది. ఒకరు చూచిన చూపు మరొకరి చూపు ఎలా అవుతుంది? ఈ చూపు కంటిచూపు కాదు. లోచూపు. అంటే మనోనేత్రంతో చూచేచూపు. ఇరువురి మనస్సులు ఒకటైనపుడు చూపు కూడా ఒకటే అవుతుంది. ప్రేయసీ ప్రియులు సంభాషణలో 'నాకంటితో నీవు చూడుమ'ని అనుకోవడం లోకంలో ఉంది. అందువల్ల ఈ పద్యం దివ్య శృంగారానికి ఒక మంచి ఉదాహరణ.

ఈ శతకంలో సంభోగ ప్రణయాన్ని రూపుకట్టించే పద్యాలు కూడా ఉన్నాయి. శరీరం శరీరంతో కలవడం కాదు. ప్రాణం ప్రాణంతో కలవడం సంభోగానికి చరమావస్థ అని అన్నమయ్య అభిప్రాయపడినట్లు –

> **'ఓ యలిమేలు మంగ యిది యొక్కటిపో జగదేక భర్తకున్**
> **బాయని నీకునుం గదమ ప్రాణము ప్రాణము నేకమాయె'**

అనే పద్యం చెపుతుంది.

> **'అతడె నీవు నీవనగ నాతడు నీ పలుకె తలంపగా**
> **నాతని పల్కు నీ హృదయ మాతడె పో - - - - -,**

అనే పద్యం కూడా దీనికి మంచి ఉదాహరణ.

అన్నమయ్య శ్రీపతిని శరణువేడి శరణుపొంది తాను తరించి మనలను తరింపజేయడానికి తన సాహిత్య పెన్నిధిని మనకిచ్చి పోయిన మహానుభావుడు. ప్రక్రియ ఏదైనా ఆయన సాహిత్యం నిండా శరణాగతి కనిపిస్తుంది. ఆయన సంకీర్తనలన్నీ దీనికి లక్ష్యాలే.

**'చొచ్చితి తల్లి నీమరుగు సొంపుగ నీ కరుణా కటాక్షమె**
**ట్లిచ్చెదొ నాకు నేడు పరమేశ్వరి - - - - - - - -'**
**'యోగ్యతలేని కష్టుద నయోగ్యుడ నన్నిట జూడ గర్భ ని**
**ర్భాగ్యుడ నీ కృపామతికి పాత్రుడనో యలిమేలుమంగ'**

మొదలైన ఈ శతక పద్యాలలో అన్నమయ్య అమ్మను శరణుపొందడం కనిపిస్తున్నది. వైష్ణవ సంప్రదాయంలో అమ్మ ద్వారా అయ్యవారికి విన్నవించుకోవడం ఒక పద్ధతి. లక్ష్మి ఆయన ఉరంపై ఉంటూ ఆయన కరుణను ప్రపన్నులపై ప్రసరింప జేస్తుందన్న విశ్వాసం భక్తులలో ఉంటుంది. ఇక మధుర భక్తిని మధురంగా ఆవిష్కరించిన పద్యాలుకూడా ఈ శతకంలో ఉన్నాయి.

**శ్రీసతి నీల జాంబవతి శ్రీయమునా సతి సత్యభామ ధా**
**త్రీ సతి రుక్మిణీ రమణి దేవి యిలాసతి వీరలందరున్**
**జేసిన సేవ జేసెదను జేకొను శ్రీ యలివేలుమంగ నీ**
**మూసిన ముత్యమై యురము ముంగిటఁ జెంగట వేంకటేశ్వరా**

ఈ శతకంలో మొదటిదైన ఈ పద్యం మధురభక్తికి మంచి ఉదాహరణ. ఈ పద్యంలో శ్రీవారి ఎనిమిది మంది దేవేరులు స్వామిని సేవిస్తూ కనిపిస్తారు. వీరితోపాటు తానుకూడా ఒక దేవేరియై సేవిస్తానంటున్నాడు అన్నమయ్య. భక్తుడు నాయికగా మారి భగవంతుని చేరుకోవాలనే తపన మధురభక్తిగా చెప్పబడుతున్నది. తాను నాయికగా మారడమేకాదు లోకంలోని భక్తులను కూడా ఈవిధంగా స్వామిని చేరుకోవచ్చునని ఉద్బోధించడానికి అన్నమయ్య శతక ప్రారంభంలోనే ప్రయత్నించాడు.

ఇలాంటి గంభీర విషయ వైవిధ్యంతో కూడిన ఈ శతకంలో అన్నమయ్య రచన అతిలలితంగా మనోజ్ఞంగా అలంకార ప్రాయంగా ఉంటూ ఆయన కవితా ప్రౌఢిమను ప్రకటిస్తున్నది.

## ద్విపద రామాయణం

**'ప్రవిమల ద్విపద ప్రబంధ రూపమున - నవముగ రామాయణము ప్రతిలేని - నానా ప్రబంధముల్ చేసి'** అనే అన్నమాచార్య చరిత్రలోని చిన్నన్న కథనాన్ని బట్టి అన్నమయ్య ద్విపదలో రామాయణాన్ని ఒక ప్రబంధంగా రచించాడని తెలుస్తున్నది. కాని ఇది అలభ్యం. పూర్వరామాయణాలకు భిన్నంగా సరికొత్త పద్ధతిలో రచింపబడి నందువల్లనేమో చిన్న 'నవముగ' అనే విశేషణాన్ని వాడాడు. **'ప్రవిమల ద్విపద'** అంటే స్వచ్ఛమైన లేక శుద్ధమైన ద్విపద అని అర్థం. ప్రాసయతి పాటించకుండా ఏపాదానికాపాదం విరిగేటట్లు చేసి విషయ బోధనను సుకరం చేసే ద్విపదనే చిన్నన్న ప్రవిమల ద్విపద అని ఉంటాడని భావించవచ్చు. అన్నమయ్య ఈ ద్విపద రామాయణాన్ని ప్రబంధంగా రచించాడని చిన్నన్న చెపుతున్నాడు. ప్రబంధమనే పదాన్ని మనమిప్పుడు ఏ అర్థంలో ప్రయోగిస్తున్నామో ఆయర్థంలోనే అన్నమయ్య రచన సాగి ఉంటుంది. రాయల యుగ ప్రబంధాలకు తలమానిక మనదగిన మనుచరిత్ర రచించిన అల్లసాని పెద్దనకు అన్నమయ్య ముందు తరం వాడు. అన్నమయ్యకు ఒకరంగా సమకాలికుడైన శ్రీనాథుని శృంగార నైషధం ఒక ప్రబంధంగా అప్పటికి పేరుపొందిన రచన. పదకవితను శ్రీనాథుడు ఏవగించుకొన్నా అన్నమయ్య మాత్రం సమకాలీన సాహిత్య స్థితిగతులను పరిశీలిస్తూ రావడంచేత తన రామాయణం ద్విపదలో ఉన్నా ప్రబంధ లక్షణ శోభితగా ఉంటే ప్రచారానికి నోచుకొంటుందని భావించి ఉండవచ్చు. ఈకారణంచేత అన్నమయ్య ద్విపద రామాయణం ప్రబంధంగా వెలువడి ఉంటుంది. ద్విపద లోనే ఎందుకుండాలన్న దానికి కారణం అప్పటికే ద్విపదలో ఉండిన రంగనాథ రామాయణం ప్రాచుర్యం పొంది ఉండడం.

తెలుగులో ద్విపద రామాయణాలను గురించి ఆలోచిస్తే మొదటిది రంగనాథ రామాయణం. రెండవది అన్నమయ్య రామాయణం. తరువాత 16వ శతాబ్దంలో కట్టావరదరాజు రామాయణం, 18వ శతాబ్దంలో ఏకోజీ రామాయణం ద్విపద రామాయణాలే. అన్నమయ్య రామాయణం అలభ్యం కాబట్టి ఈ ద్విపద రామాయణాల తులనాత్మక అధ్యయనం సాధ్యంకాదు. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు

వారు ప్రచురించిన రంగనాథ రామాయణం చివర ఒక అనుబంధంలో రంగనాథుని రచనలో చేరిపోయి ఇతర ప్రతులలో కానరాని ఇతరేతర కవికృత గ్రంథ రచనా భాగాలు కొన్ని ప్రకటింపబడినాయి. ఆ భాగాలలో కొన్ని పంక్తులు వరదరాజ రామాయణంలోని వని దాని పరిష్కర్త నిడదవోలు వేంకటరావుగారు తన పీఠికలో చెప్పినారు. అలాగే అన్నమయ్య రామాయణ ద్విపదలు కూడా కొన్ని అందులో చేరి ఉంటాయని ఆయన అభిప్రాయం. ఈ పరిశీలనలన్నీ అన్నమయ్య రామాయణ అస్తిత్వాన్ని తెలిపేవే కాని అందులోని విషయాలను పరామర్శించేవి కావు.

వేలకు వేల సంకీర్తనలలో అన్నమయ్య వివరించిన శరణాగతి తత్త్వం రామాయణంలో ప్రతిఫలించిన విధంగా లేకపోవడం ఆయన శరణాగతిని వివరించే కథాంశాలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి రామాయణ రచన చేసి ఉంటాడని చెప్పడానికి పోషకమైన విషయం. రామాయణ కథాంశాలను అనేక సంకీర్తనలలో పొందుపరిచాడు అన్నమయ్య. సంకీర్తనలలో చెల్లా చెదురుగా ఉన్న రామాయణ కథా విషయాలను ఒకచోటికి తెచ్చి పరిశీలిస్తే అన్నమయ్య రామాయణ కథా స్వభావం కొంతకు కొంత అర్థమవుతుంది. ఉదాహరణకు ఒక సంకీర్తన పరిశీలించడం అవసరం.

**ఇతడె పరబ్రహ్మమిదియె రామకథ**
**శతకోటి విస్తరము సర్వ పుణ్యఫలము**
**ధరలో రాముండు పుట్టె ధరణిజ బెండ్లాడె**
**అరణ్య వాసులకెల్లా నభయమిచ్చె**
**సొరిది ముక్కుచెవులు చుప్పనాతికి గోసె**
**ఖరదూషణులను ఖండించి వేసె**
**కినిసి వాలిని జంపి కిష్కింధ సుగ్రీవునికిచ్చె**
**వనధి బంధించి దాటె వానరులతో**
**కనలి రావణ కుంభకర్ణాదులను జంపి**
**వనిత జేకొని మళ్లి వచ్చె నయోధ్యకు**

**సౌమిత్రియు భరతుడు శత్రుఘ్నుండు గొలువగ**
**భూమి యేలె కుశలవ పుత్రులను గాంచె**
**శ్రీమంతుడై నిలిచె శ్రీవేంకటాద్రి మీద**
**కామించి విభీషణు లంకకు బట్టము గట్టి**

స్థూలంగా అన్నమయ్య రామాయణ రచనా ప్రణాళిక ఇది. శరణాగతి కావ్యంగా పేరుపొందిన రామాయణ రహస్యాలన్నీ ఆయన తన రచనలో ప్రతిపాదించి ఉంటాడు. మూలం వాల్మీకిదైనా అన్నమయ్య స్వతంత్రంగా దేశీయతతో అనువదించి నట్లు అనేకానేక సంకీర్తనలలో కనిపించే రామాయణ కథా విషయాలు నిరూపిస్తాయి. ఇంతకు మించి వీరి రామాయణ కావ్యాన్ని గురించి చెప్పడానికి వీలుకాదు.

## శృంగార మంజరి

ప్రాస నియమం పాటించని ద్విపద మంజరీ ద్విపద. 'వలదు ప్రాసం బంద్రు వరుస మంజరికి' అని లాక్షణిక నియమం. మామూలు ద్విపదకు ప్రతిపాదాన మూడింద్ర గణాలు ఒక సూర్యగణం ఉండి యతిప్రాసలుంటాయి. మంజరీ ద్విపదలో ఏ చరణానికాచరణం విచ్చుకొన్న రెక్కలవలె విడివడి విస్తృతమై భావ కుసుమ సౌగంధ్యం కలిగి ఉంటుంది. అందుకే దీనికి మంజరీ నామం సార్థకం. తెలుగులో గ్రామీణులు పాడుకొనే పాటలు ఈ దేశీయ ఛందంలోనే ఉంటాయి. జనప్రియమైన మంజరీ ద్విపదలో తాళ్లపాక వాళ్లు శృంగార మంజరి, చక్రవాళ మంజరి, సుభద్రా కల్యాణం ఇత్యాది కావ్యాలు రచించారు.

శృంగార మంజరి అన్నమయ్య కృతి. ఇది వేంకటేశ్వరస్వామికి అంకితం. ఇందులో కేవలం దేవతా స్తుతులే గాక భక్తుని అనుభవం, అభినివేశం కూడా చిత్రింప బడినాయి. భగవంతుని చేరడానికి భక్తి, శృంగారం రెండూ సమప్రాధాన్యత గలవేనని అన్నమయ్య భావం. శృంగారం ద్వారా స్వామి ఐక్యాన్ని పొందిన ఒక భక్తురాలు ఇందులో కనిపిస్తుంది. పైకి ఆమెది పచ్చిశృంగారంగా భాసించినా దాని వెనక ఆమె అంతరంగం స్వామికోసం పరితపించే విధం హృదయంగమంగా

ఈకృతిలో ఆవిష్కృతమైంది. కవి ఆమెను ఒక బాల అన్నాడు. బాల భగవంతుని విరహంతో బేలగా మారి మన్మథావస్థలను అనుభవించింది. ఆ బాల స్థానంలో అన్నమయ్య అలిమేలుమంగను ఊహించి ఉంటాడనడం నిజం.

ఈ కృతిలోని వస్తువు దివ్య శృంగారం. నాయికా నాయకులు అలిమేలు మంగా శ్రీనివాసులైనప్పుడే అది దివ్యశృంగార మవుతుంది. 516 ద్విపద పాదాలు గల ఈ రచనలో ప్రబంధ లక్షణాలున్నాయి. లౌకిక శృంగారం విశ్వ శృంగారంగా దివ్యశృంగారంగా మారడానికి కావలసిన సోపాన క్రమం దీనిలో కనిపిస్తుంది. వర్ణనలన్నీ ప్రబంధోచిత రీతిలో ఉన్నాయి. వసంత వర్ణన, పుష్పాపచయం, నాయిక విరహం, చెలుల చైత్యోపచారాలు, మన్మథ పూజ మొదలైనవన్నీ కథాంశానికి పుష్టిని చేకూర్చాయి. విరహ తాపంతో వేగిపోయిన చెలిని స్వామి వచ్చి చల్లబరచి శృంగార సాగరంలో ముంచెత్తడం ఇందులోని కథాంశం. నాయిక విరహ తాపం కామ ప్రేరితంగా కనిపిస్తున్నా ఈ కృతిలో జీవి పరమేశ్వర సాన్నిధ్యం కోసం పడే ఆరాటంగా భావించాలి. శృంగార సాగరమంటే మన్మథ వికారమైన భావ ప్రాప్తికాదు. స్వామి జీవి ఆర్తిని గమనించి, మానసిక ఉద్రేకాన్ని తగ్గించి తన శీతల దృక్కులతో రజస్సును మాయంచేసి జీవిని సత్వసంపన్నమైన స్థితికి చేర్చడం. సుఖ దుఃఖాలుగాని, రాగ ద్వేషాలుగాని ఉండని ఒక అద్వైత స్థితి ఇది. ఈ రచనలోని పంక్తులలో పైకి లౌకిక శృంగార లౌల్యం కనిపించినా అన్నమయ్య భావించిన అంతరార్థమిది. ఇలా భావించకుంటే అన్నమయ్య శృంగార మంజరి రచించనవసరం లేదు. నాయికా నాయక శృంగారంలో రేగే పొగలు సెగలు అప్పటికే వచ్చిన ఎన్నో కావ్యాల్లో కనిపిస్తూనే ఉన్నాయి.

శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలోని పద్మావతీ శ్రీనివాసుల పరిణయ గాథను సామాన్య జనులకు వినిపించడం కోసం అన్నమయ్య దీనిని మంజరీ ద్విపదలో పాడాడని ఒక అభిప్రాయముంది. 'అమరాద్రితో మాద్రియగు వేంకటాద్రి, నున్నతోన్నత లీల నుండెడివాని' శృంగార విఖ్యాతిని, చెలువపు రీతిని 'సకల జనానంద సంస్తుతిచేత' విని ఒక బాల ఆస్వామియందు 'వినుకలి' దగిలి ఉంటుంది. వినుకలి అంటే ఎవరైనా చెపుతూ ఉంటే విని ఆ విషయాన్ని గురించి

ఆలోచించడమని అర్థం. ఆమె ఆ వినుకలిని తలపోసి స్వామి మీద మరులు పెంచుకొని వలపు కాకకు బలి అవుతుంది. ఇలాంటి వినుకలి ప్రేమే రుక్మిణిది కూడా. పోతన భాగవంతంలోని –

**తన తండ్రి గేహమునకుం**
**జనుదెంచుచునున్న యతిథి జనుల వలనఁ గృ**
**ష్ణుని రూప బలగుణాదులు**
**విని కృష్ణుడు దనకు దగిన విభుడని తలచెన్ (దశమ. 1691)**

అనే పద్యం రుక్మిణి వినుకలి ద్వారా కృష్ణుని ఎలా తన విభుదని తలంచినదో చెపుతున్నది. రాయలయుగంలోని ప్రబంధాలన్నిటా ఇలాంటి వినుకలి కథలున్నాయి.

ఆ బాల బాధను ఉపశమింప జేయడానికి చెలికత్తె లామెను ఉద్యాన వనానికి తీసుకొని పోయారు. అంతలోనే వసంతం రావడం, ఆమె విరహం అగ్గలం కావడం జరిగింది. ప్రబంధ సాహిత్యంతో పరిచయమున్న వాళ్లకు తరువాత ఏమి జరిగి ఉంటుందో ఊహించుకోవడం అంత కష్టంకాదు. ఈ రచనలోని అన్నమయ్య కవితను ఆస్వాదించడానికి కనీసం రెండుపంక్తులనైనా ఉదహరించడం అవసరం.

**తాపంబుమేన ప్రతాపింప దొడగెఁ**
**నూర్పులు మిగుల నిట్టూర్పులై నిగిడెఁ**
**బగలె మృగాక్షికి వగలుగా జొచ్చె**
**రాత్రులింతికి శివరాత్రులై తోచె**

నాయిక విప్రలంభావస్థ ననుభవించే సందర్భంలోనివీ పంక్తులు.

ఇతి వృత్తపు నిడివి చిన్నదైనా శృంగార రస వ్యంజన కవసరమైన సామగ్రి నంతా అన్నమయ్య ఇందులో కుప్పలు పోశాడు. విభావానుభావ సాత్విక సంచారుల స్ఫుటత్వాన్ని, అవి రసోత్పత్తికి దోహద పడిన వైనాన్ని ఆలంకారిక

మర్యాద ననుసరించి వివరించాడు. నాయిక విరహావస్థలోని కొన్ని పంక్తులు చూడదగినవి–

**"చూడదు తలయెత్తి శ్రుతి దండె గూర్చి**
**పాడదు చెలులెల్లఁ బైకొన్న సరస**
**మాడదు చిలుకతో నందంపు మాట**
**లాడదు వెడమాటలాడెడి గాని**
**కొంచదు ప్రాణంబు గుఱుతుగా జేసి**
**యెంచదు వీణె వాయించదు........."**

ఈ పంక్తులు పోతన వర్ణించిన రుక్మిణీదేవి విరహావస్థను స్ఫురింప జేస్తాయి.

**'చెప్పదు తల్లికిం దలపుఁ జిక్కు, దిశల్ దరహాస చంద్రికల్**
**గప్పదు . . . . . . . . . . . . . . . . . . . . . .'**
**'తడువదు కన్నులం వెడలు తోయ కణంబులు, కొప్పుఁ జక్కగా**
**ముదువదు . . . . . . . . . . . . . . . . . . . . . .'**

**(దశమ 1727, 1728)**

ఈ పద్యాలు భాగవతంలో రుక్మిణి విరహాన్ని రూపుకట్టిస్తున్నాయి.

శృంగార మంజరిలో అన్నమయ్య అలివేలుమంగా శ్రీనివాసులు వివాహాన్ని వర్ణించడం ప్రధానాంశమని, ఆ హేతువు చేతనే ఆ తరువాత తాళ్లపాక వారు తిరుమల మీద స్వామివారికి వైవాహికోత్సవ మనే ఒక నూతన ఉత్సవాన్ని ఆరంభించి తామే పెండ్లి పెద్దలై నిర్వహిస్తూ వచ్చారని వేటూరి ఆనందమూర్తి అభిప్రాయ పడుతున్నారు. (తాళ్లపాక కవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు, 1974, పుట 309).

## సంకీర్తన లక్షణం

చిన తిరుమలయ్య రచించిన సంకీర్తన లక్షణ గ్రంథం అన్నమయ్య సంస్కృతంలో రచించిన సంకీర్తన లక్షణానికి అనువాదం. అన్నమయ్య సంకీర్తన

లక్షణానికి పెదతిరుమలయ్య వ్యాఖ్యానం కూడా రచించాడు. సంస్కృత సంకీర్తన లక్షణంగాని, ఈ వ్యాఖ్యనం గాని దొరకలేదు. దొరుకుతున్నది చిన తిరుమలయ్య అనువాద గ్రంథమే.

దైవస్తుతికి చెందిన స్తోత్ర సాహిత్యానికి లక్షణాలను నిర్దేశిస్తున్న గ్రంథమిది. దీనికి సంకీర్తన లక్షణం, పదచ్ఛందం అని పేర్లున్నాయి. సంకీర్తన, పదం ఒకదాని కొకటి పర్యాయాలు. భరతుడు నాట్యశాస్త్రంలో పదానికి లక్షణాలు చెప్పినాడు. సంగీత రత్నాకరం, సంగీత చంద్రిక, సంగీత చూడామణి, సంగీత సుధాకరం వంటి గ్రంథాలలో పదానికి లక్షణాలు చెప్పబడినాయి. ఈ లక్షణ గ్రంథాలన్నిటికి మూలం భరతుని నాట్యశాస్త్రం. భరతుడు చెప్పిన లక్షణాలనే అన్నమయ్య సంకీర్తన లక్షణంలో వివరించాడు.

సంకీర్తన లక్షణంలోని విషయాలను తెలుసుకొనే ముందు చిన తిరుమలయ్య తాత తండ్రుల గ్రంథాల నుండి సేకరించి వివరించిన ఉపోద్ఘాత ప్రాయాలైన విషయాలను తెలుసుకోవాలి. పదం అనేమాటకు కవిత్వం అని అర్థం చెప్పవచ్చు. వేంకటాద్రి పతిపై చెప్పిన పదమే తుది పదమట. దానికి ప్రయోజనం వేంకటపతిని నుతించడమే. తాళ్లపాక అన్నయ పదాలు హరిభక్తి విభావనలు. శ్రీహరి సుజ్ఞాన ధనాలు. అవి బహుదేశాలలో వ్యాపించి సుజనులకు హ్లాదాన్ని కలిగిస్తాయి. విన్నంతనే పాపాలను హరిస్తాయి. శంకా తంకాలను పోగొట్టి సర్వేశ్వరునిపై భక్తిని కుదుర్చుతాయి. ఇలాంటి అన్నమయ్య పదాలను చదివి అర్థంచేసుకొంటే బాలుడు ప్రౌఢుడవుతాడు. సంకీర్తనల పరిశుద్ధి కోసం అన్నమయ్య సంకీర్తన లక్షణం రచించాడు. తండ్రి ఆనతితో ఆమ్నాయ సమానమైన సంకీర్తన లక్షణాన్ని లక్షణ శాస్త్రజ్ఞులు ఔదల దాల్చునట్లు పద్యరూపంలో చెపుతున్నానని చిన తిరుమలయ్య చెప్పుకొన్నాడు.

'పదమన సుప్తిఙ్గంతము - పదమవయవ మవయవియును బదమన బరగున్' అని పద నిర్వచనం. ఈ నిర్వచనంలో లక్షణార్థమే కాకుండా ఒక విశేషార్థం కూడా ఉంది. అవయవ మంటే శరీరం. అవయవి అంటే శరీరి. ఈ

రెండిటి సమాహారమే పదం. శరీరి – శరీరుల సంబంధాన్ని, వీటికి పరమాత్మతో గల సంబంధాన్ని వివరించేది పదమనే విశేషార్థం కూడా ఈ నిర్వచనంలో ఉంది.

సంకీర్తన లక్షణంలో 71 పద్యాలు 25 వచనాలు ఉన్నాయి. వచనాలు చిన్న చిన్న ముక్కలు. పదమంటే ఏమిటో చెప్పిన తరువాత వృత్త విషయం చెప్పబడింది. చతుష్పాదమైంది వృత్తం. వృత్తాన్ని సంస్కృత ప్రాకృత దేశ భాషలలో కూడా చెప్పవచ్చు. ఈ వృత్తం పద్య కవిత్వానికి సంబంధించినది కాదు. పదానికి సంబంధించినది. దీనికి యతి ప్రాసలు పద్యాల కెలా ఉంటాయో అలా ఉంటాయి. ఇది భరత దత్తళాది మునుల అభిప్రాయం. ఈ వృత్తాలు దేశి సంగీతంతో కూడి ఉంటాయి.

పదాలు వృత్త పదమని, నిబంధనామ పదమని రెండు రకాలుగా ఉంటాయి. వీటిలో వృత్త పదం - ఛందోగణ యుక్తంగా ఉంటుంది. నాలుగు పాదాలు తాళాలంకృతంగా సమంగా ఉంటే సమపదం. ఒకటి మూడు పాదాలు ఒకరకంగా రెండు నాలుగు పాదాలు మరొక రకంగా ఉంటే విషమ పదం.

నిబంధ నామ పద లక్షణం –

**యతులుం బ్రాసములుం బదంబులును మాత్రానీకముల్ తాళ సం**
**గతులుం గల్గి నిబంధ నామ పదమాఖ్యాతార్థ సంయుక్త స**
**త్కృతియై తాళ్లపాక యన్నయ గురూక్తిన్ లోక విఖ్యాతమై**
**జిత మార్ద్వీకసితా సుధారస రుచి స్ఫీతంబులై చెన్నగున్**

దీనికీ వృత్తాల కున్నట్లు యతి ప్రాసలుంటాయి.

పదానికి పల్లవి ఉంటుంది. సాధారణంగా పల్లవి రెండు పాదాలు కలిగి ఉంటుంది. ఒకపాదం కూడా ఉండవచ్చు. ఒకపాదంతో ఉండే పల్లవికి శిఖాపదమని పేరు. పల్లవి తరువాత ఉన్న చరణాలలో మొదటి దానికి ఉద్గ్రాహమని, రెండవ దానికి మేళాపమని, మూడవ దానికి ధృవమని ఆ తరువాత

ఉన్నదానికి ఆ భోగమని పేర్లు. ఆభోగం ముద్రతో ఉంటుంది. పల్లవి తరువాత ఉండే ప్రతి చరణానికి పదమనేపేరు. ఇలాంటి పదాలు ఎనిమిది వరకు ఉండవచ్చు. జయదేవుని అష్టపదుల ననుసరించి ఏర్పడిన లక్షణమిది.

**ఘనత మీరంగ జయదేవ కవివరేణ్యుఁ**
**దందమై నట్టి గీత గోవింద మందు**
**నంచితాష్ట పదులు పల్కె, నట్ల పదంబు**
**పరగు నెనిమిది పదములు పల్లవియును.**

కొందరు పదకర్తలు ఎనిమిదికి మించి కూడా చరణాలు రాశారు. అర్థ చాతురితో ఎనిమిదికి మించి చరణాలున్నపుడు వాటిని పద మాలికలని పిలవవచ్చు. సీస మాలికలుండనే ఉన్నాయి కదా.

వస్తు దృష్టితో పరిశీలిస్తే సంకీర్తనలలోని విషయాలే సంకీర్తనేతర రచనలలో కూడా కనిపించక పోవు. కొన్ని కొత్త విషయాలుండవచ్చు. సంకీర్తన లక్షణం ఒక ప్రత్యేక రచన.

# అన్నమయ్య శృంగార సంకీర్తనలు
# సామాజిక శృంగారతత్త్వం

దొరికిన అన్నమాచార్యులవారి సంకీర్తనల్లో శృంగార సంకీర్తనల సంఖ్య ఎక్కువ. దీనికి కారణముంది. సాధారణంగా మనిషి జీవితంలో శృంగారం అనుభవంలోకి రావడం ఒక దశ వరకు జరిగితే ఆ తరువాత శృంగారాన్ని గురించి ముచ్చటించు కోవడం ఉంటుంది. అనుభవ దశలోని శృంగారానికున్న తీవ్రత, ఉరవడి ముచ్చటించుకొనే దశలో ఉండవు. శృంగార విషయాలను దగ్గర వాళ్లతో చెప్పడం, తద్వారా మానసిక ప్రశాంతతను పొందడం అసహజం కాదు. ఇలాంటి విషయాలను కూలంకషంగా చెప్పడానికి ప్రయత్నించే వాళ్లు శాస్త్రకారులవుతారు. వాత్స్యాయన మహర్షి లాంటి వాళ్లు ఇలాంటి శాస్త్రకారులే. వీళ్లది సమాజదృష్టి. కామపురాషార్థాన్ని లోకం ఎలా అర్థంచేసుకోవాలో, దాని అవసరం ఎలాంటిదో, దాని ప్రయోజనం ఎలాంటిదో వాళ్ల రచనల ద్వారా చెప్పడానికి ప్రయత్నం చేశారు. శాస్త్ర విషయాలు సమాజ అభ్యుదయకరాలు కాబట్టి శాస్త్రకారులు వాళ్ల అనుభవాలతోపాటు వివిధ ప్రాంతాల నుండి సేకరించిన విషయాలను ఆధారం చేసుకొని సిద్ధాంతాలు తయారుచేసి సమాజానికందిస్తారు. అందువల్ల ఈ విషయాలన్నీ ఆయా శాస్త్ర కారుల జీవితాలలోని రెండవ దశకు సంబంధించినవిగానే ఉంటాయి. ఇలా ఆలోచిస్తే శృంగార సంకీర్తనలన్నీ అన్నమయ్య జీవితంలోని రెండవ దశలోనే చెప్పినట్లు అర్థమవుతుంది. అన్నమయ్య చిన్నతనం నుండి తిరుమలవాసుని భక్తుడు. భక్తితో స్వామివారిని సేవించాడు.

వైష్ణవంలో మునిగి పునీతుడయ్యాడు. విశిష్టాద్వైత సంప్రదాయాన్ని జీర్ణం చేసుకొన్నాడు. స్వామివారి అనంతత్వాన్ని దర్శించాడు. శరణాగతి విద్యను నమ్ముకొన్నాడు. సృష్టి అంతటా నిండిన శ్రియః పతిని నోరారా కీర్తించాడు. స్వామిసేవలో భక్తుని స్థానమేమిటో గుర్తించాడు. భగవత్తత్వాన్ని, జీవనతత్త్వాన్ని అర్థంచేసుకొన్నాడు. భక్తుడు పయనించ వలసిన అధ్యాత్మ వీధులలో పయనించాడు. చిదచిత్తుల స్వభావాన్ని గుర్తించాడు. వీటితో స్వామికి గల తాత్త్విక సంబంధాన్ని తెలుసుకొన్నాడు. తానునమ్మిన విషయాలను లోకానికి చెప్పాలనుకొన్నాడు. అధ్యాత్మ సంకీర్తనలు రచించాడు. ఈ కీర్తనలలో అన్నమయ్య జీవితం ఉంది. లోకపు నడత ఉంది. ఆయన ప్రచారం చేసిన భక్తి ఉంది. జీవితంలోకి తొంగి చూసుకోవడంలో దర్శనీయమైన తాత్త్వికత ఉంది. ఈ సంకీర్తనలు పునాదిగా అన్నమయ్య భక్తి సిద్ధాంతాన్ని వివేచించడానికి అవకాశముంది.

## అన్నమయ్య సంకీర్తనల స్వభావం

అన్నమయ్య సారసనేత్రునిపై రచించిన సంకీర్తనలు యోగ మార్గానికి చెందినవి కొన్ని, వైరాగ్య వాసన గలవి కొన్ని, శృంగార రస రీతిలో ఉన్నని కొన్ని అని అన్నమాచార్య చరిత్ర కథనం. యోగానికి, వైరాగ్యానికి సంబంధించినవి అధ్యాత్మికాలుగా గుర్తిస్తే మిగిలినవి శృంగార సంకీర్తనలు. అధ్యాత్మికత భక్తికి పునాది. కాబట్టి అన్నమయ్య భక్తిని నిరూపించడానికి అధ్యాత్మ సంకీర్తనలు బాగా తోడ్పడతాయి. 'విభావానుభావ సంచారీ సంయోగాద్రస నిష్పత్తిః' అనే రస సిద్ధాంతం భక్తిపరంగా అధ్యాత్మ సంకీర్తనలలో బాగా సమన్వయమవుతుంది. భక్తి రసానికి ఆలంబనం భగవంతుడు. ఉద్దీపనం భగవచ్చరిత్రలు. భగవదాకార చిత్తవృత్తి లేక భగవద్రతి స్థాయిభావం. తత్కాలీన నేత్ర విక్రియాదులు అనుభవాలు. నిర్వేద శంకాహర్షాదులు వ్యభిచారులు. ఇలా భక్తి రసంగా పరిణమిస్తుంది. అధ్యాత్మ సంకీర్తనల్లో ఈ భక్తిరస సామగ్రి ఎక్కడ వెదికినా కనిపిస్తుంది.

భక్తి భావమని, రసమని ఆలంకారికులలో అభిప్రాయ భేదాలున్నా రసంగానే నిరూపితమైంది. భక్తి భావస్థితి నుండి రస స్థితిని పొందిన విధానాన్ని రూపగోస్వామి

తన 'ఉజ్జ్వల నీలమణి' అనే గ్రంథంలోను, మధుసూదన సరస్వతి తన 'భక్తిరసాయనం' అనే గ్రంథంలోను విస్తృతంగా వివరించారు. శృంగారాదులు భక్తికంటే తక్కువే ననికూడా అన్నారు. అన్నమయ్యది సగుణ సాకార భక్తి. అధ్యాత్మ సంకీర్తనలలో ఆయన వర్ణించిన దేవతామూర్తులన్నీ అర్చామూర్తులే. అందువల్ల విభావాది సామగ్రికి లోటులేదు. ఇలా అన్నమయ్య పండించిన భక్తిరసం లౌకిక స్థితి నుండి అలౌకిక స్థితికి చేరుకొని భక్తులకు తన్మయత్వాన్ని కలిగించి వారి మానసాలలో భగవద్రూపాన్ని నిలుపుతున్నది.

## శృంగార సంకీర్తనలు - రసస్థితి

భారతీయ జీవన విధానానికి ధర్మార్థకామ మోక్షాలు సోపానాలు. వీటి ఆధారంగానే మానవుడు జీవిత గమ్యం పొందుతాడని -

**'చతుష్పదీహి నిః శ్రేణీ బ్రహ్మణ్యేషా ప్రతిష్ఠితా**

**ఏతామారుహ్య నిః శ్రేణీ బ్రహ్మలోకే మహీయతే'** అనే శ్లోకం ద్వారా (మహాభారతం. శాంతిపర్వం 242-15) వ్యాసుడు స్పష్టంచేశాడు. భారతీయ సాహిత్యం ఈ విషయాన్న గుర్తించి చతుర్విధ పురుషార్థాల సాధన కథల ద్వారా వివరించింది. పురుషార్థాలలో కామ పురుషార్థం ముఖ్యమైంది ఎందుకంటే కామం మానవుడికి ఒక సహజ భావం (instinct) కాబట్టి. దీని ద్వారానే జీవిత పరమార్థం నిర్ణయింప బడుతుంది. కామం ఆనందం కోసమే కాదు సంతానం కోసం కూడా. ఇంత విలువైన ఈ పురుషార్థాన్ని ఒక కళగా భావించడం జరిగింది. అందుకే **'ధర్మా విరుద్ధోభూతేషు కామోస్మి భరతర్షభ'** అని గీత ప్రకటించింది. కామ పురుషార్థంలో రతి, ప్రేమ అనే రెండంశాలున్నాయి. రతి (Sex) దేహానికి ప్రేమ (Love) హృదయానికి సంబంధించినవి. వాత్స్యాయనుని అభిప్రాయం ప్రకారం "Human sexuality is a fine combination of physical, emotional, itellectual and social aspects."[1] కామం ఒక పురుషార్థం కావడంలో దాని విలువ ఏమిటో అర్థమవుతుంది.

కామ పురుషార్థాన్ని పండించే స్థాయి భావం రతి. ఇది శృంగార రసాన్ని నిష్పన్నంచేయడంలో ప్రధాన సహాయకారి. కామ పురుషార్థ ప్రాధాన్యాన్ని

గుర్తించడం వల్లనే ఆలంకారికులు దానికి సంబంధించిన శృంగార రసానికి ప్రాధాన్యత నిచ్చి రసరాజమన్నారు.[2] ఈ నేపథ్యంతో శృంగార సంకీర్తనలను పరిశీలించాలి. ప్రతి శృంగార సంకీర్తన శృంగార రస నిష్పత్తికి అవసరమైన రస సామగ్రిని కలిగి ఉంది. ఈ సామగ్రి సాధారణీకరణ స్థితిని పొంది పఠితలో లేక శ్రోతలో రసానుభవ స్థితిని కలిగిస్తుంది. ప్రతి సంకీర్తనలోను ఆలంబన విభావమైన నాయికా నాయకులు తప్పకుండా ఉంటారు. లోకంలోని శృంగార రససామగ్రిని సంకీర్తన నిండా నింపి చివరి చరణంలో నాయికా నాయకులను అలమేల్మంగా వేంకటపతులుగా చెప్పడం అన్నమయ్య పద్ధతిగా కనిపిస్తుంది. చివరి చరణంలో కూడితివి, కలిసితివి, ఏలితివి, ఇత్యాది క్రియలు రతి సలపడం అనే అర్థంలో తప్పకుండా కనిపిస్తాయి. ఇలా శృంగార సంకీర్తనల నిండా శృంగారం తొణికిస లాడడం వల్ల ఈ శృంగారం లౌకిక శృంగారమని, అది వేంకటపతి శృంగారంగా చెప్పడం వల్ల అలౌకిక మవుతుందని అన్నమయ్య భావించాడని అర్థమవుతుంది.

వివిధ అర్చావతారాల కీర్తన, భగవంతుని వివిధ నామావళి కీర్తన, నిత్య విభూతి వర్ణన, శరణాగతిని పొందడం ఇత్యాది విషయాలు భక్తికి సంబంధించినవి. ఇవన్నీ అధ్యాత్మ సంకీర్తనల అంశాలు. శృంగార సంకీర్తనలలో భక్తిని నిరూపించే అంశాలు లేవు. అయితే ఆ శృంగార సన్నివేశం అలివేలుమంగా శ్రీనివాసులది కాబట్టి, అది అలౌకికం కాబట్టి. ఆయంశం భక్తికి సోపానమేనని భావించడానికి అవకాశముంది. శృంగార రసం లౌకికమైనంది. లైంగికమైంది అయినా భక్తి యుక్తమై దైవ పరమైనపుడు పారమార్థికం, అధ్యాత్మికం అవుతుంది.[3] చాలమంది పండితుల అభిప్రాయమిదే. శిఖర శృంగోన్నతమైన సంయోగ వాంఛ శారీరకమైతే బాహ్యరతికి, ఆత్మికమైతే ఆత్మరతికి దారితీస్తుందని, మొదటిదశ స్త్రీని స్త్రీగా, పురుషుని పురుషునిగా చూపే భౌతిక దృష్టి అని, రెండవ దశ స్త్రీ పురుషులందరూ ఆత్మలై అంటే స్త్రీలై పరమాత్మకోసం పరితపించే ఒక పారలౌకిక మధుర దృష్టి అని మరొక అభిప్రాయం.[4] ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేసిన ఎందరో పండితులు అన్నమయ్య వర్ణించిన శృంగారం ఆత్మ పరమాత్మల దివ్య శృంగారమని, దీనికి లౌకిక స్పర్శ ఉండదని, ఇది శృంగారం ద్వారా భక్తిని ప్రకటించే మార్గమని

నమ్మిన వారు. జీవాత్మ పరమాత్మల మధ్య ప్రవర్తిల్లే శృంగారం నిజమైన శృంగారం కాదని, అది జీవాత్మ ప్రకృతి నుండి పొటమరించే శుద్ధ సాత్విక భావమని, భక్తిగా పరిణమిస్తుందని చెప్పే అభిప్రాయమే ఇప్పటివరకు ప్రతిష్ఠితమై ఉంది. శృంగార సంకీర్తనల లోని విషయాన్ని నిశితంగా పరిశీలించక పోవడం వల్ల విమర్శకులలో ఈ అభిప్రాయం ఏర్పడిందని అనిపిస్తుంది. వీళ్లకు అన్నమయ్యను శృంగార కవిగా చెప్పడం ఇష్టంలేక పోవడం మరోకారణం. అన్నమయ్య దార్శినికుడైన కవి. దార్శినికత్వం, లోకవృత్త వర్ణత్వం కవిగా ఆయన కుండవలసిన లక్షణాలు. ఈరెండు లక్షణాలు అధ్యాత్మ శృంగార సంకీర్తనల ప్రధానలక్షణాలు. ఇవి లోక పరిశీలన వల్ల రచనలోకి ప్రసరించిన లక్షణాలు. రెండు రకాల సంకీర్తనలు ఆయన జీవితంలోని రెండు దశలను సామాజిక స్థితి ఆధారంగా నిరూపిస్తున్నాయి. ఎంతటి భక్తావేశపరుడైన వాగ్గేయకారుడైనా సామాజికాంశాలకు స్పృశించకుండా ఉండడం కవిగా ఆయనకు సాధ్యంకాదు. ఏ కవి మీదైనా సామాజిక ప్రభావం లేకుండా ఉండదు. అందువల్లనే శృంగార సంకీర్తనలలో వేంకట విభుడు, అలమేలు మంగమ్మలు చివరి చరణంలో నామమాత్రంగా పదముద్ర కోసమేనన్నట్లు కనిపిస్తారు. సంకీర్తనలలోని మిగిలిన సరుకంతా సమాజం నుండి సేకరించి గంపల కొలది కుప్పలు పోసినట్లు కనిపిస్తుంది.

అధ్యాత్మ సంకీర్తనల నిర్మాణం కార్య కారణత్వాలతో నిండుగా ఉంది. సంకీర్తన నిండా ప్రకృతి తత్వం, దాన్ని నియంత్రించే పరమాత్మ తత్వం కనిపిస్తుంది. ఇది అన్నమయ్య అధ్యాత్మ తత్త్వం నుండి బహిర్గతమైన విషయం. ఆయనలోని అధ్యాత్మ తత్వానికి శ్రీవైష్ణవం కారణం. దాని వెనుక అళ్వారులు, ఆచార్యులు - వారి రచనలు ఉన్నాయి. స్వామివారి నందకాశంలో జన్మించడం, చిన్నతనం నుండి వైష్ణవ భక్తిలో పారవశ్యం పొందడం, వైష్ణవాచార్యుల సరసన ఉండి వైష్ణవ సంప్రదాయాన్ని ఆకళింపు చేసుకోవడం, భక్తిమార్గాలలో కీర్తన మార్గాన్ని ఎన్నుకొని నేరుగా స్వామిసేవలో పాల్గొంటూ వెన్నుని అనంత గుణాలను కీర్తించడం ఇత్యాది విషయాలన్నీ అన్నమయ్య జీవిత ప్రథమ దశకు చెందిన అంశాలు. ఇవన్నీ అధ్యాత్మ సంకీర్తనల ఆవిర్భావానికి భిత్తికలు. అన్నమయ్య శుద్ధ సాత్త్విక దశ

నుండి తాత్త్విక భావోద్వేగంతో పైకుబికిన నరహరి కీర్తనలివి. శృంగారం అనుభవ గోచరమైన తరువాత లోకంలోని మిథున మిథునేతర శృంగారాంశాలను ప్రతిపాదించడానికి చెప్పినవి శృంగార సంకీర్తనలు. ఇలా ఈ రెండురకాల సంకీర్తనల నిర్మాణంలోను, స్వభావంలోను ఖచ్చితమైన భేదం కనిపిస్తుంది. ఈ భేదమే సంకీర్తనలలో వ్యక్తమయ్యే భక్తి శృంగార రసాల మధ్య కూడా ఉంది. ఈ అంశం స్పష్టపడిన తరువాత కూడా శృంగార సంకీర్తనలలో కనిపించేది దివ్య శృంగారమని, భక్తి శృంగారమని చెప్పడం సరికాదనిపిస్తుంది.

## మధుర భక్తి

శృంగార సంకీర్తనలలో ప్రపంచితమై కనిపించే శృంగారం లౌకిక స్థితికి సంబంధించినది కాదని, శృంగారం నుండి విడివడిన దివ్యశృంగారమని, భక్తుడు భగవంతుని సంయోగంకోసం చేసేప్రయత్నంలో దీనికి అస్తిత్వముంటుందని, దీనిని మధుర భక్తి అనవచ్చునని విమర్శకులు బలంగా అభిప్రాయపడుతున్నారు. సింహగిరి నరహరి వచనాలలోనే మధుర భక్తి సంప్రదాయం బీజరూపంగా ఉందని కూడా చెపుతున్నారు. కాని అందులో శరణాగతికి చెందిన అంశాలే ఎక్కువ. మధుర భక్తి రాధామాధవ తత్త్వానికి చెందిన అంశం. క్రీ.శ. పండ్రెండు పదమూడు శతాబ్దాల్లో బెంగాలు, ఒరిస్సా ప్రాంతాలలో ఈ తత్త్వం బాగా ప్రచారమైంది. దీనికి రాధాకృష్ణుల ప్రణయమే ఆధారం. రాధ జీవాత్మ, కృష్ణుడు పరమాత్మ. జీవాత్మ పరమాత్మను పొందడానికి ఉపకరించిన మాధ్యమం శృంగారం. ఈ సిద్ధాంతం తాత్త్విక కవులైన చండిదాసు, విద్యాపతి, జయదేవుడు, చైతన్య మహాప్రభు మొదలైన వారిద్వారా అద్వితీయంగా రూపొంది ఉత్తర భారత మంతా ప్రచారమైంది. ముఖ్యంగా జయదేవుని గీతగోవిందం ఈ తత్త్వానికి లక్ష్యప్రాయం. ఇందులో ప్రతిపాదింపబడిన రాధాకృష్ణుల ప్రణయం రస జగత్తును సమ్మోహ పరచిన తాత్త్విక శృంగారం. అష్టపదులలోని శృంగారం లౌకిక జగత్తును దాటి తాత్త్విక దశకు చేరుకొన్న మనస్సులో అనిర్వచనీయమైన ఆనందాన్ని నింపిన అద్భుత భావం. అన్నమయ్య శృంగార సంకీర్తనలలో ఇంత ఉదాత్తత (Sublime feeling) కనపడదు. సరిగ్గా అన్నమయ్య కాలంవాడే పోతన. భాగవతం

గోపికాకృష్ణుల ప్రణయాన్ని వర్ణించిందే కాని రాధామాధవులను గురించి పట్టించుకోలేదు. మొదటిసారిగా రాధాకృష్ణుల ప్రణయానికి తెలుగుదేశంలో ఊత నిచ్చింది. చింతలపూడి ఎల్లన రాధామాధవ ప్రబంధం. దీనిని అన్నమయ్య చూచి ఉంటాడని చెప్పడానికి వీలుగాకున్నా, బ్రహ్మవైవర్త పురాణాన్ని చూడడానికి అవకాశముంది. అన్నమయ్య కాలంలో మధుర భక్తికి లక్ష్యప్రాయమైన రాధామాధవ తత్త్వం ప్రచారం పొందుతూ ఉండినట్లు కనిపిస్తుంది. రెండు మూడు సంకీర్తనలలో ఆయన ఈ తత్త్వాన్ని దర్శించాడు. అప్పటికది సుప్రతిష్ఠితం కాకపోవడం వల్ల అన్నమయ్య దానిని పెద్దగా శృంగార సంకీర్తనలలో వివరించలేదు. అన్నమయ్య శృంగార రస సామగ్రి సమకాల సమాజంలోనిదే కావడం వల్ల, దానికి కావ్యత్వం కలిగించే ప్రయత్నం చేయడం వల్ల శృంగారం లౌకిక స్థితిని పొందిందేగాని అధ్యాత్మ వాసనా దూషితం కాలేదు. అన్నమయ్యలో గొప్పతాత్త్వికుడు, గొప్పభక్తుడు, గొప్ప అధ్యాత్మవేత్త ఉన్నప్పటికీ ఆయనలోని గొప్ప కవే మనకు దర్శనమిస్తాడు. లౌకిక భావాలు ఆధారంగా అన్నమయ్య భక్తి ప్రపంచ సోపానాన్ని ఎక్కే ప్రయత్నం చేశాడు. అయినా రస పుష్టి దగ్గరకు వచ్చేటప్పటికి అదిపూర్తిగా అలౌకికం కాలేక పోయింది. ఈ కింది సంకీర్తన ద్వారా ఇది ఎంత నిజమో అర్థమవుతుంది.

**ఎట్టు గడిపీనో దైవ మింతికి నీ గండమిక**
**ముట్టివచ్చి ఇరుమేల మోహరించె పనులు ॥పల్లవి॥**

**జలజాక్షి మోమువాడె చంద్రుడు కళలు గూడె**
**కలికి కన్నులు మూసె కలువలు లాసె**
**బలు వూరువులు దాగె పయ్యెర గాలి రేగె**
**కులుకు మాటలణగె కోవిలలు గొణగె ॥ఎట్టు॥**

**చింత చెలిమేను చిక్కె చిగురు కెంజాయ లెక్కె**
**వింత నవ్వులెల్లా గుంగె వెన్నెలలు పొంగె**
**దొంతి దురుము విరిసె తుమ్మిద మూక మొరసె**
**మంతనాలు కరవాయె మరుడు ఎరవాయె ॥ఎట్టు॥**

**చనుగొంగెడలె పంచశరు టెక్కెము వెడలె**
**వెనువెంట బులకించె విరులెల్లబొంచె**
**యెనసి శ్రీవేంకటేశుడింతి నిట్టికూడగాను**
**ననుపిట్ట సేయ దమి నచ్చు గనమాయ ॥ఎట్టు॥**

**(శృం.సం. 22-29)**

పై సంకీర్తనలో కనిపించే శృంగార నాయికకు సంబంధించిన మోము, కన్నులు, ఊర్పులు, మాటలు, మేను, నవ్వు, తురుము, చనుగొంగు ఉపమేయాలు. వీటికి చంద్రుడు, కలువలు, పయ్యరగాలి, కోవిలలు, చిగురు, వెన్నెల, తుమ్మిద మూక, పంచశరు టెక్కెము వరుసగా ఉపమానాలు. వీటిలో ఒకటి రెండు తప్ప మిగిలినవన్నీ అలంకార శాస్త్రం నిరూపించినవే. ఇవన్నీ అన్నమయ్య గ్రహించిన రస సామగ్రి. ఈ సామగ్రి సంయోగంలో రసం నిష్పన్న మవుతుంది. ప్రియుని లాలన కరువైనపుడు ప్రియురాలి మోము వాడడం సహజం. అయితే కూడిక గలిగినపుడు మోముమీద చంద్ర కళలు కనిపిస్తాయి. మోము వాడిపోతే చంద్రుడు కళలతో వెలగడం సంబంధం లేనిమాట. మోము కళాత్మకం కావడానికి ప్రియుడు చేసిన ననుపు - అంటే శృంగార క్రియ కారణం. కన్నులు మూత పడడం పారవశ్యం చేత. కనులలో కలువలు ప్రకాశించడానికి కారణం సంతోషంతో కనులు వెలగడం. ఇలాగే నిట్టూర్పులతో కలిగిన అలసత్వాన్ని పైరగాలి పోగొట్టింది. అంటే అంతరంగంలోని స్థాయిని కదిలించిందని భావించాలి. ఇలాగే మిగిలిన రెండు చరణాలు చూడవచ్చు. ఉపమేయాలు చేయవలసిన పనులను ఉపమానాలు నిర్వహించడం ఈ సంకీర్తనలో కనిపించే సొగసు. ఉపమానాలన్నీ ఆ యింతిని మోహరించాయి. అది ఆమెకు ఒక గండమైంది. ఈ గండాన్ని దైవం ఆమెను పతితో కూర్చి దూరం చేశాడు. ఆమె నిలువెల్ల పులకించింది. ఉపమేయోపమానాల మధ్య లేని సంబంధాన్ని కల్పించి ఒక జిలుగు శిల్పాన్ని సాధించాడు. ఆయన తరువాత వచ్చిన ప్రబంధ కవులు ఈ అనితర శిల్పాన్ని అనాయాసంగా సొంత చేసుకొని మరింత మెరుగుపెట్టి చూపారు. అన్నమయ్య సేకరించి గంపలకెత్తిన శృంగార సామగ్రిని పూర్తిగా వాడుకొన్నారు. ఈ సంకీర్తనలో మధురభక్తి

ఉందనుకొనేవారికి దొరికే సాక్ష్యం చివరి చరణంలో ముద్రా ముద్రితుడైన వేంకటేశ్వర స్వామి ఇంతిని కూడడం. బాగా పరిశీలిస్తే మొదటి చరణం నుండి కనిపిస్తున్న రస సామగ్రిగాని, రసభావాలు గాని వేంకటేశ్వరునివి కావు. ప్రియుని కూడికను కాంక్షించిన సామాన్య నాయికవి. ఈ సంకీర్తనలో మనకు వెంటనే కనిపించేవి ప్రియుని లాలన కోసం తపించే ఒక నాయిక, ఆమె రసభావాలు. అన్నమయ్య తాత్త్వికత గాని, వేంకటేశ్వరస్వామి నాయకత్వం గాని కనిపించవు. మంతనాలకు మరుని, చనుకొంగుకు పంచశరు టెక్కాన్ని ఉపమానాలుగా గ్రహించడం అప్పటి కవి సమయాలకు కొత్త. శృంగార సంకీర్తనలను బాగా పరిశీలిస్తే ఇలాంటి కొత్త కవి సమయాలు ఎన్నో దొరుకుతాయి.[5] అలంకార శాస్త్రంలో చోటు కల్పించ వలసినవివన్నీ. అలంకార శాస్త్రాన్ని వాడుకుంటూ దానికి కూడా మెరుగుపెట్టే ప్రయత్నం చేసిన కవి అన్నమయ్య.

ఇలా పరిశీలిస్తూపోతే **'నానృషిః కురుతే కావ్యం', 'కవయః క్రాంత దర్శినః', 'అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః'** ఇత్యాది ఆలంకారిక లక్షణాలకు అనుగుణంగా రచనలు చేసిన కవిగా కనిపిస్తాడు అన్నమయ్య. ఇలాంటి కవికి సామాజికాంశాలను పట్టించుకోకుండా అధ్యాత్మ వాసనలతో తనను తాను బంధించుకోవడం సాధ్యంకాదు. అందువల్ల అన్నమయ్య అన్నిటికంటె ముందు కవి. తరువాతనే తాత్త్వికుడు, అధ్యాత్మవేత్త. తాను అధ్యాత్మ భావాలను ప్రతిపాదిస్తున్నాననే స్పృహ కలిగినప్పుడు రూపొందిన సంకీర్తనలలో భక్తి శృంగార లేదా శృంగార భక్తి విషయాలు కనిపించి మధురభక్తి తాలూకు భావం ప్రస్ఫుటమై ఉండవచ్చు. దీనికి సంబంధించిన విషయాన్ని తరువాత పరిశీలిద్దాం. ప్రజాకవి అన్న పదం అన్నమయ్యకు బాగా అన్వర్థమవుతుంది. ప్రజా జీవనంలోని రంగులు - పొంగులు, వయ్యారాలు - వద్దనలు, సింగారాలు - శృంగారాలు, వావులు - వరుసలు, కులాంగనలు - చెవికత్తెలు, సరసాలు - విరసాలు, ఆకర్షణలు - వికర్షణలు ఇత్యాది విషయాలన్నీ అతిసహజంగా శృంగార సంకీర్తనలో విస్తారంగా కనిపిస్తున్నాయి. ఇవన్నీ సామాజిక జీవనం నుండి పైకెగసిన కెరటాలు. అన్నమయ్య కవితను అజరామరం చేసిన చైతన్య భావ దీపికలు. సమాజవిరాడ్రూపాన్ని -

పైగా శృంగార చిత్రాన్ని అద్భుతంగా ప్రదర్శించిన అన్నమయ్యను మధురభక్తి శృంఖలాలతో బంధించి పెట్టడం సబబు కాదు. ఈ గొలుసులను ఛేదించుకొని ఆయన మహాకవిగానే దర్శనమిస్తున్నాడు.

## తాత్త్వక శృంగారం

భరతుడు నాట్యశాస్త్రంలో ధర్మకామం, అర్థకామం, కామ కామం (స్త్రీ పురుష సంయోగానికి చెందిన కామం), మోక్షకామం అని కామాన్ని నాలుగు రకాలుగా చెప్పాడు.[6] వీటిలో మోక్ష కామం మోక్ష సంబంధి శృంగారం. దీనినే మధుర భక్తి అన్నారు. భాగవతంలోని గోపికాకృష్ణుల శృంగారం ఇటువంటిదే. శృంగారం ద్వారా అధ్యాత్మ భావాలను కలిగించడం, తద్వారా మనసును సమాధి స్థితికి చేర్చి దివ్యత్వపు పరిధిలో విహరింపజేయడం దీని లక్షణం.

**చాలు చాలును భోగ సమయమున మైమఱపు**
**పాలు పడునట యేటి బ్రతుకురా వోరి** ॥పల్లవి॥

**ఇందుముఖి నిను గౌగలించి లోపలి జగము**
**కందునని నీ బిగువు కౌగిలే వదలె**
**పొందైన వారితో పొసగ కౌగిట జేర్ప**
**పొందు గాదట యేటి పొందురా వోరి**

**(శృం.సం. 5-45)**

భోగసమయంలో మైమఱపు కలగడం - అంటే బాహ్యాస్థితిని పూర్తిగా మరచి పోవడం ఆనంద స్థితినందు కోవడానికి చిహ్నం. ఈ భోగం రసాత్మకం. భగవంతుని దివ్యత్వంలో కలవడం కూడా భోగమే. ఈ రెండు భోగాలు ఒక స్థితిలో సమమవుతాయి. అందుకే కామపురుషార్థం మోక్షపురుషార్థానికి మార్గమవుతుందని చెప్పడం. ఇందుముఖి ప్రియుని కౌగలించుకొని లోపలున్న జగత్తు కందిపోతుందని కౌగిలి సడలించడం శృంగార జగత్తునుండి అధ్యాత్మ లోకంలోకి చేరడంగా అర్థమవుతుంది. కౌగిలి ప్రేమకు చిహ్నం. రతికి మొదటి దశ. శరీరాన్ని శరీరాన్ని కలుపుతుంది. **'కందువ నీ కాఁగిలెల్లా కామ నిధానమే**

**కాదా'** (21-174) అంటాడు అన్నమయ్య. కౌగిలి కామనిధి. ఈ నిధినుండి జాలువారే ఇతరాంశాలు చుంబనాదులు. కౌగిలి ప్రసక్తిలేని శృంగార సంకీర్తన కనపడదు. కౌగిలి ఆకర్షణ. కౌగిలిని సడలించడం వికర్షణ. ఒకటి సంకల్పం. మరొకటి వికల్పం. శృంగారంలో మునిగిన మానసం దానినుండి విముఖత్వం చెంది తాత్త్విక దశకు చేరడం ఈ సంకీర్తన విషయం.

**మెలుఁత విభుబాసియును మితిలేని వేదనల**
**నలరి యాతని గూడు నభిరతుల నలసె**
**అలిగినను గూడినను కలిగె వలపులు దనకు**
**నెలమి తన సుఖము లిక నెప్పుతో కాని** (శృం.స.**5-299**)

అభిరతులలో అలసిపోవడం, అలిగినా కూడినా వలపులే కలగడం నిజమైన సుఖం కాదని, తనకు కావలసిన సుఖం ఎప్పుడు కలుగుతుందో తెలియడం లేదని నాయిక వాపోతున్నది. లేదా భక్తుడు వాపోతున్నాడు. ఈ ఇద్దరికి కలగ వలసిన సుఖం చిత్తశాంతి.

**విరహ తాపము చేత పొరలి పొరలిన వీడి**
**సరసంపు నెరివేణి జడగట్టె గాని**
**అరుదైన చింతతో నలయుచును దినదినము**
**సరసిజానన మేను సగమాయగాని**[7]

ఇందులో వేణి జడగట్టడం, మేను సగం కావడం కార్యాలు. విరహతాపం, అరుదైన చింత కారణాలు. ఇటు శృంగారభావానికి, అటు అధ్యాత్మ భావానికి సరిపోయే అంశాలివి.

శృంగార సంకీర్తనలలో కనిపించే ఇలాంటి మరికొన్ని సంకీర్తనలను ఆధారం చేసుకొని మధురభక్తి సిద్ధాంతం తయారైంది. అయితే దీనిని వివరించడానికి ఉదాత్తమైన పద్ధతి ఉండగా ప్రాపంచిక శృంగార వర్ణన లెందుకని ఈ సిద్ధాంత ప్రతిపాదకులైన విమర్శకులకు కూడా అనిపించింది. తాళ్లపాక వాఙ్మయ పరిష్కరణ అనగానే వెంటనే గుర్తుకు రాదగిన పండితులైన గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారికి ఈ ప్రశ్న ఎదురైంది. అన్నమయ్యను శృంగార కవి అనడం ఇష్టంలేక కాబోలు

శర్మగారు దాన్ని మరొక రకంగా సమర్థించారు. స్వామి విశ్వమోహన శృంగారి. భక్తిని శృంగారాత్మకంగా ప్రకటిస్తే ఆయన కిష్టం. మానవులకు శృంగారం అనుభవ గోచరమైనట్లు మరొక రసంకాదు. వీళ్లను శృంగారాత్మకంగా ఆకర్షించి తరువాత అధ్యాత్మ భావనా లోలురను చేయడం సులభం. అందుకే అన్నమయ్య శృంగారాన్ని విచ్చలవిడిగా వర్ణించాడు. ఆ ప్రశ్నకు శర్మగారు ఈ సమాధానం చెప్పినారే కాని ఇది పూర్తిసమాధానం కాదని ఆయనకు తెలుసు. ఆయన అంతరంగంలో ఈ శృంగారాధిక్యతకు మరొక సమాధానం ఉండి ఉంటుంది. బయటపెట్టకుండానే ఆయన వెళ్ళిపోయారు.

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో లజ్జాకర విషయ ప్రసక్తి ఉందని నమ్మిన వారుకూడా మరొక రకంగా సమన్వయించే ప్రయత్నం చేశారు. "అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో చుంబన, ఆలింగన, గుహ్యాకార్య, దంతక్షత, నఖక్షత, నీవీస్రంసన, స్తనాంతర విమర్దన, జలక్రీడాది లజ్జాకర విషయప్రసక్తి ఉన్నా నాట్యధర్మి సహితమైన అభినయంతో ఔచిత్యవంతాలవుతాయి. నాట్యధర్మి అన్న అంశం కవి వ్యాపారంలో, నట వ్యాపారంలో ఉన్నవైచిత్ర్యం". ఈ సమన్వయం డా॥ శౌంఠి శారదాపూర్ణ గారిది.[8] ధర్మి అంటే అభినయ విధానం. ఇలాంటి శృంగార విషయాలను అభినయించి నగ్నత భాసించకుండా చూపడం అంత సులభమా? ముమ్మాటికీ సాధ్యంకాదు. ఇలాంటి సమన్వయాలన్నీ సత్య దూరాలనే నా అభిప్రాయం. శృంగార సామగ్రిని కుప్ప పోయడంలో అన్నమయ్య ఆశించిన ప్రయోజనం వేరుగా కనిపిస్తుంది. దీని విషయం తరువాత చూద్దాం. అయితే మధుర భక్తి వ్యంజితాలైన ఇలాంటి సంకీర్తనల మాటేమిటి అనే అంశానికి సమాధానం వెతకాలి. అన్నమయ్యలో కవే ముందు కనిపిస్తాడు. తరువాతనే మిగిలినవన్నీ. కవిగా సమాజాన్ని దర్శించాడు. ఆయన కాలంనాటి శృంగార భంగులను సంకీర్తనల కెక్కించాడు. ఆయనలో తాత్త్వికత పైకొన్న సందర్భాల్లో చెప్పిన సంకీర్తనలలో శృంగార, అధ్యాత్మ భావాల సమ్మేళనం మధుర భక్త్యాత్మకంగా పొసగి కనిపిస్తున్నది. ఇలాంటి సంకీర్తనల సంఖ్య పరిమితంగానే ఉంది. శృంగార సంకీర్తనలలో అక్కడక్కడా కనిపిస్తాయివి. వీటి ప్రయోజనం వేరు. మిగిలిన సంకీర్తనల ప్రయోజనం వేరు. శృంగారాత్మకమైన అధ్యాత్మ భావాలను ప్రతిపాదించిన రచనలు అన్నమయ్యకు ఎంతో ముందు నుండి బోలెడున్నాయి.

**"కామేశ్వర ప్రేమరత్న మణి ప్రతిపణ స్తనీ**
**నా భ్యాలవాల రోమాళి లతాఫల కుచద్వయీ**
**కామేశ జ్ఞాత సౌభాగ్య మార్దవోరు ద్వయాన్వితా**
**మాణిక్య మకుటాకార జానుద్వయవిరాజితా"**

ఇత్యాది శ్లోకాలు '**శ్రీలలితా సహస్రనామ స్తోత్రం**'లోనివి. ఈ శ్లోకాలలో వ్యక్తమయ్యే శృంగారం జగత్పితరులు, సనాతనులు అయిన ఉమా శంకరులకు సంబంధించినది. ఈ నామ స్తోత్రాన్ని సాధకులు నిత్యం వల్లె వేస్తుంటారు. శృంగార మనిపించినా అధ్యాత్మ భావంలో ఇమిడి పోవడం వల్ల సాధకుడికి చిత్త శాంతి కలిగి అమ్మవారి రూపం దృగ్గోచరమవుతుందే కాని అన్యభావం కలగదు. సంకీర్తన నిండా లౌకిక శృంగారం నింపి చివర తిరుమలవాసునికి అంకితం చేసినందువల్ల శృంగారం ఉన్నట్టుండి అధ్యాత్మికమైపోదు. ప్రదర్శించిన రససామగ్రికి సంబంధించిన ఆలోచనలు సాగి పఠిత దృష్టి సమాజ పరిధిలో ప్రవేశిస్తుందే గాని వెంటనే దివ్యత్వాన్ని అర్థం చేసుకోలేదు. ఈ విషయం అన్నమయ్యకు బాగా తెలుసు. పాఠకులు లోక స్థితిని గమనించాలనే ఆయన ఆలోచన.

## శృంగార సంకీర్తనలు ప్రతిపాదించిన శృంగార స్వభావం

అన్నమయ్య ప్రతిపాదించిన శృంగారం సామాజికం. దీనికి లోకమే ప్రమాణం. శృంగార సంకీర్తనలలో వివిధ రకాల నాయకులు, వివిధరకాల నాయికలు కనిపిస్తారు. భార్యాభర్తలు, ప్రేయసీ ప్రియులు, రసిక రాట్టులు - వాడవనితలు, బావలు - మరదళ్లు, యజమానులు - సేవకరాండ్రు ఇత్యాది వరుసలన్నీ సమాజానివే. శృంగారం వీళ్లదే. ఈ విషయం అన్నమయ్యకు బాగా జ్ఞాపకముంది. ఆయన వివరించే శృంగార భావాలు లోకానివే ననడానికి 'లోకులు' అనే మాటను అనేక సంకీర్తనలలో వాడడమే గుర్తు.

**మదిలోనే దలచగ మరుగున దానుంటే**
**వదలక దయలేని వాడనరా <u>లోకులు</u>** **(శృం. సం.11-481)**

ఇత్యాది అనేక సంకీర్తనలలో లోకం విషయం గుర్తు చేస్తుంటాడన్నమయ్య.

దేశంలో ఎప్పటినుండో ప్రచారంలో ఉండిన శృంగార శాస్త్ర విషయాలు అన్నమయ్య కాలంనాటికి సాహిత్య గ్రంథాలలో కూడా తమ ఉనికిని చాటుకొన్నాయి. పోతన, శ్రీనాథుల సాహిత్యం కూడా దీనికి అపవాదం కాదు. శృంగారం సహజ భావమేనని గ్రహించిన వారు కావడం వల్ల మన కవులు రతిశాస్త్ర విషయాలను తమ శృంగార రస పోషణలో సమన్వయం చేసుకోవడమే గాక రతిబంధాలను కూడా అక్కడక్కడా సూచించక పోలేదు. శ్రీనాథుని హరవిలాసంలోని శివపార్వతుల శృంగార, శివుని దారుకావన విహార ఘట్టాలను పరిశీలిస్తే ఈ విషయం తేట తెల్లమవుతుంది.[9] కూచిరాజు ఎఱ్ఱన ఆంధ్ర కొక్కోకం ఈకాలంలోనే వెలువడింది. ఇంకా ముందుకు వెళితే నన్నెచోడుని కుమార సంభవంలోనే పురుషులు పురుషుల మధ్య, స్త్రీలు స్త్రీల మధ్య శృంగార సంబంధాలు కనిపిస్తున్నాయని ఆచార్య ఎల్.బి. శంకరరావు గారు చెపుతున్నారు.[10] ఇలాంటి వాటిని అపసవ్య పద్ధతులుగా శాస్త్రాలు పేర్కొన్నాయి. లేవని చెప్పలేదు.

అన్నమయ్య కాలంనాటి సమాజం సహజంగా శృంగారాత్మకం. ఇలాగని సమాజంలో వ్యక్తులందరిలో శృంగారం ఉందనికాదు. శృంగారం వయస్సులో ఉన్నవాళ్ళకు. 'కామంచ యౌవనే' అంటుంది శాస్త్రం. బహుభార్యాత్వం, వేశ్యాప్రియత్వం, భోగలాలసత్వం అప్పటి సమాజాన్ని పీడించిన లక్షణాలు. సాంసారిక వ్యవస్థలో కుటుంబ స్త్రీల దుర్బలత్వాన్ని, సహనాన్ని, ఆసరా చేసుకొని పురుషుల వైశికత్వం (బహుళ వేశ్యోపభోగ రసికుడు వైశికుడు) ప్రబలిన రోజులివి. తమభర్తల శృంగారావసరాలను ఇతర స్త్రీల సహాయంతో తీర్చడానికి కూడా అప్పటి స్త్రీలు పూనుకొన్నట్లు అనేక సంకీర్తనలు తెలుపుతున్నాయి. అప్పటి శృంగారం ఇప్పుడనుకొనేంత రహస్యమూ కాదు, బూతూకాదు. శృంగార విషయాలను బాహాటంగా ముచ్చటించుకోవడం, అనుభవానికి తెచ్చుకోవడం ఆనాటికి అతి సహజం. అదిమానవ స్వభావమని, దేహధర్మని, దాంపత్యం - దానివల్ల కలిగే సుఖం కళంక విషయం కాదని కాలౌచిత్యాన్ని బట్టి భావించ వలసి ఉంటుంది.

**ఇట్టె చన్నులంటకుర యిస్సీ యిందరు జూడ**

.... .... .... .... .... .... .... .... ....

**తొడమీద వేయకుర తోతో యిందరు నవ్వేరు**

**.... .... .... .... .... .... .... .... ....**

**పచ్చిమాట లాడకుర పడతులెల్ల వినేరు (శృం.సం. 11-303)**

**అంగన బాగాలిచ్చి ఆకుమడిచీయగానా**

**యెంగిలి చేసేవు మోవి యిందరిలోన (శృం.సం. 11-102)**

శృంగార సంకీర్తనలలోని ఇలాంటి ఉదాహరణలెన్నో అప్పటి శృంగారం అందరిలో శృంగారమనే విషయాన్ని తెలుపుతున్నాయి.

అన్నమయ్యలోకజ్ఞుడు. సమాజంలో తాను దర్శించిన విషయాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేరీతిలో తెలియజెప్పాలని ఆయన సంకల్పం. ఈయన సాహిత్యం పైకి తేటగా కనిపించినా లోతుకు దిగితే అనితర సాధ్యమైన భావ పరంపరలు దొంతర దొంతరులుగా మానసాన్ని తాకుతాయి. వేదోపనిషత్తుల సారాన్ని సామాన్య ప్రజలకు అధ్యాత్మ సంకీర్తనల ద్వారా అందించాడు. ఆ ప్రజలకోసమే - వాళ్లకు తెలియడం కోసమే వాళ్ల బ్రతులలో అతి సహజంగా అల్లుకుపోయిన శృంగారాంశాలను శృంగార సంకీర్తనల ద్వారా అందించాడు. వాత్స్యాయన మహర్షి కామసూత్ర గ్రంథ ఉపసంహార వాక్యాలుగా ఈ రెండు శ్లోకాలు రాశాడు.

**"రక్షన్ ధర్మార్థ కామానాం స్థితిం స్వాం లోక వర్తినీం**

**అన్య శాస్త్రస్య తత్త్వజ్ఞో భవత్యేవ జితేంద్రియః**

**తదేతత్కుశలో విద్వాన్ ధర్మార్థవలోకయన్**

**నాతి రాగాత్మకః కామీ ప్రయుంజానః ప్రసిధ్యతి"**

ఈ శాస్త్ర తత్వాన్ని గ్రహించిన వాడు పురుషార్థాల స్థితిని, లోక పరిస్థితిని, తన స్థితిని గమనించ గలుగుతాడు. ఈ శాస్త్రంలో మంచి ప్రావీణ్యం సంపాదించి, పురుషార్థాలకు అనుగుణంగా ప్రయోగాలను, ప్రతి క్రియలను అనుసరించి ఇష్టార్థ సిద్ధిని పొందుతాడు అని మహర్షి అభిప్రాయం. కామసిద్ధి జీవితానికి అవసరం కాబట్టి అది కలగాలంటే కామశాస్త్రం తెలిసి ఉండాలనికూడా

మహర్షిచెప్పాడు. ఇది యువతీ యువకులకేనని, శాస్త్రం తెలియనివారికి పొందు ప్రయోజన రహితమని శాస్త్రం చెప్పింది.

శృంగార సంకీర్తనలలో శృంగారం అతివేలంగా కనిపిస్తున్నప్పటికి అది అసహజం మాత్రం కాదు. మహర్షి భావించినట్లు ఈ విషయాలను శృంగారం అవసరమైన వాళ్లంతా తెలుసుకోవాలనే అన్నమయ్య కూడా అభిప్రాయపడినట్లుంది. వయసుండగానే అనుభవింప దగినవాటిని అనుభవించాలన్నది (శృం.స. 12-361) ఈ సంకీర్తనల లక్ష్యం. మైథునాన్ని ఛాందోగ్య (5-9-1), బృహదారణ్యకోపనిషత్తులు (6-2-13) ఒక యజ్ఞ కార్యంగా పేర్కొన్నాయి. దీనికి ఆనంద ప్రయోజనంతో పాటు సత్సంతాన ప్రయోజనం కూడా ఉండడం కారణం. మంచి సంతానం వల్ల మంచి సమాజం రూపొందుతుందనే విశ్వాసంతోనే కామ శాస్త్రాలొచ్చాయి. అన్నమయ్య శృంగారాన్ని పవిత్రంగా భావించాడు కాబట్టే-

**అంగన నిన్నుగూడగ నటు నీపై వడిసేటి**
**అంగపు జెమట నీకు నభిషేకము**
**వుంగిటి గొప్ప విరులు వుపరి సురతవేళ**
**సంగతి రాలేటి చల్లు వేదపూజ** **(శృం.సం. 19-531)**

అంటూ రతిని వేద పూజగా భావించాడు. ఉపస్థ యజ్ఞమనే ఉపనిషద్విషయం ఇక్కడ ధ్వనిస్తున్నది. తన ప్రియుని జాడ్యం పోవడానికి ఒక ప్రియురాలు 'మదన వేద మంత్రాలతో' మంత్రిస్తాననంటుంది (శృం.సం. 12-353). మదన వేదం అనేమాట శృంగార కార్యంలోని పవిత్రను చెప్పడానికే వాడబడింది. ఇలా పరిశీలిస్తూ పోతే అన్నమయ్య వివరించిన శృంగార విషయ ప్రాధాన్యతను తెలిపే ఉదాహరణ లెన్నైనా దొరుకుతాయి. ఇవన్నీ అన్నమయ్య లౌకిక శృంగార స్థితిని చూపడానికే గాని, మధుర భక్తికి సంబంధించినవి కావని ఋజువు చేస్తాయి.

## అన్నమయ్య నాటి సమాజం - శృంగారం

జీవితాన్ని అందంగా ఆకర్షకంగా మలచుకోవడంలో శృంగారానికున్న ప్రాధాన్యతను, అవసరాన్ని శృంగార సంకీర్తనలలో అన్నమయ్య గుర్తించాడు.

శృంగారాన్ని అందమైన అనుభవంగా, ఒక కళగా భావించాలని స్ఫురింపజేయ దానికి భావపుకళ (16-380), రతి రాజవిద్య (16-526), కాయజ విద్య (16-533), మదనశాస్త్రం (14-4), పూట పూట రతులివి పుష్ప యాగము (14-396), రతికళ (18-223), మదనకళ (18-343), సమరతి సంపద (18-252), కామ తంత్రపు సంపద (18-583), రతి తపము వంటిది (21-350) ఇత్యాది పదాల ప్రయోగం చేశాడు. ఈ పదాలలో చాల రతి శాస్త్ర గ్రంథాలలో కనిపిస్తాయి. దీనిని బట్టి అన్నమయ్య శాస్త్ర గ్రంథాల సారాంశాన్ని తన ధోరణిలో చెప్పే ప్రయత్నం చేసినట్లు అర్థంచేసుకోవాలి. రతులలో భేదాలు, చుంబనాలు, నఖక్షతాలు, స్తన విమర్దనాలు ఇత్యాది రతివిషయ సామగ్రిని సంకీర్తనలన్నిటా చూపించడానికి కారణం కూడా మనసిజ తంత్రాన్ని అందంగా మలచుకోమని చెప్పడానికే.

ఒక సంకీర్తనలోని విషయం మరొక సంకీర్తనలోకి ప్రసరించక దేని కది ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిఉంటుంది. ముక్తక రచన ఇది. మరి రసనిష్పత్తి మాటేమిటని పిస్తుంది. ప్రతి సంకీర్తనలోని రస సామగ్రి సాధారణీకరణత్వాన్ని పొంది రస పర్యవసాయిగా మారుతుంది. అమరుక శతకం విషయంలో రస స్థితి ఎలాగో సంకీర్తనలలోనూ అంతే. ఉత్తమ పాత్రల మధ్య వర్ణింపబడిన విభావాది సామగ్రి రసాన్ని నిష్పన్నం చేసినపుడు అది అలౌకికస్థాయికి ఎదుగుతుందని అలంకార శాస్త్రం నిరూపించింది. రసానందం బ్రహ్మానంద సహోదర మన్నది ఈ ఉద్దేశంతోనే. శృంగార సంకీర్తనలలో భార్యాభర్తలున్నారు. వారవనితలున్నారు. చెలికత్తెల శృంగారముంది. కేవలం భోగేచ్ఛతో ప్రవర్తించే పురుషులున్నారు. పురుషుని ఉసిగొలిపే స్త్రీలున్నారు. ఆనాటి విచ్చలవిడి శృంగారంలో భాగస్వాములు వీళ్లంతా. సంయమన మెరుగని శృంగారం వీళ్లది. ఈ విభావాదాలు ఆధారంగా ఏర్పడే రసం శాశ్వతమైనది కాదు. శృంగార సంకీర్తనలలో రసాన్ని గురించి ఆలోచించడం కంటె ఆనాటి సామాజిక శృంగార చిత్రాన్ని గురించి ఆలోచిస్తే సరిపోతుంది.

సమాజ వ్యవహారంలో ఉండే దాపరికం లేని శృంగార విషయాలను తెలుసు కోవడం ద్వారా కామ పురుషార్థ ప్రాధాన్యత అర్థమై ఇతర పురుషార్థాల

సాధనకు ఇది ఎలా దోహదపడుతుందో లేక సామాజిక జీవన వైవిధ్యంలో అవసరమైన క్రమశిక్షణకు ఎలా ఉపయోగ పడుతుందో వాత్స్యాయన మహర్షి తనగ్రంథంలో నిరూపించాడు. భారతీయ సంస్కృతికి మూల స్తంభాలైన చతుర్విధ పురుషార్థాల లోని మూడవ దానిని ఒక పురుషార్థంగా భావించి సాధనచేసే వాళ్ల విషయమిది. ఈ పురుషార్థాన్ని అపమార్గాలలో పయనింపజేసే వాళ్లు కూడా క్రమ క్రమంగా దీని పవిత్రతను గుర్తించి తదనుగుణంగా తమను తాము మార్చుకుంటారని కూడా మహర్షి ఆశించాడు. ఈ పురుషార్థానికింత పవిత్రత, ప్రాధాన్యత ఉండడం వల్లనే దీనినొక కళగా భావించడం జరిగింది. ఈ విషయం అన్నమయ్య శృంగార సంకీర్తనల ద్వారా నిరూపిత మవుతుంది. శృంగారం కళాత్మక మనే విషయాన్ని స్ఫురింపజేసే కామ కళ, మదన కళ లాంటి మాటలెన్నో శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్నాయి. భారతీయ సాహిత్యం శృంగార ప్రాధాన్యతను గుర్తించి దీనినొక కళగా మలచుకోవాలని ఆయా సందర్భాల్లో స్ఫురింప జేసింది. అన్నమయ్య ఒక మహా కవిగా దీనిని గుర్తించాడు. అందుకే శృంగార సంకీర్తనలు మన్మథ వేదాలుగా, కాయజోపనిషత్తులుగా రూపొంది నాయి."[11] సామాజిక శృంగారం కవితీకరించ బడింది.

అన్నమయ్య సమాజంలో దర్శించిన శృంగారం మూడు విధాలుగా శృంగార సంకీర్తనల కెక్కింది. 1. దాంపత్య శృంగారం, 2. పుంశ్చలీశృంగారం, 3.సమయాను కూల శృంగారం. శృంగార సంకీర్తనలు ప్రదర్శించిన పనిచేసే స్త్రీలతో గృహస్థులు నెరిపే శృంగారం, వావి వరుసలు లేని శృంగారం ఇత్యాదులు ఈ మూడవ తరగతికి చెందిన అంశాలుగా కనిపిస్తాయి. అన్నమయ్య కాలంనాటి సమాజంలో ఇప్పటికంటె ఎక్కువగా శృంగారానికి ప్రాధాన్యత, అవసరం ఉన్నాయనడంలో సందేహం లేదు. శృంగార విషయాలను అందరూ వింటుండగా చర్చించుకోవడం అప్పటికి అసహజం కాదు. పైగా వేశ్యా శృంగారానికి బాగా అలవాటు పడిన కాలమది. వేశ్యా సంపర్కం మగ సిరికి గుర్తుగా, కొందరు కుల స్త్రీలు సహించి మెచ్చుకొనే తమ భర్తల విలాసంగా భావింప బడినట్లు చెప్పడానికి ఎన్నో ఆధారాలున్నాయి. సమాజపు శృంగార పోకడలను శృంగార సంకీర్తనలు స్పష్టంగా చూపాయి. మధురభక్తి వాదులు కొందరు అన్నమయ్య నాయికలలో వేశ్యలు

లేరని చెపుతున్నారు.[12] కాని ఇది పూర్తిగా నిజంకాదు. వేశ్యా సంపర్కం కుల స్త్రీలకు తమ పతులవల్ల ఎదురైన అనేక సమస్యలకు కారణమని అన్నమయ్య గుర్తించాడు. దాంపత్య బంధం బీటలు వారడం సహించలేక పోయాడు. వేశ్యా సంపర్కం కుల స్త్రీల సంపర్కంకంటె అధమమని భావించాడు. ఇంటి ఆలు భర్తకు ఎన్ని రకాల ఊడిగాలైనా చేస్తుంది కాని **'పొత్తుల యెంగిలి తోడి బోగము సయించదు'** (11-556). సానబట్టే సరసాలు ఆమెకు చవిగావు. సరసంలో సంత జాణ తనాలు పనికి రావు (13-237). వారకాంతలు నిన్ను మెప్పించినట్లు కులస్త్రీలు మెప్పించలేరా (13-176) అంటూ ఒక సంసారస్త్రీ తనభర్తను నిలదీస్తున్నది. ఆడదానికి ఆశ గల్పించి పరాకు చేయడం పాపం. వలచిన వారున్నపుడు వేశ్యల వెంట తిరగడం పాపం (16-147) అని స్త్రీ గొంతుకతో అన్నమయ్యే అంటున్నాడు.

బహు భార్యత్వాన్ని శృంగార సంకీర్తనలు బాగా ఎత్తి చూపినాయి. దీనివల్ల స్త్రీలు మానసికంగా ఎంతగా నలిగి పోయారో, అపరిహార్యమైన ఈ వ్యవస్థ నుండి తప్పించుకోవడానికి వీలుగాక ఎలా సర్దుకుపోయారో, ఇద్దరు ముగ్గురు భార్యలున్న భర్తలను ఎలా సహించారో నన్న విషయాలను అన్నమయ్య గమనించాడు. ఈ పద్ధతి పురుషుల లౌల్యాన్ని బాగా పెంచింది. దీనికి తోడు అప్పటి సమాజంలో విరివిగా దొరుకుతూ ఉండిన స్వేచ్ఛా ప్రణయం (Free love), రహస్య ప్రణయం (Secret love) కుల స్త్రీల పాలిట శాపాలైనాయి. ఎదిరించలేని అశక్తతతో సంసార స్త్రీలు పురుషుల స్వేచ్ఛా ప్రణయాన్ని మూగబాధతో ఆమోదించిన వైనాలను కూడా శృంగార సంకీర్తనలు స్పష్టంచేస్తున్నాయి. ముందు యుగాలలో 'కోరిక' అనే అర్థంలో కనిపిస్తూ ఉండిన 'కామ' శబ్దం ఈ సమాజంలో లైంగికతకు గుర్తుగా మారిపోయింది.[13] మగవాడి విశృంఖల విహారాలు వేశ్యాప్రణయాలు బహు భార్యత్వానికి తోడై సమాజం శృంగారపు కంపుతో నిండిపోయింది.

**చెప్పనా నేనప్పుడే చిత్తిణి వాడితడని**
**చిప్పిల నెందో పొందు సేసి వచ్చెను (13-3)**

**పెల్లుగా నీకిట్టె యింట బెట్టుకుండ వలసితే**
**చెల్లునా సవతి పోరు చెప్పుమాయెందైననూ (16-361)**

**పంతమాడే దానగాను పతితోడ సారె సారె**
**నెంతైనా నిచ్చకురాల నింతే కాని (14-433)**

**మారు సవతులు రాని మనువొకటే మంచిది (14-471)**

**వరుసతో బెండ్లాడిన వనిత మాటాడగాను**
**పొరుగాపెతో నవ్వేవు పోరచిగాను (19-92)**

ఇలాంటి ఎన్నో ఉదాహరణలు సంసార స్త్రీల ఆవేదనను రూపు కట్టిస్తున్నాయి. వీళ్ల మీద అన్నమయ్యకు ఎంతో సానుభూతి ఉంది. ఓర్పుగా నేర్పుగా ప్రణయాన్ని పొందాలని ఇలాంటి స్త్రీలకు ఇచ్చిన సలహాలు శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్నాయి. విచ్చలవిడి శృంగారానికి అలవాటైన మగవాళ్లను కూడా అంగడి సరుకులని (14-68), పొత్తుల మగళ్లని (16-391) ఎద్దేవా చేశాడు. వేశ్యా శృంగారం కుల స్త్రీల శృంగారం కంటె హేయమైనదని-

**కాయకపు వావుల కాంతలు సరయ్యేరా**
**చేయిమీదై సేసపాల చెలులకు**
**యెరవుల సతులెల్ల యీడు జోడు వచ్చేరా**
**తిరమైన పట్టంపు దేవులకును (21-214)**

ఇత్యాది అనేక సంకీర్తనలలో మగ వాళ్లకు తెలిపే ప్రయత్నంచేశాడు అన్నమయ్య.

వేశ్య కుల కాంతలకు రూపుగొన్న శోకం. పురుషుల వేశ్యా ప్రియత్వం పట్టపు స్త్రీలకు భరింపరాని దుఃఖం. సమాజంలో ఇది అపరిహార్యమైన అంశం. దీనికి తోడు బహుభార్యత్వం. అయినా ఆనాటి సమాజంలో మాంగల్యానికి ఎంతో గౌరవ పవిత్రతలున్నాయి. సంసార స్త్రీకున్న విలువ చెక్కు చెదరలేదు. స్వేచ్ఛా ప్రణయాలు, రహస్య ప్రణయాలు గృహస్థురాలి స్థానాన్ని ఏమాత్రం చలింప జేయలేక పోయాయి. భారతీయ వైవాహిక వ్యవస్థకు, గృహస్థ ధర్మానికి గల పవిత్రత దీనికి కారణం. ఈ విషయం అర్థంకావడం కోసమే అన్నమయ్య

సంసార స్త్రీని 'పట్టపు దేవి' అన్నాడు. శృంగార సంకీర్తనలు చిత్రించిన పట్టపుదేవులు గూడా శృంగార రసలోలురుగా కనిపిస్తున్నారు. ఆనాటి సామాజిక ప్రభావం దీనికి కారణం. భర్తల ప్రణయాన్ని పదిలపరచు కోవాలంటే వీళ్లు కూడా అతివేలమైన శృంగారవతులు కాకతప్పలేదు. ఆనాటికది ఔచిత్యం. దేశకాల పాత్రలను బట్టి ఔచిత్యానౌచిత్యాలను మదింపు వేయాలి.

**ముప్పిరి నితవుతోడ ముచ్చట లచ్చటలాడి**
**యెప్పుడూ బాయకుండేదే యిల్లాలు**
**యిచ్చక మెరిగి తన యిలు వరుస నెరపి**
**నిచ్చ బతి గూడినదే నెరవాది (22-524)**

**నేరవలె రతి లేదా నేరుపనైనావలె**
**యేరీతికి జొరకుంటే నేటి యాటదే (13-511)**

ఇలాంటి అనేక సంకీర్తనలలో అన్నమయ్య కుల స్త్రీల శృంగార విషయాలను స్పృశించాడు. ఇల్లాలు నేర్పరిగా ఉండాలని, తాను పరవశించి పతిని పరవశింప జేయాలని, వలచి వలపింప జేసుకోవాలని సూచించాడు. ఆనాటి వ్యవస్థలో ఇల్లాలు తన అస్తిత్వాన్ని, సంసార గౌరవాన్ని నిలుపుకోవాలంటే శృంగార విషయంలో కూడా తన పెనమిటి దగ్గర బిడియం కొంత వదలుకొని ప్రవర్తించాలని చెపుతూ

**అందరూ నెఱిగినవే నన్నిపనులు**
**అందియ్యరాదా వీడెమంత సిగ్గులేటికి (13-513)**

అంటున్నా డన్నమయ్య. తన తలపులో మెలిగే పతి ఉన్నపుడు స్త్రీకి వలపే ధన మవుతుందని, యౌవనం సతతం శృంగారంలో మునిగితే సుదతికి సురతమే సంపదవుతుందని (18-399) తెలుసుకోమని స్త్రీలకు చేసిన బోధ అనేక శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్నది.

## అన్నమయ్య దర్శించిన సామాజిక శృంగార చిత్రం

ఇప్పటివారమైన మనం ఇప్పటి దృష్టితో శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్న అతివేలమైన శృంగార విషయాలను గమనిస్తే కొంత ఎబ్బెట్టుగా తోచక పోదు.

ఈ విషయాన్ని ఆనాటి సామాజిక వ్యవస్థ ఆధారంగా పరిశీలించాలి. అన్నమయ్య కాలం ప్రబంధ పూర్వయుగం. ఈ యుగపు శృంగారం ప్రబంధ యుగానికి ప్రసరించి నవ్య దీధితులతో కామ పురుషార్థాన్ని ఆకర్షకంగా మార్చి చరితార్థం చేసింది. ప్రబంధాల శృంగారం పోతన శ్రీనాథాది కవుల గ్రంథాలలో కనిపించే శృంగారం కంటె ఎక్కువ కాదు. ప్రబంధాల పడకింటి శృంగారానికి మూలాలు ముందునుండే ఉన్నాయి. శృంగార విషయాలను బాహాటంగా చర్చించుకోవడం, అనుభవానికి తెచ్చుకోవడం ఆనాటి సమాజంలో రహస్య విషయం కాదు. సామాజిక నిబద్ధత గల కవి అలాంటి విషయాలకు తన కవిత్వంలో గతి కల్పించడం కూడా అసహజంకాదు. మధ్యయుగంనాటి సాహిత్యంలో మితిమీరి కనిపిస్తున్న శృంగారాన్ని గురించి పుట్టపర్తి వారి మాటలివి. "సాధారణముగా విలాసమన్న మాత్రమునే యొక విముఖత, అసహ్యము మన కలవాటైనది. అది మనమే అడిగి తెచ్చిన వరము. మన మనోరథము లల్పములు. మన ప్రవృత్త నివృత్తులల్పములగుటయే యందులకు కారణము. అది (శృంగారం) మానవ స్వభావమనియు, దేహధర్మమనియు, దాంపత్యమును తజ్జనిత సౌఖ్యములును కళంకములు కావనియు వ్యాఖ్యానము గావించువాడు దానికై యంతగా భయపడ నవసరములేదు".[14] సమకాలీన విషయాలను కాలానుగుణంగా అర్థం చేసుకోవాలనే విషయాన్ని స్ఫురింప జేస్తున్న ఈ యభిప్రాయం ఎంతో విలువైంది. ఇంకా ముందు తరాలకు వెళ్లి అప్పటి సమాజాలను పరిశీలిస్తే శృంగారం విషయంలో ఆసక్తికరమైన విషయాలెన్నో కనిపిస్తాయి.

ఋగ్వేద కాలంలోనే స్త్రీలలో 'సాధారణీ' అనేమాట Public Woman అనే అర్థంలో కనిపిస్తున్నది. కృష్ణయజుర్వేదం (30-22), అథర్వవేదం (15-2) పుంశ్చలిని పేర్కొన్నాయి. 'జార' అనేమాట ఆకాలంలో ప్రేమికులకు వర్తించే విధంగా ఉంది. 'కుమారీ పుత్ర' అన్నది అప్పటికి సహజమైన మాట. ఒక స్త్రీ ఐదు మంది పురుషులతో సంబంధం కలిగి ఉన్నా పవిత్రురాలేనని వాత్స్యాయనుని కంటె పూర్వుడైన బాభ్రవ్యుడు తన కామశాస్త్ర గ్రంథంలో ప్రకటించాడు.[15] ఇవన్నీ ఆయాకాలాల సామాజిక విషయాలే. దేశాభ్యుదయ సత్సంతానం పైన ఆధారపడి

ఉంటుందని, సత్సంతానం సరైన కామ పురుషార్థం వల్ల ఉత్పన్నమవుతుందని, ఈ పురుషార్థ సాధకులు దీనిని గురించి సరిగా అర్థంచేసుకోవాలని, అలాంటి అర్థబోధ కలిగించడానికే కామశాస్త్రాలు వెలువడినాయని కామశాస్త్రకారులు వాళ్ల గ్రంథాలలో స్పష్టం చేశారు.[16] ఈ విషయాలు అర్థమైతే శృంగార సంకీర్తనల లోని శృంగారం, దాని ఉరవడి ఆ సమాజానికి అవసరం కాబట్టే చిత్రితమైనట్లు తెలుసుకో గలుగుతాము.

**తనువులేకములైన తప్పులు నొప్పులు లేవు**
**మనసు లేకములైన మరుగులే లేవు (19-484)**

అనే విషయాన్ని శాస్త్ర దృష్టితోను, అప్పటి సమాజ దృష్టితోను పరిశీలిస్తే ఔచిత్యవంతంగా అనిపిస్తుంది.

**'పూటపూట రతులివి పుష్పయాగము' (14-396)**

**అంగన నిన్ను గూడగ నట నీపై వడిసేటి**
**అంగపు జెమట నీకు నభిషేకము**
**వుంగిటి గొప్పవిరులు వుపరి సురతవేళ**
**సంగతి రాలేటి చల్లు వేదపూజ (19-531)**

**రతి తపము వంటిది రచనలు మీఱగాను**
**చతురత గాగిటిలో సఫలమౌను (21-350)**

శృంగార సంకీర్తనలు ప్రదర్శిస్తున్న ఈ అంశాలన్నీ కామ పురుషార్థ పవిత్రతను తెలియజెప్పడానికి ఉద్దేశింపబడినవే. ఛాందోగ్య (5-9-1), బృహదారణ్యక (6-2-13) ఉపనిషత్తులు మైథునాన్ని ఒక యజ్ఞ కార్యంగా చర్చించి ఉండడం అన్నమయ్య అభిప్రాయాలకు బలాన్ని చేకూర్చే అంశం. కామ పురుషార్థం మోక్ష పురుషార్థానికి మార్గాన్ని నిర్దేశిస్తుందని కూడా శాస్త్ర గ్రంథాలు ప్రకటించాయి. గాఢ పరిష్వంగంలోని మిథున సంయోగం మోక్షానికి ప్రతీకగా చెప్పబడింది.[17]

శృంగార సంకీర్తనలలో కామ శాస్త్రాలలోని విషయాలెన్నో కనిపిస్తున్నాయి. సురతవిద్య (19-250), మదన శాస్త్రములెన్ని చదివినా (14-4), అంగన

మంచము మీద నభ్యసించిన విద్యలు (21-351), కామతంత్రం (21-339) మొదలైన విషయాలన్నీ అప్పటి సమాజంలో ఈ శాస్త్రాల ప్రాధాన్యతను, ప్రాచుర్యాన్ని వివరిస్తున్నాయి. ప్రాచీన దశలో ఇతర శాస్త్రాల అధ్యయనంలో కామ శాస్త్రంగూడా ఉండడం గమనించవచ్చు. వాత్స్యాయనుని గ్రంథం వచ్చిన తరువాత ఈ విషయం మరీ స్పష్టంగా కనిపిస్తుంది. అన్నమయ్య కాలంనాటికి దీని ప్రాధాన్యత కొంత తక్గినా గుర్తింపు, గౌరవం లేకుండా పోలేదు.

**సురతాంతమున నీ సోకిన గురుతులెల్ల**
**పరగ జెలులకెల్ల బయలు సేసీని (11-204)**

అనడంలో అన్నమయ్య చూపిన నఖాంకురాలు, చంద్రవంకలు స్ఫురిస్తాయి. శృంగార సందర్భాలలో ప్రతి శృంగార సంకీర్తన శారీరక అవయవాల ప్రాధాన్యతను వర్ణించింది. శృంగారోద్దీపనకు అనవసరమైన భాగాలను ఆయాలని (11-302), ఇక్కువలని (11-3) కందువలని (11-378) శృంగార సంకీర్తనలు పేర్కొన్నాయి. వీటిని కళాస్థానాలని, రతిస్థానాలని వాత్స్యాయనుడు పేర్కొన్నాడు. కాలి వేళ్లనుండి తలవరకు గల పదునైదు కళాస్థానాలను (Anatomical Parts) శాస్త్రం చూపింది. శాస్త్ర విషయాలను అవసరమైన వాళ్లకు తెలియజెప్పాలనే ఉద్దేశంతో కాబోలు ఇవి శృంగార సంకీర్తనల కెక్కినాయి.

అన్నమయ్య జన జీవన శృంగార భంగులను అతి సహజంగా చూపించడం ఆనాటి పామరుల శృంగార విషయాలను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. చెరుగు మాసిన దానిని కూడడం (16-241, 20-147), సమయానికి దొరికిన స్త్రీని వదలక పోవడం (12-398), సవతులు కొట్లాడుతుంటే పతి నడుమ వచ్చి వారించడం (18-450), ఇద్దరు సవతులున్నపుడు వంతులవారిగా కూడడం (21-1), నిద్రిస్తున్న స్త్రీతో సరస మాడడం (19-338), ఆయాల సాక్షిగా ఒట్టుపెట్టుకోవడం (11-385), చెలికత్తెలతో రతులు (14-25), వదిన - మరిది శృంగారం (18-45), శృంగారంలో న్యాయాన్యాయాలు పనికిరావనుకోవడం (11-26) మొదలైన విషయాలన్నీ పామరుల శృంగార జీవితం నుండి

సేకరించినవే. అన్నమయ్య శృంగార విషయాలను చిన్న సన్నివేశాలుగా మలచి చూపిస్తాడు. అవి చిన్న సంఘటనలుగా మారి సాధారణ విషయాలవుతాయి.

**వేట వోయిన మగడు వీధిరాగాఁ గిన్నెర**
**మీటుచు దానిక్కి చూచి మేడపై నుండి**
**గాటపు గుబ్బల కొంగు గప్పదు జారిన నింత**
**ఆటది వలచెనేని అపరాదు ప్రియము (5-336)**

వేటకు పోయి వస్తున్న మగని రత్యాసక్తితో చూస్తున్న భామ శృంగార భంగిమ ఈ సంకీర్తనలో కనిపిస్తున్నది. శృంగార సంకీర్తనలలో ఇలాంటి నిశ్చల చిత్రాలెన్నో కనిపిస్తాయి. ఇవన్నీ జానపదుల జీవితాలలోని సజీవ శృంగార శిల్పాలు.

అన్నమయ్య శృంగార సంకీర్తనల మీద ఆయన అధ్యాత్మ సంకీర్తనల మీద జరిగినంత పరిశోధన జరగలేదు. జరిగిన అరకొర పరిశోధన కూడా అందులో మధుర భక్తిని దర్శించి, అన్నమయ్య చూపిన శృంగార విషయాలు అధ్యాత్మ భావాలకు వేసిన సోపాలని తేల్చి, ఆయనను అధ్యాత్మ కవిగానే భావించింది. కొందరు శృంగార సంకీర్తనలలో కామశాస్త్ర విషయాలున్నట్లు గుర్తించారు.[18] కాని ఆ విషయాలను తూర్పార బట్టి అవి శృంగార సంకీర్తనల కెందుకు ఎక్కినాయో, వాటి సామాజికత ఏమిటో వివరించే ప్రయత్నం చేయలేదు. ఈ విషయాలను సమాజ పరంగా పరిశీలిస్తే వాటి విలువ అర్థమవుతుంది. అన్నమయ్యకున్న నిబద్ధత, సామాజిక స్పృహ వెల్లడవుతాయి. అన్నమయ్యది కేవలం మధురభక్తే అయితే ఇన్నివేల శృంగార సంకీర్తనలు చెప్పవలసిన అవసరం లేదు. '**పచ్చియైన పనులకు పాడియేల పంతమేల**' (11-26) అన్న అభిప్రాయం ఆనాటి సామాజిక శృంగార చిత్రం. సమాజంలో అన్నమయ్య గమనించిన పచ్చియైన పనులు అన్నీ ఇన్నీ కావు. ఆయన పేర్కొన్న రతులు కొన్ని వందలున్నాయి. రతి, సురతం వేర్వేరు అర్థాలలో కనిపిస్తాయి. తలపులోని వలపును దాచనవసరంలేదు (18-25) అని చెపుతున్న అన్నమయ్య ఆ భావం తోనే శృంగార విషయాలను ప్రదర్శించాడు. శృంగారం కోసం వరస కలుపుకొన్న స్త్రీలెందరో శృంగార సంకీర్తనలలో చుట్టమ రాండ్రుగా కనిపిస్తున్నారు. శృంగార సంకీర్తనలు ప్రదర్శించిన పచ్చిదనం మధుర భక్తికి సంబంధించినదీకాదు, అన్నమయ్యకు సంబంధించిన తాత్త్విక శృంగారమూ

కాదు. ఇది పూర్తిగా ఆనాటి సమాజానిది. అప్పటి స్త్రీ పురుషుల జీవితాలలో ప్రముఖంగా కొనసాగిన అంశమిది. దీనిని అన్నమయ్య కవిత అజరామరం చేసింది. దీనిని ప్రయోజన కరంగా వ్యాఖ్యానించిన అన్నమయ్య గొప్ప సామాజిక కవి.

**సూచికలు:**

1. Dr. V.K. Hampiholi - 'Sex Education - Indian View' 1966. P.4
2. 'శృంగార ప్రకాశిక' లో భోజుడు శృంగార రసాన్ని వివరిస్తూ శృంగార ఏవ ఏకోరసః అని నిర్ణయించాడు. శృంగారాన్ని అభిమాన రసమని, అహంకార రసమని పిలిచాడు. జీవి అహంకారాన్ని నిర్ణయించేది శృంగారమేనని, అందువల్ల అదొక్కటే రసమని అభిప్రాయ పడినాడు.
3. తాళ్లపాక పదసాహిత్యం 12వ సంపుటంలో పరిష్కర్త పి.టి. జగన్నథా చార్యుల అభిప్రాయమిది.
4. వి. పార్వతీదేవి - 'అన్నమయ్య సంకీర్తనలు - నాయికా నాయక తత్త్వం' పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. పుట. 282.

   ఈమె ప్రతి శృంగార సంకీర్తనలోను నాయకుని విటత్వం, విశృంఖల శృంగారం వెల్లడవుతున్నాయని చెపుతూనే ఆత్మరతిని, పారలౌకిక మధుర దృష్టిని గురించి మాట్లాడడంలో అంత పొంతన కనిపించదు.
5. కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యానంలో సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి నాయిక అవయవాలను ఏయే ప్రకృతి ద్రవ్యాలతో పోలుస్తారో వివరించాడు. అలాగే నాయిక వాక్కు, నవ్వు, ఊర్పులకు కూడా ఉపమాన ద్రవ్యాలను చూపించాడు. 1976 నాటి ప్రతి. పుటలు 85-88.
6. ధర్మ కామోర్థ కామశ్చ మోక్ష కామస్తథైవచ

   స్త్రీ పుంసయోస్తు సంయోగో యః కామస్సతు సంస్మృతః - నాట్యశాస్త్రం.
7. 'అముద్రితములైన తాళ్లపాక వారి సంకీర్తనలు - ఒక పరిశోధనాత్మక పరిశీలన' అనే వ్యాసంలో వ్యాసకర్త వేటూరి ఆనందమూర్తి ఈ సంకీర్తనను

అన్నమయ్యదిగా చూపారు. ఈ వ్యాసంలో కనిపించే సంకీర్తనలన్నీ తాళ్లపాక వారివని, ఇవి ముద్రిత ప్రతుల కెక్కలేదని వారు చెపుతున్నారు. ఈ అముద్రిత సంకీర్తనలు శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థవారి 6609ఎ ప్రతిలో ఉన్నట్లు వారు గుర్తించారు. ఈ వ్యాసం 'అక్షర' అనే డి.ఆర్. అభినందన సంచిక (నవంబరు, 2005 కావలి)లో ముద్రింపబడింది. పుటలు. 889-913.

8. 'శారదా విపంచి' ఆచార్య కోలవెన్ను మలయ వాసిని షష్టి పూర్తి ప్రత్యేక సంచిక లోని వ్యాసం – అన్నమయ్య పదాలలో ధర్మి. శౌంఠి శారదాపూర్ణ. విశాఖ. 2004, పుట 12.

9. హర విలాసం 4-101

"గాఢాలింగనంబులును, నీవీబంధ సంస్పర్శనంబులును, బింబాధర చుంబనంబులును, నఖాంకుర వ్యాపారంబులును, దంతక్షత వేదనా ప్రపంచిత కిలకించితంబులును వెలయ బాహ్యాంతరోత్సవంబులను సంధించి మన్మథుం గృతార్థుజేసి ........." ఈ వచనంలో రతి బంధాల విషయముంది.

10. 'చందనం' ఆర్వీయస్ అభినందన గ్రంథం (జూలై 2008) లోని తెలుగు భాషా విన్యాసం అనే వ్యాసం. పుట 79. అందులోని విషయం – నన్నె చోడుడు "మనోజు జూచి మగలు కరముఁ బ్రీతి దగిలి గండబేటంబు గొని" (4-36) అని ప్రయోగించాడు. గండబేటం అంటే మగవారికి మగవారిపై కలిగే ప్రేమ. అంటే Homosexual లాంటిది. ఇంకొక చోట "కలచుట దోషమే మగల గల్వక యుండురు దొల్లి యాండురం గలతురె" (8-151) అనడం విశేషం. ఇది Lesbianism లాంటిది.

11. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం 4వ సంపుటంలో అన్నమయ్య శృంగార సంకీర్తనలను గురించి చెప్పిన మాటలివి.

12. అన్నమయ్య సంకీర్తనలు – నాయికా నాయక తత్త్వం. పుట 102.

13. S.K. De 'Ancient Indian Erotics and Erotic Literature' Calcutta 1969, P. 88.

14. పుట్టపర్తివారి 'గిరిక' అనే వ్యాసంలోనిదీ విషయం. వారి కుమార్తె పుట్టపర్తి నాగపద్మిని ప్రచురించిన పుట్టపర్తి వ్యాస సంకలనం 'వ్యాసవల్మీకం' 2004, పుట 63. ఇదే గ్రంథంలోని 'వరూధి' అనే మరో వ్యాసంలో కూడా పుట్టపర్తివారు కవి సమాజంలోని విషయ వికారాలను అనుభవించి తన పాత్రలను మాత్రం ఉన్నతాదర్శ మూర్తులుగా తయారుచేయడం సహజం కాదని వివరించారు. పుట. 117.

15. ఈ విషయాలన్నీ 'Ancient Indian Erotics and Erotic Literature' అనే గ్రంథం నుండి గ్రహించ బడినాయి.

16. రతిశాస్త్రమ్ ( The Hindu system of sexual life ) అనే గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించిన అవినాష్ చంద్రఘోష్ ఆ గ్రంథ లో రాసిన పంక్తులు రతిశాస్త్రాల ప్రయోజనాన్ని చక్కగా వివరిస్తున్నాయి. '........ as the progress of world depends upon coming generatinos, their bodilyand mental energies, so the production of healthy progeny is of the greatest moment to us, and the Rati Sastra deals upon those featurs of sexual enjoyment as are productive of good progeny" Nag Publishers, New Delhi, 1977. From the prefare.

17. 'గుడిలో సెక్స్' అనే గ్రంథంలో ఆరుద్ర బృహదారణ్యకోపనిషత్తు (1-4-3) లోని సంయోగ ప్రాధాన్యాన్ని వివరించారు. విశాలాంధ్ర ఎడిషన్ 2000, పుట. 105.

18. "తాళ్లపాక శృంగార సంకీర్తనలలో నాయిక భేదాలతోపాటు రతి రహస్యాది కామశాస్త్ర గ్రంథములందు ప్రవచింపబడిన హస్తిన్యాది చతుర్విధ నాయికా భేదాలు కూడా కనబడతాయి." ఈ అభిప్రాయం వేటూరి ఆనంద మూర్తి గారిది. 'తాళ్లపాక కవితలు - భాషా ప్రయోగ విశేషాలు' హైదరాబాదు, 1976. పుట. 103.

# సారంగపాణి పదాలు - సామాజికత

తాళ్లపాక కవుల తరువాత వెలసిన తెలుగు పద కర్తలలో సారంగపాణి ప్రముఖుడు. కార్వేటి నగర సంస్థానాధీశులు మాకరాజు వేంకట పెరుమాళ్రాజు, మాకరాజు కార్వేటిరాజు కాలానికి చెందిన ఈ పదకర్త కార్వేటిరాజు ఆస్థాన కవిగా, గాయకుడుగా, పండితుడుగా, వైణికుడుగా ఉండడం వల్ల పందొమ్మిదవ శతాబ్దం పూర్వార్థం వాడు. ఈయన ఏప్రాంతం నుండి సంస్థానానికి వచ్చాడన్న విషయం మీద అభిప్రాయ భేదాలున్నా, బ్రతికిన కాలం మాత్రం సందేహం లేని అంశం. దక్షిణ దేశీయ పదకవులైన క్షేత్రయ్యకు, త్యాగరాజుకు మధ్యకాలంలోనే ఉండిన వాడితడు. అందువల్ల క్షేత్రయ్య పదాలలోని శృంగారం, త్యాగరాజు కీర్తనల లోని భక్తి ఈయన పదాలలో బాగా కనిపిస్తాయి. తాళ్లపాక కవులలో అన్నమయ్య ప్రభావం సారంగపాణి మీద వస్తుపరంగా ఎంతో ఉందనిపిస్తుంది. అయితే పద నిర్మాణంలో ఈయన పదాలు క్షేత్రయ్య పదాలకు దగ్గరగా కనిపిస్తాయి. క్షేత్రయ్య లాగా పల్లవి అనుపల్లవులను నియతంగా వాడినాడితడు.

సంస్థాన కవిగా ఉండినా సారంగపాణి తాను రాసిన పదాలలో 'వేణుగోపాల' ముద్రనే వాడుకొన్నాడు. కార్వేటినగరంలో నెలకొని వున్న వేణు గోపాలస్వామి భక్తుడు గావడం దీనికి కారణం. కొన్ని పదాలలో పరిసర ప్రాంతాలలో ఉన్న దేవతా మూర్తుల ముద్రలు కూడా ఉన్నాయి. కార్వేటిరాజు పద ముద్రతో ఉన్నవి మూడు పదాలు మాత్రమే కనిపిస్తున్నాయి. సారంగపాణి ఎన్ని పదాలు రాశాడో తెలియదు. చాలానే రాసి ఉండాలి. అయితే దొరుకుతున్నవి

210 మాత్రమే. దేశంలోని దేవాలయాల్లో - ముఖ్యంగా వైష్ణవ దేవాలయాల్లో, భజన కూటాల్లో పాడబడుతూ ఈ పదాలు ప్రచారమైనాయేగాని వీటిని పని గట్టుకొని ప్రచారం చేసినవాళ్లు లేరు. 19వ శతాబ్ది పూర్వార్థంలోనే ఈ పదాలు ప్రచురింప బడినాయని తెలుస్తున్నది కాని ఆ ప్రతి ఇప్పుడు దొరకదు. ఈ ప్రతిలోనే సారంగపాణి పదాలు శృంగార పదాలు, దేశీయపదాలు, జాతీయ పదాలు, కీర్తనలు అనే నాలుగు విభాగాల కింద ప్రచురింప బడినట్లుంది. తరువాత వచ్చిన ప్రతులన్నిటా ఈ విభాగాల కిందనే ఈ పదాలు కనిపిస్తున్నాయి. ఈ విభాగాలు సారంగపాణే చేశాడో లేక మరెవరైనా చేశారో తెలియదు.

పద్య కవులకు పద కవులకు ఒక ప్రధానమైన తేడా ఉంటుంది. పద్య కవులు మార్గ దేశి సమన్వయాత్మక రచనలు చేస్తే పద కవులు పూర్తిగా దేశి ప్రక్రియకే చెందినవారు. అందువల్ల సమకాలీన సాంఘిక విశేషాలు పద్యకవుల రచనలలో కన్నా పదకవుల రచనలలో ఎక్కువగా వ్యక్తమవుతాయి. పద్యకవిత కథనాత్మకంగాను, వర్ణనాత్మకంగా ఉంటుంది. పద కవిత కథానిరపేక్షకంగాను, ముక్తక రచనగాను ఉండడంవల్ల భక్తి, నీతి, శృంగారం, వేదాంతం, ధర్మం, అధ్యాత్మం ఇత్యాది విషయాలను సమాజ పరంగా వ్యాఖ్యానించడానికే ఉద్దేశింప బడినదిగా ఉంటుంది. అందుకే పద కవులను సమాజ కవులనికూడా అంటారు. పద కవులందరూ వాగ్గేయ కారులు. సారంగపాణి వాగ్గేయ కారుడు కాబట్టి పదాలకు రాగ తాళ నిర్దేశం చేశాడు. ఈ పదాలను సంగీత దృష్టితో పరిశీలిస్తే అప్పటి సంగీత బాణీలకు చెందిన విషయాలు తెలుస్తాయి. సాహిత్య దృష్టితో పరిశీలిస్తే సారంగపాణి కవిత లక్షణ యుక్తంగా ఆలంకారిక నియమాలకు అనుగుణంగా కనిపిస్తుంది. విషయ దృష్టితో పరిశీలిస్తే సామాజిక, సాంస్కృతిక, విశేషాలతో పాటు సారంగపాణిలోని సంస్కరణత్వం కూడా కనిపిస్తుంది. ఇక ఆయన వాడిన భాషను పరిశీలిస్తే అప్పటి వ్యావహారిక భాషా సౌందర్యం కనిపిస్తుంది. ఈ 210 పదాలతోనే సారంగపాణి ఒక అద్వితీయ పదకర్తగా గణనకెక్కి కనిపిస్తాడు. ఆయన రచించిన పదాలన్నీ దొరికి ఉంటే ఇంకా ఎన్నోవిషయాలు వెలుగులోకి వచ్చేవి.

## సారంగపాణి కాలంనాటి సమాజం

దేవాలయాలలో పవిత్రంగా కొనసాగిన దేవదాసీ వ్యవస్థ పతనమై దానికి చెందిన వికృత స్వరూపం వ్యాపించిన సమాజమది. దక్షిణ భారత దేశమంతా ఆంగ్లేయుల పెత్తనం చెలామణి అయిన రోజులవి. దేశీయుల విషయాలలో మ్లేచ్ఛులు జోక్యం చేసుకోవడం వల్ల అనాదిగా కొనసాగిన సంప్రదాయంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకొన్నాయి. దేశీయుల ఆహార విహారాలలోను, కట్టుబొట్టుల లోను, ఆలోచనా విధానంలోను మార్పు రావడం ప్రారంభమైంది. దొరల సంస్కృతి వ్యాపించింది. పట్టణాలలో స్థిర పడిన దొరల ఇండ్లలో దేశీయులు పనిచేయ వలసిన దుస్థితి సంభవించింది. దేవాలయాలలో పవిత్ర జీవనం కోల్పోయిన దేవదాసీ స్త్రీలు సమాజంలో ఇతర వృత్తులు వెదుక్కోవలసి వచ్చింది. ఇతర వృత్తులలో ఇమడలేని వీళ్లు సుఖ జీవనాన్నాసించి దొరలతో సంబంధాలు పెట్టుకోవడం, ఆ దొరలు వీళ్లను చేరదీయడం జరిగింది. దొరల సాన్నిహిత్యం దొరకని స్త్రీలు సమాజంలో అప్పటికి అవసాన స్థితిలో ఉండిన సంస్థానాలలోని చిన్న పెద్ద ఉద్యోగుల ప్రాపకం కోరి తమను విలాస వస్తువులుగా మార్చుకొన్నారు. కొందరు తమప్రాంతం చుట్టూ ఉండిన దేవాలయాల అర్చక వర్గంతో కూడా స్వతంత్రంగా ప్రవర్తిస్తూ తృణమో పణమో సంగ్రహించుకొనే వారు. దేవాలయ పూజారులు కూడా దేవాలయాలలో తమ ధర్మాలు నెరవేర్చుతూనే చాటుమాటుగా శృంగార సరదాల కోసం వెంపరలాడేవారు. సమాజంలోని సంపన్న పురుషులు, చివరకు మధ్య తరగతి పురుషులు కూడా ఇంటి శృంగారంతో తృప్తి పడక తమ సంపాదనను వెలయాండ్లకు దోచిపెట్టి తమ సరదాలను తీర్చుకోవడానికి ప్రయత్నించిన కాలమది. దొరల, పూజారుల, సంపన్నుల, మధ్య తరగతి వాళ్ల విచ్చలవిడి ప్రవర్తన సమాజంలో అవాంఛనీయ పరిస్థితికి దారితీసింది.

తమ మగల పోకిరాటలను సహించలేని కొందరు స్త్రీలు తమను తాము ఓదార్చుకొని బాధ పడుతుంటే కొందరు స్త్రీలు దాన్ని ఆసరాగా తీసుకొని తాము కూడా స్వైరవిహారం చేయడానికి పూనుకొన్నారు. పల్లెలలో తమ అవసరాలు

తీరక ఇంట్లో వాళ్లను, ఇంటిని వదలి పర సంస్కృతి వ్యామోహంతో పట్టణాలకు వెళ్లడానికి ప్రయత్నించారు. పాశ్చాత్య సంస్కృతి అప్పుడప్పుడే ప్రచారమవుతూ విలాసవంతులను బాగా ప్రభావితం చేసింది. సారంగపాణి కాలంలో కరువులు కొత్తకాదు. 'అక్షయ' కరువును, దానివల్ల కలిగిన దుర్భిక్ష పరిస్థితులను ఆయన తన పదాలలో వివరించాడు. పట్టణ నాగరకత మీద వ్యామోహం ప్రబలింది. పల్లె పట్టులలోని సంప్రదాయ జీవన విధానం ఆటుపోట్లకు గురైంది. సారంగపాణి పదాలలో కనిపించే జన జీవితాన్ని పరిశీలించడానికి అవసరమైన నేపథ్యమిది. సారంగపాణి వాగ్గేయకారుడుగా పదాలల్లడానికి ప్రారంభించిన నాటికి దక్షిణ భారత దేశపు పరిస్థితులివి. ముఖ్యంగా చిత్తూరు జిల్లా దక్షిణ ప్రాంతపు సంస్కృతి సంప్రదాయాలు ఈ పదాలలో బాగా ప్రతిబింబితమైనాయి. ఈ 210 పదాలలో శృంగారమనే ప్రథమ భాగంగా 76 పదాలున్నాయి. ఈ పదాలలో వ్యక్తమయ్యే సామాజికాంశాలను పరిశీలిద్దాం.

**1. శృంగార పదాలు :** ఈ పదాలలో వేణుగోపాలుని స్థానంలో ఒక సామాన్య శృంగార పురుషుడు కనిపిస్తాడు. నాయికలలో ముగ్ధలు, ప్రౌఢలు కనిపిస్తారు. వీరి మధ్య ప్రవర్తిల్లిన శృంగారం ఆనాటి సమాజంలోని విచ్చలవిడి శృంగారమే. 'ప్రేమ డాచితే వడ్డికి మారున' (50) అంటున్నాడు ఒక శృంగార పురుషుడు. ప్రేమ దాచుకుంటే వయోదశ ననుసరించి నశిస్తుందే గాని వృద్ధికాదు. కాబట్టి దాచుకోకుండా దాన్ని వినియోగంలోకి తేవాలన్నది అప్పటి ఆలోచన. ఈ సందర్భంలో ప్రేమ అంటే లౌకికమైన శృంగార ప్రేమే. ఈ విభాగంలోని పదాలన్నీ ప్రేమను సార్థక పరచడానికే నన్నట్లున్నాయి. సమాజం లోని రకరకాల శృంగార సంబంధాలు కనిపిస్తాయి. స్త్రీ పురుషుల మధ్య సంధాన కత్తెలు రాయబారాలు నడపడం, అనుకొన్న సమయానికి తాను కోరినవాడు సంకేత స్థలానికి రాకపోతే అతనికి ఇతర స్త్రీలతో సంబంధాలున్నట్లు భావించడం, వలపు మందులు పెట్టి మచ్చిక చేసుకొన్నట్లు భావించడం, ఇతర స్త్రీలకు చెప్పి బాధపడడం, అలాగే స్త్రీల విషయంలో మగవాళ్లు కూడా భావించడం వంటి విషయాలు వయసు తొందరలో ఉన్న స్త్రీ పురుషులకు ప్రధాన విషయాలుగా కనిపిస్తాయి.

మగవాళ్లు తమ కిష్టమైన స్త్రీలకు తమ భార్యలకు తెలియకుండా నగలు చేయించడం, ముఖ్యంగా ఉంగరాలు చేయించడం, మంచి మంచి చీరలు కొని పెట్టడం, కలసి ఉండాలని దేవాలయాలలో ఒట్లు పెట్టుకోవడం సాధారణంగా కనిపించే విషయం. ఈ విషయాలను వివరించిన పదాలలో సారంగపాణి పల్లి పట్టుచీర, మట్లవారి చీర, పచ్చని కమ్ములచీర, వారపప్పుళి చీర, కరకంచు చీర, మొగ్గల పని చీర ఇత్యాది చీరల రకాలను పేర్కొన్నాడు. మునిమాపు సమయాన పల్లెటూరి గుడులు ఈ వ్యవహారాలకు అనువైన ప్రదేశాలు. తీగె, చిలకల తాళి, గుజరాతి ముత్యపు సరులు, మగరాల కమ్మలు, వెండిమెట్టెలు పచ్చల మొలనూలు, వేలి వెండిచుట్లు, గుండ్లపేరు మొదలైన ఆభరణాలను అప్పటి స్త్రీలు అలంకరించుకొనే వారిని ఈ పదాలను బట్టి తెలుస్తుంది. ఒకామె చీర అడిగితే ఒక విటుడు మళ్లీవస్తానని వెళ్లిపోయాడట. పైగా ఆమె తీగెను కుదువ బెట్టినాడట. (16) ఒకతను ఆమెను మంచం దిగనీడట. పదిరూకల కంచం దీసీయమంటే కండ్లెఱ్ఱజేస్తాడట. వెచ్చానికి ఏమీ లేదంటే మాట్లాడకుండా వెళ్ళిపోతాడట (26). ఇతని కంటె ఇత్యాహనాభట్లు మేలు. ఇక నాదగ్గరకు రావద్దని ఒకామె కరుసు కొంటున్నది. ఇత్యాహనాభట్లు ఎవరో వైష్ణవ పూజారిలా ఉన్నాడు. దేవాలయాల ప్రసాదాల కవసరమైన సరుకులలో కొన్ని తమ సావాసగత్తెలకు ఇస్తున్న విషయాన్ని సారంగపాణి గమనించాడు. శృంగార పురుషులు తమకు వచ్చిన స్త్రీలను ప్రత్యేకంగా ఇండ్లు కట్టించి ఉంచేవారని – 'మిద్దెయిల్లు గట్టి మేలు మెచ్చుగ జూచి – హద్దుగా వుంచినది అందుకే నటనే' (41) అనే పదపంక్తి ద్వారా అర్థమవుతుంది. ఇలాంటి ఇండ్లలో గిలకల మంచాలు అమర్చేవారు (72). ఆకు మడుపులలో – అంటే తాంబూలంలో వలపు మందులు దాచి స్త్రీలు తమ మాట దాటకుండా ఉంటారని మగవాళ్లకు ఇచ్చేవారని (35, 36) తెలుస్తుంది. ఎంత దోచిపెట్టినా ఇంకా తెమ్మనే స్త్రీలెందరో ఈ పదాలలో కనిపిస్తున్నారు. ఇలాంటి స్త్రీలతో గడపడం విటరాయుళ్లకు అలివిగాని పని అయినా ఎలాగో భరించేవారు. ఈ విటరాయుళ్లు భార్యలు అటకల మీద దాచుకొన్న చలువ చీరలు, సొమ్ములు తెచ్చి విటకత్తెలకు చదివించుకొనేవారు (57).

చిన్న వయసులోనే స్త్రీలకు విచ్చలవిడితనం అలవాటైనందున పెళ్లైన తరువాత పుట్టిన బిడ్డ పోలికలను బట్టి ఎవరి బిడ్డో తెలిసి పోయేది. ఆ స్త్రీ విషయం హేయమైనా అది ఆ సమాజానికి పట్టిన జాడ్యం.

**వింతయిది యేమైన - విరిబోణి నినుబాసి**
**అంత నిన్నటికి పద - హారేండ్లు మట్టుగ**
**కంతుకేళి నన్ను - గలసి నందుకే సాక్షి**
**ఇంతి తొలు చూలు కొడు - కెవరి పోలిక అయినా (72)**

అంటూ సారంగపాణి ఈ అసంబద్ధమైన విషయాన్ని ఒకపదానికెక్కించాడు. చేసిన పాపం పోవాలంటే కాశియాత్ర, సేతుయాత్ర చేయాలనే నమ్మక ముండేది(57). ఇతర స్త్రీలతో గడిపి వచ్చిన తమ పతుల ముఖాలు చూస్తేనే పాపమని, ఆ పాప రాహిత్యానికి యాత్రలు చేయాలని కుటుంబ స్త్రీలు వాపోవడం ఈ పద్లాలో గమనించవచ్చు. ఏపని చేయదానికైనా శకునాలు చూసే అలవాటు బాగా ఉంది. కడకు తన స్త్రీ తన దగ్గరకు రాకున్నా, తన పురుషుడు తనదగ్గరకు రాకున్నా శకునాలు గమనించడం (73,74) కనిపిస్తున్నది.

## 2. దేశీయపదాలు :

ఈ విభాగంలోని 66 పదాలలో కూడా శృంగార విషయాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ పదాలలో కనిపించే శృంగారం పల్లీయ వాతావరణానికి సంబంధించినదిగా ఉంది. కోడె వయస్సులోని విటీవిటుల మధ్య ప్రవర్తిల్లిన శృంగారాన్ని సారంగపాణి సామాన్యుల శృంగారంగా చూపాడు. వేశ్యా వ్యవస్థ స్వరూప మీపదాలలో బాగా కనిపిస్తుంది. దేవ దాసీ వ్యవస్థకు పతన దశ సారంగ పాణి గమనించిన వేశ్యా వ్యవస్థ. ఎంత వీలైతే అంత గుంజుకోవాలనే వేశ్యలు, వేశ్యల ప్రేమను డబ్బిచ్చి కొనుక్కోవాలనుకొనే సంసారాలు వెలగబెడుతున్న విటులు పోయిన పలు పోకడలను సారంగపాణి చిత్రించాడు.

**(అ) వేశ్యలు :** వేశ్యల మీద మోహం నేతిబీరకాయ వంటిదని, సంపన్నుడైనా విటుడైతే పనికిరాకుండా పోతాడని, దానివల్ల సమాజం రోగగ్రస్థమవుతుందని

సమకాలీనులను చైతన్య పరచడానికి సారంగపాణి వేశ్యల విషయాలను సహజంగాను, సంపూర్ణంగాను పదాలకెక్కించాడు. ఈ విషయంలో ఆ వాగ్గేయ కారుడు ఒక సంస్కర్తగా కనిపిస్తాడు.

**'కలిగిన కాసు గుంజుకోవే - కడమ జోలి నీకెందుకే'**
**'ఇన్నాళ్లు జరిపింది - యీ భోగానికేనా ఒక్క**
**చిన్న రూక దెచ్చి - చేతికిచ్చి అట్టె**
**కన్ను సైగజేసి - కదలమంటి వహహ'**
**'ఇన్నూరు వరహాలు - తిన్నగ నాచుకొని**
**ఇక కదల మంటివిగా'**

ఇత్యాది పదాల్లో వేశ్యల సహజ ప్రవృత్తిని వ్యక్తంచేశాడు సారంగపాణి. వేశ్యలవల్ల సంస్థాన విషయాలలో కూడా మార్పులు వస్తున్నట్లు గమనించాడు. వేశ్యల ప్రేమ ధనం మీదనే ఉంటుందని, వారిది నిజమైన సౌందర్యం కాదని సాంసారిక వ్యవస్థలోని మంచిని గ్రహించమని తెలియజెప్పే ప్రయత్నం చేశాడు. ఇలాంటి వేశ్యలతో పొందుకోరే వారికి వెగటు పుట్టించే

**మొగ చెంపలదిగాన - మోమెల్ల మొటిమలు**
**దిగబడ్డ చన్నులు - తెట్టెనోరు**
**వగలాడి వయసు - యేబది మీద రెణ్ణెళ్లు**
**యెగతాళి చేయక వా - దేలాగు గూడెనో**

ఇలాంటి పదాల్లో వేశ్యల నైజాన్ని, రోత పుట్టించే వారి స్వరూపాన్ని హాస్య ప్రాయంగా చూపాడు. ఒకరితో సరసాలాడి, వేరొకని జూచి కనుసైగజేసి, ఒకని ముద్దు బెట్టుకొని, ఒకని రమ్మనే వేశ్యలు 'పిళ్లారాయవలె పొట్టాడించు కొంటూ మంత్రుల చుట్టూ తిరిగి' (90) సంస్థాన పరిపాలనను కూడా చెడగొట్టేవారని సారంగపాణి చెపుతున్నాడు.

సంస్థానాలలో పనికావలసిన వారు వేశ్యల ద్వారా ప్రయత్నించడం, వేశ్యల తమ్ముళ్లు దొరలు గావడం, పుల్లగంజి తాగుతూ వుండిన వేశ్యలు ఆశ్రయం

దొరకగానే రాణులుగా చెలామణి కావడం సారంగపాణి జీర్ణం చేసుకోలేక పోయాడు. ఒక విటుడు వేశ్య ఇంటికి వచ్చాడు. ఆమె రూకలిస్తేగాని లోనికి రానీయలేదు. వక్కాకు ఇస్తేగాని మంచమెక్కనీయలేదు (84), ఆ వేశ్యది కోమటి విశ్వాసం (85). వార స్త్రీ నీపక్కలోకి ఊరక వచ్చునా అని నిలదీస్తుంది (92). నీవేనా శాస్త్రము నాచేత కాసుంటే నీయక్క ఇంకొకతె అంటాడతడు (102) ఇంత కంటె యింకా ఎవడిచ్చునే యేమిటికే గొణిగేవు అని ఆమెను బతిమాలు కొంటాడు (104). 'ఇన్నాళ్లు జరిపింది యీ భాగ్యానికేనా, ఒక్క చిన్నరూకదెచ్చి చేతికిచ్చి కన్ను సైగ జేసితివి' అని ఆమె ఎత్తి పొడుస్తుంటే (105) 'పుట్టిన పుట్టుక వచ్చిన రాకడ అట్టె తలచుకోవే, పట్టెదేసి సొమ్మేర్పడగానే మిట్టి పడకు'మని ఆమె పూర్వపు స్థితిని గుర్తుచేస్తాడతడు. ఈవిషయాలన్నీ సమాజాన్ని రుగ్మత పాలు జేసే వేశ్యా వ్యవస్థను కండ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి.

**(ఆ) కుటుంబ వ్యవస్థ :** వెలయాండ్లు సంసార స్త్రీలకు తలనొప్పిగా మారడం ఒక అంశమైతే, సంసార స్త్రీలే పరనాగరకతా వ్యామోహంలో పడి సంసారాలను, పల్లెలను వదలి వేశ్యలుగా మారడం మరో అంశం. ఇలాంటి స్త్రీలు తమ కడుపులు కొడుతున్నారని వేశ్యలు వాపోయిన వైనాన్ని సారంగపాణి-

**'అందరు నాయకురాండ్లైరి యిదేమి**
**యాశ్చర్యమే చెలియా నిన్నమన**
**ముందర దుత్తలెత్తుక అల్లాడిన లంజ**
**లందలా లెక్కిరి యౌరా కాలమహిమ**
**కులకాంతలు విడిబడి నలుదిక్కుల**
**చెలరేగి రిదేటి పాపమో అయితే**
**వెలయాండ్లకు జీవనమేమిక శ్రీ**
**వేణుగోపాలా సంకరమై'**

ఇత్యాది పదాలలో కండ్లకు కట్టించాడు. బడవ తనంతో ఇలాంటి తొత్తులు మగని కన్నుగప్పి అడ్డ తిరుగుళ్లు తిరిగి 'శగ రోగం ఒళ్లున యిమిడించు'

కొన్నారట(130). ఇలాంటి రోగాలమారి బడవలతో సంఘం రోగ గ్రస్థమై పోయిందని ఈ వాగ్గేయకారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పర నాగరకత తన సీమలో వ్యాపించినపుడు ఇక్కడి ప్రజలలో అనాగరకత యెడల గల వ్యామోహం, సాంస్కృతికంగా దానిప్రభావం ఈ పదాలలో చక్కగా వ్యక్తం చేశాడు సారంగపాణి. బస్తీలు బలవడం, పల్లె ప్రజలు బస్తీల కెగబడడం, స్త్రీలు షికార్లు తిరగడం, దైవభక్తి నశించడం వంటి మార్పులన్నీ ఈ కవి కండ్ల ముందు జరిగిన సామాజిక పరిణామాలు. ఈ మార్పులనతడు తన పదాలలో నిరసించాడు.

**ఉగ దెలియని బిడ్డల నెడబాసి - వున్నమూల ముంత దాటవేసి**
**మగనిపేరు కారాదని రోసి - మన్నెకాపురము వ్యర్థముజేసి**
**అందెలు మెట్టెలు రవికతొ జుట్టి - అత్తమామలకు దుద్దులు బెట్టి**
**బందరు పావడలో సద్దిగట్టి - పట్టము జూతామని భ్రమ బుట్టి**
**తల్లిదండ్రుల మది తల్లడబెట్టి - తమజాతుల కపకీర్తి జుట్టి**
**తలపరాని నిందెల కొడిగట్టి - ధర్మశాస్త్రముల రోచిక బుట్టి**
**జారుపైట చెరగు మెదకు జుట్టి - తేర లంజకాండ్ర చెట్టబట్టి**
**ఊరు దిక్కు రోత బుట్టి - ఉబ్బి తబ్బిబ్బై తొడదట్టి**
**తెగువచేసి ఠాణాలు గడిచి - తగుదు మనుచు సిగ్గు శరము విడిచి**
**ఇంత దూరమెవరు వెదక రారని - యెవరు వచ్చి వేలు వంచ లేరని**
**అంత పనికి రేవణి చిత్తూరని - చింతలేదు హూణుల దరబారని (138)**

తెగించిన స్త్రీలు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని తమ దారిన తాము పోయిన వైనాన్ని ఈ పదం స్పష్టంగా రూపు కట్టిస్తున్నది. అప్పటికి చిత్తూరు ఆ ప్రాంత మంతటికి పట్టణం కావడం వల్ల, అక్కడ దొరలు (హూణులు) కచేరీలు నడుపుతూ వాళ్ల సంస్కృతితో ఊరిస్తూ వుండడం వల్ల సుఖాన్ని వెదుక్కొంటూ ఇలాంటి స్త్రీలెందరో వలసపోయి వాళ్లకు తమను అమ్ముకొనే ప్రయత్నం చేశారు.

## ఇ) పరసంస్కృతి ప్రభావం

సాధారణ విటులకు లొంగని వారకాంతలు గుడులలోని పూజారి వర్గం వారిని బాగా ఆకర్షించారు. వాళ్లు దేవాలయాల సరుకులు వీళ్లకు దోచిపెట్టడం

గమనించిన సారంగపాణి వీళ్ల శృంగార కార్యకలాపాలను కొన్ని పదాలలో బట్టబయలు చేశాడు. రాత్రి స్వామిసేవ పూర్తయ్యేవరకు కాచుకొని ఉంటే తేవాకులయ్యవారు ఒక దోశె నీఒళ్లోవేసి ఒడి మూసుకొమ్మన్నాడు. గద్దగూడు వంటి తలతో సుద్దులాడడానికి వస్తే ఆ గుడి సాతాని (సాతాని వైష్ణవ పూజారి) గుడి శిద్దిలోని చమురు పెద్ద వెలగ చిప్పనిండా వంచి నీకిచ్చాడు. రొయ్య దిన్న నోటికి కొద్దిగా పోవ్వాకివ్వమని అడిగితే పొవ్వాకు లేదని ఉగ్రాణపు దాసరి నీకు చారెడు బియ్యమిచ్చాడు. ఉన్న పాతగుడ్డ పైటకంద లేదని బతిమాలితే గుడిలోని నాంచారుకు కప్పిన గుడ్డపెరికి నీకిచ్చాడు ఆ దేవాలయ పరిచారక వైష్ణవుడు. ఇవి నేనివ్వలేనా నాదగ్గర కెందుకు రావని ఒక సాధారణ విటుడు ఒకవేశ్యను నిలదీసిన విషయాన్ని ఈ వాగ్గేయకారుడు ఒక పదానికెక్కించాడు (94). ఇలాంటి బీద వేశ్యలను దొరలు పోషించడం ప్రారంభమయిన తరువాత వీళ్ల దశమారి గుడి పూజారులను కూడా లెక్క చేయని పరిస్థితి వచ్చింది. పట్నాలకెళ్లి వచ్చిన బడాయి (114) తో నాగరికత పెరిగింది. పల్లకీలలో తిరగడం మొదలైంది. అంబలి దాగే నీకు అన్నం సహించలేదా. సంబావడ్లు దంచి సత్రాలుపెడతావా. ఎంబెరుమానారంటె ఎగతాళిగా ఉందా అంటూ తనను నిర్లక్ష్యం చేసిన ఒక వాడ వనితను నిలదీసి అడుగుతున్న విషయం ఒక పదంలో (87) కనిపిస్తున్నది. చిప్పల గంజి వెగటై పోయిందని, వట్టాకు ఉడికించే చట్టి మూలబడిందని, నడతలో నాగరీకం కనిపిస్తున్నదని చెపుతున్నాడు సారంగపాణి (83). ఇలాంటి వేశ్యలకు కోళ్ల గుడిసెలు పోయి మంచి ఇండ్లొచ్చాయి. నల్లుల కుక్కి మంచాలు పోయి కీళ్ల మంచాలొచ్చాయి. కుండలు పోయి వెండి పాత్రలొచ్చాయి. తమలపాకు తొడిమెలు పోయి తాంబూలపు మడుపులొచ్చాయి. పర నాగరికత కలిగించిన సదుపాయాలివన్నీ. వీళ్లకీ సదుపాయాలు కలిగించిన వాళ్లు దొరలు.

దొరల సాంగత్యంలోని లాభాలవల్ల పల్లెటూరి వేశ్యలు సీమాటి చిత్రాంగులైనారు (110). అప్పటి వరకు పోషించిన దేశీయ విటులను నిర్లక్ష్యం చేశారు. బొటన వేలికి సున్నమైతే బోర్ల పడుతూ దిండుకానుకొని కూర్చుని, కుండలు గోకింది తలచుకోకుండా 'దండము బెట్టేది దొరలకేనని' చెపుతున్న వేశ్యలను

ఏవగించుకొన్నాడు సారంగపాణి (114). ఈ పరిణామం వల్ల గ్రామీణ వ్యవస్థ చెడిపోవడాన్ని సహించలేకపోయాడు. ఒక పంతపు విటుడు 'తప్పించుకొంటే విడుతునా – ఇక నీ తల్లికేమైన నేర్ఘుడుతునా' అంటూ ఒక పల్లెటూరి వేశ్యను నిలదీస్తే ఆమె అప్పటికే దొరల పోషణలో ఉండడం వల్ల, 'తెల్లవారికే గాని చెల్లదు పొమ్మని' అతనితో నిర్భయంగా చెప్పింది (125). అడిగినంతా ఇచ్చాను గదా ఇదేమి టంటాడు ఆ కోడెగాడు. ఇలాంటివాళ్ళ వల్ల ఏమొస్తుంది దొరల వల్ల మన దర్జా పెరుగుతుందని చెపుతుంది ఆ వేశ్యతల్లి. అప్పటి సమాజంలో సారంగపాణి స్వయంగా గమనించిన ఈ పరిణామాలన్నీ పర సంస్కృతి కలిగించిన పెనుమార్పులు.

## జాతీయపదాలు

తన జాతిప్రజలు వాళ్లకు సహజమైన భాషలో సహజమైన రీతిలో వ్యక్తం చేసిన వాళ్ల భావాలను కొన్ని పదాలలో వర్ణించాడు. ఇవి జాతీయ పదాలు. ఇవి 17 మాత్రమే దొరికాయి. పై రెండు రకాల పదాలలో వ్యక్తమైన భావాలు, ఆ భావాలను వ్యక్తపరచిన భాష వ్యావహారికం. రాయలసీమ ప్రాంతంలో ముఖ్యంగా సీమ దక్షిణ ప్రాంతంలో వ్యవహారంలో ఉండిన భాష ఇది. ఈ 17 పదాలలో సారంగపాణి వాడిన భాష అచ్చమైన పామరభాష. పామరులంటే పట్టణ సంసర్గం లేకుండా పల్లెలలో ఉండే విధ్యాగంధం లేని ప్రజలు. వీళ్లు తమ భావాలను వీళ్లకు సహజమైన భాషలోనే వ్యక్తంచేస్తారు. వాళ్ల భాషను ఈ పదాలలో సారంగపాణి యథాతథంగా వాడినాడు. సంస్కృత నాటకాలు ప్రచారం చేసిన పాత్రోచిత భాషకు ఇతడు పట్టాభిషేకం చేశాడు. విద్యాగంధం లేని రాయలసీమ ప్రజలందరూ ఆనాడు మాట్లాడిన భాష ఇది. వాళ్లకర్థమైన భాష. శిష్టులకే ఈ భాష సరిగా అర్థంగావడం లేదు. ఈ భాషా స్వరూపాన్ని తెలుసుకోవాలనుకొనే వారు ఆ పదాలను చూడాలి.

ఈ 17 జాతీయ పదాలలో ఆనాటి క్షామ పరిస్థితులు, ప్రజల ఇక్కట్లు, దేవాలయాలు కేంద్రంగా జరుపుకొన్న తిరునాళ్లు, భిక్షగాండ్లకు దానం చేయలేని ప్రజల దారిద్ర్యం, పరిస్థితులెలా ఉన్నా తప్పని పామర శృంగారం, పల్లెటూళ్ల

సంతలు ఇత్యాది విషయాలు వివరంగా కనిపిస్తున్నాయి. పద్దెనిమిదవ శతాబ్ది ఉత్తరార్థంలో రాయలసీమలో గొప్ప కరువొచ్చింది. కొన్ని సంవత్సరాల పాటు వర్షాభావం ఏర్పడింది. పంటపొలాలు బంజర్లుగా మారాయి ఆహారపు కొరత మనుషులకే కాదు పశువులకు కూడా మేతలేక పల్లెప్రాంతాలు అట్టుడికి పోయాయి. రైతులకే కష్టకాలం దాపురిస్తే ఇక బీదవాళ్లు, యాచకుల విషయం మరీ దారుణం. కరువు వేడిలో శలభాల్లాగా మాడి పోయారు. ఈ క్షామ పరిస్థితుల్లో అక్షయ నామ సంవత్సరం వచ్చింది. 'అచ్చియ బుట్టింది బూమికి బలుసెబ్బర (142) అనే పదంలో సారంగపాణి అప్పటి క్షామ తీవ్రతను కండ్లకు కట్టినట్లు వర్ణించాడు.

అచ్చియ బుట్టింది బూమికి బలుసెబ్బ -
రయినా దానెమ్మ సోనిది సూడె ॥పల్లవి॥

పచ్చినూకలు నేలా - బడితె దీనబ్బదేలు
బిచ్చగాల్ల శేశిడిశ - బిరుద బంట్ల నీతూరి ॥అనుపల్లవి॥

మందలు గదిలె పర - మటి శీమ కెగబడి
కందులేశిరిగా శె - క్కరూక్కు పందేశి
అందులో సాంకోలె - కమ్మేశిరే బిడల
కుందనంబు పైడి - కూట్నీల కెలబోయె

శెట్టుమీద పచ్చు - లట్టు తలేలేశె
సుట్టుదొంగలు వగ - తట్టగ్గి దేవర
గట్టిగా బీదోల్లకు - కలబందేగా కూడు
బట్ట మరకేదది - ప్పటి యాడ మాసులకు
ఆలు మొగుడు గూడే - దది వోరోబగు రెగిచం
సాలా వుడకా డించె సప్పన్న రార్ఖూఖులు
యీా లోన యేనుగో - పాలుని దయచేత
కాలవరసము గురిశ - కరువు దెలిశె గాక

పచ్చినూకలు నేలబడలేదు. రైతులు భిక్షగాళ్ళైపోయారు. పశువులు పశ్చిమ ప్రాంతాలకు కళేబాల నిమిత్తం వెళ్లాయి. పోషించలేక బిడ్డలను అమ్మేసే స్థితి వచ్చింది. బంగారు అతి తక్కువ ధరకు అమ్మాల్సి వచ్చింది. చెట్లు ఎండిపోవడం వల్ల, మేత లేకపోవడం వల్ల పక్షుల తలలు వాలిపోయాయి. మాటి మాటికి అగ్ని ప్రమాదాలు దానికి తోడు దొంగతనాలు. ఆహారం లేక బీదవాళ్లు కలబంద గుజ్జు తిని ప్రాణాలు కాపాడుకోవలసి వచ్చింది. రక్త హీనత వల్ల స్త్రీలకు బహిష్ఠులు ఆగిపోయాయి. ఇక ఇలాంటి స్త్రీ పురుషుల మధ్య శృంగారానికి తావెక్కడిది? చుట్టుప్రక్క ప్రాంతాలన్నీ కరువుతో అల్లాడిపోయాయి.

భిక్షగాండ్లకు భిక్షంవేసేవాళ్లు లేరు. అగ్రహారంలో అగ్గురోరపు వెంగయ్యకు శోభనం జరుగుతూ ఉంది. ఊరందరికీ విందుపెట్టాలని అనుకొంటున్నారు. అక్కడికి వెళ్లు నీకు అన్నం దొరుకుందని ఒక ఇంటి దగ్గర భిక్షగాడికి చెపుతున్నట్లు మరొక పదంలో సారంగపాణి పేర్కొన్నాడు. చెరువు లెండిపోయాయి, గొర్రెలకు పూరి చిక్కడం లేదని రైతులు వాపోతున్నారు (143).

తమప్రాంతంలో జరుగుతూ ఉండిన తిరునాళ్లను సారంగపాణి రెండు మూడు పదాలలో వర్ణించాడు. 'కొండ సుట్టోచ్చేరంటె' (144) అనే పదంలో ఆనాడు కార్వేటినగర సమీపంలో గల కొండ ప్రాంతంలో జరిగే ఉత్సవం కనిపిస్తుంది. చుట్టుపక్క గ్రామాలనుండి దేవతావిగ్రహాలను ఇక్కడికి తెచ్చి గంట కొట్టి దించేవారు. సంస్థానం వాళ్లు నగారాతో అక్కడికి వచ్చినపుడు ఆ ప్రాంతం కలియుగ వైకుంఠంగా మారుతుంది. సంస్థానాధీశులు పూజించే విగ్రహాలను ఏనుగుల మీద తెచ్చేవారు. భోగంవాళ్లు పాటలు పాడుతూ నాట్యం చేసేవారు. ఉత్సాహవంతులు రకరకాల వేషాలతో భక్తులను ఆనందపరిచేవారు. వీధులలో సాగే మెరవణలో వృషభ వాహనం మీద దేవుని పక్క కూర్చున్న పూజారి బుట్టలో ఉన్న రాగిపాత్రతో దగ్గరకొచ్చిన వారి తలలు తాకించి తాంబూలం తీసుకొంటున్నాడు. తరువాత జరిగే తెప్పతిరునాళ్లను సారంగపాణి 147వ పదంలో వివరంగా వర్ణించాడు. నగరంలో జరిగే అగ్గితిరునాళ్లను చూడవలసిందే నంటున్నాడు సారంగపాణి. ద్రౌపదమ్మ తిరునాళ్ల పేరుతో 18 రోజులు ఇప్పటికీ

చిత్తూరు జిల్లాలో జరుగుతున్న ఉత్సవాలు సారంగపాణి కాలంనుండి ఉన్నట్లున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు ద్రౌపది పాండవుల విగ్రహాలను ఊరేగించడం ఉంది. చివరి రోజు అగ్నిగుండం తొక్కడం ఉంటుంది. ఈ తిరునాళ్ల వల్ల పామర ప్రజలలో కూడా భారత పాత్రల మీద భక్తి ఉండినట్లు అర్థమవుతుంది. మరొక పదంలో సారంగపాణి శిరతన గుళ్లో జరిగే నక్షత్రోత్సవాన్ని (కృత్తికోత్సవం) వర్ణించాడు (155). శిరతని గుడిలో వాహనాల వేడుకను, భోగం సానుల ఆటలను చూడడానికి జనం విపరీతంగా వచ్చేవారని, రథానికి అమర్చిన బొమ్మలు చిత్తూరులో తయారయ్యేవని చెపుతున్నాడు సారంగపాణి. ఉత్సవ సమయంలో జరిగే సంతలో 'తొగరు శీల్లు' (ఎరుపు చీరలు), గురుగులు, వరుగులు అమ్మేవారట. ఈత బెల్లంతో చేసిన నిప్పట్లు కొనడానికి జనం ఎగబడేవారట. కార్వేటి నగరానికి చుట్టూ వారం వారం జరిగే సంతలలో రకరకాల వస్తువులు అమ్మేవారని, 'నాన్నారం సంత' (నారాయణవనం) లో ఈసుళ్లు, మలుగు చేపలు, తలయెంటిక తాళ్లు (సవరాలు), ఇత్తడి కమ్మలు దొరుకుతాయని సారంగపాణి గమనించాడు.

రెండు మూడు పదాలలో (151, 152) పామర వేశ్యల శృంగారం చూపబడింది. గుడులలో పెట్టే ప్రసాదాలకు గాక, చేలలో కాసే కాయగూరలకు కూడా ఆశపడి శృంగారం పంచిన వేశ్యలు వీళ్లు. చింతచెట్ల దగ్గర చింతపండుకు, వంగతోటల దగ్గర వంకాయలకు కూడా వీళ్లు తృప్తిపడ్డారు.

**బగుమాణ మిప్పించె బగిశేనాయీ మూతి - పాత శీరుందంటివి**
**నగర దచ్చన శిన్నాగి చేతులో బోసి - నను శూశి దాగుంటివి**
**అగసాల దాంతో అన్నేల మంటన - న్నాడీ పోసుకొంటివి (151)**

పాతచీర బహుమానంగా తెచ్చి ఇచ్చినాడట ఒక విటుడు. అతడెవరో పురోహితు డైనట్లున్నాడు. నగరంలో వసూలైన దక్షిణ ఇస్తానని చెప్పి మరొక స్త్రీ చిన్నాగికి ఇచ్చి ఈమెను చూచి దాక్కున్నాడని ఒక వేశ్య ఆ విటుని దెప్పి పొడుస్తున్నది. ఈమె తనతో సరిగా లేదని ఒక అగసాల స్త్రీ దగ్గర ఆ విటుడు ఆడిపోసుకున్నాడట. ఒక పూజారి విటుడు తనవేశ్యను ద్వాదశినాడు దేవాలయానికి రమ్మని కొంత

పాయసం, వరికూడు, పానకం ఇచ్చి పాతిక రూకలవుతుందన్నాడట. ఈ సంఘటనలనన్నీ ఆ వాగ్గేయకారుని నిశిత పరిశీలనకు నిలువుటద్దాలు. ఆనాటి జన జీవన స్రవంతిలో పడుతూ లేస్తుండిన కెరటాలు.

## కీర్తనలు

ఈ విభాగంలో గల 44 కీర్తనలలో సారంగపాణి పారమార్థిక విషయాలతో పాటు సమాజంలో ఆయన గమనించిన విషయాలను చూపించాడు. కీర్తనలు సాధారణంగా భక్తి ప్రధానంగా ఉంటాయి కాబట్టి వీటిలో అవాంఛనీయమైన శృంగారం హేయమని, భగవద్భక్తి శాశ్వతానందాన్ని కలగిస్తుందని హితబోధ చేశాడు.

**'వేణుగోపాలుని విడువము – వేరే యొక్కరి పేరు నుడువము' (158)**
**'హరి నారాయణ గోవిందాయని స్మరణ సేయవే వో మనసా' (175)**

ఇత్యాది కీర్తనలలో సారంగపాణి ప్రజలలో భక్తిని ప్రచారంచేసే ప్రయత్నం చేశాడు. దేహం అద్దె కొంప వంటిదని, అనిత్యమైనదని తెలుసుకొని – బలం తగ్గకముందే, కఱ్ఱ పట్టుకొని తిరగక ముందే పరమార్థ సాధనకు పూనుకోవాలని హితంచెప్పాడు. వైద్యం తెలియకుండా వైద్యం చేసేవారు, పనిలేక పొరుగిండ్లకు తిరిగే స్త్రీలు, స్త్రీ పురుషులను తార్చే మగ వెధవలు, లంచాలు తిని పనులు ఎగవేసే వాళ్లు, పనులకోసం వచ్చేవారిని మాపురేపని తిప్పుకొనేవారు ఒక కీర్తనలో (167) కనిపిస్తున్నారు. సమాజంలో ఇలాంటివాళ్లను సారంగపాణి గమనించే ఈ కీర్తన కెక్కించాడు. 'తన పద్యము విని బహుమతి సేయని మనుజున కొక సొద్దు' అని ఇదే కీర్తనలో ఉండడం వల్ల ఎవరో కవిపండితుల నిర్లక్ష్యం చేసిన ఒకవ్యక్తిని సారంగపాణి ప్రస్తావించినట్లు అనుకోడానికి వీలుంది. ఇలాంటి అనుభవం కవిగా ఆయనకే ఎదురయిందేమో.

శృంగార పదాలలోను, దేశీయ పదాలలోను ప్రస్తావించిన సామాజిక విషయాలలో తాను బాగా గమనించి తప్పని సరిగా చెప్పాలనుకొన్నవాటిని కీర్తనలలో కూడా ఆ వాగ్గేయకారుడు పొందుపరిచాడు. ఆయన సంస్థానంలో

ఉండినవాడు కావడం వల్ల సంస్థానం చుట్టూ పడుగు పేకవలె అల్లుకొని పోయిన వ్యవస్థను తూర్పార పట్టినాడు. రాజకీయంగా పరపతి సంపాదించిన వేశ్యల తమ్ముళ్లు అధికారం చెలాయించడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోయాడు 'లంజ వారి తమ్ములకె యిప్పుడు రాజ ఠీవులన్ని' అంటూ వాళ్ల దాబుసరితనాన్ని ఒక పదంలో బయటపెట్టాడు.

**పాపాత్ముని ధర్మాధికారిగా బంపే దొక రోత - సతతము**
**కోపము జేసే నరనాథు కొలువు - గొలిచే దొక రోత - ఛీఛీ (174)**

అనే కీర్తన అధికారిక వ్యవస్థలో ఈ కవికి ఎదురైన సమస్యలను తెలిపేదిగానే ఉంది. కులకాంతలు ఉస్సురుమంటుంటే వేశ్యల గూడడం రోత. జారస్త్రీకి బిడ్డగా పుట్టడం రోత. యాచక వృత్తి ఒకరోత. భార్యను ఎక్కువ కాలం పుట్టింట్లో పెట్టడం రోత. హీనులను మహాత్ములని పొగడడం రోత. తన స్త్రీని అన్య పురుషులకు అప్పగించడం రోత. తాపసిగా ఉంటూ అరిషడ్వర్గంతో మెలగడం రోత. రోతగా అనిపించే ఈ అంశాలన్నీ ఆనాటి సమాజంలోని రుగ్మతలు. ఈ రుగ్మతలు లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని కోరుకున్నవాడు కావడంవల్ల సారంగపాణి వీటిని ప్రస్తావించాడు. పేదలకు ఆశ చెప్పినవాళ్లు, బీదలను ఎగతాళి చేసినవాళ్లు, పని చేయించుకొని జీతమివ్వనివాళ్లు, అప్పులుచేసి తీర్చలేనివాళ్లు, భక్తిరహితమైన వ్రతాలు చేసేవాళ్లు, పెండ్లికావాలనుకొనే వృద్ధులు, తల్లిదండ్రులను పోషించని బిడ్డలు, కూటికోసం వివిధ వేషాలు వేసే టక్కరులు, భిక్షగాండ్లను తరిమి తలుపులు మూసుకొనే గృహస్థులు, ఒట్టుపెట్టుకొని మోసం చేసే కుటిలాత్ములు, కోపం ప్రదర్శించే భిక్షగాండ్లు, ఆనాడు సారంగపాణికి తారసపడిన సామాజిక ప్రతినిధులు. వీళ్లను ప్రస్తావించడం ద్వారా ఈకవి సమాజపు సహజ చిత్రాన్ని మన కండ్ల ముందుంచాడు.

సారంగపాణి సమాజకవి. సమాజంలోని వివిధ రకాల మనస్తత్వాలను, అసమానతలను పదాల కెక్కించి సమాజ నిజ స్వరూపాన్ని చిత్రించాడు. ప్రజా జీవితంలో ఎదురైన భిన్నవర్గాలను, వారి జీవన ప్రమాణాలను గుర్తించి, వారి

సాంస్కృతిక విశేషాలను ప్రదర్శించాడు. భోగలాలసతో ప్రవర్తించే నాగరీకులు, దుర్భిక్షంతో బాధపడిన పామర ప్రజలు ఆనాటి సమాజంలోని ప్రధాన వర్గాలు. భోగలాలసుల చుట్టూ పెనవేసుకొని పోయిన వేశ్యావ్యవస్థ, వేశ్యావ్యవస్థను తమ కనుకూలంగా మార్చుకొన్న దొరల సంస్కృతి, దేవాలయ వర్గం వారి వేశ్యా ప్రియత్వం, పామర విటుల సరసం సారంగపాణి పదాలలో కనిపించే ప్రధానాంశాలు. పరనాగరికత ప్రభావం వల్ల పట్టణ నాగరికత బలవడం, పల్లెల నుండి వలసలు వెళ్లడం, విలాస జీవితపు రుచులను అన్వేషిస్తూ దొరల ప్రాపకం కోసం ప్రయత్నించడం, కులస్త్రీలలో కూడా చాలమంది విలాసవతులు కావడం, దేవాలయ సంస్కృతి కలుషితం కావడం మొదలైన విషయాలు సారంగపాణి గమనించి గ్రంథస్థం చేసిన అంశాలు.



**ఆచార్య గల్లాచలపతి**
విశ్రాంతాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

## ప్రచురించిన ఇతరగ్రంథాలు

| | |
|---|---|
| కవికర్ణ రసాయనము - విశిష్టాద్వైత సమన్వయము ( పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం ) | 1984 |
| ప్రేమ - తాత్త్విక పరిశీలన | 1993 |
| సారంగపాణి పదాలు (విపుల పీఠికా సహిత పరిష్కరణ) | 1994 |
| శ్రీ వివేకానంద సాహిత్య సర్వస్వం (అనువాదం) | 1994 |
| కరపత్రాలు - చరిత్రశకలాలు | 1995 |
| తరతరాల తెలుగువారి మతాచార విశేషాలు | 1996 |
| వ్యాసభండారం (శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రచురణ) | 1999 |
| మహాభారతేతి వృత్త సినిమాలపై జానపద సాహిత్యప్రభావం | 1999 |
| సాహిత్య సురభి (సంపాదకత్వం) | 2000 |

*C.N., Tpt. Ph : 2251371*